ఘండికోట బ్రహ్మాజీ రావు రచనలు

నవలలు

పరుగు విడే చక్రాలు – ప్రవహించే జీవిత వాహిని

నవ్వింది నాగావళి

శ్రామికశకటం

విజయవాడ జంక్షన్

నల్లమబ్బుకో వెండి అంచు

ప్రేమమూర్తి

రాగలత

గులాబిముళ్ళు

ప్రతిమ

జలప్రళయం

డాక్టరు భాయి

పరివర్తన

జంగమా హేమవల్లి

బావి

సుందరం

పసిడి పంజరం

వాన – ఎరిద

కథానికలు

మయూరాక్షి (సంపుటం – 40 కథానికలు)

అనువాదాలు

శ్రీమత్ సుందరకాండ – తాత్పర్య సహితం.

శ్రీమత్ సుందర కొండ – సౌందర్య దర్శనం – సంగ్రహకథ – మొదటి భాగం.

వేయిన్నొక్కరాత్రులు – అరేబియన్ నైట్సు కథలు

కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురణ

విజయవాడ జంక్షన్

సస్పెన్స్ థ్రిల్లర్

ఘండికోట బ్రహ్మాజీ రావు

జనసేవా పబ్లికేషన్స్
46-18-11/6 మండావారి పేట, దొండపర్తి,
విశాఖపట్నం - 530 016 - ఫోన్ : 746187

VIJAYAWADA JUNCTION
A Popular Novel in Telugu
by Ghandikota Brahmaji Rao
46-18-11/6 Mandavaripeta
Dondaparthi
Visakhapatnam - 530 016
Ph : 746187

Reprint : September - 2000
Cover Illustration : Bali

Publishers
Janaseva Publications
46-18-11/6 Mandavari peta
Dondapathi
Visakhapatnam - 530 016
Ph : 746187

Designed and Printed by :

J.J. Printers
47-10-4, Dwarakanagar
Visakhapatnam - 530 016
Ph : 595368

Price : Rs. 75-00

For Copies :

1. Visalandra Publishing House (All Branches)

2. Janaseva Pubications at the above address

కృతజ్ఞతలు

విజయవాడ జంక్షన్ చాల ప్రచారమున్న నవల. 1983లో ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక నిర్వహించిన సస్పెన్స్ థ్రిల్లర్ నవలల పోటీలో మొదటి బహుమతి పొందింది. పత్రికలో ధారావాహికంగా వచ్చేనవలకు పాఠకులు బారులు తీర్చి ఎదురు చూసేవారు.

ఈ నవలను పునర్ముద్రించడానికి రిటైర్డు రైల్వే బోర్డు మెంబరు, సాహితీ వేత్త, శ్రీ వేదుల చిన్న వేంకట చయనులు గారు ఉదారంగా ద్రవ్యసహాయం చేశారు. వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ముద్రాపకులు శ్రీ చంద్ర శేఖర్ గారికి కృతజ్ఞతలు.

శ్రీ కోట శేషగిరిరావు ప్రకటనలు తెచ్చి సహాయం చేశారు. వారికి, ప్రకటన కర్తలకు కృతజ్ఞతలు.

చాల చక్కటి ముఖచిత్రం చిత్రించిన శ్రీ బాలికి కృతజ్ఞతలు.

విశాఖపట్నం - 16,
15-8-2000

ఘండికోట బ్రహ్మాజీరావు

విజయవాడ జంక్షన్

1. శనివారం -

1. శనివారం -

1.1. శనివారం - సాయంకాలం- 6 గంటలు - కేసముద్రం.

కాజీపేట నుంచి విజయవాడకు పోతున్న గూడ్స్ ట్రైన్ వరంగల్లుకి డోర్న కల్లుకి మధ్యనున్న కేసముద్రం స్టేషను దాటిన అయిదు నిమిషాలకు, సరిగా సాయంకాలం ఆరు గంటలకు ప్రమాదానికి గురి అయింది.

ఒక్కాసారిగా కుదుపుతో ఆగిపోయిన బ్రేక్ వాను నుంచి గార్డు క్రిందికి దిగి ధారాపాతంగా కురుస్తున్న వర్షంలో తడుసుకుంటూ ఇంజను వేపు నడిచాడు. పాతిక వాగన్లు దాటిన తరువాత అతనికంతా నీరే కనిపించింది. ఇంజను, మిగిలిన నలభై వాగన్లు నీటిలో మునిగి కనిపించకుండా పోయాయి. పక్కనున్న లైను కూడా వాటితోపాటు మాయమయిపోయింది. గార్డు మరి కాలం వ్యర్థం చేయలేదు. వెనుకకు తిరిగి కేసముద్రం స్టేషను వేపు పరుగెత్తాడు.

1.2. శనివారం- సాయంకాలం - 6 గంటల 30 నిమిషాలు - విజయవాడ.

వర్షం కురుస్తున్నది.

రేడియోలో ప్రతి పదిహేను నిమిషాలకు తుఫాను హెచ్చరిక వినవస్తున్నది. గాలి నూరు కిలోమీర్లవేగంతో వీస్తుందని, బంగాళా ఖాతంలో ఏర్పడిన వాయుగుండం సాయంకాలం అయిదు గంటలకు మచిలీపట్నానికి నూరు కిలోమీటర్ల దూరంలో ఉందని, రాత్రి పది గంటల వేళకు తీరాన్ని దాటి బలహీనమవవచ్చునని, దీని ప్రభావం వలన కృష్ణా, గుంటూరు, ఖమ్మం జిల్లాలలో భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక చేస్తున్నారు పదే పదే.

వర్షం నిలువుగా కురవడంలేదు. ఏటవాలుగా కురుస్తున్నది. జల్లులుగా గాలిలో తెరలా క్రిందికి మీదికి అవుతున్నది.

విజయవాడ స్టేషను అయిదో నంబరు ప్లాట్ ఫారమ్ మీద హౌరా - మద్రాసు మెయిలు కోసం వేచివున్న ప్రయాణీకులు నిర్దాక్షిణ్యంగా వర్షంలో తడిసిపోతున్నారు. మెయిలు సకాలంలో ఏలూరు విడిచి పెట్టింది. అది అయిదో నంబరు ప్లాట్ ఫారమ్ మీదికి వస్తుంది.

కాని పావుతక్కువ ఏడుగంటలకు లైటింజనొకటి ఆ లైను మీద నుంచి పోతుంటే పోలీసు ముసలయ్య ఇంజను చక్రాలక్రింద తలపెట్టాడు. సాయంకాలం కొంచెం వేగంగా వెళ్ళిపోదామనుకున్న స్టేషను సూపరింటెండెంటుకి మతిపోయింది. ఆరో నంబరు- ఏడో నంబరు ప్లాట్‌ఫారాల మీద పార్సిల్ ఎక్స్ ప్రెస్ నుంచి సరకులు దించుతున్నారు. మద్రాసు మెయిలుకు ముందు రావలసినసర్కారు ఎక్స్‌ప్రెస్ అరగంటలేటు. ముసలయ్య ఆత్మ హత్య చేసుకున్నందుకు స్టేషను సూపరింటెండెంటు నాగభూషణం విచారించలేదు. ముసలయ్యచాల మంచి వాడు. బాగా తనకు తెలిసినవాడు. పెద్ద కుటుంబమతనికి. కొడుకులు, కూతుళ్ళు. కొడుకులకి చదువులు లేవు. కూతుళ్ళకి పెళ్ళిళ్ళు కాలేదు. అతను తెచ్చినదంతా ఆ యిల్లు మింగేస్తున్నది. కాని, చూసి చూసి యిటువంటి క్లిష్ట పరిస్థితులలో తానొక్కడే చావకుండా చాలా మందికి చచ్చినంత పని కల్పించినందుకు నాగభూషణం పిచ్చెక్కి పోతున్నాడు. ఇవాళ పంక్చుయాలిటీ వీక్‌లో రెండో రోజు - ముఖ్యమైన ట్రెయినుకే లేటయితే ఆ నింద తనమీదే పడుతుంది. ఈ ముసలయ్య ఇంటి దగ్గరో ఏ రాత్రో ఆత్మహత్య చేసుకుంటే ఇంత చికాకు కలిగి ఉండదుకదా.

నాగభూషణం పంపిన పోర్టరు తిరిగి వచ్చాడు. రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టరు గారు గుంటూరు వెళ్ళారు. హెడ్ కానిస్టబలుగారు ఇప్పుడే గాంధీనగరం వెళ్ళారు. ''శవ పంచాయతికి'' మనుషులెవరూ లేరు.

ఇంజను తీయడానికి వీలులేదు, రెండుగా తెగిన ఆ మంచివాడిని తొలగించడా నికి వీలు లేదు. మెయిలు పావుగంట ముందు వస్తున్నదని కంట్రోలరు మళ్ళా చెప్పాడు.

నాగభూషణం తలను రెండు చేతులతో పట్టుకొన్నాడు. గాలి హోరు పెడుతూ స్వింగ్ డోర్లను ఊపుతున్నది. అప్రయత్నంగా అతని కళ్ళు టేబిలు గ్లాసుకింద పెట్టిన ఆర్డర్లీ ఆఫీసర్ల లిస్టుమీద పడ్డాయి. అక్టోబరు 31వ తేదీ శనివారం సాయంకాలం ఆరు గంటల నుంచీ శ్రీనివాస మూర్తిగారిది స్టేషను ఆర్డర్లీ ఆఫీసరు డ్యూటీ. మూర్తిగారి పేరుచదవగానే నాగభూషణానికి ఎక్కడలేని ధైర్యం కలిగింది. అప్పటికి ఏడుగంటలవ డానికి పది నిమిషాలు మిగిలాయి. వెంటనే మూర్తికి టెలిఫోన్ చేశాడు. ఇంకా ఆఫీసు లోనే ఉన్నాడని తెలిసి మరొక నంబరు రింగు చేశాడు.

శ్రీనివాసమూర్తికి స్టెనోగ్రాఫరు రిపోర్టు లోని ఆఖరి పేరా చదివి వినిపిస్తున్నాడు. అతను అక్కడక్కడ మాటలు మారుస్తున్నాడు. ఇంతలో టెలిఫోను మ్రోగింది. ఇది

మూడోసారి. ఇంటి నుంచి ఇంతకు ముందు రెండు సార్లు ఫోను వచ్చింది. పద్మావతి తన కోసం చాల ఆత్రతతో ఎదురు చూస్తున్నది. ఇవాళ రఘు పుట్టిన రోజు, అయిదేళ్ళు వెళ్ళిపోయి కుర్రాడికి ఆరో యేడు వస్తున్నది. ఆఫీసర్లను, వారి భార్యలను పార్టీకి పిలిచింది పద్మావతి. సాయంకాలం ఆరున్నరకు బర్తుడే కేక్ కోయవలసి ఉంది. అతిథులందరూ వచ్చినట్లుంది. పది నిమిషాల క్రింద ఫోన్ చేసినప్పుడు డివిజనల్ సూపరింటెండెంటు నారాయణన్ గారు కూడా వచ్చినట్లు చెప్పింది. తానూ తొందరపడుతున్నాడు. మరునాడు ఆ అర్జెంటు రిపోర్టు బోర్డుకు వెళ్ళవలసి వుంది. అన్నిటికన్న ఉద్యోగమే హెచ్చుగా పరిగణించే ఆ పెద్ద మనిషి ఆ రిపోర్టు పూర్తి అయేవరకు మరే ఆలోచన మనసుకు పట్టించుకోదలచలేదు.కాని విడువకుండా టెలిఫోను మోగుతున్నది.

రిపోర్టులో ఆఖరి పేరా పూర్తి చేసి స్టెనో లేచిపోయిన తరువాత మూర్తి టెలిఫోను ఎత్తాడు.

''మూర్తి!''

''నమస్కారం మూర్తిగారూ! నేను నాగభూషణాన్ని. చాల చిక్కులో పడ్డాను సార్! మద్రాసు మెయిలు అవుటర్‌లో వుండిపోయింది. సర్కార్ ఎక్స్‌ప్రెస్ గుడివాడలో వుంది. అయిదో ప్లాట్ ఫారమ్ మీద లైటింజను క్రింద తలపెట్టి ముసలయ్య అన్న పోలీసు సూయిసైడు చేసుకున్నాడు. పోలీసు వాళ్ళెవరూ ఇంత వరకూ రాలేదు సార్. ఈరోజు మీది ఆర్డర్లీ ఆఫీసరు డ్యూటీ అని మిమ్మల్ని ఇబ్బంది పెట్టవలసి వచ్చింది''.

''నాగభూషణం! వెంటనే బయలు దేరి వస్తున్నాను. సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్-అతనికి టెలిఫోన్ చేసి మరెవరినైనా పంపమని చెప్పండి.''

శ్రీనివాసమూర్తి బెల్ కొట్టాడు. యూనిఫారమ్ తొడుక్కున్న బంట్రోతు వచ్చాడు. ''కాంతయ్యా! వర్షాకాలపు కోటు, గొడుగు తీసుకురా! ఈ వర్షంలో స్కూటరు మీద వెళ్ళడానికి వీలుపడదు. ఎమర్జన్సీ జీప్ ఉంటే తీసుకురా.''

కాంతయ్య తలగోక్కుంటూ నిల బడ్డాడు.

''సంగతేమిటి''? మూర్తి ప్రశ్నించాడు.

''వాళ్ళు సార్! టెంపరరీ కళాసీలు. వాళ్ళు సాయంకాలం నాలుగు గంటలనుంచి మీకోసం వర్షంలో నిలబడ్డారు సార్! వానలో అరచి వాళ్ళు మిమ్మల్ని ఘెరావ్ చేయాలని వచ్చారు సార్! రేవటినుంచి వాళ్ళకి ఉద్యోగాలు లేవు.''

మూర్తి చిన్న నవ్వు నవ్వాడు.

''వాళ్ళతో నేను మాట్లాడుతాను. ముందు జీప్ తీసుకొని రా!''

మూర్తి ఛాంబరు తలుపులు తోసుకొని కారిడార్‌లోకి రాగానే వెలువల వరండాలో నిలుచున్న వాళ్ళు ఒక్కాసారి అరిచారు.

''మజ్‌దూర్ యూనియన్ జిందాబాద్! టెంపరరీ కళాసీలను పెర్మనెంటు చేయాలి. అధికారుల ఆగడాలు పనికిరావు. జులమ్ పనికిరాదు.''

మూర్తి వానకోటు భుజం మీద వేసుకొని, గొడుగు చేత్తో పట్టుకొని వరండాలోకి వచ్చాడు.

''సార్! మేము నాలుగు గంటల్నించీ ఈ వానలో చస్తున్నాం. మీరందరూ ఆఫీసర్లు, వెచ్చగా గదుల్లో కూకుండారు. నలభై మందికి ఉద్యోగాలు నేటితో పోతుండాయి. రేపు ఆళ్ళంతా నడిరోడ్డు మీద బిచ్చమెత్తుకోవాలి సార్. అందుచేత ఈ తగువు తేగేవరకు....''

''వీరాస్వామీ! నేను ఈ రోజు మధ్యాహ్నం మన డివిజినల్ సూపరింటెండెంటు గారితో మాట్లాడాను. ఆయన నా ఎదుటనే సికిందరాబాదు జనరల్ మేనేజరు ఆఫీసుతో టెలిఫోనులో మాట్లాడారు. ఈ నలభై మంది కళాసీలు మరొక మూడు నెలలు టెంపరరీగా పనిచేసి, ఆ తరువాత సీనియారిటీ ప్రకారం మెడికల్ అయిన తరువాత, పెర్మనెంటుగా ఉద్యోగాలలో నిలుస్తారు! మీరు నాలుగు గంటల నుంచి ఇక్కడ ఉన్నారని నాకు తెలియదు, అర్జంటు రిపోర్టు తయారుచేస్తూ ఉండిపోయాను''.

''మజ్‌దూర్ యూనియన్ జిందాబాద్! టెంపరరీ కళాసీలు - జిందాబాద్! రైల్వే - జిందాబాద్!''

అన్ని జిందాబాద్‌లే! అంతవరకు ముఖాల మీద వెలుగులేని వాళ్ళందరూ సంతోషంతో వెళ్ళిపోయారు.

ఇంతలో జీప్ వచ్చింది.

మూర్తి అయిదో నంబరు ప్లాట్‌ఫారమ్ పైకి అడుగు పెట్టేసరికి, అంటే అడుగు పెట్టలేనంత జనసమర్దంలోకి ప్రవేశించే సరికి, చిన్న దెబ్బలాట వినవలసి వచ్చింది.

ఆ చల్లని గాలివాన హోరులో ఒక కుర్రాడు తన లూ-ఇన్-వన్ మీద డిస్కో

సంగీతం వేస్తే. పక్కనున్న పెద్దమనిషి పడతిడుతున్నాడు. ఎవరికి వారు ఫండమెంటల్ రైట్సు గురించి పోట్లాడుకుంటున్నారు.

రెండడుగులు మూర్తి నడిచి, రైలు లైనులను చేరుకోదలిచాడు. లైనుమీద మనుషులు లేరు. కాని అక్కడ విస్తరాకుల కోసం పోట్లాడుతున్న కుక్కలు సింహాలయాయి.

మూర్తి లైటింజను చేరే సరికి పోలీసులు, నాగభూషణం, మరి కొందరూ ఉన్నారు. పంచాయితీ అయిపోయింది. లైటింజను వెళ్ళిపోయింది. మరొక్క ఐదు నిమిషాలకు అయిదో నంబరు ప్లాట్‌ఫారమ్ మీదికి హౌరా-మద్రాసు మెయిలు వచ్చింది.

మూర్తికి ఇంటిమీద ధ్యాస పోయింది. తోటి ఆఫీసర్లు, వారి భార్యలు, పిల్లలు అందరూ తన రాక కోసం ఎదురుచూస్తున్నారు. పద్మావతి చాల ప్రయత్నాలు చేసింది. స్వీటు బందరు నుంచి తెప్పించింది. హోటల్ నటరాజ్‌లో స్పెషల్‌గా అరవై ప్లేట్లకు ఆర్డరిచ్చింది. చాల ఘనంగా ఇవ్వవలసిన పార్టీకి తను తొందరపడటంలేదు. మెయిలు వచ్చినా రద్దీ తగ్గలేదు. ఈ మెయిలు వెళ్ళిపోయేదాక ఉంటే చాల మంచిది. కాని తన బంగళాలో చాలమంది పెద్ద పెద్ద ఆఫీసర్లయినగెస్టులు వేయి కళ్ళతో తన కోసం ఎదురు చూస్తున్నారు.

మూర్తి ఆ జనసముద్రంలో తోసుకుంటూ ముందుకుపోతున్నాడు, ప్లేషను సూపరిండెండెంటు గది ఇంకా నూరుగజాల దూరంలో ఉంది. మరొక్క పదినిమిషాలు సర్కార్ ఎక్స్‌ప్రెస్ వచ్చేవరకు ఉండి. తరువాత బంగళాకు వెళ్దామనుకున్నాడు. వాచీ చూసుకున్నాడు. ఏడుగంటల ఇరవై నిమిషాలయింది.

మూర్తిని వెదుక్కుంటూ మళ్ళీ నాగభూషణం వచ్చాడు.

''సార్! కంట్రోలరు పిలుస్తున్నాడు. చాల సీరియస్ ఆక్సిడెంటయిందట. అర్జంటుగా ఫోనుమీదికి రావలసింది.''

మూర్తి మనుషులను తప్పించుకొని ముందుకు అడుగులు వేశాడు. అతను టెలిఫోను చేరేసరికి సైరన్ వినిపిస్తున్నది.

కేసముద్రానికి, తాడలపూనపల్లి ప్లేషనుకు మధ్య, భాజోపేటనుంచి విజయవాడ వస్తున్న గూడ్సుబండి ఘోరమైన ప్రమాదానికి లోనయింది. డీసెలు ఇంజను, నలభై వేగనులు, నీటిలో మునిగిపోయాయి. ఎగువలైను, దిగువ లైను అరకిలో మీటరు వరకు కనిపించకుండా పోయాయి. ఢిల్లీ-మద్రాసు, హైదరాబాదు-విజయవాడల మధ్య రైళ్ళ రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి..

''డ్రైవరు, అతని ఎటెండెంటు ఎలా ఉన్నారు''? మూర్తి కంట్రోలరు నడిగాడు.

''వాళ్ళిద్దరినీ ఇంజను కిటికీ తలుపులు పగులగొట్టి తీశారట. ఇప్పుడే వరంగల్ గవర్నమెంట్ హాస్పిటల్‌కి మోటార్ ట్రాలీలో తీసుకు పోతున్నారు.''

''గార్డుకు ప్రమాదం లేదుకదా!''

''లేదు, అతనే చాలా శ్రమపడి స్టాఫ్‌ని రక్షించడానికి ప్రయత్నం చేశాడు.''

''మంచిది.''

తరువాత శ్రీనివాసమూర్తి బంగళాకు ఫోను చేసి పద్మావతితో మాట్లాడాడు. కొడుకు రఘుతో మాట్లాడాడు. డివిజనల్ సూపరింటెండెంటు నారాయణన్ గారు మాట్లాడారు. సికిందరాబాదులోను, న్యూఢిల్లీలోను అధికారవర్గం చాలా ఆందోళన చెందుతోంది. లైన్‌ను పునరుద్ధరించడం చాల త్వరలో పూర్తి అవాలి. అతనప్పుడే వారికి మాట యిచ్చాడు. ఆ మాట మూర్తి నిలబెట్టాలి. డివిజనల్ ఇంజనీరు అబ్రహాం కూడా బయలు దేరుతున్నారు.

శ్రీనివాసమూర్తి తనకు పైన వున్న అధికారి చెప్పినదంతా విన్నాడు. ఇది ప్రశ్నలు వేయవలసిన వేళ కాదు. వాదించవలసిన సమయం కూడా కాదు. సలహాల కోసం ప్రాకులాడవలసిన తరుణం కాదు.

మూర్తి చివరగా ఒక్కరితో మాట్లాడాడు,

అతను కేశవయ్య, తన అన్నయ్య.

తనకున్న వారిలో అతనే పెద్దవాడు.

క్వార్టరులో ఒక్కడే వుంటున్నాడు. భార్యను, ఆడపిల్లను రెండేళ్ళయి పుట్టింటికి పంపించాడు.

కేశవయ్యకు కబురుపంపి, కంట్రోలు ఆఫీసుకు రమ్మన్నాడు. అతడు వచ్చిన తరువాత మూర్తి మాట్లాడాడు.

''అన్నయ్యా!''

'' ఏం మూర్తి!''

''మీ ఆఫీసరుతో మాట్లాడాను. వెంటనే ఎమర్జన్సీ సెల్ తెరుస్తున్నారు. దానికి నువ్వు ఇన్ ఛార్జివి. ఎవరో జూనియర్ ఆఫీసరు ఉంటాడు. కాని అన్ని కార్యక్రమాలు నువ్వే ప్లాను చేయాలి. రైళ్ళు తిరిగి సరిగా ప్రయాణం చేసేవరకు నువ్వే బాధ్యుడివి.''

''చచ్చినవాడినెందుకు చంపుతావు!''

''నువ్వు బ్రతకాలి! నేను కోరినదదే! ఏదో పాపాలు చేశానని విచారిస్తూ జీవితం పాడుచేసుకున్నావు. మరో మంచిపని చేసి, చేసిన పాపాన్ని కడిగివేస్తే అప్పుడు నువ్వు చావుకు అర్హతను పొందుతావు. లేకపోతే నీవు చచ్చిపోవడానికి కూడా పనికిరావు.''

''ఈమాట లెవరంటున్నారు!''

''నీ తమ్ముడు, శ్రీనివాసమూర్తి''

''మూర్తీ! ముందు పాప ప్రక్షాళన, తరువాత జీవితం, పిమ్మట మృత్యువు. అన్నిటికన్న ముందు ఈ ఉపద్రవంనుంచి ప్రయాణీకులను కాపాడాలి. వాళ్ళకోసం నాజీవితం ధారపోస్తాను. ఇటువంటి అవకాశం తప్పకుండా సద్వినియోగం చేస్తాను. నువ్వు నిశ్చింతగావెళ్ళు.''

మూర్తి టెలిఫోను క్రేడిల్ మీద పెట్టాడు. తన అన్నమీద అతనికి చాల విశ్వాస ముంది.

1.3. శనివారం - సాయంకాలం - 7 గంటలు - న్యూఢిల్లీ

అతని పేరు జస్బీర్ సింగ్ తల్వండీ. అతనికి దట్టమయిన గెడ్డముంది. ముడిచుట్టిన జుత్తుంది. జుత్తుమీద పాగా వుంది. వెడల్పయిన ముఖముంది. మెలి తిరగిన మీసాలున్నాయి. చిన్న అదృష్టపు బొజ్జ వుంది. అన్నిటికీ మించి నలభై యేళ్ళ నడి యౌవన ముంది.

న్యూఢిల్లీ కన్నాట్‌ప్లేసులో '' ఇండియన్ ఫైర్ ఆరమ్సు అండ్ ఎక్స్‌ప్లోసివ్సు కంపెనీ'' ఉంది. దానికి జస్బీర్ సింగ్ యజమాని.

అతను పార్టనరుకి వ్యాపారం అప్పగించి, షాపు వెనుకనున్న తన ఎయిర్ కండిషన్డ్ ప్రైవేట్ రూమ్‌లోకి అయిదు గంటలప్పుడు వెళ్ళిపోయాడు. ఆ సమయం నుంచి టెలిఫోనుతో తల మోదుకుంటున్నాడు.

టెలిఫోను చెడిపోలేదు. ప్రతి పదిహేను నిమిషాలకు సబ్ స్క్రైబర్సు ట్రంక్ డయలింగ్‌లో టుండ్లాకు సమీపంలోనున్న రాణీమోహినీదేవి ఫారమ్‌కోసం ప్రయత్నిస్తున్నాడు. ఎవరూ టెలిఫోను ఎత్తడం లేదు. రింగు వెళ్తున్నది. ఆ టెలిఫోను చెడిపోయిందేమోనని టుండ్లాలోని టెలిఫోను ఇంజనీరుతో మాట్లాడాడు. టెటిఫోను బాగానే వుంది.

సరిగ్గా ఏడుగంటలు కొడుతుంటే పదోసారి ప్రయత్నం చేశాడు. ఈసారి ఎవరో టెలిఫోను ఎత్తారు.

''రాణీ సాహేబా వున్నారా!''

''ఉన్నారు- ఎవరు మాట్లాడుతున్నారు?''

''నాపేరు జస్బీర్ సింగ్- జస్బీర్ బాబు న్యూఢిల్లీ నుంచి పిలుస్తున్నాడని చెప్పండి.''

పది నిమిషాల వరకు నిశ్శబ్దం.

''రాణీసాహేబా గారు బాత్ రూమ్‌లో వున్నారు. మరో అరగంట తరువాత పిలవండి.''

''చూడండీ! నేను ఎస్. టి. డి చేసి మాట్లాడు తున్నా - మీటరు తిరుగుతున్నది. ఇప్పటికి వంద రూపాయలు దాటిపోయిందేమో దీని ఖర్చు. ఆవిడ బాత్ రూమ్ నుంచి వెలుపలికి వచ్చిన వెంటనే టెలిఫోన్ దగ్గరికి తీసుకొని రండి. చాల జరూరైన విషయం మాట్లాడాలి.''

మరొక్క అయిదు నిమిషాలలోనే రాణీమోహినీదేవి కంఠం టెలిఫోనులో వినిపించింది.

''హల్లో''

''నమస్తే రాణీ సాహేబా!''

''నమస్తే జస్బీర్ భాయి!''

''మీకోసం ఎంత ప్రయత్నించినా దొరకడం లేదు. ఎక్కడికెళ్ళారు?''

''మూడు రోజుల క్రింద మన గుర్రాలు కలకత్తా రేసులలో గెలిచాయికాదా.''

''టెలివిజన్ మీద చూశాను.''

''నేను నిన్ననే ఫారమ్‌కి వచ్చాను, ఇప్పుడే ఆగ్రా నుంచి వచ్చానుభాయి చాల అలిసిపోయాను. రేపు సావకాశంగా మాట్లాడుకుందాం.''

''అరే రాణీ సాహేబా! సాయంకాలం అయిదు నుంచీ మీ కోసం ప్రయత్నిస్తున్నాను. పదిహేను నిమిషాల నుంచి మీటర్ తిరిగి పోతున్నా ఒక ముఖ్య విషయం చెప్పాలని కాచుకొని కూచున్నాను.''

''అయితే వేగం చెప్పు.''

'' ఒక్క- మాటలో చెప్తాను. ఈరోజు మధ్యాహ్నం కుమార రాజాగారికి ఒక శక్తి వంతమైన టైం బాంబు అమ్మాను.''

రాణీ మోహినీదేవికి చాల కోపం వచ్చింది.

''చూడు, జస్బీర్ భాయీ! ఢిల్లీ పోలీస్ కమిషనరుతో ఒకసారి నీ గురించి చెప్తే ఇటువంటి తప్పుడు పనులు చెయ్యవు.''

జస్బీర్ నవ్వు రాణీమోహినీ దేవికి టిలిఫోనులో వినిపించింది.

''రాణి సాహేబా! జస్బీర్ ఎప్పుడూ తప్పుడు పనులు చేయడు. తప్పుడు పనులె వరు చేస్తున్నారో అతనికి తెలుసు. సులోచనాదేవి. కుమారాజాగారి ప్రియరాలు కాన్పూరు హోటలులో కత్తిపోట్లతో ఎలా చనిపోయిందీ, కుమారరాజాగారి బాడీగార్డు నరేంద్ర సింగ్‌ను విశ్వనాథసింగ్ ఎలా క్లోజ్ రేంజిలో కాల్చినది జస్బీర్‌కి తెలియదనుకున్నారా!''

రాణీమోహినీదేవి దారికొచ్చింది.

''జస్బీర్ భాయి! ఈ విషయాలన్నీ తవ్వి బయటికి తీస్తావెందుకు? ఇంతకు ముందు నావ్వాడిన మాటలు నేను వినలేదు. నేను అన్నవి నువ్వూ వినలేదు. ఇక చెప్పవలసినది మొదలు పెట్టు.''

''అది రాజా మార్గం. ఇక వినండి. ఈ రోజు మధ్యాహ్నం పన్నెండున్నరకు కుమారరాజా మా కంపెనీకి వచ్చారు. నాతో ఒంటిగంటున్నర వరకూ ఉన్నారు. అప్పుడు చాల ఖరీదు చేసే పది కేజీలు బరువు వున్న టైం బాంబు కొన్నారు.''

''ఎందుకబ్బా, అంత డబ్బు పెట్టి ఆ పెద్ద మనిషి బాంబు కొన్నారు?''

''ఆ బాంబు చాలా శక్తివంతమైనది. దానిని చక్కని ప్రెజెంటేషను బాక్సులో పెట్టి, రిబ్బను కట్టి అతని కారులో పెట్టించాను.''

''ఇంతకూ ఎవరిమీద ఆ బాంబుని ఉపయోగిస్తున్నాడాయన?''

''అదే నాకు ముందు తెలియలేదు. రెండుమూడు పెగ్గులు నాతో తీసుకున్న తరువాత ఆయన చాలా గొప్ప రహస్యమొకటి వెల్లడి చేశారు.''

''జస్బీర్ భాయి! ఏమిటా రహస్యం?''

''రాణీ సాహెబా ! మా కష్టమరు రహస్యాలను వెల్లడి చేసే స్థితికి ఈ జస్బీరు దిగజారిపోలేదు. చాలా విలువైనదా రహస్యం. నేను చెప్పలేను.''

''జస్బీర్, నా గొంతుక కోయడానికి మరో కత్తి లేదా?''

''మీరిలా అంటారనే నాకు తెలుసు. ఈ రహస్యం మీ ఒక్కరికే చెప్పుతున్నాను. కుమారరాజాగారు పట్టపగలే కలలు కంటున్నారు. ఆయన కలలలో అన్నీ గుర్రాలే. ఆ గుర్రాలు ఆకాశంలోకి ఎగిరి, పారుతున్న నదిలో పడతాయి. ఆ గుర్రాల పేర్లు కూడా ఆయన వర్ణించాడు. రణజిత్, చంద్రగుప్త, శశాంక.... అన్నట్లు, రాణీ సాహెబా! ఈ గుర్రాలు మొన్న కలకత్తా రేసులో గెలుపొందినవి కదూ!''

''ఓ జస్బీర్ నువ్వు నిజమే చెప్తున్నావా?''

''చిట్టి తల్లీ, ఈ జస్బీర్ ఎప్పుడూ అబద్ధం చెప్పడు. మీరు మాకు పెంపుడు సోదరీ మణులు. ఇంకా ఆ కుమారరాజా ఏమన్నారో తెలుసా? ఆ గుర్రాలకు రెక్కలు వస్తాయి. పంచకళ్యాణీ గుర్రాలయి ఆకాశం మీదకు ఎగిరి ఇంద్రలోకానికి పోతాయి. అక్కడ వాటికి స్వాగత మివ్వడానికి రంభ ఎదురు చూస్తున్నది.''

''ఈ వేళాకోళం ఇక చాలు. జస్బీర్ భాయీ. నువ్వు చెప్పినదంతా నిజమేనా?''

''రాణీ సాహెబా! గుర్రాల పేర్లు వినగానే నాకు ఏడుపొచ్చిందనుకోండి. అయ్యో, అన్ని రేసులలోనూ గెలిచి చివరకో దౌర్భాగ్యుడి బాంబుతో ఈ గుర్రాలు చచ్చిపోతున్నాయే అని విచారిస్తున్నాను.''

రాణీమోహినీదేవి మరి మనసు నిలుపుకోలేక పోయింది. ఆమె భళ్ళున ఏడ్చింది. ఆ గుర్రాలన్నీ అప్పుడే చచ్చిపోతున్నట్లు ఏడ్చింది. ఆ ఏడుపు జస్బీర్ సింగ్‌కి వినిపిస్తోంది. అతను వింటున్నాడు. ఓదార్చను కూడా లేదు. అయిదు నిమిషాల తరువాత అతనే మాట్లాడాడు.

''రాణీ మోహినీ దేవి; ఒక్క జస్బీర్ సింగ్‌కే ఆ ప్రమాదం నుంచి గుర్రాలను రక్షించే రహస్యం తెలుసు. మీరు అవునంటే.... డబ్బు మీకు లెక్కలోది కాదని తెలుసు ఆలోచించి చెప్పండి.''

''ఓ జస్బీర్ భాయీ, ఇంకా ఆలోచనెందుకయ్యా? ఆ బాస్టర్డు బాంబు నుంచి నా గుర్రాలను. నా మాణిక్యాలను, నా కన్న తండ్రులను రక్షించవయ్యా. సేవ్ మీ! సేవ్ మై హార్సెస్.... ఓ గాడ్!''

ఆమెకు మూర్ఛ వచ్చినట్లయింది.

ఆమె మాట్లాడడానికి ప్రయత్నించేసరికి లైన్ తెగిపోయింది.

ఆమె టెలిఫోను దగ్గిరే కుప్ప కూలి పోయింది.

* * *

1-4. శనివారం - సాయంకాలం - 7 గంటల 15 నిమిషాలు
న్యూఢిల్లీ స్టేషను

గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ ఖాళీ బండిని న్యూఢిల్లీ స్టేషనులో ముందు ప్లాట్‌ఫారం మీద సకాలంలో ఉంచారు. ప్రయాణీకులు రిజర్వేషనులు చూసుకుంటున్నారు. అప్పటికి ఏడు గంటల పదిహేను నిమిషాలు అయింది. మరొక్క పదిహేను నిమిషాలలో బండి బయలు దేరుతుంది.

ఆ బండిలో 694వ నంబరుగల ఎయిర్ కండిషన్డ్ ఫస్టు క్లాసు ఒకటి ఉంది. దాని వెనుకను 568వ నంబర్ ఫస్టు క్లాసు ఒకటి వుంది. దానిలో ''డి'' కంపార్టుమెంటులో 4 బెర్తులున్నవి. అవన్నీ మిస్ చిత్రలేఖ అండ్ పార్టీవారికి న్యూఢిల్లీ నుంచి మదరాసు వరకు రిజర్వయిపోయినవి.

ఎయిర్ కండిషను కోచ్‌కి ఫస్టు క్లాసుకి సమీపంలో ప్లాట్‌ఫారమ్ టికెట్ కలెక్టరు రిజర్వేషను ఛార్టులు పట్టుకొని నిలబడ్డాడు. అతనికి ఇరుప్రక్కల ఇద్దరు పెద్దమనుషులు అనిశ్చయమైన పరిస్థితులలో నిలబడి ఉన్నారు.

కొంచెం పొడుగ్గా ఉన్న అతను సోమేశ్వరరావు. అతను సుప్రీం కోర్టుకు పని మీద వచ్చి వారం రోజులై న్యూఢిల్లీలోనే మకాం పెట్టి ఉన్నాడు. సోమవారానికి అతను విధిగా విజయవాడ చేరుకోవాలి. అతని పేరు వెయిటింగ్ లిస్టులో ఉంది.

మధ్యరకం ఎత్తులో ఉన్న అతను జనార్దనశర్మ. అతను విజయవాడలో అసిస్టెంటు ఇంజనీరు (బ్రిడ్జెస్) గా రైల్వేలో పనిచేస్తున్నాడు ఇతని పేరు కూడా వెయిటింగ్ లిస్టులో ఉంది.

లాయరు సోమేశ్వర రావు వయసు ముప్పయికి మించింది. జనార్దన శర్మ వయసు ముప్పయికి లోపు. ఇద్దరూ సూట్లు వేసుకున్నారు. టైలు కట్టుకున్నారు. ఢిల్లీవాలా లందరూ ఈ వేషాలలోనే కనిపిస్తారు.

రావు. శర్మలు టికట్ కలెక్టరు వెనుక పదిహేను నిమిషాలయి పడరాని పాట్లు పడుతున్నారు. ఆ పెద్దమనిషి చాల ఓర్పుతో వారికి బెర్తులు దొరకవని చెప్తున్నాడు.

ఇంతలో ఒక వయసులో ఉన్న వనిత, ఆమె వెనుక మధ్య వయసులో వున్న మహిళ, వారిద్దరి వెనుక నలుగురు కూలీలు నాలుగు విబిపి పెట్టెలు పట్టుకొని అనుసరిస్తూ సదరు ఫస్టుక్లాసు కోచ్‌లోకి ఎక్కి ''డి'' కంపార్ట్‌మెంటులో ప్రవేశించారు. కోచ్ 568 రిజర్వేషను ఛార్టు ఆసరికి కంఠస్థం చేసిన రావ్ అండ్ శర్మలు, పోతున్న అయిదు

ప్రాణాలలోను రెండింటిని ఆశతో నిలబెట్టారు. కొద్ది సేపటిలోనే మరో రెండు ప్రాణాలు కూడా కుదుట పడ్డాయి.

వయ్యారంగా ఆమె నడచి వచ్చింది, టికెట్ కలెక్టరు దగ్గిరికి. ఇంగ్లీషులోనే మాట్లాడింది.

''మిస్, చిత్రలేఖకు నాలుగు బెర్తులు రిజర్వయినవి. అందులో ఇద్దరమే వచ్చాము. నేను చిత్రలేఖను. రెండవ ఆవిడ మా ఆంటీ చిన్నమ్మ. మిగిలిన రెండు బెర్తులు మరెవరికేనా మీరు ఇవ్వ వచ్చు. దయచేసి ఆడవారికి ఇస్తే సంతోషిస్తాను.''

శర్మ ప్రాధేయపడ్డాడు. రావు బ్రతిమాలాడు. తామిద్దరం వెయిటింగ్ లిస్టులో ఉండడం చేత నిరభ్యంతరంగా ఆ బెర్తులు ఇవ్వవచ్చునని వారిద్దరూ వాదించారు.

కాని ఆ టికెట్ కలెక్టరు మొండివాడు. ఆ బెర్తులు ఆడవాళ్ళకే ఇవ్వాలన్నాడు. మిస్ చిత్రలేఖ కోరిక అది.

అయినా పట్టువదలని విక్రమార్కుళ్ళో చిన్నవాడు జనార్దనశర్మ , పరుగెత్తి, సామాను సర్దుకుంటున్న చిత్ర లేఖతో కలసి వివయంగా బెర్తు లిప్పించమని దోసిలి పట్టాడు. ఆమె తెలుగు ముఖాన్ని తేరి చూసి మాతృభాషలోనే మాట్లాడాడు.

''మీరిద్దరూ మగవాళ్ళు. మేం ఇద్దరం ఆడవాళ్ళం, మిమ్మల్ని నమ్మవచ్చా?'' ప్రశ్నించింది మిస్ చిత్రలేఖ అదే భాషలో.

''నా పేరు జనార్దన శర్మ. విజయవాడలో రైల్వేలో నేను అసిస్టెంటు ఇంజనీరుగా పని చేస్తున్నాను. మొదటి తరగతి గజిటెడ్ ఆఫీసరుని. అతని పేరు సోమేశ్వరరావు. అతను వృద్ధిలోకి వస్తున్న క్రిమినల్ లాయరు. మీరు మా ఇద్దరినీ సంపూర్ణంగా విశ్వసించవచ్చు.''

''అయితే నా సమ్మతి ఆ టికెట్ కలెక్టరుకు తెలియచేయండి.''

''మీరు శ్రమ అని తలచకుండా, కొంచెం ద్వారం వరకు వచ్చి చెప్తేనేకాని అతను బెర్తులివ్వడు.''

''సరే''

ఆమె అన్నప్రకారం తలుపు దగ్గర నిలబడి చేయి వూపింది.

కాని ఆ టికెట్ కలెక్టరు చాల తెలివయినవాడు.

శర్మ పేరు వెయిటింగ్ లిస్టులో మూడవది. రావు పేరు నాలుగవది. కాబట్టి మొదటి పేరు రెండవ పేరు వున్నవారికి బెర్తులిస్తానన్నాడా ప్రబుద్ధుడు.

ఇంతలో పసుపుపచ్చ సిగ్నలు లైటు వెలిగింది. మరొక్క అయిదు నిమిషాలలో బండి ప్లాంట్ ఫారమ్ విడిచి పెడుతుంది.

''శర్మగారూ! కొంచెం పక్కకు వెళ్ళండి. వెండి చెప్పుతో కొడితేనే గాని పని సాంతం కాదు'' అన్నాడు రావు తెలుగు భాషలో

శర్మ రెండడుగులు వెనక్కు వేశాడు. రావు జేబులోంచి ఇరవై రూపాయల నోటు తీసి టికెట్ కలెక్టరు చేతిలో ఉంచాడు.

ఛార్టులో రావు, శర్మ పేర్లు ఎక్కిపోయాయి.

కదులుతున్న బండిలోకి ఇద్దరూ సామానుతో పరుగెత్తి ఎక్కిపోయారు.

1.5. శనివారం సాయంకాలం - 7 గంటల 30 నిమిషాలు - కాజీపేట.

సీనియర్ మెయిల్ డ్రయివర్ వెంకట నారాయణ రన్నింగ్ రూమ్ చేరేసరికి సాయం కాలం ఏడు గంటల ముప్పయి నిమిషాలయింది.

సికింద్రాబాదు పోతున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్ సరిగ్గా ఏడు గంటలకు కాజీపేట చేరుకుంది. అయిదు నిమిషాలు ముందుగా వచ్చింది. ఆ ట్రైను నడిపించుకొని వచ్చిన వెంకట నారాయణ కాజీపేటలో దిగిపోయాడు. రన్నింగ్ రూమ్‌కి తిన్నగా వెళ్ళిపోయాడు, అతను.

వర్షం పడుతున్నది. కాని కుండపోతగా కురియడంలేదు. చిత్తడి చిత్తడిగి ఉంది వెంకటనారాయణ తన గది చేరుకోగానే బేరరుకి కబురు పంపాడు. స్నానానికి వేడి నీళ్ళు సిద్ధం చేయమన్నాడు. వర్షంలో తడిసిన బట్టలను విప్పి ఆరవేశాడు. తరువాత బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు.

ఇచ్చిన బకెట్ నీళ్ళు చాల వేడిగా ఉన్నవి. వాటిని క్రమంగా చల్లబరచి, హెచ్చుగా వేడినీళ్ళు స్నానం చేసి, తుడుచుకొని తన గదిలోకి వచ్చాడు. ఆసరికి పరుపు మీద దుప్పటి, తలగడా గలీబు మార్చి మడత వేశారు. తెల్లని పంచ లుంగీ చుట్టుకొని, పరుపుమీద వీర మతం వేసుకొని కూర్చున్నాడు.

భగవద్గీత తెరచి, పారాయణ శ్లోకాలు చదివి, తరువాత రెండవ అధ్యాయం సాంఖ్య యోగం చదివాడు.

ఆ గదిలో మరెవరూ లేరు. సీనియర్ మెయిలు డ్రైవర్లు ఇద్దరి కోసం ఆ గది ప్రత్యేకించారు. గదిలో టేబిలు, కుర్చీ ఉన్నాయి. రెండు మంచాలకు రెండు పంఖాలున్నాయి.

పారాయణ తరువాత గీతా మాహాత్మ్యం శ్లోకాలు చదివి పుస్తకాన్ని జాగ్రత్తగా బైను బాక్సులో పెట్టాడు. తరువాత సావకాశంగా పరుపుమీద నడుము వాల్చాడు.

భోజనానికి ముందు కొన్ని విషయాలను అతను ఆలోచించదలచాడు. భోజనమైన తరువాత హాయిగా పడుక్కొని ఆలోచించబలసినవి చాల సంగతులున్నాయి. ఆ సంగతులు రేపంతా ఆలోచించుకోవాలి. రేపు రాత్రి, అంటే ఆదివారం రాత్రి తొమ్మిది గంటల అయిదు నిమిషాలు ముందు ఆమెను గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌లో కలుసుకునే వరకు ఈ ఆలోచనలు విడిచి పెట్టవు. ఈ ఆకలి కడుపుమీద వాటి గురించి ఆలోచించినా ప్రయోజనం లేదు.

బేరరును పిలిచాడు. వంట ఎంతసేపటిలో తయారవుతుందని అడిగాడు. మరొక్క గంటలో సిద్ధమవుతుందని తెలిసింది.

.... విజయవాడ సరిగా మధ్యాహ్నం మూడుగంటల ఇరవై నిమిషాలకు విడిచి పెట్టాడు. డీసెలు యింజనులలో కొన్ని ఒక మాదిరిగా ఉంటాయి. కొన్ని చికాకు పెట్టకుండా పనిచేస్తాయి. వాట్లలో 18588 నంబరుకల ఇంజను చాల మంచిది. అదృష్టం కొద్ది అది ఇవాళ దొరికింది. తొందరగా వేగాన్ని అందుకొనిగాలిలో, వానలో ఎటువంటి పరిస్థితులలో కూడా లేటవకుండా పరుగెత్తుతుంది. ఆ యింజనును చూడగానే వెంకట నారాయణ శుభశకునాలు తోచినట్లయింది.

విజయవాడలో ఉదయం నుంచి వర్షం తెరలు తెరలుగా కురుస్తున్నది. మధ్యాహ్నానికిగాలి కూడ హెచ్చి, వర్షం విడవకుండా కురుస్తూగాలివానగా మారింది. అంతటి గాలివానలోను యింజను బ్రిడ్జిమీద వెళ్ళేటప్పుడు హారను వాయిస్తే, గాలికి అవి సన్నాయి నొక్కులలా వినిపించేవి. వర్షం తెరలా ఎదురుగా ఉన్న కిటికీలమీద పడుతుంటే, విండోవైపర్సు పనిచేసి వాటిని శుభ్రం చేస్తుండేవి. వర్షపునీరు కాలువలై ప్రవహిస్తుంటే వెంకటనారాయణ మనస్సులో కోరిక పరవళ్ళు తొక్కింది.

కృష్ణా ఎక్స్‌ప్రెస్ డోర్నకల్ సాయంకాలం అయిదుగంటల పదిహేను నిమిషాలకే వచ్చింది. సకాలంలో విడిచిపెట్టింది. మహబూబాబాదు కూడా రెండు నిమిషాలు ముందుగా వచ్చి సకాలంలో అయిదుగంటల నలభై ఎనిమిది నిమిషాలకు విడిచి పెట్టింది.

మహబూబాబాదు విడిచినప్పుడు వెంకట నారాయణ రిస్టువాచీ చూసుకొని, వేళ రాసు కున్నాడు పుస్తకం మీద. తరువాత టై సరిచేసుకున్నాడు. యింజను వేగం పుంజుకొంటున్నది. స్టేషను దాటిపోయిన అరకిలో మీటరు దూరంలో గంటకు నూరు కిలో మీటర్ల వేగాన్ని అందుకొంది.

తాడలపూసపల్లి స్టేషను దాటినప్పుడు వెంకట నారాయణ టైము చూసుకున్నాడు. అయిదు గంటల ఏభై ఐదు నిమిషాలయింది. క్రాసింగుల మీద కొంచెం వేగం తగ్గించాడు. తిరిగి అవుటర్ దాటగానే గంటకు నూరు కిలోమీటర్లు చూపించింది అతని ఎదురుగా నున్న స్పీడో మీటరు.

వెంకట నారాయణ ఆలోచిస్తూ కిటికీ అద్దాలలోంచి కుడిచేతివేపు ఉన్న కొండల వేపు చూశాడు. తన కళ్ళను తానే నమ్మలేక పోయాడు. వెలుగు కొంచెం సన్నగిల్లింది. వర్షం చాల హెచ్చుగా కురుస్తున్నది. కొండల వరుసమీద కాటుక ముద్దలు పేర్చినట్లున్నాయి, ఆమేఘాలు. సుళ్ళు తిరుగుతున్నవి. నాలుగయిదు మెరుపులు ఆ కొండల అంచుల మీద డపాయల్లా అల్లుకున్నవి. ఒక్కసారి ప్రభవించిన కాంతిలో అతనికొక అద్భుత మైన దృశ్యం కనిపించింది. ఆపర్వత శ్రేణి నుంచి పడగలెత్తిన ఆదిశేషుడు తరుముకొని వస్తున్నట్లయింది. రాళ్ళు దొర్లుతూ వస్తున్న మహా శబ్దమొకటి వినవచ్చింది. ఆ శబ్ద ఘోషకు భయపడి అతను ఇంజను హారను మరీ గట్టిగా నొక్కాడు. ఆ హోరునుంచి అతను బయట పడేసరికి కేసముద్రం స్టేషనుదాటిపోయింది. ''రైట్'' అతని అటెండెంటు అన్న మాట అతని మనసులో ఇంకా కొట్టుకుంటున్నది. ''డబుల్ లైను మీద గూడ్సు ట్రెయిను క్రాసయింది సార్! అన్నీ సరీగానే వున్నాయి.''

క్రమంగా వర్షం తగ్గింది. గాలికూడా అంతగా లేదు. వరంగల్‌లో ఒక మాదిరిగా వుంది. కాజీపేట చేరుకునే సరికి చిన్న చిన్న చినుకులు మాత్రమే పడుతున్నవి.

ఇంతలో కిచన్ నుంచి కబురువచ్చింది. భోజనం తయారయిందని, డైనింగ్ హాలులోకి రమ్మనమని.

వెంకటనారాయణ పక్కమీద నుంచిలేచి, తువాలు భుజంమీద వేసుకున్నాడు. ద్వారం వరకు వెళ్ళాడో లేదో మరొక డ్రైవరు అతనికి ఎదురుపడ్డాడు.

''వెంకటనారాయణగారూ! మీరు చాలా చాలా అదృష్టవంతులు, రెప్పపాటు కాలంలో మహా ప్రమాదం నుంచి దాటిపోయారు. మీరే కాదు మీతో వున్న వేలకొలది ప్రయాణీకులు బ్రతికిపోయారు. కొండనాగు పాంగి, వరదలెత్తి, కేసముద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో రెండు లైన్లను తుడిచిపెట్టింది. సాయంకాలం నాలుగు గంటలకు కాజీపేట విడిచి విజయవాడ పోతున్న గూడ్సు ట్రెయిను ప్రమాదంలో చిక్కుకుంది. డ్రైవర్ ఆదినారాయణ అతని అసిస్టెంటు అబ్దుల్‌ఖాదరు, నీళ్ళలో మునిగిపోయిన డీసెలు యింజను నుంచి వెలుపలికి రాలేక పోయారు. గాజు తలుపులు బద్దలు కొట్టి కొన ఊపిరితో ఉన్న వాళ్ళని పైకితీసి వరంగల్ తీసుకుపోయారు. మీరు అదృష్టవంతులని చెప్పడానికి వచ్చాను.''

వెంకట నారాయణ ఒక్కక్షణం నిశ్చేష్టుడయి నిలబడిపోయాడు. తాను, తన అసిస్టెంట్, కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేస్తున్న వేల కొద్ది జనం బ్రతికి బయట పడ్డందుకు తాను కారణం కాదన్నాడు. మీద వాడెవడో రక్షించినందుకు చేతులెత్తి నమస్కారం చేశాడు.

''ఓ భగవంతుడా! నాపై నీవు దయ చూపించినందుకు ధన్యవాదాలు. కాని, అంత కన్న ముఖ్యమైన పని మరొకటి చేయాలి. మా ఆదినారాయణను, మా అబ్దుల్ ఖాదర్‌ను కాపాడు. అదే మాకు పదివేలు.''

తరువాత వంటవాడు స్లేటులో భోజనం వడ్డించాడు.

1.6. శనివారం - సాయంకాలం - 7 గంటల 45 నిమిషాలు - కన్నాట్ ప్లేస్ - న్యూఢిల్లీ.

ఫైరారమ్స్ కంపెనీ యజమాని తన ప్రయివేటు ఛాంబరులో కూర్చొని పనిచేస్తున్నాడు. రెండు ఢిల్లీ బుట్టలు అతని పక్కను బల్లమీద వున్నాయి. పక్కను మరొక స్లైవుడ్ కేసులో ఇటాలియన్ ఆపిల్స్ వున్నాయి.

టేబిలు మీద ప్లాస్టిక్ పెట్టెలో ప్రేలుడు వస్తువొకటి వుంది. దానిమీదనున్న వాచీని సరిగా భారతీయ కాలమానానికి దిద్ది తరువాత దాని అలారమ్‌ను ఒక నిర్ణీతమైన కాలానికి సెట్ చేశాడు. తరువాత ఆ ప్లాస్టిక్ పెట్టెను ఒక బుట్ట అడుగున, మధ్యగా ఉంచి చుట్టూ ఆపిల్ పళ్ళను నింపాడు. పైని కాగితపు తునకలు వుంచి, మూతవేసి, కొక్కెం తగిలించాడు, నైలాను దారంతో మూతను జాగ్రత్తగా దబ్బనంతో కుట్టివేశాడు. శ్రమ పడితేగాని దిని మూత తీయడానికి వీలు లేనంత దగ్గిరగా కుట్టి, దానిని పక్కకు పెట్టాడు. రెండవ బుట్టలో మిగిలిన పళ్ళు పోశాడు. కప్పుమూసి, కొక్కెం తగిలించాడు. దీనిలోని పళ్ళురుచి చూడడానికి ఎటువంటి ఆటంకాలులేవు. రెండింటిమీద ''సోదరి రజియాకు- ప్రేమతో-సుల్తానా-ఆగ్రా'' అని వ్రాసిన లేబిళ్ళు కట్టాడు.

పని అయిన వెంటనే బెల్ నొక్కాడు. పక్కనే వున్న గదిలో కూర్చున్న ఇద్దరిలో రామేశ్వర్ సింగ్ మాత్రం ఛాంబరు తలుపులు తోసుకొని లోనికి వచ్చాడు.

''రామేశ్వర్! ఇవిగో రెండు బుట్టలు ఎనిమిది గంటలకు రెండు నిమిషాలు బాకీ, బీగమ్ సుల్తానా తమ అక్కగారికి పంపిన బహుమతి అనిచెప్తే చాలు. కూపె తలుపులు తెరుచుకుంటవి. తరువాత పని నీకు పూర్తిగా తెలుసు. ఇంకా వివరించవలసినవి ఏవైనా వున్నవా?''

రామేశ్వరసింగ్ అయిదడుగుల పది అంగుళాలు పొడవుంటాడు. తలమీద జుత్తు పలచగా కత్తిరించబడి వుంది. ముఖం వెడల్పుగా వుంది. కళ్ళకోని లోతుల లోతు తెలుసుకోవడం కష్టం. మెలితిరిగిన మీసాలను ఒకసారి తిప్పి, అతను తల పంకించాడు. అంటే మరేమీ జస్బీర్ సింగ్ చెప్ప నక్కరలేదని అర్థం.

జస్బీర్ సింగ్ రామేశ్వరసింగ్ చిన్న నమస్కారంచేసి వెళ్ళిన అయిదు నిమిషాల వరకు కుర్చీమీద అలా కూర్చుండిపోయాడు. దీర్ఘంగా నిట్టూర్చి టెలిఫోను తీసి డైల్ చేయదలచాడు. ఏదో జ్ఞాపకం వచ్చినట్లు ఎత్తిన టెలిఫోనును తిరిగి పెట్టేసి. అల్మారాలోని స్కాచ్‌సీసా, గ్లాసు తీశాడు. ఫ్రిజ్‌లోని ఐసు క్యూబులు తీసి గ్లాసులోవేసి, బంగారు రంగు గల ద్రవాన్ని వాటిమీద పోశాడు. కొద్దిసేపటి తరువాత దానిని సిప్ చేసి, గ్లాసు టేబిలుమీద పెట్టాడు.

''ఒకే గుండుకు రెండు పిట్టలు'' అన్నాడు గట్టిగా.

నవ్వు పెదవులు దాటింది. అతని ఆలోచన ఎప్పుడూ గుళ్ళతో నిండివుంటుంది.

అప్పుడు మిగిలిన ద్రవాన్ని ఒక్క సారిగా తాగి, టెలిఫోను తీసుకున్నాడు, రాణి మోహినీ దేవిగారితో మాట్లాడడానికి.

1.7 శనివారం - రాత్రి - 8 గంటలు - గ్రాండ్ ట్రంక్ ఎక్స్ ప్రెస్ - న్యూఢిల్లీ మధురా స్టేషనులమధ్య.

లాయర్ సోమేశ్వర రావు తదేక దీక్షతో చూస్తున్నాడు.

కంపార్ట్‌మెంటులోని లైట్లు చాలా కాంతితో వెలుగు తున్నాయి.

చిత్రలేఖ సవిలాసంగా చేరబడి, రీడింగ్ లైటు వెలుతురులో హెయిలీ వ్రాసిన ''ఎయిర్‌పోర్టు'' నవల చదువుతున్నది సోమేశ్వర రావుకు ఆమె ముఖం కనిపించలేదు. కాని ఆమె వక్షం మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నది. పయ్యెద తొలగిపోయింది. ఉబికిన పయోధరాలు 'వి' కట్ లోంచి కనిపించడం కాదు. ఆమె సీధ్రూ బ్లౌజ్‌లోంచి వక్షం సొంపులు స్పష్టంగా కనిపిస్తున్నవి. ఆ రసికుడు స్త్రీ శరీరం తెలియనివాడు కాడు. మరి ఈ చిలిపి పని ఎందుకు చేస్తున్నట్లు?

చిత్రలేఖ పాదాల దగ్గిర ఆమె తెచ్చిన సయామ్‌దేశపు పిల్లి జిమ్మీ కూర్చుంది. రాత్రివేళ దాని కనుపాపలలో కలిగిన మార్పు స్పష్టంగా కనిపిస్తున్నది. దాని నల్ల గుడ్లు పెద్దవయాయి. ఈ పిల్లి సాధారణ మైన పిల్లిలా లేదు. పెరిషియన్ పిల్లులకు బొచ్చు

బాగా వుంటుంది. ముచ్చటకు అటు వంటి దానిని పెంచుకుంటే అర్థముంది. కాని ఈ పిల్లికి వెంట్రుకలంతగా దట్టంగా లేవు. దీని చూపులు చాల తీక్షణంగా లాయరు గారి మీద పడుతున్నవి.

తాను చేస్తున్న పనికి ఈ పిల్లి తనమీద కోపం చూపిస్తున్నట్లయింది అతనికి.

''అమ్మాయ్! జిమ్మీకి డిన్నర్ ఆర్డరు చేశావా?'' చిన్నమ్మగారు మీద బెర్తు మీద నుంచి అడిగారు. పావుగంటయి ఆమెపైకి ఎక్కారు. తల నొప్పిగా వుందని మాత్ర వేసుకొని ఆమె మీద బెర్తుమీదికి వెళ్ళి పోయారు.

''అవును ఆంటీ! తొమ్మిది గంటలకు తెస్తున్నారు.'' చిత్రలేఖ పుస్తకం నుంచి చూపు మరల్చకుండానే చెప్పింది. ఆమె కాళ్ళ దగ్గిర రెస్టు తీసుకుంటున్న జిమ్మి మెల్లగా ఆవులించింది.

సోమేశ్వర రావు చూపులు యథాప్రకారం ఆమె విపుల వక్షం మీదికి మరలిపోయాయి. అతని కుతూహలానికి కారణం లేకపోలేదు. బ్లవుజ్ మీద కనిపించిన పూవు డిజైను, బట్టమీద లేదు. ఆమె పయోధరాలమీదే దానిని పేయింట్ చేసినట్లు తెలిసి అతను ఆశ్చర్య పోయాడు.

మగవాళ్ళిద్దరూ పెద్ద మనుషులని నమ్మి బెర్తు లిప్పించిందామె. అందులోకి, వృద్ధిలోకి వస్తున్న క్రిమినల్ లాయరు ఇటువంటి పనులు చేయడం సమంజసంగా లేదు. బహుశా ఆమె కూడా ఆ విధంగానే భావించిందేమో, ఒక్క సారి పుస్తకం పక్కకు పెట్టి అతనివేపు తిరిగింది. సూటిగా ఒకే ఒక్క ప్రశ్నించింది.

''ఏమిటలా మతిపోయి చూస్తున్నారు?''

సోమేశ్వరరావు తమాయించుకున్నాడు.

''మీరు తదేక ధ్యానంతో ఇంగ్లీషు నవల చదువుతున్నారు. సాధారణంగా మన మహిళలు తెలుగు నవలలు మాత్రమే చదువుతుంటారు. అందుకు భిన్నంగా మీరు ''ఎయిర్ పోర్టు'' వంటి నవలను శ్రద్ధతో చదువుతున్నారు. మిమ్మల్ని ఎలా అభినందించాలో నాకు తెలియడం లేదు.''

చిత్రలేఖ నవ్వింది. అప్పుడు పయ్యెద సరిచేసుకుంది.

''అందరు మగవాళ్ళకు మల్లే మీకు కూడా ఆడవాళ్ళమీద సద్భావం లేదు. ఎమ్.సి.పి. ల కున్న దుర్గుణమే ఇది.''

''మేల్ ఛావనిస్ట్ పిగ్'' - ఎంత మాట ప్రయోగించిందీ కొంటెది? చాల గట్టి దెబ్బ కొట్టిందీమె! ఏ వుమెన్స్ లిబ్ బ్రాంచి కీమె సెక్రెటరీయో? జాగ్రత్తగా మాట్లాడాలి.

''సాధారణంగా మహిళలు రొమాన్సులు చదువుతారు. ఇటువంటి సస్పెన్స్ థ్రిల్లర్లు చదివి అర్థం చేసుకోవలసిన ఆడవాళ్ళు నాకెవరూ ఇప్పటివరకు కనిపించలేదు. అందుచేత మిమ్మల్ని అభినందిస్తున్నాను మరోసారి.''

తరువాత ఆమె చాల ఇంగ్లీషు నవలల గురించి అతనితో చర్చించింది. ఇర్వింగ్ వాలేస్, హెరాల్డ్ రాబిన్స్, లుడ్ లుమ్ మొదలైన వారిని గురించి చాల తేలికగా మాట్లాడింది. వాట్లలోని సెక్సు గురించి, రిసెర్చ్ గురించి, వాస్తవికత గురించి చెప్పింది. సోమేశ్వరరావు ఓడిపోలేదు, ఆమెను చూస్తూ ఆమె మాటలు వింటూ చాల చాల ఆనందిస్తున్నాడు.

ఆనందానికి నోచుకోని వాడు జనార్దన శర్మ.

చక్కని యువతితో సరసమైన సాహిత్య ప్రసంగం జరుగుతుంటే దానిలో పాల్గొనకుండా తన సంకుచిత ప్రపంచంలో, బావిలోని కప్పకు మల్లె జీవించడం ఆమోదించ తగ్గది కాదు. కాని అతనికి ఒక్కటే ఆలోచన!

.... ఏడుగంటల ముప్పయి నిమిషాలకు న్యూఢిల్లీ ప్లాట్ ఫారమ్ వదులుతున్న గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ ఇరవైగజాల మేరకు నడిచి, గార్డు బ్రేకు వేసి ఎర్రదీపం చూపించడంతో ఆగిపోయింది. ఎందుకాగిపోయిందో తెలుసుకొడానికి అతను తలుపు దగ్గిర నిలబడి ప్లాట్ ఫారమ్ వేపు చూశాడు.

పాడవుగా కొంచెం స్థూలంగా, చలువ జోడు పెట్టుకొని నోటిలో పైపు వుంచుకుని తొందరలేకుండా నడిచి వస్తున్న పెద్దమనిషి, అతని వెనుక సామాను మోసుకొస్తున్న రైల్వే పోర్టర్లను చూశాడు. ఆపెద్ద మనిషి ఫస్టు క్లాసు దాటి ఎయిర్ కండిషన్డు కోచ్ దగ్గిర నిలబడ్డాడు. కొద్ది సేపటిలో తలుపు తెరిచిన తరువాత లోపలికి ప్రవేశించాడు. పోర్టర్ల తలల మీద వి ఐ పి సూట్ కేసులు, ఏడుగురు తలల మీద ఏడు, చివరి ఎనిమిదో పోర్టరు తలమీద ఒక గులాబీ రంగు కాగితం చుట్టి, ఆకు పచ్చని నైలాను రిబ్బను కట్టిన గిఫ్ట్ పార్సెలు చూశాడు. అందరూ ఏసి కోచ్‌లోకి దూరారు. సామాను లోపల ఉంచి అయిదు నిమిషాలలో పోర్టరులందరూ తిరిగి వచ్చారు. తరువాత రైలు కదిలింది.

ఇది సర్వసాధారణంగా ఏసీ ప్యాసింజరు అందుకునే మర్యాద. దాన్ని గురించి ఇంతగా తల బద్దలు కొట్టుకోవడం దేనికి?

ఆ పెద్ద మనిషిని ఎక్కడో చూసినట్లనిపించింది జనార్దన శర్మకు. ఎప్పుడో ఏమిటి - యీరోజే, మధ్యాహ్నం, పన్నెండున్నరనుంచీ ఒంటిగంటున్నర వరకు, తనకు పది అడుగుల దూరంలో ఫైరారమ్ము కంపెనీలో, దాని యజమాని జస్బీర్ సింగ్‌తో చాల ఉల్లాసంగా మాట్లాడుతూ, పెగ్గు మీద పెగ్గు సేవించిన పెద్ద మనిషి ఇతను.

జస్బీర్ సింగ్ చాల సాంకేతిక విషయాలు మాట్లాడాడు. ఆ వచ్చిన అతనిని 'కుమార్ జీ' అని పదేపదే సంబోధించాడు. ప్రేలుడు వస్తువుల ఆధునిక నిర్మాణం గురించి అతనితో చెప్పాడు. నోబెలు, ట్రైనైట్రో టోలూను - దానికి 140 శాతం శక్తి వంతమైన గ్లిసెరిన్ నైట్రేటు - జిలాటిన్‌డై నమైట్ - మొదలైన పదాలు దొర్లించాడా సింగు తరువాత మిడిలీస్టు, అరబ్ దేశాల నుంచి స్మగుల్ అయి ఒకే ఒక్క పీస్ వచ్చింద న్నాడు. దాని ధర చిన్న కాగితం మీద వ్రాసి చూపించాడు. అప్పుడా ''కుమార్ జీ'' అన్న పెద్దమనిషి మారు బేరమేనా ఆడకుండా బ్రీఫ్ కేసులోంచి చెక్ బుక్ తీసి చెక్కు వ్రాసి ఇచ్చాడు. ఒక అయిదు నిమిషాలు జస్బీర్ సింగ్ లోపలికి పోయి వచ్చాడు. సరిగా సెట్ చేశానని అన్నాడు కస్టమర్‌తో.

తరువాత సర్దార్‌జీ ఆల్ మరా తెరచి బాటిల్ పైకి తీశాడు గ్లాసులు, సోడాలు, అయిసు ముక్కలు, రోసైడ్ కాజూ అన్నీ వచ్చాయి. అదే గదిలో, మూలకున్న టేబిలు దగ్గిర కూర్చున్న మరొక మనిషి సంగతి కూడా వాళ్ళు మరచిపోయారు.

జస్బీర్ రహస్యంగా కుమార్ జీని చెవిలో ఏదో అడిగినట్టున్నాడు. దానికి జవా బుగా ఆ కుమార్‌జీ చేతులూపుకుంటూ చెప్పాడు. పెద్దనది, దాని మీద ఓ బ్రిడ్జి, దాని మీద ఓ రైలు బండి. అన్నవి జ్ఞాపకమున్నవి. రణజిత్, చంద్రగుప్త శశాంక పెద్ద పేలుడు, బ్రిడ్జి తునియలై, దాని మీదరైలు మీదకెగిరి, వాగములలోని గుర్రాలు ఆకాశాని కెగిరి, నదిలోపడి... ఆ కుమార్‌జీ ఆనందంతో వర్ణిస్తున్నాడు.

ఈ తతంగం అంతా తనకేమో ఆనంద మనిపించలేదు.

మరొక్క పది నిమిషాలలో గులాబీ రంగు కాగితం చుట్టి, ఆకు పచ్చని నైలాను రిబ్బను కట్టిన గిఫ్ట్ పార్సెలు ఒకటి, కంపెనీ మనిషి ఒకడు తన ఎదుటే లోపలనుంచి తీసుకొచ్చి కుమార్‌జీ కారులో పెట్టడానికి వెళ్ళాడు.

తరువాత ఇద్దరూ కరచాలనాలు చేసుకున్నారు. అప్పుడు సర్దార్‌జీ ఒక మాట అన్నాడు.

''కుమార్ జీ! సెట్ చేసిన టైమ్స్ మాత్రం మరచిపోకండీ!''

కుమార్ జీ వెళ్ళిన పది నిమిషాలలో తన డిటనేటరు ఆర్డరు గురించి జవాబు చెప్పి పంపించాడు జస్బీర్ సింగ్.

జస్బీర్ సింగ్ దగ్గిర ప్రజంటేషన్ ఆర్టికల్సు ఏమున్నవి?

రివాల్వరులు, డబల్ బేరల్ తుపాకులు, తూటాలు, డిటనేటరు, ఇంకా ఇతర విధాలయిన ప్రేలుడు సామగ్రి, ఇంకా పోతే బాంబులు.

అయితే వీటిని సెబ్ చేయడం దేనికి?

జనార్దన శర్మ ఆలోచించాడు.

ఈ పెద్ద మనిషి కుమార్ జీ ప్రాద్దున పదిన్నరకు రైల్వే బోర్డులో కూడా కనిపించాడు. డైరెక్టరు ఒకరితో ఇతను మాట్లాడుతున్నాడు. ఆ డైరెక్టరు స్టెనో విసుక్కుంటున్నాడు.

''శర్మగారూ! ఈ డబ్బుగల వాళ్ళకి మరేదీ ధ్యాస వుండదు. రేసులు, గుర్రాలు, లాటరీలు. ఈ పెద్ద మనిషెవడో రేస్ హార్సు స్పెషలు గురించి చంపుకుతింటున్నాడు. కలకత్తా వాళ్ళు తిన్నగా చెప్పరు'' అన్నాడు తనతో.

బోర్డులో మరో రెండు సెక్షన్లకు పోయి కన్మాట్ ప్లేస్‌కు వెళ్ళేసరికి పన్నెండు దాటిపోయింది. జస్బీర్ సింగ్‌తో మాట్లాడి తమ ఆర్డరుకు సంబంధించిన కాగితాలు తెప్పించే సరికి ఈ ''కుమార్ జీ'' దాపురించి ఈ చికాకులన్నీ తెచ్చిపెట్టాడు.

ఇప్పటి వరకు దొరికిన సమాచారాన్ని బట్టి కొన్ని సంగతులు నిర్ధారణ అవుతున్నవి.

ఈ కుమార్‌జీ ఒక బాంబు కొన్నాడు. దానిని సెట్ చేశారు. కాబట్టి అది టైంబాంబు.

ఆ బాంబును ఉపయోగిస్తే ఒక బ్రిడ్జి బద్దలవుతుంది. దాని మీద పోతున్న గుర్రాలు ఎలా పోతున్నవి? నడిచా - కాదు - రేస్ హార్స్ స్పెషల్ - అంటే రైలులో - రైలు బ్రిడ్జిని పేలుస్తున్నాడీ ప్రబుద్ధుడు.

ఎంత ఘోరం, ఆ నది, కృష్ణ అయి, ఆ బ్రిడ్జి తన పర్యవేక్షణలో నిదై

జనార్దన శర్మకు మతిపోయింది.

ముఖంనిండా చెమటలు నిండిపోయాయి.

తలెత్తి ఎదుట చూశాడు. చిత్రలేఖ నవ్వుతూ రావుగారితో మాట్లాడుతున్నది. ఈ జాతీయ విపత్తు తెలియని వీళ్ళెంత అదృష్టవంతులు!

1.8 శనివారం. రాత్రి - 8 గంటల 15 నిమిషాలు

రాణీ మోహినీ దేవి ఫారమ్-టుండ్లా.

రాణీమోహినీదేవి ఇప్పుడు తన పడకగదిలో ఫోమ్ బెడ్ మీద శరీరాన్ని వాల్చింది. పక్కనే బల్ల మీద టెలిఫోను వుంది. ఇది లైబ్రరీ లోని ఫోనుకు ఎక్స్‌టెన్షన్. అది గాక మరొకటి ప్రత్యేకంగా పడకగదిలో వుంది. దాని నంబరు ఇద్దరికే తెలుసు-తనకూ, విశ్వనాథసింగ్‌కు, టెలిఫోను శాఖ వారిని విడిచి పెట్టి ..

ఎక్స్‌టెన్షన్ టెలిఫోను లేత ఆకుపచ్చ రంగులో వుంది. దిని రింగ్ కూడా శ్రావ్యంగా వినిపిస్తుంది.

రాణీ మెహినీ దేవి లైబ్రరీలో మరి కూర్చోలేకపోయింది. ప్రధాన దాసి తెచ్చిన బాదంఖీర్, చల్లనిది తాగి జస్ట్‌బీర్ నుంచి వార్తకోసం ఎదురుచూస్తున్నది.

ఈ పందెపు గుర్రాల మోజు అయిదు సంవత్సరాల నుంచీ తన జీవితరంగం లోకి ప్రవేశించినా, అంతకుముందు పది సంవత్సరాల నుంచి గుర్రపు పందాల మోజు ఆమెకు జాస్తీగా వుండేది. ఈ కారణం చేతనే భార్యాభర్తలు వేరుగా వుంటున్నారు. లోకం దృష్టిలో చాల కారణాలు ఇంకా వారిని వేరుచేసినవి వున్నాయి.

కుమార రాజాకి గుర్రాలన్నా, గుర్రపు పందాలన్నా అరికాలిమంట. ఎందుకంటే అతను తన పదిహేనవ ఏట తొలి సారి గుర్రం ఎక్కాడు. అదే ఆఖరిసారి కూడా. చేయెత్తు పాడుగనున్న గుర్రం అతనిని పడదోయడమే కాకుండా, ముందు కాళ్ళెత్తి కొట్టబోయింది. అదృష్టవ శాత్తు మా లీసు చేసే సైస్ రక్షించబట్టి సరిపోయింది. లేకపోతే ముఖం పచ్చడ యిపోయి వుండేది. ఇక గుర్రపు పందాల విషయంలో, రాణీ మోహినీ దేవి అంటే ఎంత కోపమో, గుర్రపు పందాలన్నా అంత కోపమే. దానికి కారణం తాను పందాలలో ఓడిపో వడం కాదు, రాణీ మోహినీ దేవి గెలవడమే.

రాణీ మోహినీ దేవికి తల్లిదండ్రుల జమీ సంక్రమించింది. టుండ్లా దగ్గిర చాల ఎకరాల భూములు, ఫరీదాబాదులోని చాల కంపెనీలలో అధికభాగం షేర్లు వున్నాయి.

రామ్‌నగర్ రాజభవనంలో ఆమె కుమార రాజాతో కాపురం చేసినది అయిదు సంవత్సరాలు మాత్రమే. తరువాత ఎవరి బ్రతుకులు వారు బ్రతుకుతున్నారు, ప్రతిసంవత్సరం ద్వేషాలు పెంచుకుంటూ.

రాణీ మోహినీదేవి ఈ గుర్రాల పెంపకం ఫారమ్ మొదలు పెట్టి ఇప్పటికి రెండు కోట్ల రూపాయిలు ఖర్చు పెట్టింది. ప్రస్తుతం నూరు గుర్రాలు అందులో పెంచుతున్నది. వాటిలో పాతిక మగ గుర్రాలు, మిగిలినవి ఆడ గుర్రాలు. ప్రతీ గుర్రానికీ ఒక చరిత్ర వుంది. ఏడు తరాల వరకు ప్రతీ గుర్రానికున్న తండ్రి తాతల చరిత్ర సేకరించి. గుర్రానికో ఫైలు తెరచిందామె. ఆ గుర్రాల చరిత్రను రెండేసి సంవత్సరాల కొకసారి ముద్రిస్తుంది.

ఫారమ్‌ను రిజిస్టర్ చేయించి, రెండేసి సంవత్సరాలకొక సారి ఒక మగగుర్రాన్నీ, ప్రతీ ఏడు రెండు ఆడ గుర్రాలను విదేశాల నుంచి దిగుమతి చేసి తెచ్చిందామె. ఆడ గుర్రం చూలుతో వుంటే, లోపలనున్న గుర్రపు పిల్లతో కూడా వెలకట్టి అమ్ముతారు. ఒకొక్కసారి పెద్ద పెద్ద పందాలలో గెలిచిన గుర్రానికి పుట్టిన పిల్లలు ఎందుకూ పనికి రాకుండా పోతాయి. అక్షలలోనే వ్యాపారమంతా.

ఈ గుర్రాల కోసం వాటి పెంపకం కోసం ఆమె డబ్బు వ్యయం చేయడమే కాక, చాల అనుభవం గడించింది. హిందూ దేశంలోనున్న కొద్ది ఫారమ్‌లలోనూ, రాణీమోహినీ దేవి ఫారమ్ చాల ఆధునికమైనదని అందరూ ఏకకంఠంతో అంగీకరిస్తారు.

ఫారమ్ రెండు వందల ఏభై ఎకరాలలో వుంది. అందులో గుర్రాలు చాల స్వేచ్ఛగా విహరిస్తాయి. వాటి శాలలను చాల శుభ్రంగా వుంచుతారు. డి.డి.టి. కొట్టి ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటారు. ఫారమ్‌లో ఆల్ఫా ఆల్ఫా జాతికి చెందిన గడ్డిని పెంచుతారు. మూడుసార్లు పచ్చగడ్డితో మేపుతారు. గోధుమ పొట్టు, ఓట్లు, కాల్షియమ్, విటమిన్లు, ఇలాంటివెన్నో వాటి పోషకాహారంలో ఉంటాయి.

రాణీ మోహినీ దేవి ఫారమ్‌లో గుర్రాలకు రాజపూజ్యమైన ఉపచారాలు జరుగుతాయి.

రాత్రి మేసుకోవాలంటే మెర్క్యూరీ దీపాల దేదీప్యమైన కాంతిలో ఆ గుర్రాలు యథేచ్ఛగా విహరిస్తాయి.

గుర్రాల ఆరోగ్యం కోసం ఆమె చాల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకున్నది. ఆరుగురు పశుశైద్యులలో అయిదుగురు అమెరికాలో ప్రత్యేకమైన శిక్షణ పొందినవారే. వైద్య పరీక్ష

కోసం స్టైరైల్ పాథలాజికల్ రూము, నెలలు నిండకముందు పుట్టిన గుర్రపు పిల్లలకోసం ఇంక్యుబేటరు ఇంకా ఇంకా ఎన్నో పందాలలో దెబ్బలు తిన్న గుర్రాలకు బ్లడ్ ట్రాన్స్ ఫ్యూజను చేయడం- ఇవన్నీ సాధారణమైనవి ఆ ఫారమ్‌లో.

గుర్రాలకు మంచి వ్యాయామం అవసరం. నాలుగు సంవత్సరాల ప్రాయంలో గుర్రం చాల చురుకుగా ఉంటుంది. ఒక ఏడాది పాటు దాని ప్రతిభ, అందం నిలిచి ఉంటాయి.

ఇది ఒక ప్రత్యేకమైన లోకం. ఇందులో మామూలుగా గుర్రాలను మాలిష్ చేసే సైస్ కూడా స్పెషలిస్టే, గుర్రాలకు శిక్షణ ఇచ్చేవారు, నడిపించే జాకీలు దేశంలో చాల తక్కువమంది ఉన్నారు. వాళ్ళకు మంచి గిరాకీ.

దేశంలో రమారమి నూరుకోట్లు రూపాయలు గుర్రపు పందాల సందర్భంలో చేతులు మారుతుంటాయి. గుర్రంగెలిస్తే పందెం సొమ్ము ఏడు లక్షలలో రెండు లక్షలు యజమానికి ముడతాయి.

రాణీమోహినీదేవి గుర్రాలు దేశంలో చాలచోట్ల, పూనా, మద్రాసు, మైసూరు, ఊటీ, బొంబాయి మొదలైన చోట్ల పందాలుగెలుచుకున్నాయి. వచ్చే ఏడాదికి హైదరాబాదులో రేస్ కోర్సుక్లబ్ వారి చార్‌మీనార్ ఇన్విటేషను కప్పు కోసం వాటిని తీసుకొని పోవడినికి ఏర్పాట్లు జరిగాయి.

దేశంలోని రమారమి మూడువందల గుర్రాల చరిత్రను తయారుచేశారు. వాటిలో కొన్ని రాణీమోహినీదేవి ఫారమ్‌లో ఉన్నాయి.

పందెంగెలుచుకున్న గుర్రం యజమానికి సంపాదించేది అంతంత మాత్రంగా రెండు లక్షల వరకే ఉంటుంది. కాని విదేశాలలోని వేలాలలో పాల్గొన్న గుర్రం ఒకప్పుడు కోట్ల రూపాయల సంపదను తెచ్చి పెడుతుంది. రాణీ మోహినీ దేవి ప్రయత్నాలన్నీ ఈ ఏనుగు కుంభస్థలాన్ని కొట్టడానికే.

విదేశ విపణిలో అరబ్‌షేక్‌లు కోట్ల కొలది రూపాయలు గవ్వలలా పారేసి జాతి గుర్రాన్ని కొంటారు. ఆ స్థితికి రావాలంటే ఆ గుర్రం చాల పందాలలో గెలవాలి. రాణీ మోహినీ దేవి గుర్రాలు ఆ విధంగా ప్రగతి మార్గంలోనే వున్నవి. దేశంలో చాల పందాలు గెలుచుకున్నవి. వచ్చే యేడు హైదరాబాదు పందాలలో అవి పాల్గొన్న తరువాత ఇంగ్లాండులో డర్బీ రేసులలో వాటిని పరుగెత్తించి, పందాలు గెలిస్తే ఈ శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది.

రాణీ మోహినీ దేవి ఆలోచిస్తున్నది.

ఈ రోజు ఎంత చక్కనిది! కానీ జస్టీర్ ఆనందాన్ని పాడుచేశాడు.

ఉదయం ఎనిమిది గంటలకు కార్య క్రమం మొదలయింది. ఎదకొచ్చిన ఆడ గుర్రాన్ని ముందు సీనియర్ డాక్టరు స్మియర్ తీసుకొని పరీక్షచేసి ఆమోదించాడు. తరువాత దానిముందు ఒక మామూలు మగ గుర్రాన్ని నిలిపారు. ఆడ గుర్రం ఎదకు రాక పోతే మగ గుర్రాన్ని దగ్గిరికి రానీయదు. వెనుక కాళ్ళతో తంతుంది.

ఈ ట్రయల్ జరిగిన తరువాత అసలైన జాతి మొగ గుర్రాన్ని లోపలికి వదిలారు. ఇది గ్యారంటీగా గర్భం నిలబడే ప్రయత్న మన్నమాట. దీనికి లక్షలరూపాయలు ఖర్చు. ఈ ఖర్చుకామె విచారించలేదు. క్రిందటి సంవత్సరం గ్యారంటీ ఎందుకని పాతికవేల రూపాయలకే గర్భధారణ జరిపించాలనంటే బెడిసి కొట్టింది. ఆడ గుర్రానికి జెనిటిక్ ఎక్జిమా సంప్రాప్తమయి. గర్భం నిలవలేదు కదా, రోగం మూలాన అది మళ్ళా దారి బట్టలేదు ఇంతవరకు.

పొద్దున ఈ తతంగాన్ని ఇద్దరే పర్యవేక్షించారు. తాను, విశ్వనాథసింగ్. విశ్వనాథ సింగ్ లంచ్ తరువాత తనను ఆగ్రా తీసుకొని పోయి, బాహువులలో బంధించి సాయం కాలం వరకు విడువలేదు.

తీయని అనుభూతులను నెమరువేసు కుంటూ, హాయిగా రాత్రి విశ్రాంతి తీసు కుందామనుకుంది ఆమె.

కాని ఈ జస్టీర్ అంత ఆనందాన్ని పాడుచేశాడు.

ప్రతీ నెల కొన్ని లక్షలు ఖర్చుపెట్టి, ఫారమ్‌లోని వారినందరిని చాల ఆదరంగా చూసి, వారి విశ్వాసాన్ని చూరగొని, పెట్టుబడిమీద లాభాలు సంపాదించవలసిన వేళలో ఈ ఉపద్రవం తెచ్చి పెట్టాడు ఆ పెద్దమనిషి, కుమారరాజా.

ఆమె ఆలోచనలో వేగములలో ప్రయాణం చేస్తున్న గుర్రాలు మెదిలాయి. దారిలో ఒక నదిమీద ఆ స్పెషలు నడుస్తుంటే బాంబుపేలి, బ్రిడ్జిముక్కలయి, వేగనులు పైకెగిరి, గుర్రాలు నీటబడతాయి.

ఆమెకేదో జ్ఞాపకం వచ్చింది. గుర్రాలు నీటిలో పడినా ఈదుకొని సులువుగా ఒడ్డు చేరుకోగలవు.

కాని ఈ ఆశ నిరాశ అయింది. రైలు వేగంతో పాటు నదిలో పడిన గుర్రాలు తేలవు- మునిగి చచ్చిపోతాయి, వాటిలో ఇరుక్కొని.

ఆమెకు మళ్ళా ఏడుపొస్తున్నది.

ఇంతలో టెలిఫోను మ్రైగింది.

''హలో!''

''రాణీ సాహెబా! ఏర్పాట్లు పూర్తి చేయించాను ఆ బాంబును దొంగిలించి తేవడానికి మనుషులు అప్పుడే వెళ్ళిపోయారు. ఇక మీద ఇటువంటి ఇబ్బంది మీకు కలుగ కుండా మరో గట్టి పని కూడా చేశాను.''

''థ్యాంక్స్! థాంక్స్! జస్బీర్ భాయి! నా ప్రాణం నిలబెట్టావు.''

''రాణీ సాహెబా! ఈ జస్బీర్ బాయి ఉండగా మీకు భయమెందుకు? ఈ ప్రయత్నమంతటికి పదిహేను వేలు అయింది. దయచేసి రేపు చెక్కు పంపుతారు కదూ!''

''ష్యూర్! ష్యూర్!!''

''రాణీ సాహెబా! హాయిగా నిద్రపొండి. విష్‌యు గుడ్‌నైట్!''

1.9 శనివారం- రాత్రి-8 గంటల 30 నిమిషాలు- గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్- న్యూఢిల్లీ-మధురాల మధ్య.

చిత్రలేఖ ఒక్కసారి ఫకాలున నవ్వింది.

లాయర్ సోమేశ్వరరావు ఒక చిన్నవిట్ విసిరాడు.

నవ్వుతూ చిత్రలేఖ ఎదురు బెర్తు చివరను కూర్చున్న జనార్దన శర్మవేపు చూసింది. అతని ముఖం చెమటతో నిండిపోయింది.

నవ్వుతున్న ఆమెను జనార్దనశర్మ తల ఎత్తి చూశాడు.

''హలో శర్మగారూ! పడుకోకుండానే పీడకల వచ్చినట్లుందే?'' అంది చిత్రలేఖ.

సోమేశ్వర రావు కూడా శర్మవేపే చూశాడు.

శర్మ రుమాలుతో ముఖం తుడుచుకున్నాడు.

''మిమ్మల్ని చూచినట్లుంది ఎక్కడో. చాల పరిచయమున్న ముఖంలా ఉంది'' అప్రయత్నంగా అన్నాడు శర్మ.

''చెప్పండి ఎక్కడ చూశారో'' అంది చిత్రలేఖ.

''ఈ వారం సినిమా వారపత్రిక మీద వున్న చిత్రం అచ్చంగా మిమ్మల్నే పోలి వుంది. ఆ బొమ్మకూ, మీకు ఒకటే తేడా మీరు శరీరం నిండా బట్టలు వేసుకున్నారు, ఆ బొమ్మకు చాల తక్కువగా వేశారు. ఆమె పేరు, మీ పేరు ఒక్కటే.''

చిత్రలేఖ విరగబడి నవ్వింది.

సోమేశ్వరరావు కూడా ఆమె వేపు ఆశ్చర్యంతో చూశాడు.

''బలేవారు మీ ఇద్దరు మిత్రులు. నన్ను గుర్తుపట్టడానికి ఒక గంటపైగా పట్టిందన్నమాట.''

''సెక్స్ బాంబ్ చిత్రలేఖ మీరేనన్న మాట?'' సోమేశ్వరరావు ప్రశ్నించాడు.

జవాబుగా చిత్రలేఖ చిన్న నవ్వు నవ్వింది.

జనార్దనశర్మ పిచ్చిగా చిత్రలేఖ ముఖంలోకి చూస్తున్నాడు. అతని మనసులో ఎన్నో ఆలోచనలు. పెద్ద పెద్ద సీక్రెట్ సర్వీస్ మిషన్లలో అందమయిన ఆడవారు ప్రముఖ పాత్రలు వహిస్తారు. ఈ చిత్రలేఖ ప్రస్తుతం సంభవించనున్న ఉపద్రవం నుంచి వేలకొలది మనుష్యుల జీవితాలను, లక్షలు విలువజేసే ప్రభుత్వపు ఆస్తులను కాపాడడానికి సహాయకారి కాగలదు.

''ఏమిటలా మతి పోయి నావేపు చూస్తున్నారు?'' చిత్రలేఖ ప్రశ్నించింది.

''మనందరం పెద్ద ప్రమాదంలో చిక్కుకున్నాము. ఉన్న పాళంగా గొలుసు లాగి, రైలాపి, ఎయిర్ కండిషన్డు కోచిలోని పాసంజర్లను సెర్చ్ చేయాలి, ప్రేలుడు వస్తువులను రైలు పెట్టెలో తీసుకొని పోవడం పెద్దనేరం.''

''మీకు నిజంగానే పిచ్చెక్కినట్లుంది'' అంది చిత్రలేఖ అతనివేపు ఆశ్చర్యంగా చూస్తూ.

''విషయం సావకాశంగా వినండి. నేను ప్రార్దున్న రైల్వే బోర్డుకు వెళ్ళాను. అక్కడో పెద్దమనిషి రేస్ హార్సు స్పెషలు ట్రెయినును గురించి వివరాలు సేకరిస్తున్నాడు. మధ్యాహ్నం తూటాలు. బాంబులు అమ్మే కంపెనీలో ఆ పెద్దమనిషి ఎదురయ్యాడు. అక్కడ తనొక

చాల విలువైన వస్తువు కొన్నాడు. దానిని ఒక గిఫ్ట్ పార్సెలుగా కట్టి కంపెనీ యజమాని ఆ పెద్దమనిషి కారులో పెట్టించాడు. న్యూఢిల్లీ స్టేషనులో బయలుదేరి ఇరవై గజాలు వెళ్ళిన మనరైలును ఆపేశారు. ఎయిర్ కండిషన్డు ఫస్టు క్లాసు ప్యాసింజరు ఒకతను సామానుతో రైలెక్కాడు. అతని సామానులలో ఆఖరిది ఈ గిఫ్ట్ పార్సెలు. పింక్ కలర్ పేపరు చుట్టి దానిమీద ఆకుపచ్చని నైలాను రిబ్బను కట్టినదా చిన్న పార్సెలు. ఆ ప్యాసంజరు కూడా మధ్యాహ్నం చూసిన పెద్దమనిషే. అందుకే నేను భయపడ్డాను.

''శర్మ గారూ! మీ మాటలు నాకు అర్థమవడం లేదు. ఆ గిఫ్ట్ పార్సెలు లోని వస్తువు ప్రమాదకరమైనదని ఎలాతెలుసు?'' సోమేశ్వరరావు ప్రశ్నించాడు.

''వినండి. ఆ వస్తువు కొన్నతరువాత కంపెనీ యజమాని, మన పెద్దమనిషితో కలిసి బాటిల్ తెరచి తాగడం మొదలు పెట్టాడు. అప్పుడా పెద్దమనిషి మాటలు కొన్ని వినబడ్డాయి. ప్రవహిస్తున్న నది- నదిపైన బ్రిడ్జి- బ్రిడ్జిమీద స్పీడుగా పోతున్న రైలు. బ్రిడ్జి పేలిపోతుంది. రైలు పెట్టెలు విరిగిపోతాయి. వాటిలోని ప్రవహించే నదిలో పడి కొట్టుకుపోతాయి. రణజిత్, నీటిలో పడినగుర్రాలకు రెక్కలొస్తాయి. చంద్రగుప్త, శశాంక, వీటికోసం రంభ ఎదురు చూస్తూన్నది... ఆ విన్న మాటలన్నీ, ఈ పెద్దమనిషి రైలెక్కుతుంటే జ్ఞాపకానికి వచ్చాయి. కాబట్టి ఆ గిఫ్ట్ పార్సెలులో ఏదో ప్రమాదకరమైన ప్రేలుడు వస్తువుంది. కంపెనీ యజమాని దానిని సెట్ చేసి, ఆ టైము మరచిపోవద్దని పెద్దమనిషిని హెచ్చరించాడు.''

''ఒకవేళ ఆ పార్సెలులో ఏదో బహుమతి వుంటే అప్పుడు సెర్చ్ చేసిన జనార్దన శర్మను అతను కోర్టు కెక్కించగలడు'' అన్నాడు సోమేశ్వర రావు.

''శర్మగారూ! రావుగారూ! ఇప్పటికి మన దగ్గిర వున్న విషయాలను క్రోడీకరిద్దాము. దీనిలోని రహస్యం బయటపడవచ్చు'' అంది చిత్రలేఖ.

''అవును మీ సలహా బాగుంది'' అన్నాడు శర్మ, విధేయుడైన విద్యార్థివలె.

''మూడు రోజుల క్రింద టి.వి.లో కలకత్తా గుర్రపు పందాలు చూపించారు. అప్పుడు మూడుగుర్రాలను చూపించారు. వాటిపేర్లు, మీరు చెప్పిన పేర్లు సరిపోయాయి. నాలుగు రోజుల తరువాత బెంగుళూరులో గుర్రపు పందాలున్నాయి. కాబట్టి ఈగుర్రాలు బెంగుళూరు వెళ్తాయి. రేస్ హార్సు స్పెషలు కలకత్తాలో బయలుదేరి మద్రాసు మీదుగా ప్రయాణం చేయవచ్చు. మనం ప్రయాణం చేస్తున్న ఈ జీ. టీ. ఎక్స్‌ప్రెస్ రేపురాత్రి.

అంటే ఆదివారం రాత్రి ఒంటిగంటకు హౌరా-మద్రాసు లైనులో విజయవాడ జంక్షన్‌కు చేరుకుంటుంది. ఆ పేలుడు వస్తువు, లేక పోతే టైంబాంబు ఆ తరువాత పేలుతుంది. కాబట్టి తక్షణం మనకు ఎటువంటి ప్రమాదం లేదు. ఇంతకూ ఆ పెద్దమనిషి పేరేమిటి?'' చిత్ర లేఖ ఆఖరున ప్రశ్నించింది.

''కుమార్ జీ అని కంపెనీ యజమాని చాలాసార్లు అన్నాడు.''

''మన కుమార రాజాయా?'' ఆశ్చర్యంతో ప్రశ్నించింది చిత్రలేఖ.

''మీకు తెలుసా?''

''తెలియకేమండీ,'' అతను ఏసీలో రెండు బెర్తులు రిజర్వు చేయించుకున్నాడు. దానితో మరి నాకు ఆ కోచిలో బెర్తులు దొరకలేదు. అతనిని మూడు నెలల కిందే మద్రాసులో కలిశాను. ఆయన ఒక గొప్ప చిత్రం తీయాలని తొందర పడుతున్నారు. అందులో నాకు హీరోయిన్ పాత్ర యివ్వడానికి అతను ఆలోచించారు. ఇంతలో అతని అక్కగారికి ప్రాణం మీదకు వచ్చిందని టెలిఫోను మీద కబురు తెలిసి అతను ఉన్న పాళంగా స్లేనెక్కి వెళ్లిపోయారు. కాని అతనికి, గుర్రాలకి, బాంబులకి ఏమి సంబంధం?''

''నేను కూడా టీవీ చూశాను. ఆ గుర్రాలు రాణీ మోహినీ దేవిగారివని అపుడు విన్నాను. కుమార రాజాకు ఆమెకు సంబంధముందా?'' సోమేశ్వరరావు అన్నాడు.

''అవునవును. రాణీ మోహినీదేవి కుమారరాజా భార్య. ఇద్దరూ పది సంవత్సరాలయి వేరువేరుగా జీవితాలు గడుపుతున్నారు. ఆమెకు గుర్రపు పందాల పిచ్చి, గుర్రాల పిచ్చి. విషయమింకా స్పష్టమవుతున్నది. రాణీమోహినీదేవి గుర్రాలు ప్రయాణం చేస్తున్న రైలు, ప్రవహిస్తున్న నది మీదనున్న బ్రిడ్జిమీద నుంచి వెళ్ళేటప్పుడు బాంబు పేలుతుంది. ఆ వేళలు రైల్వే బోర్డు నుంచి కుమార రాజా తెలుసుకున్నారు. సరియైన వేళకు బాంబు సెట్ చేయించారు. ఆ బాంబును తనతోపాటు కూపేలో తీసుకెళ్తున్నారు- విజయవాడ దాటిన తరువాత ప్రవహించే పెద్ద నది''

'' ఓహో! ఈ కుమారరాజా కొంప ముంచేశాడు. కృష్ణా నది రైలు వంతెన పేల్చి గుర్రాలను స్వర్గానికి పంపడానికి ప్లాను వేశాడా?'' సోమేశ్వరరావు ప్రశ్నించాడు.

''మహోపద్రవం సంభవించడానికి అట్టే వ్యవది లేదు. వెంటనే రైలాపుతున్నాను.'' జనార్దన శర్మ లేవబోయాడు.

''ఇది ఉద్రేకపడవలసిన సమయం కాదు కూర్చోండి'' సోమేశ్వరరావు శర్మను కూచో బెట్టాడు.

''చిత్రలేఖగారూ! ఈ సమస్యను పరిష్కరించడానికి మీరు పూర్తిగా సహకరించాలి. రావుగారు అన్నట్లు ముందు ఆ పార్శెలులో ఏముందో, ఎక్కడ పేలుతుందో నిర్ధారణగా తెలుసుకొని తరువాత ప్రమాదాన్ని నివారించడానికి ప్రయత్నం చేయాలి. మీకు కుమారరాజా పరిచితులు కాబట్టి కొన్ని కొన్ని పరిస్థితులలో కొన్ని కొన్ని వేళలలో పురుషులు స్త్రీలకు రహస్యాలను బయట పెడతారు. మనకు ఈ రహస్యం ఈ రాత్రి తెలియాలి. ఆది మీ వల్లనే కావాలి'' అన్నాడు జనార్ధన శర్మ.

చిత్రలేఖ అయిదు నిమిషాలు ఆలోచించింది.

''మీరు చెప్పినట్లు పరిస్థితి చాల ప్రమాదకరంగా పరిణమించే అవకాశం చేరువలో వుంది. ఆ గిఫ్ట్ పార్సెలులో ఏముంది? ఒక వేళ అది టైంబాబయితే ఎన్ని గంటలకు సెట్‌చేసినది, ఆ బాంబును వుపయోగించి ఏ బ్రిడ్జిని పేల్చదలచినది ముఖ్యంగా తెలుసుకోవాలి. అంతకుమించి, ఆ పార్సెలును కూపేలోంచి బయటికి నడిపి, సామానుగదిలో పెట్టిస్తే, మనం సులువుగా దానిని తోవలో దింపించవచ్చు'' అంది ఆమె.

''స్ట్రెండిడ్! మీరు రహస్యాన్ని తెలుసుకొని వచ్చిన తరువాత ఆ కుమారరాజాని ఏం చేస్తానో చూడండి'' అన్నాడు శర్మ.

చిత్రలేఖ ముఖం తిప్పుకుంది.

''నేను అందుకోసమే ఎమ్.సి.పీ లతో మాట్లాడను. స్వలాభపరులు మగవాళ్ళు. నేను కుమార రాజామీద ఎన్నో ఆశలు పెట్టుకొని, అతను తీయబోయే ఫిలిమ్‌లో హీరోయిన్‌గా వటించాలని తొందరపడుతున్నపుడు, నా ఆశలన్నీ ఈ శర్మగారుగొడ్డలితో నరికేయడానికి సిద్ధపడుతున్నారు. కాబట్టి ఓ పెద్దమనుషులారా! మీ బాధలు మీరు పడండి, నేను మీకు ఏవిధంగానూ సహాయం చేయలేను.''

శర్మ ముఖంలో కత్తివాటుకి కూడా నెత్తురు లేకుండా పోయింది. అతను క్రమంగా ఆలోచనలు కూడగట్టుకొని నవ్వుతూ మాట్లాడాడు.

''చిత్రలేఖగారూ! సారీ! మిమ్మల్ని అర్థం చేసుకోవడం చాల కష్టం. మిమ్మల్ని నమ్మి అతను చెప్పిన రహస్యాలను మీరు బయట పెట్టదలచలేదు. నేను చాల గర్విస్తున్నాను. మీ వంటి ఉదాత్తులయినవారు ఏ నాటికో, కోటికో ఉంటారు. మనం రాబోయే ఉపద్రవాన్ని తప్పించడమే దృష్టిలో ఉంచుకొని పని చేద్దాం. మరి ఆలస్యం చేయకండి.''

చిత్రలేఖ అతని ముఖంలోకి చూసి నవ్వింది.

''ఓ కే! కాని ఒకటే సమస్య, ఆగిస్ట్ పార్శెలును వెలుపలికి ఎలా నడిపించడం?''

చిత్రలేఖ మీద తిరుగుతున్న పంఖా వేపు చూచింది.

''మేడమ్! బిల్లీకా డిన్నర్ లాయా హూం- దర్వాజా ఖోలియే!'' తలుపు మీద సెర్వరు కొడుతున్నాడు.

''మైగాడ్! మా జిమ్మి ఈ ప్రాబ్లెమ్ సాల్వ్ చేస్తుంది'' ఎగిరి గంతేసి చిత్రలేఖ జిమ్మిని ఎత్తుకుని ముద్దులాడి. తరువాత తలుపు తీసింది.

1.10 శనివారం- రాత్రి- 8 గంటల 54 నిమిషాలు- విజయవాడ

కేశవయ్య చాలా ఉత్సాహంగా ఉన్నాడు.

విజయవాడకు హైదరాబాదుకు మధ్యను రైళ్ళు నడవనందుకు కలిగిన ఉత్సాహమా?

కాదు.

ఢిల్లీకి, మద్రాసుకు మధ్యన రైళ్ళ రాకపోకలు ఆగిపోయి నందుకు కలిగిన ఆనందమా?

అదీ కాదు.

అసలు కేశవయ్యకుపని అంటే విసుపు ఎప్పుడూ లేదు. కాని గడిచిన రెండు సంవత్సరాలయి అతనికి జీవితం మీద ఆసక్తి పోయింది.

లోకంలో తప్పుచేయని వాళ్ళెవరున్నారు?

పశ్చాత్తాపపడి మాత్రం బాగుపడడానికి ఏ ప్రయత్నం చేయలేదు. ఉద్యోగానికి సరిగా వెళ్ళేవాడు కాడు. భార్యను, అయిదేళ్ళ కూతురిని ఇంటి నుంచి పుట్టింటికి తరిమి నంత పనిచేశాడు.

సిగరెట్టు మీద సిగరెట్టు కాలుస్తూ, నిరంతరం ఒకే ఆలోచన.

ఆ ఆలోచన మళ్ళా అతన్ని వెంటబెట్టడానికి తలెత్తింది. వెంటనే లేచి రెండడుగులు ఆ చిన్న గదిలోనే పచారు చేశాడు.

తరువాత గన్నవరం ముస్తాబాదా స్టేషన్లతో తన టేబిలు మీదనున్న కంట్రోలు ఫోనులో మాట్లాడాడు.

విజయవాడ స్టేషనుకు సమీపంలో, డివిజినల్ సూపరెండెంటు ఆఫీసులో కంట్రోలు ఆఫీసు వుంది. దానిలో ఒక చిన్న గదివుంది. అందులో ఒక టెబిలు, టేబిలు మీద మూడు రకాల ఫోనులు వున్నాయి. ఒకటి డైరెక్టు కంట్రోలు ఫోను. రెండవది రైల్వే ఎక్స్చేంజి ఫోను- మూడవది పబ్లిక్ ఫోను. ఇది ఎమర్జన్సీ సెల్స్వరూపం.

కేసుద్రానికి రిలీఫ్ ట్రెయిన్ బయలుదేరింది సరిగ్గా ఎనిమిది గంటలకు. అదే సమయానికి కంట్రోలు ఆఫీసులో ఎమర్జన్సీ సెల్ తెరిచారు. ఒక ప్రొబేషనరీ ఆఫీసరు, కేశవయ్య, అందలో పనిచేయడం మొదలు పెట్టారు.

శ్రీనివాసమూర్తి రిలీఫ్ ట్రెయినులో వెళ్తూ ఒక చిన్న చీటీ అన్నకు. పంపించాడు. అందులో మూడే విషయాలు వ్రాసి ఉన్నవి. ఒకటి సిండరు షేగులు, రెండవది లేబరు, మూడవది స్టీమ్ క్రేన్ డ్రైవరు. అంతకు మించి ఆ చీటీలో మరేమీ లేవు

కేశవయ్య నిదానంగా కేసుద్రంమంచి వచ్చిన మెసేజి చదువుకున్నాడు.

కిలో మీటరు 200/1 నుంచి కిలోమీటరు 201/3 వరకు గల రైలు లైను పాడయింది.

ఇంజను, దానితో నలభై వాగనులు పట్టాలు తప్పాయి.

డ్రైవరు, అతని అసిస్టెంటు ప్రమాదమైన పరిస్థితులలో వరంగల్ హాస్పిటలకి పంపబడ్డారు.

కాజీపేటకు విజయవాడకు మధ్య రైళ్ళ రాకపోకలు తాత్కాలికంగా ఆపివేయ బడినవి.

పడిపోయిన ఇంజనును వాగనులను ఎత్తడానికి ఆక్సిడెంట్ రిలీఫ్ ట్రెయినును పంపవలసింది.

రైలు దారి బాగు చేయడానికి ఏర్పాటులు చేయవలసింది.

ఈ మెసేజ్ చాల మందికి వెళ్ళింది.

కాని, కేశవయ్యకు, దీనికి చాల సంబంధముంది.

ఈ ప్రమాదం వల్ల చాల రైళ్ళు దెబ్బ తిన్నాయి. అటు సరకు రవాణాకు ఇటు ప్రయాణీకుల చలనానికీ తీవ్రమయిన అంతరాయం కలిగింది. దూర ప్రదేశాలకు చేరుకో వలసినవారు, దారి మధ్యలో వుండి పోయారు. కొన్ని రైళ్ళను చుట్టు తిప్పి పంపడం వల్ల ఎంతమందికో ఇబ్బంది కలుగుతున్నది. ఎంత వేగంగా రైలు లైనును పునరుద్ధరిస్తే, అంత త్వరగా ప్రజలకష్టాలు గట్టెక్కుతవి.

కేశవయ్య తానొక మామూలు డిప్యూటీ కంట్రోలరుగా పనిచేయలేదు. పేరు, ఊరు లేని స్టేషనులలో ఆగిన రైళ్ళలో ఆకలికి ఏడ్చే పాపలు, తమవారిని చూడడానికి ఆలస్యమయిందని అలమటించే బంధువులు, వృద్ధులు, బాలురు, స్త్రీలు, కిక్కిరిసిన బళ్ళలో నరకాన్ని అనుభవిస్తూ గమ్యం చేరలేక చాల బాధలకు లోనయినారు. వారి గురించి ఆలోచిస్తున్నాడు. తన మనసులోని తప్పు చేశానన్న భావనను పైకి నెట్టివేశాడు. గతం గురించి ఆలోచించడానికి ఇది తరుణం కాదు. ఏదో అజ్ఞాత శక్తి అతనిని నడిపిస్తున్నది.

తమ్ముడు రంగంలోను, తాను సమాలోచనా కేంద్రంలోనూ సహజమైన తెలివి తేటలను ప్రదర్శించే కాలం వచ్చిందను కున్నాడు.

వర్షాకాలంలో రైలు లైనులు కొట్టుకు పోతాయని ముందే సిండరు వాగనులు తయారుగా ఉంచుతారు. ఆ విధంగా ముప్పయి వాగనులు గన్నవరం సైడింగులోను, మరొక ఇరవై ముస్తాబాదా లోను ఉన్నాయి. వాటిని విజయవాడ తెప్పించడానికి ఇంజను పంపించే ఏర్పాటు చేశాడు. ఆ సిండరు స్పెషలు రాత్రి పది గంటలకు ఆర్డరు చేశాడు.

రైలు లైను బాగుచేసే ఇంజనీరింగు గాంగులో ఇరవై మంది శ్రామికులుంటారు. ఏవి ఉన్నా, వారు లేనిదే పని నడవదు. విజయవాడ డివిజనులో నున్న గాంగులలో ఏభై గాంగులను సమాయత్తం చేశాడు. వాళ్ళకోసం రెండు స్పెషలు ట్రెయినులను ఆర్డరు చేశారు. రాజమహేంద్రవరం నుంచి, నెల్లూరు నుంచి, గుంటూరు నుంచి విజయవాడ కు రాత్రి పన్నెండు గంటల వేళకు తీసుకొని వస్తాయి. వాళ్ళ తిన్నగా కేసముద్రానికి వెంటనే బయలుదేరి తెల్లవారే లోపుగా ప్రమాదం సంభవించిన స్థలం చేరుకుంటారు. స్లీపర్లు, పనిముట్లు, పెట్రో మాక్సులైట్లు..... అన్నీ పెద్ద పెళ్ళివారి సరంజామాతో వాళ్ళు కదులుతున్నారు.

తమ్ముడు చెప్పిన మూడవ వస్తువు - వస్తువులలో చాల విలువయినది. రథానికి చోదకుడు ఎంత ముఖ్యమో క్రేను పనిచేయడానికి దాని డ్రైవరు అంత అవసరం. ఈపనికి ప్రత్యేకమైన శిక్షణ, అనుభవం కావాలి. అన్నిటికీ మించి ఆ మనిషి చాలా చురుకుగా, అహోరాత్రులు పనిచేయాలి. అటువంటి వాడు కనకరాజు. ఆ కనకరాజు సెలవు మీద తిరుపతి వెళ్ళినవాడు తిరిగి రాలేదు. ఇంటికి కబురులు పంపించినా ప్రయోజనం లేక

పోయింది. ప్రస్తుతం పనిచేస్తున్న కళాసీ కూడా కొత్తవాడు. కాని రిలీఫ్ ట్రెయిను పని వాళ్ళలో సీతారామయ్య అన్న ఫిట్టరు క్రేను నడిపించగలడు. అతని మీదే రైలింజనును, వాగన్లను ఎత్తే బాధ్యత మోపబడింది. ఏదైనా ప్రమాదం జరిగితే అతను జవాబుదారు కాడు. సీతారామయ్య కూడా లేకపోతే పని జరగడమే సాధ్యం కాదేమో!

కేశవయ్య మెనుక ముందు ఆలోచించలేదు. పెద్ద అధికారులతో సంప్రదించి ప్రత్యామ్నాయంగా మరొక ఏర్పాటు చేశాడు.

తరువాత పబ్లిక్ రిలేషను వర్కు కూడా తల మీద పెట్టుకున్నాడు. పత్రికల వారికి, ఆలిండియా రేడియోకు రైలు ప్రమాదం గురించి, రైళ్ళ రాకపోకలు ఆగిపోవడం గురించి సంగ్రహ వార్తలను అందజేశాడు.

పని సాంతం చేసి ఛప్రాసీని పిలిచి వేడి పాలు, బిస్కట్లు కాంటీను నుంచి తెమ్మని పంపించాడు. ఆకలి అనిపించింది ఎన్నాళ్ళ తరువాతనో అతనికి.

తరువాత కాజోపేట బోర్డు మీదికెళ్ళి రిలీఫ్ ట్రెయిను ఎక్కడుందో చూడడానికి తొందరపడ్డాడు.

కంట్రోలరు తల బాదుకుంటున్నాడు.

కేశవయ్య గంగినేని స్టేషను చిన్న మాస్టరు కోసం ఫోనులో అరవడం మొదలు పెట్టాడు. సరిగ్గా తొమ్మిది గంటలకు రిలీఫ్ ట్రెయిను ఆగిపోయింది.

1.11 శనివారం- రాత్రి- 9 గంటలు- గ్రాండ్ ట్రంక్ ఎక్స్ ప్రెస్- మధుర చేరుకోవడానికి ఇంకా అరగంట వ్యవధి ఉంది.

రైలు చాల వేగంగా పరుగెత్తుతున్నది.

694 నంబరు ఎయిర్ కండిషన్డు ఫస్టుక్లాసు కోచిలో పద్దెనిమిది బెర్తులున్నవి. ఆరు కంపార్టు మెంటులు ప్యాసింజరు లకు, ఒక చిన్నది కోచి ఇచ్చార్జి కోసం ఉన్నవి.

నాలుగేసి బెర్తులున్న కంపార్టుమెంటులు మూడు, కూపేలు మూడు, ఎ,బి,ఎస్ కంపార్టమెంట్లలో నాలుగు బెర్తులున్నవి. సి.డి.ఇ కంపార్టమెంట్లు కూపేలు.

అందులో 'సి' కూపేలో ఒక్కరే వున్నారు.

ఆమె పేరు పెరియనాయకి.

లేత నీలం పాలిస్టరు చీర, మాచ్ చేసే బ్లౌజు, నుదుట చిన్నతిలకం-ధరించిం దామె. వాష్ బేసిన్‌లో చేయి కడుక్కుంటూ అద్దంలో ముఖం చూసుకుంది. ఆమెకే సిగ్గనిపించింది, తన చక్కదనం నవ్వినందుకు.

బేరరు అంతకుముందు అయిదు నిమిషాలక్రిందే బల్లమీద పెట్టిన డిన్నరు ఆమె ముందుకు తీసుకుంది.

దానిలో ఆనియన్ సూపు, రెండువెజిటబుల్ కట్ లెట్‌లు, ఫ్రెంచిఫ్రై, బాయిల్‌డు వెజిటబిల్స్, సలాడ్ ఉన్నవి. ఫ్రెంచి రోల్సు, వెన్న వేరుగా మరో ప్లేటులో ఉన్నాయి. తరువాత పెద్ద సైజు పేపర్ కప్పులో ఐస్‌క్రీమ్- స్వచ్ఛంగా ఉన్న గ్లాసులో మంచి నీళ్ళు-

కూపే ఇద్దరికి రిజర్వయింది. పెరియనాయకి ఒక్కతే ప్రస్తుతం ప్రయాణం చేస్తున్నది అందులో- న్యూఢిల్లీ నుండి రిజర్వేషను ఉన్నా. రెండవ ప్యాసింజరు మాత్రం ఎక్కడో దారిలో వచ్చి ఎక్కుతారు.

కూపేలో పెరియనాయకి లగేజి అట్టేలేదు. చిన్న ట్రావెల్ బాగ్ మాత్రమే ఆమె దగ్గిర ఉంది. తలగడలు, దుప్పట్లు, రగ్గులు కోచిలోనే ఇచ్చారు. రెండు పెద్ద సూట్ కేసులు ఆమె బ్రేక్‌లో వేయించింది.

ఆమె కువాయత్ నుండి వచ్చింది. మద్రాసు వెళుతున్నది. ప్లేను పొద్దున్న పది గంటలకు పాలమ్ ఎయిర్ పోర్టులో దిగినా, కస్టమ్సు నుంచి బయట పడేసరికి మధ్యాహ్నము పండ్రెండు గంటలయింది. రెండు పెద్ద సూట్ కేసులు, ఒక ట్రావెల్ బాగు ఆమె లగేజి. ఒక సూట్‌కేసు నిండా బట్టలు, రెండవ దానిలో టేపు రికార్డరు, కెమేరా, కాస్మెటిక్సు, టోస్టరు మంచి డిన్నర్ సెట్ వంటివి వున్నాయి. మూడువేల రూపాయలు కస్టమ్సు డ్యూటీ చెల్లించింది. అన్ని వస్తువులను డిక్లేరు చేసింది. అయినా కస్టమ్సు వారికి అనుమానమే. తప్పించుకోవలసినవారు సులువుగా దాటిపోతారు. న్యాయంగా వర్తించే వారికి మాత్రం బాధలు తప్పవు. ఆ రెండు గంటలు ఆమె చాల ఇబ్బంది పడింది. ప్రతీ వస్తువుకు కొన్న రసీదు చూపించినా, ఆ ధర తక్కువేనని కస్టమ్సు వారి అంచనా. రెండు మూడు వస్తువులు, ఒక అలారం టైంపీసు, ఒక ఫ్రూట్ స్క్వీజరు అక్కడివాళ్ళు బహూమతి చేశారు. వాటికి కూడా నిర్మొహమాటంగా డబ్బు వసూలు చేశారు. కస్టమ్సు వారు, తరువాత డబ్బు మార్చుకోడానికి కొంత ఆలస్యం- మధ్యాహ్నం భోజనమే లేదంటే సబబుగా ఉంటుంది. ట్రావెలు ఏజెంటుని కలిసి. టిక్కట్లు తీసుకొని, హోటలులో ఒక గంట విశ్రాంతి తీసుకొని స్టేషనుకు చేరుకున్నవరకూ ఆరాటం తప్పలేదు.

దేశం విడిచి మూడు సంవత్సరాలయింది. మద్రాసులో అమ్మ మాత్రం ఇంట్లో వుంది. ఆమె హెడ్మిస్ట్రెస్‌గా ఉంది. మేనమామ అప్పుడప్పుడు వచ్చి క్షేమం కనుక్కొని వెళ్తున్నారు. ప్రక్కనే ఉన్న రామానుజంగారు చాల సహాయంగా ఉంటున్నారు. వాళ్ళ పిల్లలు తరచు ఇంట్లోనే ఉండి, రాత్రి పడుకొని అన్ని విధాల ఆమెను చూస్తున్నారు. పదిహేను రోజులకోసారి అతను కూడా వెళ్తున్నాడు.

పెరియనాయకి భోజనం ముగించింది. కాఫీ వద్దని ఐస్‌క్రీము ముందే ఆర్డరు చేసింది. అదొక్కటే మిగిలింది. దానిని పక్కనున్న బల్లమీద వుంచింది. బేరరు ట్రే

తీసుకొని పోయిన తరువాత, బాత్‌రూమ్‌కి వెళ్ళివచ్చి, పక్క పరుచుకొని, సావకాశంగా ఐస్‌క్రీమ్ చప్పరించడం మొదలు పెట్టింది.

జీవితంలో కొన్ని సంఘటనలు అనుకోకుండా సంభవించుతవి. తాను పనిచేస్తున్న పెరంబూరు నర్సింగ్ హోములో ఒక వెర్రిబాగులవాడు ఆపరేషనుకని చేరాడు. టెస్టు లన్నీ అయిన తరువాత, అతనికి ఆపరేషను అవసరం లేదని మందులు తిని, విశ్రాంతి తీసుకుంటే రోగం నయమవుతుందని సరదాగా డాక్టరుగారి కంటే ముందుగా చెప్పడం వలన, జీవితాంతం విడిపోని అనుబంధానికి బందీ అయింది.

పెరియనాయకి ఐస్‌క్రీమ్ చప్పరిస్తున్నది. అందులో వనిలా కాకుండా, బాదం, కాజూ, చెర్రీ.... అన్నీ ఎంతో మధురంగా కొత్త కొత్త రుచులను అందిస్తున్నవి.

మెడలోని ఒంటిపేట బంగారు గొలుసు, పైకితీసి ఆమె చూసుకుంది. ఏకాంతంగా వున్నప్పుడు. తీయని కలలు కంటున్నప్పుడు, మనసు కలవరపాటు చెంది నప్పుడు ఆమె చేయి అప్రయత్నంగా ఆ బంగారు గొలుసు మీదికి పోతుంది.

.... తాను చెప్పిన వార్తకా పెద్దమనిషి వుబ్బి తబ్బిబ్బయి, ఒక్కసారి మంచం మీద నుండిగెంతి, తనను గాఢంగా కాగలించుకొని, బలంగా పెదవులను ముద్దుపెట్టుకొని, మరేమీ ఆలోచించకుండా మెడలోని బంగారుగొలుసు తన మెడలో వేశాడు.

ఆ విషయం తలుచుకుంటే ఆమె కిప్పటికీ కూడా నవ్వు వస్తున్నది. నవ్వేమిటి- తనలో నిద్రాణంగా వున్న స్త్రీత్వాన్ని అతను మేలుకొలిపాడు.

తాను చేసిన తప్పు గ్రహించుకున్నట్లున్నాడు అతను. హడావుడిగా కౌగిలిలోంచి తనను విడిచి, బితుకు బితుకుమంటూ, తన కళ్ళలోకి చూశాడు. అతని కళ్ళనిండా నీరు నిండితే తనకే జాలి వేసింది. అంత అమాయకుడు.

తరువాత అతను తన యింట్లో ఒక ఇరవై రోజులున్నాడు. తాను వండినది తిన్నాడు. తనతో రాత్రిళ్ళు మాటలు చెప్తూ, పలుకులువింటూ, ఆనందతన్మయుడై తన బాహువులలో నిద్రించాడు.

మొగ్గగానే తన జీవితం ముగుస్తుందని భయపడింది. కాని నేడు సంపూర్ణంగా విరిసిన సంధ్యాకాలపు మల్లెపూవువలె తన బ్రతుకుని అతడు దిద్దాడు.

తలగడను కౌగిలించుకొని, బంగారపు గొలుసులోని మంచి ముత్యాన్ని మృదువుగా మునివేళ్ళతో స్పృశిస్తూ ఆమె నిద్ర పోయింది.

1.12 శనివారం- రాత్రి- 9 గంటల 15 నిమిషాలు- గంగినేని

మర్ఫీ అనే మహానుభావుడు కొన్ని సూత్రాలను నిర్వచించాడు. పదవీ బాధ్యతలు గల మేనేజర్లకు అవి ఉపయుక్తమవుతవి. ఈ మర్ఫీ సూత్రాలన్నీ శ్రీనివాసమూర్తికి జ్ఞాపకం వుండడమే కాదు, సమయానుకూలంగా అతనికి మార్గదర్శకాలుగా ఉంటున్నవి.

ఏదైనా సంస్థలో అన్నీ సాఫీగా నడుస్తున్నాయంటే, విధిగా ఎక్కడనో తీవ్రమయిన లోపం ఉండితీరాలి. ఇది మర్ఫీ సూత్రాలలో ఒకటి.

ఫోర్మెను సింహాచలం చాల హడావుడిగా సినిమాహాలు నుంచి స్టేషను చేరి, రిలీఫ్ ట్రెయిను చుట్టూ ఒకసారి తిరిగి, అన్నీ ఓకే అని తనతో చెప్పగానే శ్రీనివాస మూర్తికి ఈ సూత్రం జ్ఞాపకం వచ్చింది.

ఆ సూత్రం అక్షరాల నిజమని గంగినేనిలో రిలీఫ్ ట్రెయిను ఆగిపోగానే అతనికి తోచింది.

రిలీఫ్ ట్రెయినుకు ప్రాణం వంటిది క్రేను. అవసరమయినప్పుడు పనిచేయిస్తూ, అత్యవసర పరిస్థితుల కోసం దానిని ఎప్పుడూ సర్వసన్నద్ధంగా ఉంచుతారు. దానిమీద పనిచేసేవారికో ప్రత్యేకత ఉంది. మంచి పనివాడు, విశ్రాంతి కోరకుండా రాత్రి, పగలు కనిపెట్టుకొని పనిచేయవలసినవాడు దానికి డ్రైవరుగా ఉండాలి. కనకరాజుకి ఈ యోగ్యత లన్నీ ఉన్నాయి. రిలీఫ్ ట్రెయినుకి రాగానే ముందు కనకరాజే మూర్తికి జ్ఞాపకం వస్తాడు. ఆ కనకరాజు ఈ రోజు కనిపించలేదు. సెలవు పెట్టి రెండు రోజుల క్రిందనే తిరుపతి వెళ్ళిపోయాడు. ఈ సంగతి తెలుసుకొని శ్రీనివాసమూర్తి చీటి వ్రాసి కేశవయ్యకు పంపించాడు, రిలీఫ్ ట్రెయిను విజయవాడ వదిలేముందు.

కనకరాజు లేనిలోటు బాగా కనిపించింది. రిలీఫ్ ట్రెయిను విజయవాడ వదిలి ముప్పై రెండు కిలోమీటర్లు వచ్చిందో లేదో, స్టీము క్రేను ఆక్సిల్ బాక్సు ఒకటి వేడెక్కడమే కాకుండా మంటలు కూడా వచ్చాయి. ట్రెయినుకు థ్రూ సిగ్నల్సు ఇచ్చినా గంగినేని స్టేషనులో దానిని ఆపివేయవలసి వచ్చింది.

రాత్రి సరిగా తొమ్మిది గంటలకు గంగినేనిలో బండి ఆగిపోయింది. బండి ఆగగానే పెద్దలంతా కారణం తెలుసుకోడానికి క్రిందికి దిగారు. ఫోర్మెను సింహాచలం హడావుడిగా తిరుగుతూ పనివాళ్ళను కేకలేస్తున్నాడు. ఆక్సిల్‌బాక్సు మూత తెరిచి ఇంత నూనె పోస్తే చాలునన్నాడు.

కొంతమంది పనిచేతకానివాళ్ళు, తెలియనట్లు వెనక్కు వుండరు. అధికార ముందని చలాయించడానికి ముందుకు వస్తారు. శ్రీనివాసమూర్తికి అటువంటి సింహాచలాలను చూస్తే అరికాలిమంట.

ఇది ఒకరిమీద కోపం వహించవలసిన సమయంకాదు.

సెలూనులో అబ్రహాము డిన్నరుకోసం తొందరపడుతున్నాడు.

రెండుమూడు సార్లు చిన్న మాస్టరు వచ్చి ఇంకా ఎంత ఆలస్యం ముంటుందని అడుగుతున్నాడు. మూడోసారి డివిజనల్ సూపరెండెంటుగారే ఫోనుమీద మాట్లాడ మంటున్నారని శుభవార్త కూడా తెచ్చాడు.

కాని శ్రీనివాసమూర్తి, పదిహేను నిమిషాలయి స్థాణువులా నిలుచుని పని చూస్తు న్నాడు. కాలిపోయిన పెట్టెలోని బేరింగు తీయించాడు. కొత్త బేరింగు వేయిస్తున్నాడు. ఫిట్టరు సీతారామయ్య చాల తొందరగా, మెలకువగా పనిచేస్తున్నాడు. మిగిలిన పనివా ళ్ళందరూ అందుబాటులో వుండి పనులు చేస్తున్నారు.

సింహాచలం చెప్పిన ప్రకారం బేరింగులో నూనెపోసి నడిపిస్తే, ప్రతీ స్టేషనులోనూ, లేకపోతే దారిలోనూ ట్రెయినాపి బేరింగు వేడెక్కుతున్నదో, లేదో చూసుకోవాలి. ఈ ప్రకారం రిలీఫ్ ట్రెయిను నడిపిస్తే రైలు దారి బాగుపడ్డట్లే.

తొమ్మిదిగంటల ఇరవై అయిదు నిమిషాలకు పని పూర్తిచేశారు. సాధారణంగా ఈ పని రెండు గంటలు పడుతుంది. శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో నిమిషాలలో ముగిసింది.

కంట్రోలు ఫోనుమీద మాట్లాడాడు.

''గంగినేని! హలో! నేను శ్రీనివాసమూర్తిని మాట్లాడుతున్నాను. డివిజనల్ సూపరెండెంటుని కనెక్టు చేయండి!''

''మూర్తి? నేను కేశవయ్యను మాట్లాడు తున్నాను. పెద్దదొరగారు ఇప్పుడే ఛాంబర్ ఆఫ్ కామర్సువారి డిన్నరుకు వెళ్ళారు. ఏ సంగతి తనకు పదిన్నర తరువాత చెప్పమన్నారు.''

''మంచిది! మరేమేనా కొత్త విశేషాలా? కాజోపేట మంచి వచ్చిన రిలీఫ్ ట్రెయిను ఎంతవరకు ముందుకు సాగింది?''

''వాళ్ళు పట్టాల మీద నున్న వాగన్లను కేసముద్రానికి తరలించుకొని పోయారు. తరువాత క్రేను ముందుకు పెట్టి, రిలీఫ్ ట్రెయిన్‌ను సైట్ లోకి తీసుకొని పోయారు. ఇప్పటికి ఇంకా సర్దుకుంటున్నారు.''

''మంచిది. కాజీపేట నుంచి సిండరు వాగనులు, ఇంజనీరింగ్ గాంగులను ఏర్పాటు చేశావా?''

''అక్కడ నుంచి ఓ అయిదారు గాంగులు రావచ్చు, ఒక పాతిక సిండర్ వాగనులు కాజీపేటలో సిద్ధంగా ఉన్నాయి. ఇవేవి చాలవని నా అంచనా. సరియైన పరిస్థితి ఎవరూ ఇంతవరకు చెప్పలేకపోతున్నారు.''

''డ్రైవరు, అసిస్టెంటుల గురించి ఏమైనా తాజా వార్తలా?''

''ఏమీ రాలేదు''

''డోర్నకల్‌లో మోటారు ట్రాలీ ఏర్పాటుచేయి. రిలీఫ్ ట్రెయిను సైటుకి చేరుకునే ముందు నేను, అబ్రహాము ఎంత పనిచేయవలసి ఉందో అంచనా వేయాలి.''

శ్రీనివాసమూర్తి సెలూను చేరడమే ఆలస్యం- రిలీఫ్ ట్రెయిను బయలుదేరింది గంగినేని నుండి.

1.13 శనివారం- రాత్రి- 9 గంటల 30 నిమిషాలు- గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్- మధుర సమీపించే వేళ

జనార్దన శర్మకు ఎన్నో అను మానాలు.

కీడెంచి ముందు తరువాత మేలెంచడానికి అప్పుడప్పుడు ప్రయత్నిస్తాడు.

గొప్ప ప్రమాదం సంభవించగలదని తెలిసి కూడా, ఎవరూ దానిని గుర్తించకుండా యదాలాపంగా వర్తిస్తున్నారు.

పిల్లిని చంకబెట్టుకుని, నిక్కీ- నీల్గీ, చిత్రలేఖ తొమ్మిదిగంటల ఇరవై నిమిషాలకు ఎయిర్ కండిషన్డు కోచ్ వేపు వెళ్ళింది.

'డి' అనే కూపేలో ఆ పెద్దమనిషి కుమారరాజా ఉన్నాడని, డిన్నరు ఇంకా అతను వద్దన్నాడని కోచిఇంఛార్జి చెప్పాడు.

వెళ్ళి పది నిమిషాలు కాలేదు. చిత్రలేఖ పిల్లితో సహా తిరిగి వచ్చింది. ఎంత పెంపుడు జంతువయినా, ఎన్ని వేల రూపాయలు ఖరీదు చేసినా, జిమ్మీ మాత్రం ముమ్మాటికి పిల్లే, అన్నిటికన్న పిల్లి శకునం చాల చెడ్డది.

చిత్రలేఖ చాల నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నది. ఆమెమీద భారమంతా మోపి నందుకు నట్టేల్లో ముంచేయడానికి ప్రయత్నిస్తున్నది.

జనార్దన శర్మకు ముఖం కోపంతో ఎర్రబడింది. తన నిస్సహాయతకి అతను తనను తానే నిందించుకున్నాడు.

ఇంతలో బేరరు వచ్చాడు.

''మేం సాబ్! మీ డిన్నరు తెమ్మన్నారా?''

''ఇప్పుడు వద్దు! మధురా దాటిన తరువాత ఏసీ కోచిలో 'డి' కూపేలో, కుమార రాజాగారి డిన్నరుతో తీసుకొనిరా, ఇక్కడ వద్దు''

''జీ హుజూర్!''

చిత్రలేఖ ఉన్నట్టుండి ముఖమెత్తి జనార్దన శర్మను చూసింది.

''శర్మగారూ! ఏమిటి గాభరాపడుతున్నారు?'' అడిగిందామె

బేరరుతో ఆమె చెప్పిన మాటలు విన్నతరువాత జనార్దన శర్మ ముఖంలో వెలుగు తోచింది. అతను వెంటే జవాబు చెప్పలేక పోయాడు. ఆమె పెట్టెలుతీసి, ఒక దాని నుంచి పోర్టబుల్ టేపురికార్డరు. మరొక దానినుంచి రెండు కాసెట్లు తీసింది. మరికొన్ని బట్టలు తీసింది. వాటి నన్నిటిని ఒక ట్రావెలు బాగ్‌లో వుంచింది. పక్కనే వున్న ఆకు పాట్లాంలో ఉన్న గులాబీదండ, పాలిథిన్ పేపరులో మెరుస్తున్నది. దానిని కూడా ఆమె తీసుకుంది. ఒక క్షణం నిలబడి జనార్దన శర్మవేపు, సోమేశ్వరరావు వేపు చూసింది.

''మిమ్మల్ని ఇద్దరిని చూస్తుంటే మపాసా ప్రాసిన కథానిక ఒకటి జ్ఞాపకం వస్తు న్నది. దీనిపేరు 'బౌల్ డిసూఫ్' -కొవ్వు ముద్ద- ఎలిజబిత్ కొంచెం స్థూలంగా ఉంటే ఆమెను పెద్ద మనుషులంతా కొవ్వుముద్దని పిలిచేవారు. శరీరమమ్ముకొని బ్రతికేవాళ్ళలో ఆమె ఒకర్తె- మరికొంతమంది పెద్దమనుషులు, పతివ్రతలు, చర్చిలోని సిస్టర్లు - వీరితో పాటు ఆమె కూడా స్టేజి కోచిలో ప్రయాణం చేస్తున్నది. శీతాకాలం-మంచు కర్వా రంలా కురుస్తున్నది. చలి విపరీతంగా ఉంది. ఆమె ప్రయాణానికని పళ్ళు, మాంసపు వంటకాలు బుట్టలో పెట్టుకొని తెచ్చింది. దారిలో ఒక మజలీ దగ్గర కోచ్ ఆగిపోయిం ది. అక్కడ ఉన్న ఇన్‌లో, ఉన్నవాటిలో మంచి గదిలో ఒక జర్మన్ సైనికుడు ఉన్నాడు. వీళ్ళ దగ్గిర ప్రయాణానికి కావలసిన అనుమతి పత్రాలున్నా, ఆ ఒంటరిసైనికుడు ఈ ఫ్రెంచివారిని అందరిని అక్కడ ఆపివేశాడు. వాడొక్కటే కోరాడు. ఆ కొవ్వు ముద్ద త నతో నిద్రిస్తే, అప్పుడు వారు వెళ్ళిపోవడానికి అనుమతిస్తానన్నాడు.

''ఆ కొవ్వుముద్ద ససేమిరా ఆ సైనికుడి కోరికను అంగీకరించలేదు. శరీరం అమ్ముకోవచ్చు. కాని ఆమె మనసును అమ్ముకోడానికి ఒప్పుకోలేదు. పతివ్రతలంతా ఆమెను బ్రతిమాలారు. పడుపు కత్తెలకు, సైనికులకు అవినాభావ సంబంధముంది. అందుచేత వాడు ఫ్రెంచి సైనికుడైనా, జర్మను సైనికుడైనా భేదమేముంది? అందరూ కాకీ దుస్తులే వేసుకుంటారు. ఒక పతిత ప్రయాణం చేయడం వల్ల వారి పాతివ్రత్యానికే ముప్పు వస్తున్నది. ఈ సైనికుడు, కొవ్వు ముద్ద అంగీకరించకపోతే, తమను మాన భంగం చేయడానికి వెనుదీయడు. చర్చిలో పెరిగిన సిస్టర్సు పవిత్రమైన మనస్సుతో చేసిన పాపపు పనైనా భగవంతుడు అంగీకరిస్తాడని బోధిస్తారు. ఇక మగవారు సరేసరి. తమ వంటి గౌరవనీయుల భార్యలు ఒక చెడిపె కారణంగా అవమానింపండుతున్నారని వాపోతారు ప్రతీక్షణం ఒక యుగంగా వారు మూడుదినాలు గడుపుతారు. ఒక రోజు కొవ్వుముద్ద బాప్టిజమ్ జరుగుతుంటే దగ్గిరనే ఉన్న చర్చికిపోయి ప్రార్థనలు చేసి వస్తుంది. ఆ మృదువైన మనసుమీద ఈ మేధావులందరూ తమ వాక్చాతుర్యాన్ని ఉపయోగించి ఇంకా అర్థం చేస్తారు. ఆమె జర్మను సైనికుడి దగ్గిరికి పోతుంది. అందరూ చాల ఆనందించి షాం పేనుతో విందు చేసుకుంటారు. కొవ్వుముద్ద తిరిగి వస్తుంది. ఆమె వచ్చేసరికి అందరూ తమ తమ స్థానాలలో స్టేజికోచిలో కూచుంటారు. కంపుకొట్టే జర్మను సైనికుడి కొగిలిలో ఆమె నలిగి పోయింది. అంతకు పదిరెట్లు మానసికంగా కుంగిపోయింది. ఆ పెద్దమనుషులు, ఆ పతివ్రతలు, ఆ దేవుని ప్రచారికలు అందరూ ఆమెను తెలియనట్లు ముఖాలు తిప్పుకున్నారు. ప్రయాణం మొదలుపెట్టిన దగ్గిర నుంచీ, క్రొవ్వు ముద్ద తెచ్చిన పండ్లు, తినుబండారాలు గొంతుక మొయ్యా తిన్న వారందరూ ఆమె చూస్తుండగానే తాము తెచ్చుకున్నవి తిని మిగిలినవి జాగ్రత్తగా పొట్లాలు కట్టి దాచుకున్నారు. కోచి బయలుదేరుతూ ఉండడం చేత ఆమెకు దారిలో ఆహారం కావాలనన్న మాట కూడా జ్ఞాపకం రాలేదు.''

చిత్రలేఖ చాల ఉద్వేగంతో మాట్లాడింది. జనార్ధన శర్మ, సోమేశ్వరరావు ఇద్దరూ లేచి నిలబడ్డారు.

రైలు వేగం తగ్గుతున్నది.

మధురా స్టేషను వచ్చింది. రైలు ఆగింది.

''నాకూ, ఆ కొవ్వు ముద్దకు భేదం లేదు. నన్ను ఉపయోగించి, రహస్యమేదో తెలుసుకుంటారు. జనార్ధన శర్మ పోలీసులను పిలిపిస్తారు. సోమేశ్వరరావు క్రిమినల్ కేసులో

నన్ను ప్రత్యక్ష సాక్షిగా బోనెక్కిస్తారు. దానితో సరి. ఆ కొవ్వు ముద్ద ఏం చేసింది? ఆకలితో అలమటించింది. అవమానంతో క్రుంగిపోయింది. నాకు ఆ గతే పడుతుంది. మీ యిద్దరి ధర్మమా అని నా గురించి తాటికాయలంత అక్షరాలతో పత్రికలవాళ్ళు తిడుతూ రాస్తారు. దానితో నాకు ఏడుపే మిగులుతుంది.''

సోమేశ్వరరావు మరి భరించలేక పోయాడు. ఆమె చేతులు రెండూ పట్టుకున్నాడు.

''మీరు తక్కువ బట్టలతో శరీరాన్ని ప్రేక్షకులకు చూపించి తైతక్కలాడుతున్నారని ఇప్పటివరకు నా భావన. దీనినిగొడ్డలితో నరికివేశారు. ఎంతమంది సాహిత్యం అధ్యయనం చేయలేదు? కాని మీవలె మానసత్వపు విలువలు గుర్తించిన వాళ్ళేరి? చిత్రలేఖా! నేను నీకన్నా మయసులో పెద్దవాడిని. మనసారా నిన్ను ఆశీర్వదిస్తున్నాను- చెల్లెలిని నడివీధిలో పెట్టే నీచుడు ఉంటాడా?''

చిత్రలేఖ జనార్దనశర్మ ముఖంలోకి చూచింది.

ఎంత ఆపుకుందామనుకున్నా ఆగలేదు దుఃఖం. కళ్ళలో నీళ్ళు అతని చెంపలమీద ధారలుగా కారాయి.

రైలు తిరిగి బయలుదేరింది.

''నేను చాల అదృష్టవంతురాలిని, మీ వంటి అన్న లున్నప్పుడు నాకు దిగులు లేదు. ఈ ట్రావెలు బాగ్ ఒకరు, ఈ పూల దండ పార్సెలు ఒకరూ పట్టుకొని నాతోరండి.''

చిత్రలేఖ పిల్లిని చంకబెట్టుకొని నడిచింది.

ఈ సారి జనార్దనశర్మకు అనుమానం కలగలేదు.

పిల్లి జిమ్మీకి కూడా ఈ సీక్రెట్ మిషన్‌లో భాగముందని అతనికి నమ్మకం కుదిరింది.

1.14 శనివారం- రాత్రి- 9 గంటల 45 నిమిషాలు- కాజీ పేట.

మెయిలు డ్రైవరు వెంకటనారాయణకు అతను అనుకున్న ప్రకారం తీయని కలలు కనడానికి అవకాశం లభించలేదు. అతను ఎంత మరచిపోదామన్నా డ్రైవరు ఆదినారాయణ, అతని అసిస్టెంటు అబ్దుల్ ఖాదర్ గురించి మరువ లేకుండా వున్నాడు. తెల్లటి దుప్పటీ, మెత్తని పక్క, ఇవేవీ అతని మనసులోని ఆందోళనను తగ్గించలేకపోతున్నాయి.

ఆదినారాయణకు అట్టే చదువులేదు. అందుచేత అతను గూడ్సు డ్రైవరుగానే ఉండిపోయాడు. ఇద్దరూ ఇరుగూ పొరుగూ. పిల్లలు చదువుకుంటున్నారు. అతనికో ముసలి తల్లి పెళ్ళికెదిగిన కూతురు- ఆదినారాయణ తనకు చాల సహాయం చేశాడు.

తన భార్యకు మశూచి వచ్చింది. ఐడి హాస్పిటల్‌లో వేశారు. అప్పుడు ఆదినారాయణ అతని భార్య హాస్పిటలులోనే కాపురముండి ఆమెకు సంరక్షణ చేశారు. కాని మాట దక్కలేదు. ఆదినారాయణకు అంతగా చదువు లేకపోవచ్చు. లోకంలోని మానవ జీవితం బాగా అర్థం చేసుకున్న వాడతను. రోజుల తరబడి తను దుఃఖంతో చింతిస్తుంటే దారికి తీసుకొని వచ్చినవాడు ఆదినారాయణ. బంధువులందరిలోకి ఉత్తమమైన బంధువు. స్నేహితులందరిలోకి ఉత్తమమైన స్నేహితుడు అతను.

వెంకటనారాయణ మరి మంచం మీద పడుక్కోలేకపోయాడు. చొక్కా వేసుకొని తిన్నగా స్టేషనుకి వెళ్ళాడు. చిన్న మాస్టరు ఆఫీసులో కూర్చొని వరంగల్ స్టేషనుకు రింగ్ చేశాడు.

''హలో! ఎవరది మాట్లాడుతున్నది?''

''చిన్న మాస్టరుని.''

''చిన్నారావుగారా?''

''అవును''

''నేను మెయిలు డ్రైవరు వెంకట నారాయణను మాట్లాడుతున్నాను.''

''నమస్కారం సార్!''

''నమస్కారం, మీరు ఒక ఉపకారం చేయాలి. తెలివితేటలున్న మీ పోర్టర్‌ని ఒకడిని గవర్నమెంటు హాస్పిటలుకి పంపించి డ్రైవరు ఆదినారాయణ, అతని అసిస్టెంటు అబ్దుల్ ఖాదరు ఎటువంటి పరిస్థితిలో ఉన్నారో కనుక్కోవాలి. వెళ్ళేమనిషిని రిక్షామీద పోయి తెలుసుకొని రమ్మనండి అయిన ఖర్చు నే నిస్తాను.''

''సార్! నా దగ్గిర మనుషులు భోజనానికి పోయారు.''

''వచ్చినవెంటనే పంపండి. మీ దగ్గిర నుంచి కబురు తెలిసేదాకా కాజీపేట చిన్న మాస్టరుగారి దగ్గిరే నేను కూచుంటాను.''

వెంకటనారాయణ చిన్న మాస్టరుతో మాట్లాడుతూ చాలాకాలం కూర్చున్నాడు. అందరూ తనని అభినందిస్తున్నారు. కాని తనకు ఏ విధమైన పంతోషమూ లేదు. తనే ఆ విపత్తుకు లోనయి, ఆదినారాయణే బ్రతికి బయటపడితే ఎంతో బాగుండేది. మనం కోరినట్లు చాల పనులు జరగవు. మనమే పరిస్థితులకు అనుగుణంగా ప్రవర్తించాలి.

ఒక్క అరగంటలో వరంగల్‌నుంచి చిన్న మాస్టరు మాట్లాడాడు.

''సార్, డ్రైవరును, అసిస్టెంటును ఇంటిన్సివ్‌కేర్ యూనిట్‌లో ఉంచారు. ఇద్దరూ ఆక్సిజన్ మీదనే ఉన్నారు. ఎవ్వరినీ లోనికి రానివ్వడం లేదు. డాక్టర్లు చాల గాభరా పడుతున్నారు. పన్నెండు గంటలు గడిచేదాకా వారి పరిస్థితి గురించి చెప్పలేమన్నారు.''

వెంకటనారాయణ ఫోనులో వింటున్నాడే కాని, కట్టలు తెంచుకొని వస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు. వెంటనే జవాబివ్వలేక పోయాడు. బెక్కుతూ, కారు తున్న కీన్నీళ్ళను తుడుచుకుంటూ, మెల్లిగా అన్నాడు.

''మంచిది, చిన్నారావుగారూ?''

1.15 శనివారం- రాత్రి 10 గంటలు- ఢిల్లీ, ఆగ్రాల మధ్య- హైవే

రామేశ్వసింగ్ చేతి వాచీ చూసుకున్నాడు. ఎలక్ట్రానిక్ వాచీ పది గంటలు సూచించింది.

గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ మధురా స్టేషను తొమ్మిది గంటల ముప్పైమూడు నిమిషాలకు విడిచి ఆగ్రా కంటోన్మెంటు స్టేషను పదిగంటల ముప్పై ఏడు నిమిషాలకు చేరుకుంటుంది. అక్కడ పదిహేను నిమిషాలు హాల్టు-సరిగ్గా పదిగంటల ఏభై రెండు నిమిషాలకు విడిచిపెడుతుంది.

వెడల్పైన తారురోడ్డుమీద అంబాసిడరు కారు నాగుపాములా పరుగెత్తుతున్నది. స్పీడు మీటరు ముల్లు నూరుకిలోమీటర్ల వేగాన్ని సూచిస్తున్నది. హైవేమీద రాత్రి పది గంటల వేళ ట్రాఫిక్ ఒక మాదిరిగా ఉంది.

ఆకాశం మీద అక్కడక్కడ మబ్బులు. గాలి కొంచెం చల్లగా ఉంది. రామేశ్వర సింగ్‌తో మరొకడు కూడా ముందు సీటులో కూర్చున్నాడు.

ఉన్నట్టుండి వింత శబ్దం వినవచ్చింది. అది ఇంజనువేపు నుంచి వచ్చినట్లయింది. రామేశ్వరసింగ్ వెంటనే కారునాపే ప్రయత్నం చేశాడు. కాని అప్పటికే జరగవలసిన ప్రమాదం జరిగిపోయింది. రోడ్డు పక్కనున్న చెట్టును గుద్దుకొంది కారు. విండ్ షీల్డు పగులు వేసింది. బానెట్‌కి దెబ్బ బాగా తగిలింది. లోపలి వారికి గాయాలు తగలలేదు.

రామేశ్వరసింగ్ జాగ్రత్తగా డ్రైవరు వేపున్న తలుపు తెరుచుకొని రోడ్డు మీదకు వచ్చాడు. అతని అనుచరుడు కూడా ఆపక్క నుంచే బయటికి వచ్చాడు. ఎడమవేపున్న తలుపు చెట్టుకు కొట్టుకొంది.

రామేశ్వరసింగ్ ప్రతీ నిమిషం లెక్క పెడుతున్నాడు. దాటిన ప్రతీ కిలోమీటరు గుర్తిస్తున్నాడు. ఇంకా నలభై అయిదు కిలోమీటర్లు ఉందనగా రద్దీ మొదలవుతుంది. అక్కడ ఎంత ప్రయత్నం చేసినా వేగంగా నడవడానికి వీలవదు అందుచేతనే నూరుకిలో మీటర్లు వేగంలో పోయినా కంటోన్మెంటు స్టేషను చేరేసరికి టైమ్ బొటా బొటీ అవుతుంది. అట్టి పరిస్థితులలో ఈ ప్రమాదం సంభవించింది.

''శంకర్! ఆ బుట్టలు రెండూ వెలుపలికి తియ్యి.''

అనుచరుడు బుట్టలు తీస్తున్నాడు.

అదే దారిని పోతున్న కారేదో సమీపిస్తున్నది. రామేశ్వరసింగ్ ఫ్లడ్‌లైట్ల వెల్తురులో రోడ్డు మధ్యను నిలిచి చేతులు ఊపుతున్నాడు. ఆ వస్తున్న కారు డ్రైవరు ఆపుతున్నట్లున్నాడు. చాల జాగ్రత్తగా ఆ కారు రామేశ్వరసింగ్ నిలబడ్డ చోటుకి కొంచెం దూరంలో నిలబడింది.

కారునో ముసిలాయన నడుపుతున్నాడు. అతని భార్య కాబోలు ముందు సీటులో భర్త పక్కనే కూర్చుంది. వాళ్ళిద్దరూ మధుర నుంచి వస్తున్నట్టుంది. కిటికీ దగ్గిర నిలబడి రామేశ్వరసింగ్ మాట్లాడాడు.

''సలామ్ సాబ్! మా కారుకి ముందు ఆక్సిల్ విరిగిపోయింది. ఆగ్రా వరకు మా యిద్దరికీ లిఫ్ట్ యిస్తే, దీనిని ఎత్తడానికి క్రేను, కొత్త ఆక్సిలు తెచ్చుకుంటాం.''

ముసిలాయన చెట్టుకు కొట్టుకున్న కారును చూస్తూ తలఊపాడు ''ఠీక్ హై! చలో!....''

రామేశ్వరసింగ్ మరి ఆలస్యం చేయలేదు. వెనుక తలుపు తీసుకొని లోపలికి ఎక్కాడు. అతని వెంటే శంకర్ కూడా రెండు బుట్టలతో.

రామేశ్వరసింగ్ చేతి వాచీ చూసుకున్నాడు.

పదిగంటల పదిహేను నిమిషాలయింది. ఇంకా నలభై అయిదు కిలోమీటర్లు ముందుకున్నాయి.

ముసిలాయన కారు స్టార్టు చేశాడు.

చాల మెల్లిగా కారు నడుస్తున్నది.

రామేశ్వరసింగ్ ప్రతీ నిమిషానికి వాచీ చూస్తున్నాడు.

పదిగంటల ఇరవై నిమిషాలయింది. కారు స్పీడయి అయిదు నిమిషాలయింది. కాని దాని వేగం ఇంకా నలభై కిలోమీటర్ల వరకే వచ్చింది.

రామేశ్వరసింగ్ జేబులోకి చెయ్యి పోనిచ్చాడు.

మరో రెండు నిమిషాలు- మరి కారువేగం హెచ్చలేదు. ఈ విధంగా పోతే కంటోన్మెంటు స్టేషను పదకొండున్నరకు ముందు చేరుకునే ప్రసక్తే లేదు.

రెప్పపాటు కాలంలో ఫంట్లాం జేబులోంచి పిడికత్తి బయటికి వచ్చింది. అడుగునున్న బటన్ నొక్కగానే, ముడిచిన కత్తి నిలబడింది. అది తళతళమెరుస్తున్నది. ముసిలాయన రెండు చేతులతోనూ స్టీరింగ్ పట్టుకొని రోడ్డువేపే దృష్టి సారించి నడుపుతున్నాడు. చల్లగా, మొనదేరిన కత్తి అతని పీక వెనుక భాగానికి తగిలింది.

''సాహేబ్! మీరు చాల జాగ్రత్తగా నడుపుతున్నారు. మాకు అర్జంటు పనిఉంది. వెనుకసీటులోకి మీ యిద్దరూ రండి. కారు మేము స్టేషనులో వదిలిన తరువాత మీదారిన మీరు పోవచ్చు.''

ముసిలాయన మాట్లాడలేదు. కారు ఆగిపోయింది. రామేశ్వరసింగ్ ఒక్కడూ ముందుకు స్టీరింగ్ దగ్గరికి వచ్చాడు. శంకర్ వెనుకసీటులోనే, భార్యాభర్తల మధ్యను కూర్చున్నాడు.

రామేశ్వరసింగ్ టైము చూశాడు.

పదిగంటల ఇరవై అయిదు నిమిషాలు.

ఇంకా ఇరవై ఏడు నిమిషాలు మిగిలాయి. నలభైనాలుగు కిలోమీటర్లు.

రామేశ్వరసింగ్ దృష్టిలో రైలు విడిచేవేళ ఉంది.

కారు స్టార్టు చేశాడు రామేశ్వరసింగ్. రెండు నిమిషాలలో వేగం అరవై కిలోమీటర్ల వరకు వచ్చింది. అయిదో నిమిషానికి నూరుకిలోమీటర్లు చేరుకుంది. బోర్డు మీదగేజ్ అన్నీ మెరుస్తున్నాయి. పాములా పరుగెత్తుతున్నది కారు.

రోడ్డుమీద పోతున్న ఒకటీ, రెండూ ట్రక్కులు హారన్ మోయించినా పక్కకు తప్పుకోవడం లేదు. వెనుకనుంచి వచ్చేవి దూరంలో ఉన్నాయి. రామేశ్వరసింగ్ అంత వేగంలోను సులువుగా వాటిని పక్కకు తప్పించుకొని ముందుకు పోయాడు.

రామేశ్వరసింగ్ దృష్టిలో గమ్యమొక్కటే ఉంటుంది. దానిని చేరడమే అతని ధ్యేయం. గమ్యం చేరేలోపున ఎన్నో ఆటంకాలు వస్తాయి. కాని వాటిని అధిగమించడమే అతని అలవాటు. ఎటువంటి ప్రమాదకరమైన పరిస్థితులోను అతను చలించవలసిన వాడు కాడు. కార్యం సాధించడమే అతను నేర్చుకున్నది.

అతను చేసే పనులను బట్టే అతని ఫీజు కూడా ఉంటుంది.

కారు ఆగ్రా పాలిమేరలు చేరుకుంది.

రామేశ్వరసింగ్ టైము చూశాడు. పది గంటల నలభై నిమిషాలు.

కారు నడుపుతున్నవాడు రామేశ్వరసింగ్.

ఆ కారు అన్ని వంపులూ వంగుతున్నది. అన్ని తిరుగులూ తిరుగుతున్నది. ఆటంకం లేనిచోట అంతలోనే వేగాన్నందుకొని, ఆగవలసినచోట వయ్యారంగా ఆగి, మొత్తానికి ఆగ్రా కంటోన్మెంటు స్టేషను చేరుకుంది.

రామేశ్వరసింగ్ కొంచెం దూరంలోనే కారు ఆపాడు.

''మీరిద్దరూ మంచివాళ్ళు. మీ కారు చాల మంచిది. లేకపోతే లోకం చాల చెడ్డది. చేయరాని పనులకు పురికొల్పుతుంది.''

ముసిలాయన తల పంకించాడు.

శంకర్ రెండు బుట్టలు పట్టుకొని పరుగెత్తాడు.

ప్లాట్‌ఫారమ్ గేటు దగ్గిరకు వచ్చేసరికి గార్డు విజిల్ వినిపించింది.

రామేశ్వరసింగ్‌కి, గేటుకు కొంచెం ముందులో 694వ నంబరుకల ఏసీ కోచి కనిపించింది. ఇంజను హరను మోగింది. రైలు కదిలింది. ఏసీ కోచి తలుపు దగ్గిర చెయ్యూపుతున్న పెద్దమనిషిని తోసుకొని శంకర్ రెండు బుట్టలతో లోనికి ఎక్కాడు. రామేశ్వరసింగ్ పరుగెత్తి ఎక్కాడు.

1.16 శనివారం రాత్రి- 10 గంటల 15 నిమిషాలు- గ్రాండ్ ట్రంక్ ఎక్స్ ప్రెస్- ఆగ్రా కంటోన్మెంటు ఇంకా చేరలేదు.

చిత్రలేఖ పేపర్ కప్‌లో వున్న ఫ్రూట్ సలాడ్‌లోని ఆఖరి ముక్కలను చెమ్చాతో తీసుకొని తినడం పూర్తిచేసింది.

కుమారరాజా ఒక విచిత్రమయిన మనిషి. రావడమే స్టేషనుకు లేటు వచ్చాడు. 694వ నంబరు ఏసీ ఫస్ట్‌క్లాసు కోచిలో కూపే 'డి'ని కుమారరాజా, వారి పార్టీకి రిజర్వు చేయించాడు. అతని పార్టీవారు మరెవరూ రాలేదు. అతని లగేజ్ తప్ప, ఒక్కొక్కరికి ఒకొక్క వెర్రి- అతని లగేజ్ అంటే అతనికి అంత ప్రీతి. అందులో పెట్టెకొక వస్తువుంటుంది. ఒకదానిలో స్కాచ్‌సీసాలు, ఈ విధంగా ఎనిమిది సామానులను ఎనిమిదిమంది తెచ్చి ఎక్కించారు. వాటినన్నింటినీ బెర్తుమీద నింపారు.

ఏసీ కూపేలోకి ప్రవేశించగానే కుడిచేతి వేపు ఒక చిన్న అలమరా, దాని పైన ఒక షెల్పు ఉన్నాయి. ఆ షెల్పులో పెద్ద సైజు ఫ్లాస్కు నిండా ఐస్ క్యూబులున్నాయి. ఒక అరలో మెరుస్తున్న గాజు గ్లాసులున్నాయి. రెండవ అరలో స్కాచ్ బాటిల్ ఒకటి ఉంది. ఒక ప్లేటులో వేయించిన సాల్టెడ్ జీడిపప్పు ఉంది. ఆదే అరలో మూడు కార్క్ సోడాలున్నాయి.

స్థిరపడిన అరగంటవరకు అతను ఏదో ఆలోచిస్తూ సిగరెట్టు మీద సిగరెట్టు ముట్టిస్తూ కూర్చున్నాడు. అయిదు సిగిరెట్లు గొలుసు కట్టుగా తాగి, ఆరవది సావకాశతంగా పీల్చి, చివరకు మిగిలిన బట్‌ను ఆష్‌ట్రేలో నొక్కివేశాడు.

''మోహినీదేవికి ఆశాస్తి చాలును'' అనుకున్నాడు గట్టిగా, తరువాత లేచి గ్లాసులో కొంచెం స్కాచి, నాలుగు క్యూబులు, అరగ్లాసు సోడావాటరు నింపి సావకాశంగా సిప్ చేశాడు. పక్కనే పడివున్న సినీమా వారపత్రిక తీసి సెంటర్ స్ప్రెడ్ చూచాడు.

బ్లో అప్ అయిన క్లబ్ డాన్సరు చిత్రం చూస్తూ, కొంచెం కొంచెం గ్లాసులోనిది చప్పరిస్తూ తన్మయుడవుతున్నాడు.

పైన తలుపు మీద చిన్న చప్పుడు.

''మే ఐ కమిన్ ప్లీజ్!''

అతని జవాబుకి వేచియుండకుండా తలుపు తెరుచుకుంది. తలుపు దగ్గిర నిలబడిన సుందరికీ, సెంటర్ స్ప్రెడ్‌లోని సుందరికీ తేడా బట్టలలోను, మేకప్‌లోను మాత్రమే.

అంత కుమారరాజా ఆశ్చర్యసముద్రంలో అట్టే మునిగిపోయాడు.

''ఇది కలా! నిజమా!''

''కుమారరాజాగారి కల నిజమవుతున్నది''

''కమిన్ మై గర్ల్! హేవ్‌యూ ఎనీ మోర్ సర్‌ప్రైజస్ ఫర్ మీ!''

''ఫర్ యూ? ఓ! దేరార్ మెనీ!''

అప్పుడు చిత్రలేఖ చంకలో పిల్లి జమ్మిని పెట్టుకొని లోనికి వచ్చింది.

ఆమెకు మీద బెర్తుమీద తలుపుకు దగ్గిరగా పింక్ కలర్ రేపరులో, ఆకుపచ్చని రిబ్బనుతో కట్టిన గిఫ్ట్ పార్సెల్ కనిపించింది.

సో జనార్దన శర్మ ఈజ్ కరెక్టు!

''మీ గురించి రెండురోజులయి రాత్రులంతా హోటల్ అశోక్‌లో ఆలోచిస్తున్నాను.''

''మద్రాసు నుంచి వచ్చి మూడురోజులైంది. చాణక్యపురిలో మా మామ యింట్లో ఉన్నానన్న మాటేగాని, అంతా మీ గురించే ఆలోచన.''

''ఇప్పుడు మా అక్కగారి ఆరోగ్యం బాగుంది, ఢిల్లీ వెళ్ళేముందు మధురలో దిగి బృందావనంలో ఆమెను కలిశాను. ఆమె నా గురించి చాల జాలిపడింది. మన పిక్చరుకి సహాయం చేయడానికి సుముఖంగా ఉంది. ఆమె దగ్గిర మంచి కుర్రాడుగా నేను ప్రవర్తించాలి కదా! అందుచేత మీరు గుడ్‌గర్ల్‌వలె ఇప్పుడు మీ కంపార్టుమెంటుకి వెళ్ళిపోండి. మధురాస్టేషను విడిచిపెట్టగానే హోల్‌నైట్ స్టేకి తయారయిరండి. చాల విషయాలు మనిద్దరం మాట్లాడుకోవాలి. మీ డిన్నరు కూడా ఇక్కడికి తెమ్మని చెప్తాను.''

''వెరీ కైండ్‌ఫ్ యూ!''

''మరొక్క సంగతి మీరు వచ్చేటప్పుడు ఈ పిల్లిని మాత్రం మీతో తీసుకొని రాకండి. నాకు గుర్రాలన్నా, పిల్లులన్నా ఎలర్జీ!''

''అదా సంగతి, కుమారరాజాగారూ! ఇది మన యిళ్ళలో పాలు దొంగతనంగా తాగే పిల్లికాదు. దీని నల్లని ముఖం, తెల్లని రొమ్ము నిడుపైన కాళ్ళు, కురచ వెంట్రుకలు చూడండి. ఇది సయామీస్ కాట్! కాబట్టి మీరు ఏవిందంగానూ భయపడనక్కరలేదు.''

''అదే అదే! దాని కళ్ళల్లోకి చూస్తుంటే గుడ్లు పీకేయడం కోసం అది తొందర పడుతున్నట్లుంది.''

''ఈ జిమ్మీ మన మాస్కాట్! ఇది లేనిదీ ఏ వ్యవహారం జరగదు. నా దగ్గిర తప్ప మరొకరి దగ్గిర ఉండదిది.''

''అయితే ఇది ఆడపిల్లా, లేక మగ పిల్లా!''

''ఆడ పిల్లే!''

''కొంతలో కొంత నయం. రైలు ఆగి పోతున్నట్లుంది. వేగిరం వెళ్ళి, మధుర దాటగానే రండి.''

చిత్రలేఖ ఆ పరిస్థితులలో కుపే 'డి' ని విడిచిపెట్టింది. మరొక్క పదిహేను నిమిషాలలో ఆమె తిరిగివచ్చేసరికి పరిస్థితులలో మార్పులు అంతగా కలుగలేదు. అక్కగారిని చూసిన తరువాత కుమార రాజా ముఖంమీద మరో ఆనందరేఖ వెలిసింది. ఎనిమిది పెట్టెలకు మరో పెట్టె అదనంగా చేరింది.

రెండవసారి ఏసీ కూపేలోకి చేరిన తరువాత చిత్రలేఖ అధికారం తన హస్తగతం చేసుకుంది. బెల్ నొక్కింది. కొద్దిసేపటిలో మొదలియార్ ఏసీ కోచి ఇన్‌ఛార్జి వచ్చాడు. మొదలియారు మద్రాసు నుంచి న్యూఢిల్లీకి, న్యూఢిల్లీ నుంచి మద్రాసుకు ప్రయాణం చేస్తాడు కోచితో. అతని బాధ్యతలు చాల హెచ్చు, కాని, జీతం మాత్రం మెకానిక్‌కు దొరికేది మాత్రమే. ఏసీ కోచిలోని ప్రయాణీకుల కోర్కెలను తీర్చే మామ అతను. ఇంకా మరో ఆరు సంవత్సరాల సర్వీసు ఉంది. సూళ్ళూరు పేటలో ఒక ఇల్లు ఉంది చిన్న ఫాన్సీ దుకాణం తెరిచి రిటైరయిన తరువాత హాయిగా బ్రతకాలని అతని తాపత్రయం.

''చూడండీ! ఇన్‌ఛార్జిగారూ! మీకు తెలుగు వచ్చనుకుంటాను. ఇంతవరకు కుమార రాజాగారి పార్టీ రాలేదు. ఇప్పుడు నేను వచ్చాను. పైనున్న బెర్తు మీద సామానులన్నీ లగేజి రూములో పెట్టించండి.''

''నోనో! ఈ సామాను చాల విలువయినది.'' అన్నాడు కుమారరాజా మెల్ల మెల్లగా!

''లగేజి రూమ్ ఉంది. దానికి పైనుంచి తాళం కూడా వేయవచ్చు'' అన్నాడు మొదలియారు.

''అయితే వెంటనే మార్పించండి.''

''మేడమ్! ఈ పని వెంటనే అవదు. ఆగ్రా కంటోన్మెంటు స్టేషన్ వచ్చిన తరువాత లైసెన్సు పోర్టరుని పిలిచి చేయిస్తాను.''

''మీ పేరేం పేరు?''

''నాపేరు మొదలియారు.''

''నల్లగా, మీసాలు లేకుండా, ఉంగరాల జుత్తు తలతో ఉన్న కుర్రాడెవడు?''

''వాడా?.....''

''అవును,వాడే!''

''మా బంధువు.''

''అంటే.....''

''మేనల్లుడు.''

''మరేం! ఇదంతా మన ఏసీ కుటుంబానికి చెందినది. కాబోయే మీ అల్లుడిచేత వీటిని లగేజి రూముకి తరలించండి. ఇదిగో పది రూపాయల నోటు.''

మొదలియారు మరిమాట్లాడలేదు- జంబు లింగం. వురఫ్ మొదలియారు ముద్దుల కూతురు వద్దన్న పెళ్ళి కొడుకు. వురఫ్ జార్జి టవున్‌హీరో, వురఫ్ బీచి మెరీనా పిక్‌పాకెట్‌కొద్ది క్షణాలలో దర్శనమిచ్చి సామానంతా, ఆ ఆకుపచ్చ రిబ్బను గిఫ్ట్ పార్సెలు సహితం, లగేజి రూముకి బదిలీ చేశాడు.

చిత్రలేఖ స్వయంగా వెళ్ళి సామాను సరిగా అరలలో సర్దింది. ఆకు పచ్చ రిబ్బను కట్టిన పార్సెలు మాత్రం అడుగున ఎయిర్ కండిషనర్ లగేజి పేనలు వెనుకభాగంలో పెట్టియుంది.

సో ఫార్! సో గుడ్!

కూపే 'డి' లో మీద బెర్తు ఖాళీ అయిన వెంటనే చిత్రలేఖ తన ఆరవ ప్రాణమైన జిమ్మీని దానిమీద ప్రతిష్ఠించింది.

''ఇక మీరు ఏమీ భయపడనక్కరలేదు.''

ఇంతలో బేరరు వచ్చి, వెస్టరన్ స్టైల్ రెండు నాన్ వెజిటేరియన్ డిన్నర్లు తెచ్చి బల్ల మీద పెట్టి వెళ్ళిపోయాడు.

చిత్రలేఖ లోపలనే ఉన్న వాష్ బేసిన్‌లో చేతులు కడుక్కొంది.

''కుమారరాజాగారూ! మీరు బట్టలు మార్చుకొని రండి. ఒకసారి మీ కోరిక చెప్పారు. స్ట్రిప్ టీజ్- బర్లెస్క్యూ, నేను చేయగా చూడాలని. ఆ రెండు కాక నేనొక అద్భుత మైన నాట్యం కూడా చేస్తాను. వాటికి కావలసిన సంగీతం సమకూర్చుకొని వచ్చాను. మనం ఇద్దరం హాయిగా రాత్రి గడిపి, మిగిలిన విషయాలు తరువాత ఆలోచించవచ్చు.''

కుమారరాజా నవ్వుతూ లేచి నిలబడ్డాడు. పైజమా, కన్లీ లాల్చీ, తలగడ క్రింద ఉన్నవి తీసుకొని, తలుపు తెరచి బాత్ రూమువేపు నడిచాడు. చిత్రలేఖ డిన్నరు ఇద్దరికీ అమర్చింది.

బాత్‌రూము నుంచి కుమారరాజా వచ్చిన తరువాత, ఇద్దరూ డిన్నరు ఆరగించారు.

డిన్నరు అయిపోయింది.

కుమారరాజా వాచీ చూశాడు. పది గంటలన్నర అయింది.

''మీకు నిద్దర వస్తున్నది?'' ప్రశ్నించింది చిత్రలేఖ.

''లేదు- నిద్ర పారిపోయింది'' అన్నాడు కుమారరాజా.

చిత్రలేఖ సంచినుంచి టేపు రికార్డరు తీసింది. మొదటి కాసెట్ పెట్టి వాల్యూమ్ స్విచ్ ఆన్ చేసింది.

మధురమైన వాద్య సంగీతం, పాశ్చాత్యమైనది వినవచ్చింది.

ఆగ్రా కంటోన్మెంట్ స్టేషను వచ్చింది. రైలాగింది.

''ఆపనా?.....''

''వద్దు! మనను ఎవరూ డిస్టర్బ్ చేయరు.''

చిత్రలేఖ పైటమించి మొదటి స్ట్రిప్ ఊడిపోయింది.

డాన్సు మొదలయింది.

1.17 శనివారం- రాత్రి- 10 గంటల 30 నిమిషాలు- విజయవాడ.

''నారాయణన్ హియర్!''

''నమస్కారం సార్! సిండర్ స్పెషల్ ఏభై వాగన్లతో రాత్రి పదకొండు గంటలకు ఆర్డరయింది''. రాత్రి పన్నెండు గంటలకు స్టాఫ్ స్పెషలు ఆర్డరయింది.''

''వెరీగుడ్!''

''మన రిలీఫ్ ట్రెయిను పందిళ్ళపల్లి వదిలింది. గంగినేనిలో కొంత డిటెయిన్ అయినా, బాగానే పరిగెత్తుతున్నది. డి. ఎమ్. ఇ. గారు డోర్నకలులో మోటారు ట్రాలీ ఏర్పాటు చేయమన్నారు. దానిని కూడా అరేంజ్ చేశాను''.

''మంచిది. కాజీపేట వేపు నుంచి పని ఎంతవరకయింది?''

''ఇప్పటివరకు రెండు వాగన్లు మాత్రం తీశారు. వాళ్ళకు ఏమీ చేయడం సరిగా అర్థం కాదు. అందులో అక్కడ చిన్న దొర చాల గాభరాపడుతున్నారు. ఈ వాగన్లన్నీ ఎత్తేసరికి వారం రోజులకు తక్కువ కాదని అతను అంటున్నారు. వాళ్ళకి ఇంజనీరింగ్ పనివాళ్ళు దొరకడంలేదు. అయిదు గాంగులు మాత్రం దొరికాయి. ఏం చేయాలో తోచక ఏ పనీ చేయలేక పోతున్నారు.''

''చేయవలసిందంతా మన మూర్తి మీదే ఉంది. అతను చెప్పిన ప్రకారం మన అబ్రహాం పనిచేస్తాడు. వాళ్ళు సైటు చేరిన తరువాత, నీతో మూర్తిని ఫీల్డు టెలిఫోను మీద మాట్లాడమను- రాత్రి రెండు గంటలయినా, నన్ను నిద్రలేపి పరిస్థితి తెలియ జేయాలి. చాల ముఖ్యమై ట్రెయినులన్నీ దెబ్బతిన్నాయి. మనకు, మన రాజధానికి, భారతదేశం రాజధానికి, దక్షిణాదికి రాక పోకలు ఇరవై నాలు గంటలు, మించితే ముప్పై రెండు గంటలు దాటి ఆగిపోకూడదు.''

''అదే సార్! అందుకోసమే తాడల పూసపల్లి, కేసముద్రం స్టేషను మాస్టర్లతో మాట్లాడి, దగ్గిరనున్న పల్లెటూళ్ళో దండోరాలు వేయించాము. మామూలు కూలికి రెండు రెట్లు కూలి ఇస్తామని, తెల్లవారువేళ అయిదు గంటలకు సైటు దగ్గిరకి అందరూ రావలసిందని వార్తలంపాము. మూర్తి అక్కడకు చేరిన తరువాత పని చాలా వేగంగా మొదలవుతుంది.''

''అతనొక్కడిమీదే నాకు నమ్మకం.''

''నమస్కారం సార్?''

కేశవయ్య తాను చేస్తున్న చాల పనుల గురించి డివిజనల్ సూపరెండెంటుగారితో చర్చించలేదు.

సిగరెట్టు తీసి కాలుద్దామనుకున్నాడు.

కాని దానిని విసిరేశాడు.

మూర్తి! మూర్తి!! మూర్తి!!!

తన తమ్ముడొక్కడే ఈ పనిలో మాటకు నిలబడవలసినవాడు. అతనికి తను బలరాముడిలా సహాయం చేయడానికి సర్వసన్నద్ధుడై నాడు.

1.18 శనివారం - రాత్రి- 11 గంటలు- గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్

రామేశ్వరసింగ్ మీసం తిప్పుతూ ఏసీ కోచ్ ఇన్చార్జితో కూపే 'డి' ముందు నిల బడ్డాడు. శంకర్ రెండు పళ్ళ బుట్టలను పట్టుకొని అతని వెనుకనున్నాడు. కోచి ఇన్చార్జి మొదలియారు కూపే తలుపుమీద మూడోసారి కొట్టాడు.

''రజియా బీగమ్.'' చాల సులువుగా చెప్పాడు.

రజియా బేగమ్ పేరు వినగానే కూపే తులపులు ఆటోమాటిక్‌గా తెరుచుకుం టాయి. నవ్వుతూ కుమారరాజా రామేశ్వరసింగ్‌ని లోపలికి పిలిచి, సుల్తానా ఎలా ఉందని కుశల ప్రశ్నలు వేస్తాడు. అక్క రజియా కోసం సుల్తానా ఆపిల్ పళ్ళు పంపించిందని చెప్తే, అతను ఎగిరి గంతేసి ఏమీ ఆలోచించకుండా ఒక పండు చటుక్కున కొరికి తినే స్తాడు. అప్పుడే చేయవలసిన పని చేయాలి. ఒకరు మాట్లాడుతుంటే, రెండవ వాళ్ళు పని ముగించాలి.

కాని కథ అడ్డం తిరిగింది.

''యూ! బ్లడీ ఇన్చార్జి! డోంట్ డిస్టర్బ్ మీ!'' లోపల నుంచి కుమారరాజా ఉరుము తున్నాడు. చిత్రలేఖ ఒంటి మీద నున్న చిన్న ట్రయాంగులర్ స్ట్రిప్ రావడమా, మానడమా అని సందేహిస్తున్నది. మంచి ఉద్రేక పరిస్థితులలో ఈ గొడవేమిటి. చిత్ర లేఖ ఏమీ తొణకలేదు. సంగీతానికి అనుగుణంగా, పిరుదులనొకసారి విదలించింది.

అటువంటి వేళ మళ్లా నాలుగోసారి తలుపుమీద చప్పుడు.

ఉన్న త్రిభుజాకారమైన ఆచ్ఛాదం రాలిపోయింది. చిత్రలేఖ శరీరం ఆ సంగీతంలో మెలికలు తిరిగిపోతున్నది.

''యూ బాస్టర్డ్! గెటవుట్! నీ ఉద్యోగం పీకించేస్తాను మరోసారి తలుపుమీద కొడితే!'' ఉరిమాడు కుమారరాజా!

రామేశ్వరసింగ్ హిప్ పాకెట్‌లోంచి ఒక ఇరవై రూపాయల నోటు తీసి మొదలియారు చేతిలో పెట్టాడు.

మొదలియారు చేతులు రెండూ జోడించాడు, డబ్బు తీసుకోలేదు.

''ఈ సాబ్ చాల చెడ్డవాడు. ఇతని సామాన్లన్నీ లగేజి రూములో పెట్టించాను. అతనికి కావలసిన సదుపాయాన్నీ చేస్తున్నాను. అటువంటి నాకే ఇతను ఉద్యోగం పీకించేస్తానన్నాడు. ఇంకేం చెయ్యను.''

రామేశ్వరసింగ్ మెదడులో ఒక మెరుపు.

''దాదా! ఈ రెండు బుట్టలూ అతని సామాను దగ్గిర పెట్టు. పొద్దున్న వీలు చూసుకొని అందజేయవచ్చు'' అన్నాడు అతను.

''అయితే పద! లగేజి రూములో పెడుదుగాని''

వాళ్ళు ముగ్గురూ మొదలియారు గదిదాటి తలుపు తోసుకొని లగేజి రూము దగ్గిరకు వచ్చారు. కొలాప్సబిల్‌గేటు మూసి, దానికి ఇనుపగొలుసు కట్టి, తాళం వేసుకొని జంబు లింగం పడుకున్నాడు. లోపల కాంతి హెచ్చుగ ఉంది. ఎడమ చేతివేపు అడుగున పింక్ కలరు గిఫ్ట్ పార్సెలు ఎయిర్ కండిషనర్ గేజి పానల్‌వెనుకనుంది. దానిని చూడగానే రామేశ్వరసింగ్‌కి ప్రాణం లేచి వచ్చింది. అప్రయత్నంగా కుడిచేయి మీసం మీదికి పోయింది.

''జంబులింగం! జంబులింగం!!''

మొదలియారు ఇనుప తలుపు మీద కొట్టి మేనల్లుడిని లేపాడు.

జంబులింగం కళ్ళు నులుపుకుంటూ లేచాడు.

మొదలియారు అరవంలో మాట్లాడాడు.. జంబులింగం తలుపు తెరిచాడు.

''ఆ సామాను దగ్గిర ఈ బుట్టలు కూడా పెట్టండి. పొద్దున చెప్తాను. జంబులింగం! వీళ్ళు బండి ఆగగానే దిగిపోతారు. నేను పోయి పడుకుంటాను.''

మొదలియార్ చేతిలో యిరవై రూపాయల నోటు బలవంతాన ఉంచాడు. రామేశ్వరసింగ్.

''దాదా! బండి ఆగగానే మేము దిగిపోతాం. నీ ఉపకారానికి ధన్యవాదాలు''....

రైలు గ్వాలియర్ అవుటర్ సిగ్నల్ వద్ద ఆగిపోయింది. ఏసీ కోచ్ నుంచి రామేశ్వర సింగ్, శంకర్ దిగివెళ్ళిపోయారు.

1.19 శనివారం- రాత్రి- 11 గంటల 30 నిమిషాలు- డోర్నకలు స్టేషను

రిలీఫ్ ట్రెయిను డోర్నకలు స్టేషను అరగంట ముందుగా చేరుకుంది. గంగినేనిలో క్రేనుకు రిపేరులయిన తరువాత ఎక్కడా వేగం తగ్గించకుండా తొంభయి నాలుగు కిలో మీటర్ల దూరం నడిపించాడు డ్రైవరు రెండు గంటల్లో.

డోర్నకలు చిన్నమాస్టరు ప్లాట్‌ఫారమ్ మీద నిలబడ్డాడు. రిలీఫ్ ట్రెయిను నుంచి మూర్తి, అబ్రహాము, ఫిట్టరు సీతారామయ్య మరిద్దరు కళాసీలు దిగారు. వారితో అయిదు సెల్సు ఉన్న పాడవాటి బాటరీ లైట్లు నాలుగు, రెండు తిల్లీ లాంపులు, నాలుగు వెదురు బొంగులు కూడా దింపారు. వీరందరూ పక్క లైనుమీద నున్న ఆ చిన్న మోటారు ట్రాలీమీద సామాను ఎక్కించుకొని, ఒకరి నొకరు అంటుకొని కూర్చున్నారు.

అప్పటికి వర్షం బాగా తగ్గిపోయింది. ఆకాశంమీద నక్షత్రాలు కనిపించలేదు. బాగా మబ్బు పట్టి ఉంది. గాలి చల్లగా వీస్తున్నది. చీకటి చాల చిక్కబడి, లోతెరుగని సముద్ర గర్భంలోకి మోటారు ట్రాలీ తన హెడ్ లైటుతో జొచ్చుకుంటున్నట్లుంది.

మోటారు ట్రాలీ ముప్పై కిలోమీటర్ల వేగంతో పరుగెత్తినా, దానిమీద నున్న వారు అదిరి పోతున్నారు. ఏదీ అడ్డులేక పోవడంతో చల్లని గాలికి బలిఅయిపోతున్నారు. ట్రాలీ ఫిష్‌ప్లేట్లను దాటుతుంటే చప్పుడయి సర్దుకుంటున్నది.

కప్పల బెకబెకలు, దూరం నుంచి ఏదో జంతువు భయంతో అరచిన అరుపు, ఆ ట్రాలీ చప్పుడులో ఎవరికీ వినిపించలేదు.

గుండ్రాతి మడుగు దాటిపోయింది. మహబూబాబాదు స్టేషనులో వెళ్ళవలసిన సిగ్నల్సు వాల్చలేదు. కేవలం స్టేషనులోకి వెళ్ళడానికి సిగ్నల్సు మాత్రమే యిచ్చారు.

''గుడ్! మహబూబాబాదులో టీకి ఏర్పాటు చేయమన్నాను'' అన్నాడు అబ్రహమ్.

మూర్తి రిస్టువాచీ మీద టార్చివేసి చూశాడు.

ఇంకా జీరో అవరు దాటలేదు.

1.20 శనివారం- రాత్రి- 11 గంటల 45 నిమిషాలు- గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్

చిత్రలేఖ మీద బెర్తుమీద నున్న టేప్ రికార్డరులో మూడవ కాసెట్ పెడుతున్నది. జిమ్మీ చెమటలు చిమ్మిన యజమానురాలి ముఖం లోకి చూస్తున్నది.

ఇప్పటికి కుమారరాజా కోరిన రెండు రకాల అభినయాలు ముగిశాయి. మొదటిది స్ట్రీప్ టీజ్- అదో ఇరవై నిమిషాలపాటు నడిచింది. తరువాతది బర్లెస్క్- మొదటి నృత్యంతో బట్టలన్నీ తీసివేసిన చిత్రలేఖ, వాటిని వేసుకొనే ప్రయత్నం చేయలేదు. రెండు నిమిషాలు తనతో తెచ్చుకున్న ఫ్లాస్క్- నుంచి కాఫీ రెండు కప్పులలో పోసి కుమారరాజా కిచ్చి, తాను తాగింది. తరువాత బర్లెస్క్- అభినయించింది.

కుమార రాజా దృష్టి, మనస్సు అన్నీ ఆ చక్కని చుక్క- శరీరం మీద, ఆమె అభినయం మీద నిలిచిపోయాయి. శరీరానికి మరేచేష్టలు మిగులలేదు. చేతిలోనున్న స్కాచ్ అలానే వుండిపోయింది. ఆనంద తన్మయుడతడు.

ఇపుడు చిత్రలేఖ తాను చూపించదలచిన నృత్యం గురించి ఆయత్తమవుతున్నది. మొలకో నైలాను గర్డిల్ కట్టుకుంది. ఆకు పచ్చని గరిక కాడల వంటివి మొలనుండి పిరుదులమీద తొడలమీద వ్రేలాడుతున్నవి. పయోధరాల మీద కలువపూల తెల్లని డిజైను స్పష్టంగా కనిపిస్తున్నది. వాటిని మధ్యనుండేటట్టు మెడలో పొడుగుపాటి ఎర్రగులాబీల దండ వేసుకొంది.

చిత్రలేఖ తల కొంచెం వంచి నమస్కరించింది.

''ప్రియమైన అతిథీ! ఇది కొత్త తరహా నాట్యం- సౌత్ బ్రెజిల్‌లో, వయసులో ఉన్న ఆడపిల్లలు చేసేదిది. ఈ హవాయియన్ నృత్యం ఒక్కరు చేయడం కన్న చాలమంది ఒకరి నడుముల మీద ఒకరు చేతులుంచి చేస్తే అద్భుతంగా ఉంటుంది. దండలుగా గుచ్చిన పూలు, వక్షస్థలం మీద పెయింట్ చేసిన పూలు, నాట్య గమనంలో కొత్తకొత్త ఆకారాలను మీకు బహూకరిస్తాయి. మీ అనుజ్ఞతో నాట్యం మొదలు పెడుతున్నాను.''

కుమారరాజా చూస్తున్నాడు. ఆమె చేతులు నడుముమీద నిలిచాయి. శరీరం పైభాగం సంగీతానికి అనుగుణంగా కదులుతున్నది. మెడలోని గులాబీల దండ గుండ్రంగా వక్షాన్ని చుట్టి తిరుగుతున్నది. మొలకు కట్టిన గర్డిల్‌లోని గరికపోచలు పైకి లేచి పాలమీగడ వంటి ఆమె పై తొడ వెలుగులు కనిపిస్తున్నాయి. చాలసార్లు వక్షాన్ని, ఒక్కొక్కసారి మొలను అదిలించడంతో ఆ నృత్యం లయ ప్రస్తారం సమన్వయించి మనస్సులో ఆమె సౌందర్యం అత్యద్భుత చిత్రాలను గీస్తున్నది.

కుమార రాజా ఎంతమందినో చూశాడు ఎంతమందినో అనుభవించాడు. చాల రసికుడైన వాడు. కాని చిత్రలేఖకు సాటి ఎవరూ లేరని అనిపించింది. ఏదో స్వర్గంలో తాను ఇంద్రుడుగా, చిత్రలేఖ ఊర్వశిగా నృత్యం చేస్తున్నట్లయింది.

క్రమంగా సంగీతం తగ్గింది. చిత్రలేఖ నాట్యంలోని ఉధృతం తగ్గి, శరీరం నిలకడ బడింది.

కుమార రాజా లేచి నిలబడ్డాడు. చేతి వాచీ చూసుకున్నాడు.

''ఓ మైగాడెస్ ఆఫ్ లవ్! జీరో హవర్ సమీపిస్తున్నది. ఇక విలంబాన్ని ఓర్చలేను - మన స్నేహం చిరంగా నిలవాలి. ఈ సుముహూర్తాన్ని సెలిబ్రేట్‌చేసుకోడానికి ఆలస్యం ఇంకేమిటి?''

చిత్రలేఖ నవ్వింది.

''ఓ యు నాటీ బాయ్.''

శనివారం అర్ధరాత్రి పన్నెండు గంటలు కొడుతుంటే కూపే 'డి' లో వారి రెండు శరీరాలు పెనవేసుకున్నవి.

విజయవాడ జంక్షన్

2. ఆదివారం -

2. ఆదివారం

2-1 ఆదివారం- 1గంట- విజయవాడ

రైల్వేవారి లెక్క- ప్రకారం రాత్రి పన్నెండు గంటలకు దినం మొదలవుతుంది. ఆదివారం ఆ విధంగా మొదలయింది. రాత్రి పన్నెండు గంటలకు శనివారం ముగిసి పోయింది. తరువాత ఆదివారం మొదలయింది.

ఆదివారం మొదలయి ఒక గంట అయింది.

పనులన్నీ సరిచూసుకున్నాడు కేశవయ్య. సక్రమంగా సాగుతున్నవి. సరిగ్గా పన్నెండున్నర లేక జీరో థర్టీ హవర్సుకి మోటారు ట్రాలీ సైటు చేరుకుంది. రిలీఫ్ ట్రెయినును మహబూబాబాదులో ఉంచి వేశారు. రిలీఫ్ ట్రెయినుకన్న ముందుగా సిండర్ వాగన్లు కావలసి ఉన్నాయి సిండరు వాగన్ల స్పెషలు డోర్నకలు చేరుకుంటున్నది. స్టాఫ్ స్పెషలు ఆలస్యంగా విజయవాడ విడిచిపెట్టింది. సరిగ్గా రెండున్నర కది తాడల పూసపల్లి చేరుకుంటుంది.

అన్నీ బాగానే ఉన్నాయి.

కేశవయ్య ఎదురుగా ఉన్న గోడ గడియారం చూస్తున్నాడు. అందులో పెద్దముల్లు మెల్లిగా ప్రాకుకుంటూ పన్నెండువేపు పోతున్నది. చిన్నముల్లు ఒంటిగంటమీదకు జరుగుతున్నది. కేశవయ్య తదేక దీక్షతో పెద్ద ముల్లును చూస్తున్నాడు. అదే.. అదే... పెద్ద ముల్లు... అదే.... పన్నెండు చేరు కున్నది.

..... ఏదో పెద్ద శబ్దం. ఆశబ్దానికి గుండెలు హఠాత్తుగా ఆగిపోతాయి. చెవులు బద్దలయిపోతాయి. మొదట రెండు రైళ్ళు గుద్దుకున్న శబ్దం. ఆ శబ్దం తరువాత ఒక్క క్షణం నిశ్శబ్దం. తరువాత అరుపులు కేకలు ఆకాశానికంటి, ఆ ఏడుపులు లోకమంతా నిండి, ఆ మూలుగులు గుండె లోతులలోకి చొచ్చుకొని.... ఇంతలో ఎక్కడి నుంచి వచ్చిందో. ఒక చంటిపిల్ల కేక- గుక్క తిప్పుకోకుండా ఏడుపు- ఎవరో పెద్దవారి అరుపులు- ''ఈ చంటిగుడ్డును చూడండర్రా. దీని తల్లి విరిగిన బోగీల క్రిందపడి చస్తున్నాదర్రా-'' తరువాత మళ్ళా చంటి పిల్ల ఏడుపు- ఆ తల్లి లేని చంటిపిల్లకు పాలెవరు పోస్తారు....

తరిణయ్యా- తరిణయ్యా.....

ఇంకెక్కడి చిన్న మాస్టరు తరిణయ్య.....

భోగలింగం- భోగలింగం!

ఇంకెక్కడికేబిన్‌మాను భోగలింగం....
లోకమంతా
ప్రళయకాల మహోగ్ర
భయద జీమూతోరు
ఘన ఘోర గంభీర
ఫెళఫెళార్భటులలో.....

అంతే- కుర్చీమీద కూర్చున్న కేశవయ్య మెలికలు తిరిగి, చొంగలు కారుస్తూ, క్రిందికి పడిపోయాడు. టేబిలు మీద కంట్రోలు ఫోను మోగుతున్నది. బంట్రోతు టీ తాగి రావడానికి వెళ్ళిపోయాడు. రాత్రి పన్నెండుకు రావలసిన ప్రొబేషనరీ ఆఫీసరు జాడ లేదాయె.....

..... ఇది జరిగి అప్పుడే రెండు సంవత్సరాలయింది.

కేశవయ్య అప్పుడు సెక్షన్ కంట్రోలర్‌గా వుండేవాడు. విజయవాడ- వాల్తేరు బోర్డు మీద పనిచేసేవాడు. అది అక్టోబరు నెల ఆఖరు వారం- తూర్పు తీరమంతా పెనుగాలులు. ఎడతెగని వర్షాలు- ఈశాన్య ఋతుపవనాలు- ఆరోజు సాయంకాలం నుంచీ కంట్రోలు సరిగా లేదు. స్టేషన్లు దొరికేవి- దొరక్కపోయేవి. ఏ బండి ఎక్కడుందో తెలియడం కష్టమయింది. అటువంటి గందరగోళంలో మరో చిక్కు తెచ్చిపెట్టాడు మాణిక్యాలరావు. డౌను గూడ్సు స్పెషలు మధ్యాహ్నం పన్నెండు గంటలకు రాజమండ్రి విడిచిపెట్టింది. స్టీము ఇంజనుతో ఆ ట్రెయిను పనిచేస్తున్నది. దారిలో క్రాసింగులకు, షంటింగులకు దానిని ఆపి ఆపి సాయంకాలం నాలుగు గంటలకు సామర్లకోట తీసుకొచ్చారు. అక్కడ మాణిక్యాలరావు ఒకగంట తీసుకున్నాడు. టెండరు నిండా నీళ్ళు తీసుకొని బయల్దేరాడు. కాని ఇరవై నాలుగు కిలోమీటర్లు బండి వెళ్ళిందో లేదో టెండరులో నీళ్ళు చాల తగ్గిపోయాయి. దానితో పాటు ఇంజక్టర్లు అల్లరి పెట్టాయి. మరిన్ని నీళ్ళు ఖర్చయిపోయాయి. అతను మెమో ఇచ్చి గొల్లప్రోలులో బండిని విడిచిపెట్టి, ఇంజను కోసి నీళ్ళకోసం తుని లైటింజను పనిచేసుకొని బయలుదేరాడు. అలా బయలు దేరిన ఇంజను కంట్రోలు లేక, దారి దొరక్క అన్నవరంలో చాలసేపు ఉండిపోయింది. టెండరులో నీళ్ళు అడుక్కి అడుక్కి వెళ్ళిపోయాయి. అన్నవరం నుంచి బయలుదేరి నప్పుడే అతనికి అనుమానంగా ఉంది. అన్నవరం చేరగానే ఆ అనుమానం నిజమయింది. బాయిలరులో సగం భాగం

నీళ్ళున్నాయి. టెండరులో నీరంతా అయిపోయింది. ఇటువంటి పరిస్థితులలో డ్రైవర్లు ఇంజను బాయిలరు రక్షించడంకోసం ప్రయత్నిస్తారు. అప్పటికి రాత్రి పదిగంటలయింది. గాలి వానలో, మరో ఇంజను వచ్చి తీసుకెళ్లడానికి వీలులేక, మాణిక్యాలరావు ఇంజను డొనులైను మీద నిలబడి పోయింది.

రాత్రి పన్నెండుకి కేశవయ్య డ్యూటీకి వచ్చాడు. అన్నవరం చిన్న మాస్టరు భార్యకు పురుటి నొప్పులు వస్తే ఇంటికి వెళ్లాడు. అన్నీ సరిగానే ఉన్నాయని చెప్పి అతను వెళ్లిపోయాడు. డౌన్ లైను డౌడ్ ఇంజను సంగతి కేశవయ్యకు తెలియదు. ఇంతలో తుని వేపు వెళ్తున్న ఎక్స్ ప్రెస్‌కి సిగ్నల్సు ఇచ్చారు. దానిని డెడ్ ఇంజను ఉన్న లైను మీదికి తీసుకున్నారు. ఎక్స్ ప్రెస్ డ్రైవరు కంట్రోలు చేసినా, ప్లాట్‌ఫారమ్ మధ్యనున్న ఇంజనుతో ఎక్స్‌ప్రెస్ డీకొని ప్రయాణం జరిగింది. చిన్నమాస్టరు, కాబిన్ వరకు పారిపోయారు. తప్పంతా వాళ్లమీదే వేశారు. కేశవయ్యను విడిచిపెట్టారు. తాను కొంచెం శ్రద్ధ వహించి, డౌన్ లైను కాళీగా ఉందో లేదో మరోసారి కనుక్కుంటే ఈ ప్రమాదం జరగదని అతను భావించాడు. ఆరునెలలు మంచం పట్టాడు. అప్పటి నుంచి ఉద్యోగానికి సరిగా రాలేదు.

* * *

2.2 ఆదివారం 2 గంటలు- రాత్రి గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్

చిత్రలేఖ కుమార రాజా కౌగిలి లోంచి లేచింది.

రైలు చాల వేగంగా పరుగెత్తుతున్నది.

కుమార రాజా ఆమెను చూస్తున్నాడు.

ఆమె లేచి నాట్యం అభినయిస్తున్నది.

గుర్రమా! గుర్రమా!!

పరుగెత్తే గుర్రమా!

పంచకళ్యాణి గుర్రమా!

రెక్కలు విప్పి ఎగిరేవేమో!

ఎవరి కోసమే- ఎవరి కోసమే-

నదిలో మునిగీ, గాలిని ఎగిరీ

స్వర్గానికి సరాసరి పోతావా!

రంభా ఊర్వశి, ఎవరు నీకు!

రభసెందుకే! రెక్కలగుర్రమా!

చిత్రలేఖ చేతులు రెక్కలలా ఆడించింది.

కాళ్ళతో కదను తొక్కింది. జడను తోకలా తిప్పింది.

''వహ్వా! వహ్వా!! బ్యూటీఫుల్! చిత్రలేఖా! మీకు గుర్రాలంటే కిట్టదా!''

''నాకు గుర్రమంటే అసహ్యం! అది కృష్ణలో పడి కొట్టుకుంటుంటే చూడాలని వుంది.''

''వండ్రఫుల్! కాని మనం చూస్తూవుంటే పోలీసులు పట్టుకుంటారు.''

''అయితే ఈ గుర్రాలెలా నదిలో పడతాయి.''

''అదో పెద్ద కథ!''

''అవునవును, అవన్నీ మీరే దాచు కోండి!''

''అంతలోనే కోపమా?''

''కోపమేముంది! నా మీద మీకు నమ్మకం లేదు.''

''అయామ్ సారీ! మీకు నాకు భేదం లేదు వినండి.''

రెండు చేతులలోను చెవులను పెట్టుకొని, అతని ఒడిలో కూర్చుంది చిత్రలేఖ

''అదో పెద్ద కథ''.....

''నాకూ, రాణీ మోహినీ దేవికి సంబంధాలు తెగిపోయి పది సంవత్సరాలయింది. ఆమె తండ్రిగారి జమీ ఆమెకు సంక్రమించింది. మా అమ్మమ్మ గారి ఆస్తి నాకు కలిసింది. నేను నా బాధలు పడుతుంటే అన్నింటిలోను అడ్డు తగుల్తుంది ఆమె! ఆ విశ్వనాథసింగ్ అనే ముష్కరుడిని ఉంచుకొని నాటకాలాడుతున్నది. నన్ను చంపాలని చాలసార్లు ప్రయత్నం చేసింది. అదృష్ట మనండి దేవుడనండి- నేను మాత్రం అన్నీ తప్పించుకున్నాను. నేను బ్రతికి బయటపడ్డా, నాకు ప్రాణంవంటి ప్రియురాలు, ప్రాణానికి ప్రాణమొడ్డే విశ్వాసపాత్రుడయిన స్నేహితుడు, వీరిద్దరిని ఆమె చంపించింది. ప్రతీసారి నేను నన్ను కాపాడుకోడానికే సరిపోతున్నది. ఎదురుదెబ్బ తీయడానికి ఆమె అవకాశమియ్యకుండా ఉంది. ఎంతకాలం నేను ఈ విధంగా ఎందుకూ పనికిరాకుండా బ్రతికి ఉండడం? నాలో క్షత్రియరక్తం ప్రవహిస్తున్నది. ఆమెకు మళ్లే నేనుకూడా ఎదురు దెబ్బ తీయడానికి బృహత్పథకం ఒకటి తయారు చేశాను.''

చిత్రలేఖ కుమారరాజా గుండెల మీద మృదువుగా చేతితో రాస్తున్నది.

''చాలా శ్రమపడ్డారన్న మాట!''

''శ్రమేమిటి? ఆరునెలలయి పథకం రూపొందిస్తున్నాను. రోజు రోజుకి రాణీ మోహినీదేవి పేరుప్రఖ్యాతులు పెరిగిపోతున్నవి. దీని అంతటికీ కారణం ఆవిడపెంచుతున్న గుర్రాలు పందాలుగెలవడమే. ఆవిడ ఆటలు కట్టించడానికి ఒకటే మార్గముంది. ఆవిడ ప్రేమించే గుర్రాలను ఖతం చేస్తే మరి ఆవిడ ప్రసక్తే లేదు. ఒకసారి ఆ గొప్ప గుర్రాలు చచ్చిపోతే, మళ్ళా అటువంటి వాటిని తయారుచేయడానికి మరోపది సంవత్సరాల కాలం పడుతుంది. అంతవరకు రాణీమోహినీ దేవి పేరు సముద్రం అడుక్కుపోతుంది.''

''మిస్టర్ రాజా! ఒక్కొక్క ప్రశ్న వేస్తాను? కోపం రాదు కదా?

''రాదు డార్లింగ్?''

''కోపం మోహినీదేవి మీద, కొట్టడం గుర్రాలను, ఇదేమైనా బాగుందా? గుర్రాలు వట్టి నోరులేని జీవులుకదా!''

''ఓ చిత్రలేఖ! మీకు ఒక విషయం తెలుసా? నేను ప్రాణంకన్నా అధికంగా ప్రేమించాను కుమారి సులోచనాదేవిని. ఆ అమ్మాయి బెనారస్ యూనివర్సిటీలో ఎమ్మే చదువుతుండేది. మేమిద్దరం కాన్పూరులో హోటల్‌లో ఒక వారం రోజులున్నాము. ఒకనాడు ప్రొద్దున చూస్తే ఆ అమ్మాయి కత్తిపోట్లతో బాత్‌రూమ్‌లో చచ్చిపడివుంది. ఎంతో గాఢంగా ప్రేమించాను ఆమెను, రాణీ మోహినీ దేవికి విడాకులిచ్చి ఈ అమ్మాయిని పెళ్ళి చేసుకోడానికి నిశ్చయించాను. అప్పుడు చచ్చినంత కలగాశాను. పెద్ద పెద్ద మినిస్టర్లు, జడ్జీలు సహాయం చేయకపోతే కటకటాలవెనుక పడి ఉండేవాడిని. రాణీమోహినీ దేవి కొండచిలువ వంటిది. నామరూపాలు లేకుండా జంతువును పూర్తిగా మింగి వేస్తుంది. ఆమెకు మరెటువంటి దెబ్బ కొట్టినా తగలదు. కాబట్టి గుర్రాలకు కొట్టిన దెబ్బ రాణీ సాహెబాకి తగిలితీరుతుంది.''

''మైడియర్ రాజా! ఇప్పుడర్థమయింది.''

''మొన్న కలకత్తా రేసులలో ఆ మూడు గుర్రాలు రణజిత్, చంద్రగుప్త, శశాంక గెలుపొందాయి. అవన్నీ బెంగుళూరు రేసుల కోసం రవాణా అవుతున్నవి. ఆరేసు హార్సు స్పెషలు శనివారం రాత్రి పది గంటలకు హౌరా స్టేషను విడిచి పెడుతుంది.''

''ఈ వివరాలన్నీ మీకెలా తెలిశాయి?''

''నేను ప్రొద్దున బోర్డు ఆఫీసుకు వెళ్ళాను. ఆపరేటింగ్ శాఖలో ద్వివేది డైరెక్టరుగా ఉన్నాడు. మే మిద్దరం సిమ్లాలో చదువు కున్నాం. వాడు కలకత్తా గార్డెన్ రీచికి ఫోను చేసి రేపు హార్సు స్పెషల్ టైమింగ్స్ నాకు ఇచ్చాడు.''

''స్పెషలు ట్రయినులో భద్రంగా పోతున్న గుర్రాలు నదిలో ఎలా పడతాయి?

''ఓ డార్లింగ్! ఒక మాస్టరు ప్లాను ఎంత పరిశ్రమిస్తే గాని పూర్తవుతుంది? పెద్ద విషయాలు ఉండనే ఉంటవి. ప్రతీ చిన్న విషయానికి కూడా ఎంత శ్రద్ధ వహించాలో తెలుసా?''

''చెప్పండి!'' పెద్ద విషయాలేమిటి? చిన్న విషయాలేమిటి!''

''పెద్ద విషయాలు- రైలు, వంతెన మీద పోతుంటే దాన్ని పేల్చి వేయడం- గుర్రాలు నదిలో పడి చావడం.''

''గుర్రాలను చంపడానికి వంతెన కూల్చి వేయాలా? ఎంత ఇబ్బంది? ఎంత నష్టం.''

''ఇబ్బంది ఎవరికి! నీకా! నాకా! ప్రజలకు ఏదో విధమైన ఇబ్బంది ఎప్పుడూ ఉండనే ఉంటుంది. ఇక ప్రభుత్వానికా ఇదొక నష్టమా?.. మరో బ్రిడ్జి కట్టిస్తారు. మరి ఎంత మందికో ఉద్యోగాలు దొరుకుతాయి. అందుచేత మనమేమీ బాధపడనక్కర లేదు. మనం తీసుకోవలసింది ముందు జాగ్రత్త.''

''చెప్పండి! చిన్న విషయాలగురించి.''

''ఈ రేసు హార్సు స్పెషలు విజయవాడ సోమవారం ఉదయం మూడుగంటలకు చేరుతుంది. సరిగ్గా నాలుగు గంటలకు విడిచి పెడుతుంది. విజయవాడ జంక్షన్ విడిచి పదినిమిషాలకు బ్రిడ్జిమీదకు వస్తుంది. రైలంతా బ్రిడ్జిని దాటడానికి మూడు నిమిషాలు పడుతుంది. రైలు ఇంజను బ్రిడ్జి చివరకు రావడానికి రెండు నిమిషాలు పడుతుంది. ఎప్పుడు బాంబు పేలితే రైలంతా నదిలో పడుతుందని ప్రశ్న?''

చిత్రలేఖ చాల శ్రద్ధగా చెవులప్పగించి వింటున్నది.

''రైలు ఇంజను ముఖ్యమైనది. బాంబు పేలేసరికి ఇంజను కనీసం నలభై కిలో మీటర్ల వేగంతో పరుగెత్తుతుండాలి. ఆ వంతెన చివరకు వచ్చేసరికి బాంబు పేలితే మధ్య

నున్న పెట్టెలు మాత్రం వంతెన మీంచి నదిలో పడతాయి. ముందు పెట్టెలు, కొన్ని వెనుక పెట్టెలు చెక్కు చెదరకుండా ఉండిపోతాయి. అందుచేత ఏం చేయాలి??

''అంటే?''

''అంటేనా? ఈ నా ప్రయత్నమంతా రాణీ మోహినీదేవి గుర్రాలను గంగలో ముంచడానికి. అటువంటప్పుడు కొన్ని గుర్రాలు చచ్చి, కొన్ని బ్రతికి ఉంటే నా ప్రయత్నాలన్నీ వ్యర్థమయినట్లే. నేనెన్ని ప్రయత్నాలు చేశాను. ఆ జాకీలను, ఆ సైసులను, ఆ డాక్టర్లను, అందరినీ డబ్బుతో కొనేయాలని ప్రయత్నం చేశాను. కాని వాళ్ళందరూ చాల విశ్వాస పాత్రులు. వాళ్ళు కొంచెమయినా డబ్బుకి ఆశపడలేదు. అందరూ ఒక కుటుంబంగా పనిచేస్తూ, రాణీ సాహెబా గారి గుర్రాలు గెలవడమే ధ్యేయంగా పెట్టుకున్నారు. ఆ కంచుకోట ఆ విధంగా పగుల గొట్టడానికి వీలయింది కాదు. అందుచేత ఆ గుర్రాలు చావాలంటే ఆ స్పెషలులో ప్రయాణం చేస్తున్న గుర్రాలన్నీ చావవలసిందే''

''బాగుంది!''

''అందుకే ఆ టైం బాంబు సరిగ్గా సోమ వారం ఉదయం నాలుగు గంటల పద కొండు నిమిషాల ముప్పై సెకండ్లకు పేలుతుంది. రైలు ఇంజను బ్రిడ్జి మధ్యభాగానికి చేరేసరికి బాంబు పేలుతుంది. డ్రైవరుకి రైలు ఆపే అవకాశముండదు. ఆ వేగానికి రైలంతా నదిలో కృష్ణార్పణమయిపోతుంది.''

''నాకొక్క సందేహం. అనుకున్న ప్రకారం ఆ బాంబు పేలక పోతే?''

''ఇది మిడిల్ ఈస్టు నుంచి స్మగుల్ అయివచ్చింది. చాలా శక్తివంతమయిన జిలాటిన్ బాంబు- దీని ధర చాలా హెచ్చు. సెట్ చేసిన వేళకు మొదటి ప్యూజు పని చేయకపోతే, మరొక్క పది సెకండ్లలో రెండవ ప్యూజు బాంబును పేలుస్తుంది. అందుచేత ఓటమి లేదు-

''బాంబయితే మీ దగ్గిర ఉంది. కాని మీరు మద్రాసు పోతున్నారు. బాంబు పేలిందో, లేదో ఎలా తెలుస్తుంది? ఎవరు దానిని బ్రిడ్జి క్రింద పెడతారు? అంతా నాకు ఆగమ్యంగా ఉంది.''

''అదే నీతో చెప్పానుకదా! చాలా చిన్న డీటెయిల్ దగ్గిర నుంచీ వర్కు చేశాను. మనరైలు విజయవాడ రాత్రి పన్నెండు గంటల నలభై అయిదు నిమిషాలకు చేరుతుంది.

ఈ గిఫ్ట్ పార్సెలు కోసం ఇద్దరు పెద్ద మనుషులు స్టేషనుకు వస్తారు. తరువాత దానిని ప్లాస్టిక్‌కేసులోంచి తీసి, పైనున్న రేపరు తీస్తే చాలు. ఆ బాంబును బ్రిడ్జి గర్డరుకు అంటించి వేయవచ్చు. దానిని ఏమీ వేసి కట్టనక్కరలేదు. బ్రిడ్జి గర్డరుకు అడుగున అంటుకున్న బాంబు ఎవరికీ అనుమానం కలగనీయదు. అందుచేత పనులన్నీ చాల సాఫీగా సాగుతున్నాయి.!''

''ఓహో! ఎంత పెద్ద మాస్టరు ప్లానో!''

''మరేమను కున్నారు?''

''బేబీ! చిన్న లల్లి బీ పాడుతాను. మనం బాగా అలిసిపోయాము. రేపల్లా మన పిక్చరు గురించి మాట్లాడుకోవాలి. స్లీప్ బేబీ స్లీప్!''

చిత్రలేఖ తన మృదువై వేళ్ళను అతని జుత్తులోనికి పోనిచ్చి జోలపాడింది.

కుమారరాజా అలా కళ్ళు మూసుకున్నాడు.

మెల్లిగా అతనిని పడుకోబెట్టింది చిత్రలేఖ- వెంటనే వెళ్ళి జనార్దనశర్మతో చెప్పాలనుకుంది. కాని వెస్టి బ్యూలు తలుపులు వేసేశారు. సావకాశంగా చెప్పవచ్చు. ఆమె మీద బెర్తు మీదకెక్కింది. పిల్లిని ఒడిలోకి తీసుకొని పడుక్కుంది.

2.3. ఆదివారం- 3 గంటలు- రాత్రి- కే సముద్రం సైటు

మూర్తి గంటన్నర వరకు ప్రమాదం సంభవించిన ప్రదేశమంతా అబ్రహాముతో సర్వేచేసి తాడల పూసపల్లి వేపు బయలుదేరినచోటికి మూడు గంటల వేళకు చేరుకున్నాడు.

మోటారు ట్రాలీ మహబూబాబాదులో పన్నెండున్నరవరకు ఉండిపోయింది. అనుకున్న వేళకు టీ తయారుకాలేదు. లోకంలో కొంతమంది తిండిలేకపోయినా బ్రతుకుతారు. కాని టీ లేకపోతే ఆ మరుక్షణమే మూర్ఛపోతారు. అటువంటివారిలో అబ్రహాము ముఖ్యుడు.

రమారమి ఒంటిగంటకు మోటారు ట్రాలీ సైటు చేరుకొంది. ఎంత వరకు రైలు దారిసరిగా ఉందో, అక్కడ ఒక గాంగుమాను ఎర్రదీపం పట్టుకొని నిలబడ్డాడు. అతనిని దాటి మరోపది అడుగుల తరువాత ఆప్‌లైను డౌనులైను రెండూ పాడయిపోయాయి.

మోటారుట్రాలీ ఆగినవెంటనే తిల్లీ లాంపులు వెలిగించారు. అంతటా చీకటికమ్ముకుంది. దూరంలో క్రేను హెడ్‌లైటు కేసముద్రం స్టేషనువేపు కనిపిస్తున్నది. అప్పుడప్పుడు క్రేను విజిలు వినిపిస్తున్నది.

సీతారామయ్య గమ్‌బూట్స్ తొడుక్కుని చేపాటి కర్రపట్టుకొని తిల్లీలాంపొకటి చూపిస్తూ ముందు నడిచాడు. ఎనిమిదడుగుల ఎత్తున వున్న రాళ్ళ గట్టు మీద నుంచి రైలు దారి వేశారు. ఆ రాళ్ళన్నీ కొట్టుకుపోయాయి. కొన్ని చోట్ల కమ్మలు మట్టుకు పోయాయి. ఒక్కొక్క చోట రాళ్ళ కుప్పలు, ఒకచోట గోతులు. రెండుట్రైన్లకు మధ్యను చెట్టూచేమా జమ అయిపోయాయి. అంతటా డీసెలు ఆయిలు వ్యాపించి వుంది. ఇంజను టాంకులోని ఆయిలు కారిపోయి అలుముకుంది. అరకిలోమీటరు వరకు నడిచిన తరువాత వాళ్ళకి డీసెలు ఇంజను కళ్ళబడింది. అది ప్రక్కకు పడిపోయి ఆప్‌లైను మీద వాలిపోయింది. దాని వెనక వ్యాగన్లు ఒక దాని మీద ఒకటి ఎక్కిపోయాయి. వేగన్లలో నింపిన బంగాళాదుంపలు, ఉల్లిపాయలు, గోధుమలు, పంచదార, బియ్యం, అరటి పళ్ళు అన్నీ బస్తాలు చిరిగిగెలలు విరిగి రాశులుగా అక్కడక్కడ చుట్టూ పడి ఉన్నాయి. అవన్నీ డీసెలు ఆయిలు పైకి తేలుతున్న నీళ్ళలోపడి కొత్తరకం వాసనలు పంచి పెడుతున్నాయి.

అక్కడికొచ్చి అందరూ ఆగిపోయారు. కుడిచేతి వేపు చిన్న కొండలు కనిపిస్తున్నాయి ఆ చీకట్లో. వాటిమీద కురిసిన వర్షానికి కొండవాగు పొంగి, బండరాళ్ళను దొర్లించి మహా వేగంతో వచ్చి, ఆప్ లైనును, డౌను లైను మీద చాలా వేగంతో పోతున్న గూడ్సు బండిని కూలదోసింది.

ఈ ప్రమాదానికి మూలకారణం ప్రకృతి వైపరీత్యం ఏ యంత్రం. చెడిపోయి కాని, ఏ ఉద్యోగుల అశ్రద్ధ వలన కాని సంభవించిన ప్రమాదం కాదిది. కాబట్టి ఆ విధమైన విచారణకు అవకాశం లేదు.

అందరూ హర్షించారు, రెప్పపాటు కాలంలో కృష్ణా ఎక్స్ ట్రైన్ దాటిపోయి వేలకొలది ప్రయాణీకులకు ప్రమాదం తప్పిందని.

తరువాత వాళ్ళందరూ చాల ప్రయాసపడి, పడిన వేగన్లను దాటుకొని కేసముద్రం వైపు చేస్తున్న క్రేనును సమీపించారు.

అప్పటికి వాళ్ళు ఆరువాగన్లు పక్కకి తీశారు. మిగిలినవి తీయడం చాల శ్రమకరంగా ఉంది. క్రేను ముందుకొచ్చినకొలదీ రైలు పట్టీలు సక్రమంగా ఉన్నవి, దొరకడం

లేదు. దారి బాగుచేసుకొని, కొద్దికొద్దిగా ముందుకు వస్తున్నది క్రేను. మరొకటి రెండు వేగన్లనను తీసిన తరువాత క్రేనుకు మరి దారి దొరకదు.

మూర్తి అంతచ''యస్ బాస్!'' అన్నాడు అబ్రహాము.

అబ్రహాము చాలా అనుభవమున్న వాడు అన్ని పనులు స్వయంగా చేయగలిగే సామర్థ్యం ఉంది. అన్నిటికన్న అతనిలో ఒక ఉత్తమమైన గుణముంది. ఎప్పుడూ పని అవదని అతను చెప్పలేదు. సాధ్యమయి నంతవరకు పని సకాలంలో పూర్తిచేయిస్తాడు. అప్పటికి ఆ పనికాలేదంటే. మరెవరూ కూడా అంత తక్కువ కాలంలో చేయలేరు. క్రిందను గాంగుమాను నుంచి, పైన చీఫ్ ఇంజనీరు వరకూ ఎవరూ అతని గురించి మరో విధంగా చెప్పుకోరు. అబ్రహాము ఫీల్డులో ఉంటే పనులు చకచకా అయిపోతుం టాయి. అతను నవ్వుతుంటాడు, జోకులు వేస్తుంటాడు. ఒక చోట పార పట్టుకుంటాడు. మరోచోట హామర్‌తో స్లీపర్లమేకులు కొడతాడు. ఒకచోట భుజమెత్తి రైలు పట్టీని మోస్తాడు. అబ్రహాము హెచ్చు మాట్లాడవలసినవాడు కాడు. పని చేయవల సినవాడు.

తరువాత అందరూ బయలుదేరిన చోటికి మూడు గంటలకి చేరుకున్నారు.

రాగానే, కంట్రోలుకి, ఫీల్డు టెలిఫోను తగిలించారు. రైలు దారి పక్కకు పోయే టెలిఫోను తీగెలలో కొన్నిటిని ప్రత్యేకంగా పెయింట్ చేసి ఉంచుతారు. వాటికి ఫీల్డు టెలిఫోను తీగలను తగిలిస్తే డ్యూటీ మీద వున్న కంట్రోలరుతో మాట్లాడవచ్చు.

శ్రీనివాసమూర్తి సైటుచేరిన పదిహేను నిమిషాల నుంచీ టెలిఫోనులో కేశవయ్య కోసం ప్రయత్నించాడు. కాని కేశవయ్య ఎమర్జన్సీ రూములో తెలివిలేకుండా పడిపోయి ఉండడంచేత మాట్లాడడానికి వీలు కాలేదు. ఎంతరాత్రయినా, పరిస్థితిని తనకు తెలి యజేయమని డివిజనల్ సూపరింటెండెంటుగారు అన్నారు.

శ్రీనివాసమూర్తి మళ్ళీ కంట్రోలు ఫోను మీద మాట్లాడాడు.

''హలో!''

''ఎవరది, మూర్తా?''

''అవును, నేనే మాట్లాడుతున్నది. ఒంటి గంట పదిహేను నిముషాలకు నీకు రింగ్ చేశాను. కాని నీ దగ్గర్నుండి రెస్పాన్సు లేదు. అదే అనుకున్నాను. తెలివి తప్పిపడి

వుంటావనుకున్నాను. నీ బంట్రోతు ఏమయ్యాడు? మీ ప్రొబేషనరీ ఎమర్జన్సీ ఆఫీసరే మయ్యాడు?''

''మూర్తి! అవన్నీ గతంలోని విషయాలు. ఒక గంట క్రిందే పాలుతాగాను. శరీరమూ, మనస్సు మళ్ళా దారిలోకి వచ్చాయి. పరిస్థితి గురించి చెప్పు.''

''అన్నిటికన్నా ముఖ్యంగా ముందు చెప్పవలసిన విషయాలు- ఈ రోజు సాయంకాలానికి వేయిమంది లేబరుకు కూలులు పంచి పెట్టాలి. దానికి సరిపోయినంత డబ్బు పట్టుకొని, ఒక అకౌంట్సు ఆఫీసరును సైటుకి పంపించాలి. రెండవది అబ్రహాము చేయవలసిన పని చాల ఉంది. అతనికి సహాయం చేయడానికి ఇద్దరు అసిస్టెంటు ఇంజనీర్లను, నలుగురు పెర్మనెంటు వే ఇన్స్పెక్టర్లను పంపించాలి..... ఇవి చాల ముఖ్యం- వ్రాసుకో?''

''అక్కరలేదు- తరువాత సంగతి చెప్పు''

''ఇక నారాయణన్ గారితో చెప్పవలసినవి, చాలా విపరీతమైన నష్టం సంభవించింది. నలభై వాగనులు ఒకదాని మీదికి ఒకటి ఎక్కిపోయాయి. డీజెలు ఇంజను పడుక్కొంది. డ్రాన్లైను ఎందుకూ పనికిరాదు. మనం ఆధారపడవలసింది ఆప్లైన్ మీదనే. అదేనా మధ్యలో ఇంజను పడడం చేత కొంత శ్రమ కలిగిస్తుంది. ఇంజను ఎత్తడం తప్పని సరి అవుతున్నది. ఒక అప్లైను మాత్రం బాగుచేసి ప్రత్యేకమైన జాగ్రత్తతో రాత్రి తొమ్మిది గంటల నుంచీ రైళ్ళు నడవవచ్చు. రెండు లైన్లూ మామూలుగా పనిచేయడానికి మరో వారం రోజులు పడుతుంది. కాబట్టి రద్దు చేసిన అన్ని రైళ్ళను తిరిగి నడపడం కన్న, చాల కొద్దిరైళ్ళను, ముఖ్యమయిన వాటిని మాత్రమే నడిపితే రైలు దారికి మరమ్మత్తు వేగంగా చేయవచ్చు. రాత్రి మద్రాసు పోయే గ్రాండ్ ట్రంక్ ఎక్సప్రెస్‌తో రైళ్ళ రాకపోకలు తిరిగి మొదలవుతవి.''

''మూర్తీ! చాల బాగుంది. నారాయణన్ గారిని లేపి వివరాలు చెప్తాను.''

''సరిగ్గా 7 గంటలకు సైటుకి దగ్గిరలో జీప్ ఒకటి ఏర్పాటు చేయాలి. దానిలో నేను వరంగల్ హాస్పిటల్‌కి పోయి స్టాఫ్‌ని స్వయంగా చూసిరావాలి. కాజీపేట డి.ఎమ్ యీ. కి చెప్పు అతని జీపుసైటుకి పంపమను.''

''మంచిది మూర్తీ! ఇంటికి ఏమేనా కబురా?''

''ప్రస్తుతానికి ఏమీ లేదు.''

2.4. ఆదివారం-4 గంటలు- తెల్లవారుఝామున- కాజీపేట.

వెంకట నారాయణకు తెల్లవారు ఝామున నాలుగు గంటలకో మంచి కల వచ్చింది. అతను రాత్రి నిద్ర పోయేసరికి ఒంటిగంట అయింది. అతను చాల చక్కని విషయాలను ఆలోచిస్తూ నిద్రపోదామను కున్నాడు. కాని డ్రైవరు ఆది నారాయణ పరిస్థితి అటు వంటిపనికి అడ్డు వచ్చింది.

వెంకటనారాయణ మూడు సంవత్సరాల నుంచి బ్రహ్మచర్యవ్రతం నిష్ఠతో పాలిస్తున్నాడు. పెరియనాయకి కువాయత్ వెళ్ళిపోవడంతో అతనికి స్త్రీవలన లభించే సుఖం కేవలం భావనలోనే నిలిచిపోయింది.

భార్య పోయిన అయిదు సంవత్సరాల వరకు అతను ఇటువంటి పరిస్థితులలోనే బ్రతికాడు. జీవితం మీద అతనికి ఆసక్తి పోయింది. కొడుకు చదువుకుంటూ ఉండేవాడు. ముసలి తల్లి, తలచెడిన అక్కగారు ఇల్లునడిపిస్తూ ఉండేవారు. చేసినంత సేపు ఉద్యోగంలో మునిగిపోయేవాడు. ఇంటి దగ్గిర పెట్టినది తిని తిరిగేవాడు. అతనికి ఏమి చేయాలో తెలిసిందికాదు.

అతనికి చిన్నప్పటినుంచీ ఒకే విధమైన చింతన. లోకంలో తప్పులు చేయకుండా, న్యాయంగా బ్రతికేవారిని భగవంతుడు రక్షిస్తాడని అతను నమ్మాడు. బాగా చదువుకున్నవాడు. చిన్నప్పుడు పల్లెటూరిలో తండ్రి ఉపనయనం చేసిన దగ్గర నుంచి సంధ్యావందనం చేస్తున్నాడు. రాత్రి పూట భగవద్గీత పారాయణ చేస్తున్నాడు. హాస్యానికి కూడా ఒకరిని నొప్పించి మాట్లాడ వలసినవాడు కాడు. తనకు దొరికిన భార్యను గాఢంగా ప్రేమించాడు. ఆమె తోడిదే లోకమనుకున్నాడు. ఆమె చనిపోయిన తరువాత అతని లోకమే మారిపోయింది.

వేళకు భోజనం, ఉండడానికి మంచి యిల్లు, జేబుల నిండా ఆర్జించడానికి తగిన ఉద్యోగం, శ్రమపడి సంపాదించుకున్న ఆరోగ్యం, అనుభవించడానికి అందమైన భార్య వున్నవాడు అదృష్టవంతుడే. కాని ఈ అదృష్ట చక్రానికో ఇరుసు ఉంది. ఆమె భార్య, ఆ ఇరుసు విరిగిపోవడంతో ఆ చక్ర భ్రమణమే నిలిచినట్లయి, అతని జీవితమే అస్తవ్యస్తమయింది.

ముప్పై అయిదేళ్ళకే బ్రతుకు తెల్లవారి నట్లయింది.

వెంకట నారాయణకు ఏదో చెప్పలేని చింత మనసును పీడించుకుని తినడం

మొదలయింది. దానితో ఆహార విహారాలలో అశ్రద్ధ, ఆరోగ్యం దెబ్బతింది. ఉద్యోగం మీద ఉత్సాహం తగ్గిపోయింది. అతనికి కడుపు నొప్పి పట్టుకొంది. అన్ని రకాల వైద్యాలు చేయించాడు. స్పెషలిస్టులను కలిశాడు. డబ్బు ఖర్చుపెట్టాడు. కాని రోగం తగ్గలేదు. ఒకొక్కరు ఒకొక్క పుండు పుడుతున్నాదన్నారు. డ్రైవరు ఉద్యోగమే విడిచిపెట్టవలసి ఉంటుందన్నారు. రోజురోజుకీ పరిస్థితి క్షీణించడం మొదలుపెట్టింది.

ఒక నాటి సాయంకాలం వెంకటనారాయణ ఆకారం చూసి ఆదినారాయణ కళ్ళంట నీరు పెట్టుకున్నాడు. వెంకట నారాయణ ఆజానుబాహువు. మంచి విగ్రహ పుష్టి కలవాడు. బలమైనవాడుకూడా, మండు టెండలో కూడా ఒకరోజైనా అనారోగ్యం లేకుండా ఇంజనులలో పనిచేసి నడిపించాడు. అటువంటివాడు పని అంటే భయపడు తున్నాడు. ఎవరికీ ముఖం చూపించలేకపోతున్నాడు. అప్పుడు ఆదినారాయణ మద్రాసులో పెరంబూరు నర్సింగ్ హోము అడ్రసు ఇచ్చాడు. అక్కడ డాక్టరు వెంకటాచారి పది సంవత్సరాలు అమెరికాలో సర్జనుగా పనిచేసి, మద్రాసులో స్వంత నర్సింగ్‌హోము తెరిచాడు. అతని దగ్గిర ఆధునికమైన పనిముట్లు, అద్దంవంటి ఆపరేషను థియేటరు ఉన్నాయి. అతను తొందరపడి ఆపరేషను చేయడు. ఒకవేళ ఆపరేషను చేయవలసి వస్తే, అతనికన్న గొప్ప సర్జను ఈ ప్రాంతాలలో లేడు.

మద్రాసు వేళ్ళేముందు స్నేహితులకు, బంధువులకు ఆఖరుసారి పీడ్కోలు చెప్పి, రైలెక్కాడువెంకటనారాయణ. అతడు చేయనిదొక్కటే, లాయరును పిలిచి వీలునామా వ్రాయడం.

మద్రాసు వచ్చి నర్సింగుహోములో వెంకటనారాయణ చేరాడు. డబ్బుకి లోభం చేయకుండా డార్మట్రీలో కాకుండా స్పెషలు రూము తీసుకున్నాడు. అక్కడ వారం రోజులు అతనిని అబ్జర్వేషనులో ఉంచారు. వెంకటాచారిగారికి నలుగురు అసిస్టెంటు డాక్టర్లున్నారు. స్పెషలు రూముకి పగలు ఒక నర్సు, రాత్రి ఒక నర్సు ఉండేవారు.

అతను నర్సింగ్ హోములో చేరగానే వేయి రూపాయలు కట్టాడు. స్పెషలు రూము, భోజనం, మందులు, టెస్టులు అన్నీ అందులోనే. ఒక వారం రోజులకు వెంకట నారాయణ నర్సింగ్‌హోముకు పాతవాడయాడు.

రాత్రి పనిచేసే నర్సు రంగనాయకి. రంగనాయకికి ఏభైసంవత్సరాల పైబడ్డ వయసు. తెల్లని మనిషి. కొంచెం స్థూలంగా వుంటుంది. చిన్న మీసకట్టు- దళసరి కళ్ళద్దాలు. ఆమె మూర్తీభవించిన డిసిప్లిన్- మందు ఇవ్వడం, భోజనం పెట్టడం. నిద్రపోవడానికి

లైట్లు ఆర్పడం, ఉదయం సరిగ్గా అయిదు గంటలకు నిద్రలేపి దంత ధావనాదులు చేయించి టెస్టులకు పేషెంటుని తయారుచేయడం. ఈ పనులన్నీ గడియారానికున్న సెకండ్ హాండుని అనుసరించి నడుస్తాయంటే అతిశయోక్తి కాదు. ఈ కత్తిసాము అడుగున ఆమె హృదయంలో అమృత భాండముందని, రోగులను స్వంత బిడ్డల వలె చూసుకుంటుందని అందరికీ తెలుసు. ఆమె పట్ల వెంకట నారాయణకు భయం కన్నా భక్తి హెచ్చుగా ఉండేది.

పగలు పనిచేసే నర్సు ముందే ఉద్యోగానికి వచ్చేది. ఆమె అయిదుగురు పేషెంట్లను చూసేది. రాత్రి ఆమెకూడా ఆ విధంగానే ఆచరించేది. పెరియనాయకి వయసులో పెద్దదేమీ కాదు. పాతిక సంవత్సరాలు మించని వయసామెది. మనిషి ఒడ్డూ పొడవూ వుండేది. పొడవుకు తగిన శరీరం పాలమీగడవంటి రంగు, ఆమె ముఖం మీద తిలకం దిద్దుకొనేది. వైష్ణవులేమో, ఆమె అందం కొట్టవచ్చినట్లుండేది.

స్పెషలు రూములో చేరిన వెంకట నారాయణ అనే పెద్ద మనిషికి పెరియనాయకి చక్కదనం తెలిసిరాలేదు. ఆ నర్సింగ్ హోమ్‌లో వదంతి ఉంది. పెరియనాయకి కోసం పేషెంట్లు వచ్చి నర్సింగ్ హోమ్‌లో చేరతారని. అటువంటి పెరియనాయకి అందాన్ని గమనించనివాడు ఒక్క వెంకట నారాయణే.

పగటి పూలు, ఉదయం వేళల్లో ఎక్సురేలు తీయడం, బేరియం మీలు టెస్టు చేయడం, నెత్తురు పరీక్ష మొదలైన వన్నీ పెరియనాయకి దగ్గిరగా వుండి చేయించేది. మధ్యాహ్నం భోజన సమయం, కొంచెం విశ్రాంతి తీసుకున్న తరువాత తిరిగి వెంకట నారాయణ గదిలోకి వచ్చేది. మూడవ అంతస్తులో ఉన్న తన గది కిటికీలోంచి, దిగువను వెడల్పైన రోడ్డు మీద పోతున్న బస్సులను, కారులను, ఎడతెరిపి లేకుండా వడుస్తుండే జనాన్ని చూసి, ఆమె వచ్చి పక్కను నిలుచున్నదనేనా గుర్తుతెలియని మనిషిని ఈ లోకంలోకి తీసుకొని రావడానిక చిన్నగా దగ్గేది ఆమె.

''సారీ! నారాయణగారూ! మిమ్మల్ని డిస్టర్బు చేసినట్లున్నాను.'' పెరియనాయకి చిరునవ్వుతో పలికేది.

వెంకటనారాయణ సిగ్గుపడిపోయేవాడు.

''లేదండి''

''ఏంవో తీవ్రంగా ఆలోచిస్తున్నారా?''

పెరియనాయకి చక్కని తెలుగు మాట్లాడుతుంది.

''లేదండీ!''

''జీవితంలో సుఖాలు వస్తాయి. అంతకు రెట్టింపు కష్టాలు వస్తాయి. సుఖాలు చాలా తొందరగా గడిచిపోతాయి. కష్టాలు మాత్రం కలకాలం కాపురముంటాయి. పెద్ద లేమంటారంటే సుఖము, కష్టమూ రెండూ ఈ మనస్సు నిర్మించుకున్న పరిధులు. జీవిత మంటే కష్టాలలో సుఖించడమే.''

వెంకటనారాయణ మతిపోయిన వాడివలె ఆమె ముఖంలోకి చూశాడు. ఆమె మాటలు ఎంత తియ్యగా ఉన్నాయి. ఆమె చెప్పిన సత్యం ఉపనిషత్తులలో ఉన్నదేమో?

పెరియనాయకి అతని ముఖంలో కలిగిన మార్పులు గమనించి సంభాషణ మార్చి వేసింది.

''చూశారా! ఈ బొమ్మల పుస్తకాలు. మా డాక్టరుగారు వీటినన్నింటినీ అమెరికా నుంచి తెచ్చారు. అక్కడి రంగుల దృశ్యాలను చూడండి! ఆ ఎత్తైన భవనాలను చూడండి. అక్కడి వారికి ఏదో ముందు చూపే!

''మా పెద్ద డాక్టరుగారంటారు. అక్కడి వాళ్ళు మనకన్న రెండుపందల సంవత్సరాలు ముందుకు పోయారని. మనకు, వారికి ఒక విషయంలో మాత్రం తేడా వుందని ఆయనే ఒప్పుకుంటారు. అక్కడి వాళ్ళు భౌతికమైన సంపదల కోసం, శారీరకమైన సుఖాలకోసం, పేరు ప్రఖ్యాతల కోసం, ధనార్జన కోసం, ప్రపంచ దేశాలలో ప్రప్రథమంగా ఉండడం కోసం యుద్ధపు పందాలలో ముందుకురకడం కోసం విశేషంగా శ్రమిస్తారు. కాని వారికి భారతీయుల అధ్యాత్మికౌన్నత్యం లేదంటారు మా డాక్టరుగారు''.

వెంకటనారాయణ ఆమె ముఖంలోకి ఆశ్చర్యపోయి చూస్తున్నాడు. ఆమె ఏవో పరమ సత్యాలు చాల తేలికగా చెప్తున్నది. తాను బడిపిల్లాడి వలె ఆసక్తితో వింటున్నాడు.

పెరియనాయకి అతని ముఖంలోకి చూసింది. అతను తన మాటలకు మనసు అమ్ముకున్నాడు.

ఆమె మళ్ళా ప్రసంగం మార్చింది.

''అప్పుడే నాలుగు గంటలు కావస్తున్నది. ఏదీ ఈ రెండు మాత్రలు వేసుకొని, మందు తాగండి!''

తరువాత పెరియనాయకి తక్కిన పేషెంట్ల దగ్గిరికి వెళ్ళిపోయింది.

ఆ విధంగా పెరియనాయకి రోజు రోజుకి దగ్గరగా వచ్చింది. అది ఆమె స్వభావంలో భాగమా? ఆమె సంస్కారంలోని విశిష్టతా? అతనికేమీ అంతుబట్టలేదు.

ఎవ రేమి చెప్పినా వెంకటనారాయణ తన స్నానం మానలేదు. సంధ్యా వందనం

మానలేదు. రాత్రి రంగనాయకితో రభస జరిగినా భగవద్గీత చదవందే నిద్రపోయేవాడుకాడు.

మొదటి ఆరు రోజుల వరకు సర్జన్ వెంకటాచారి వెంకటనారాయణ విషయంలో కల్పించుకోలేదు. ఏడవ రోజున అన్ని టెస్టుల రిజల్టులు, ఎక్సురేలు అన్నీ పట్టుకొని వచ్చి వెంకటనారాయణతో రెండు గంటల కాలం గడిపారు. తరువాత వెంకటనారాయణను విశ్రాంతి తీసుకోవలసిందని చెప్పి తాను వ్రాయవలసిన రిపోర్టు సావకాశంగా మధ్యాహ్నం రెండు వరకు వ్రాసుకొని వెళ్ళిపోయారు.

సర్జను వెంకటాచారిగారు మధ్యాహ్నం రెండుగంటలకు లంచికి పోయి మళ్ళా సాయంకాలం అయిదున్నరకు వస్తారు. అప్పుడు రోగులకు సలహా లివ్వడం, కొత్తవారిని పరీక్షించడం మొదలయినవి చేస్తారు.

పెరియనాయకి రెండు గంటల భోజనం చేస్తుంది. మూడు గంటల వరకు నర్సుల గదిలో విశ్రాంతి తీసుకుంటుంది. మూడు గంటలనుంచి ఒక గంట వెంకటనారాయణతో గడిపి నాలుగు గంటలనుంచి తన డ్యూటీలలో సర్దుకుంటుంది.

ఆ రోజు వెంకటనారాయణ గదిలోకి రాకముందు పెరియనాయకి వెంకటాచారి గారి ఛాంబరులోకి వెళ్ళింది. అతని టేబిలు మీద ఒక కేసు వుంది. సాధారణంగా రోగుల కేసులన్నీ ఆయన అలమరాలో పెట్టి తాళం వేస్తారు. తొందరలో వెళ్ళిపోయినట్లున్నారు. కేసు టేబిలుమీదే వుండిపోయింది.

పెరియనాయకి కేసు తీసింది. అది మరొకరిదైతే ఆమె చదివి వుండేది కాదు. వెంకటనారాయణ పేరు మీదను కనిపించగానే మరేమీ ఆలోచనలేకుండా కేసు తీసి డాక్టరు గారు చివరను వ్రాసిన నాలుగు వాక్యాలు చదివింది. ఆమె మరి ఆ వార్తను తన గుండెల్లో దాచుకోలేక పోయింది.

ఆరోజు వెంకటనారాయణ రెండుగంటల సేపు వెంకటాచారిగారితో గడిపి బాగా అలిసిపోయాడు. తేలికయైన భోజనం చేసిపడుక్కున్నాడు. పెరియనాయకి వచ్చేసరికి అతను నిద్ర నుంచి లేవలేదు.

''నారాయణగారూ!'' పెరియ నాయకి రెండవసారి కొంచెం గట్టిగా పిలిచింది. దానితో అతను తుళ్ళిపడి లేచాడు.

''నారాయణగారూ! మీకో శుభవార్త.''

వెంకటనారాయణ వెర్రిగా ఆమె ముఖం లోకి చూశాడు.

''పెద్ద డాక్టరుగారు మీకు ఆపరేషను అక్కరలేదన్నారు. వుండు చాలా తొలి

దశలో ఉందని, వేళపట్టున భోజనం, కొంచెం విశ్రాంతి, ఒక పదిహేను రోజులు మందులు తీసుకుంటే పూర్తిగా నయమవుతుందని వ్రాశారు. ఈ విషయాలు ఆయనే మీకు రాత్రి వచ్చినప్పుడు చెప్తారు. నాకు కేసు చూసే అవకాశం దొరకడం నుంచి ఆ మంచి మాట ముందుగా మీకు చెప్పాలని తొందరపడ్డాను.''

వెంకటనారాయణ ఉన్నపాళంగా మంచం మీద నుంచి ఉరికాడు. ఆ మంచి మాట చెప్పిన పెరియనాయకిని బాహువులలోకి తీసుకున్నాడు. హృదయానికి దగ్గిరగా అదుము కున్నాడు. ఆమె కళ్ళల్లోకి చూస్తూ పెదవుల మీద బలంగా ముద్దుపెట్టుకున్నాడు. పెరియనాయకి కూడా పాడుమైన దేమో అతని కౌగిలి నిండిపోయిందామె. అయిదు నిమిషాలు ఈ విధంగా ఒళ్ళు తెలియని పరిస్థితిలో ఇద్దరూ ఉండిపోయారు. అప్పుడే అతను తన మెడలో ఉన్న బంగారు గొలుసు ఒంటి పేటది ఆమె మెడలో వేశాడు.

వెంకటనారాయణ ఆమెకు దూరంగా నేరం చేసినవాడిలా నిలబడ్డాడు. అతని కళ్ళ నిండా నీరు.

''పెరియనాయకి గారూ! నేను చేయరాని తప్పు పని చేశాను. మీకు వివాహం కాలేదు. చేతితో తాకని, వాసన చూడని, పూవు వంటి వారు. ఆరునెలల బట్టి నా మనస్సును కొరుక్కు-తింటున్న అనుమానం నివృత్తి చెందడంతో, ఆనందం పట్టలేక చిన్న కుర్రాడిలా ప్రవర్తించాను. ఏ అయ్య చేతిలోనో పెట్టాలని మీ అమ్మగారు అనుకుంటున్నారు. ఎంత తప్పు పని చేశాను. క్షమించమని మిమ్మల్ని అడిగే అర్హత కూడా నాకు లేదు. నాకు వచ్చిన ఏళ్ళు ఎవరికి వచ్చాయి? ఎంత మర్యాద తక్కువ పని చేశాను!''

ఆత్మస్తుతి వినడానికి పరమ అసహ్యంగా ఉంటుంది. ఆ విధంగానే ఆత్మ నింద వినడం కూడా ఆనందాన్ని కలిగించదు. పెరియనాయకికి వెంకట నారాయణ మీద మొదటి నుంచీ సానుభూతి ఉండేది.

''నారాయణ గారూ! ఇది మీరు అనుకొని చేసిన తప్పుపని కాదు. కొన్ని పనులు చాల ఆకస్మికంగా, ఆ క్షణంలో కలిగే మానసికో-ద్రేకం వలన సంభవిస్తాయి. వాటి మీద మనకు అధికారం లేదనడం సమంజసం. మీరు ఇంతగా నాగురించి బాధపడకండి. కూర్చోండి. మరికొంత సేపు మీతో మాట్లాడాలి.''

వెంకటనారాయణ బుద్ధిగా మంచంమీద కూర్చున్నాడు.

''మీరు ఎన్ని రోజులు సెలవు పెట్టి వచ్చారు.''

''నెల రోజులు.''

''అంటే ఇంకా ఇరవై రోజుల వరకు సెలవు వుందన్న మాట.''

''అవును''

''నే నొక సలహా యిస్తాను. మీకు అభ్యంతరం లేదుకదా?''

''ఎప్పటికీ లేదు. మీరంటే నాకు చాల గౌరవం.''

''మీరు ఈ ఇరవై రోజులు మా యింట్లో వుండండి. నేను కూడా ఇరవై రోజులు సెలవు పెడతాను. మీకు వేళకు భోజనం, మందులు అన్నీ ఏర్పాటు చేస్తారు. మీరు ఆరోగ్యంగా వున్న తరువాత సంతుష్టమయిన మనస్సుతో ఇంటికి వెళ్ళిపోదురుగాని.''

''మీకు ఇబ్బంది కలిగించడం నాకిష్టం కాదు. నేను విజయవాడ నుంచి వచ్చిన రోగిని మీరు నాయందు చాలా దయదలచి ఈ వారం రోజులయి నాకు అన్నివిధాల సహాయం చేశారు. మీరు చేసిన మేలుకి కృతజ్ఞుడుగా ఉండకుండా, మీ యింట్లో మకాం వేసి, మీకు చెడ్డపేరు తెప్పించడం నా అభిమతం కాదు.''

''నారాయణగారూ! లోకంలో మంచితనానికో హద్దు వుంది మీ వంటి హద్దు దాటిన మంచి వాళ్ళను నేనెప్పుడూ చూడలేదు. ఒక్క- విషయం నన్ను చెప్ప నిస్తారా!''

''తప్పకుండా!''

''మీరంటే నాకు చాలా గౌరవం- ఈ మాట నా హృదయం లోంచి వచ్చినది. మీ ఆరోగ్యం కోలుకోడానికి నా ఆతిథ్యం స్వీకరించండి. నాకు కేకేనగరులో రెండు బెడ్ రూముల బంగళా ఉంది. మా తండ్రిగారు అన్ని సదుపాయాలు ఉండేటట్లు కట్టించారు. కొబ్బరిచెట్లు, సంపెంగ చెట్లు ఒక వేపు వున్నాయి. చామంతులు, గులాబులు ఉన్నాయి. మరొకవేపు కాయగూరల మొక్కలు వేశాను. మా తండ్రిగారు పోయి అయిదు సంవత్సరాలయింది. మా అమ్మగారు, నేను ఇద్దరమే ఆ యింట్లో ఉంటున్నాము. మీకు కావలసినంత స్వేచ్ఛ మా యింట్లో దొరుకుతుంది. మా అమ్మగారు హెడ్‌మిస్ట్రెస్‌గా పనిచేస్తున్నారు. కాబట్టి మీరు నామాట కొట్టి వేయక మా యింటికి రండి.''

వెంకటనారాయణ తన చెవులనే తాను నమ్మలేకపోయాడు. ఇటువంటివి నవలలు మొదలైన పుస్తకాలలో జరుగుతాయి. నిజ జీవితంలో వారంరోజుల పరిచయానికి తన మీద జాలిపడి, ఆదరంతో తన ఇంటికి రమ్మన్న మంచిమనసు గలవారెవరు దొరుకుతారు?

సాయంకాలం వెంకటాచారి గారు అయిదున్నరకు రాగానే ముందు వెంకట నారాయణనే పిలిపించారు.

''నారాయణగారూ! ఒక్క- విషయం మీగురించి చెప్పవలసి ఉంది. రోగం బాధ

కన్న, రోగమున్నదనే బాధకు మీరు లొంగిపోయారు. జీవితంలో వెలుగు వేపు నడిచి, ఆత్మ విశ్వాసం కలిగి ఉంటే చాల రోగాలు తొందరగా నయమవుతాయి. మీకు ప్రమాదకరమైన రోగమేదీ లేదు. రెండువారాల పాటు మందు తీసుకొని విశ్రాంతి తీసుకుంటే మీకు కడుపులోని బాధ పూర్తిగా తగ్గిపోతుంది. మీకు ఆపరేషను అక్కరలేదు. మందుల గురించి వ్రాసి ఇస్తాను. మీరు ఏ సంశయం లేకుండా వెళ్ళి పోవచ్చు.''

వెంకటనారాయణ వెంకటాచారిగారికి నమస్కారం చేసి అతను వ్రాసి యిచ్చిన మందు చీటి తీసుకున్నాడు. అన్ని టెస్టులకి, మందులకు, బసకు అయిన ఖర్చుపోను అతనికి మూడు వందల రూపాయలు తిరిగి వచ్చాయి. రాత్రివచ్చే నర్సు రంగనాయకికి మిఠాయి కొని యిచ్చాడు. డ్యూటీ దిగిపోయిన పెరియనాయకితో టాక్సీ చేయించుకొని కేకే నగరు వెళ్ళిపోయాడు.

ఆ మరునాటి నుంచి వెంకట నారాయణ జీవితంలో నూతనాధ్యాయం మొదలయింది. పెరియనాయకి ఇరవై రోజులు, అన్న ప్రకారమే సెలవు పెట్టింది. తల్లితో చెప్పింది. వెంకటనారాయణ ఇరవై రోజుల పాటు ఆ ఇంటిలో ఉంటాడని. ఆమె కూతురి మనసులో అభిప్రాయం తెలుసుకుందో ఏమో దేనికీ అడ్డు చెప్పలేదు.

ఒక వారంరోజులు వెంకట నారాయణ పెరియ నాయకి పెట్టిన భోజనం తిని, మందులు వేసుకున్నాడు. పెరియనాయకి చాలావిషయాలు చెప్పింది. తనకుగల ఆదర్శాలు, తాను లోకంలో గమనించిన లోటు పాట్లు, తన చిన్నచిన్న కోరికలు సరదాలు, ఎన్నో విషయాలు అతనితో చెప్పింది. పరిచయం అధికమయి వాళ్ళిద్దరూ బీచికి, పార్కులకి, సినిమాలకు చెట్టాపట్టాలు వేసుకొని తిరిగారు.

ఒక రోజు పెరియ నాయకి తన మనసులోని అభిప్రాయం వెలిబుచ్చింది. ప్రస్తుతానికి వివాహ ప్రసక్తిలేదు. ఉద్యోగంలో చేరినప్పుడు అయిదు సంవత్సరాల వరకు వివాహ మాడనని బాండులో సంతకం పెట్టింది. కాని ఆమెలోని స్త్రీత్వం అతని బిగికౌగిలిలో మేలుకొంది. విశ్వాసపాత్రుడైన పురుష వృషభుడు దొరికినప్పుడు ఆమె నిరాకరించ లేకపోయింది.

వాళ్ళిద్దరూ యౌవనంలోని మాధుర్యం అనుభవించారు. వరదలెత్తిన నదివోలె కోరికలు పరవళ్ళు తొక్కగా శరీరాలు ఈయవలసిన మహాసుఖాన్ని రుచి చూడడం మొదలు పెట్టారు. ఈ కోరికకు మొదలే ఉంటుంది. అంతమన్నది లేదు. రోజురోజుకి అది పెరుగుతుంది.

వెంకట నారాయణకు కొత్త జీవితాన్ని ప్రసాదించింది పెరియనాయికి. అతను పూర్తిగా మారిపోయాడు. వేసే ప్రతిఅడుగు ఉత్సాహంతో ముందుకు వేశాడు. ఆమె కోసం అలమటించిపోయాడు. ఉద్యోగంలో చేరాడు. మన్ననలు పొందాడు, ప్రమోషనులు తీసుకున్నాడు. ఆమె ముఖంలోని చిరునవ్వు తోవ చూపిస్తుంటే ముందుకు నడిచాడు.

ఆమె మద్రాసులోనే ఉద్యోగం చేసింది. విజయవాడనుంచి ప్రతీవారం పెరియనాయకి దగ్గరికి అతను వేళ్ళేవాడు. అటువంటి పెరియనాయకిని మూడు సంవత్సరాలు విడిచి ఉండడం అతనికి మూడు యుగాలు గడిపినట్లనిపించింది. వెళ్ళేటప్పుడు ఢిల్లీలో ఉన్నారు. ఆమె ప్లేను ఎక్కినదగ్గర నుంచి అతను రోజులు లెక్కవేస్తున్నాడు

వెంకటనారాయణకు ఉదయం నాలుగు గంటలకో కలవచ్చింది. అతను పాలమ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో విజిటర్సు లేంజిలో కూర్చున్నాడు. కువాయత్ నుంచి రావలసిన ప్లేను వచ్చేసింది. కస్టమ్సు నుంచి ఒకరూ ఒకరూ వస్తున్నారు.

ఒకామె, అచ్చంగా అదే పొడవు, అదే నడక కాని ఈమె గొనుతొడుక్కుంది. ఎత్తు మడమల జోడువేసుకుంది. జుత్తు కత్తిరించుకుంది. పొంగిన వక్షం, వంపులు తీరిన శరీరం అదే. అతను కళ్ళప్పగించి చూస్తున్నాడు. ఆమె తన వేపే వచ్చి, తనని దాటిముందుకు వెళ్ళి పోయింది? ఎప్పటికీ పెరియనాయకి రాదు. బహుశా ఆమే కాబోలు అలా మారి పోయింది. తనుకూడా గుర్తు పట్టలేక పోయింది. అతనికి దుఃఖం కట్టలుగా తెంచుకుని వచ్చింది. ఏమీ తోచడం లేదు. అందరూ వచ్చేసినట్లున్నారు. అతని సహనం అడుగంటిపోయిన వేళలో తన వేపే వస్తున్న స్త్రీ కనిపించింది. ఆమె మెల్లిగా నడిచి వస్తున్నది. కంచి పట్టుచీర కట్టుకున్నది. తిలకం దిద్దుకొంది. ఆమె కళ్ళల్లో సిగ్గు దొంతరలు, నడిచివచ్చి ఆమె తన బాహువులలో చేరింది. ఆమె ముఖం చేతుల్లోకి తీసుకొని పెదవులపై ముద్దు పెట్టుకున్నాడు. ఆ చేతులలో ఉన్నది పెరియనాయకి ముఖం కాదు. అప్పుడే ఉదయించిన సూర్య కిరణాలకు మేలుకొన్న తామర పువ్వు. పెదవులకు కింజల్కాలు తగిలాయి.

ఆమె ఎవరూ కాదు పద్మప్రియ, పెరియ నాయకి. అతని కళ్ళు పద్మపత్రాల వలె విచ్చుకొన్నవి. కల కరిగిపోయింది.

2.5 ఆదివారం- 6 గంటలు- ఉదయం- కేసముద్రం సైటు

కేసముద్రం సైటు దగ్గిరికి ఉదయం అయిదు గంటల నుంచే దగ్గిర నున్న పల్లెటూరి వాళ్ళు రావడం మొదలు పెట్టారు. ఉదయం మూడు గంటలకు సైటు చేరిన స్ట్రాఫ్ స్పెషలు నుంచి వేయిమంది దిగారు. వాళ్ళలో గాంగ్‌మనులు అధిక భాగం- మేస్త్రీలు తక్కువమంది. ఇనస్పెక్టరులు ఒకరిద్దరూ.

స్పెషలు దిగినవెంటనే వాళ్ళు పారలు, గునపాలు, రైలు పట్టీలు, స్లీపర్లు, మేకులు మొదలైన సామగ్రి బండి నుంచి దింపుతున్నారు. పెట్రోమాక్సులైట్లు వెలిగించారు. గాస్ కటింగ్ సిలెండర్లు, పైపులు దించారు.

పని తాడలపూసపల్లి నుంచి మొదలయింది. రమారమి చాల రైలు పట్టీలు వంగిపోయాయి. వీలయినన్ని ఫిష్ ప్లేటులు విప్పి, పట్టీలను దూరం చేశారు. ముందు చెడిపోయిన అప్‌లైను పట్టీలు విప్పడం చేశారు. తరువాత మంచి పట్టీలను మోసుకొని పక్కనే వుంచారు. కొంతపని అయేసరికి తెల్లవారిపోయింది. స్ట్రాఫ్ స్పెషలు వెనక్కు వెళ్ళిపోయి. సిండరు స్పెషలు సైటు దగ్గిరికి వచ్చింది.

పల్లెటూరి లేబరు ఆరో గంటకు మన్నెండు వందల మంది పనిలో చేరారు. తట్టలు పట్టుకొని కొంత మంది వాగనుల నుంచి సిండరు మోసుకొచ్చి మేస్త్రీలు పోయమన్న చోట పోయడం మొదలుపెట్టారు. కొంతమంది పక్క-పక్కలనే వున్న మెల్లంగిని ఏరుకొచ్చి దారిమీద వేశారు. స్త్రీలు, బాలురు, వయసులో మున్న వాళ్ళు, వయసు మళ్ళిన వాళ్ళు అందరూ పనిచేస్తున్నారు.

మూర్తి ఆ జనసందోహాన్ని చూసి చెప్పలేని గుండె నిబ్బరం తెచ్చుకున్నాడు. జనశక్తి చాల గొప్పది. దానిని నేర్పుగా ఉపయోగించుకుంటే ఎంతటి భారీ అయిన పని అయినా సునాయాసంగా పూర్తిచేయవచ్చు.

అబ్రహాము విశ్వరూపం ధరించాడు. అతను డివిజనులో అన్ని చోట్ల పని చేశాడు. అందరు పనివాళ్ళను అతడెరుగును. ఎవరు కష్టపడి పనిచేయవలసినవారో, ఎవరు నమ్మకంగా కనిపెట్టుకొని వుంటారో, ఎవరు కావలసిన ఏర్పాటులు చేయగలరో, ఎవరు సామాను దొంగతనం కాకుండా కాపాడగలరో- వారి నందరిని గుంపులుగా ఏర్పాటు చేసి పనులు బెత్తాయించాడు. కొంత మంది స్వయంగా పనిచేయడానికి శక్తి వంతులు కాకున్నా, వారు ఇతరుల చేత పని చేయించడంలో సిద్ధహస్తులు, అటువంటి వారు పల్లెటూళ్ళ నుంచి వచ్చిన శ్రామికుల చేత పనిచేయించడం మొదలు పెట్టారు.

సిండరు స్పెషలు వెనుకను రిలీఫ్ ట్రెయిను నిలబడి వుంది. ఆరుగంటలకు శ్రీనివాసమూర్తి తన సెలూనుకి వెళ్ళి కాలకృత్యాలు ముగించి. స్నానం చేసి, బట్టలు వేసుకొని వచ్చాడు.

వెలుతురు వచ్చినకొద్దీ పనిపాటులు చురుకుగా సాగాయి. శ్రమజీవుల కోసం టెంపరరీగా టీ దుకాణాలు అక్కడవెలిశాయి. జంగిళ్ళలో తినుబడి సామాను అమ్మడం మొదలుపెట్టారు.

తెల్లవారినకొద్ది అక్కడ జరుగుతున్న మహాయజ్ఞం చూడడానికి ప్రజలు తండోప తండాలుగా రావడం మొదలు పెట్టారు. గుట్టలుగా పడిన పంచదార కరిగిపోయింది. గోధుమలు కొట్టుకుపోయాయి. బంగాళా దుంపలు, ఉల్లిపాయలు కుళ్ళి భరించలేని దుర్గంధం చిమ్ముతున్నాయి. అవి డీజిలు ఆయిలు తేలుతున్న నీటిలో ఎందుకూ ఉప యోగానికి పనికిరాకుండా పోయాయి. ఒకరూ, ఇద్దరూ ముసలివాళ్ళు, పిల్లలు సంచులు పట్టుకొని వాటిని ఎత్తుకుంటున్నా, అక్కడ కాపలా కాసే సిబ్బంది చూసీ చూడనట్లు ఊరుకుంటున్నారు.

మూర్తి అబ్రహాము భుజంమీద చెయ్యి వేశాడు.

''అబ్రహాం! పని చాల చురుకుగా జరుగుతున్నది. ఈ పద్ధతిలో పనిచేస్తే పది గంటల వేళకు డీజిలు ఇంజను పడిపోయిన చోటు వరకు వెళ్తాము. అక్కడ పని కొంచెం దెబ్బతింటుంది.''

''చెప్పండి మూర్తీ!''

''రైలు లైను వేస్తుంటే వాటిమీద సిండరు వాగనులు నడుపుతూ ముందుకు వస్తారు. ఈ విధంగా పడిపోయిన యింజను వరకూ లైను పూర్తిచేయవచ్చు. తరువాత సిండరు వాగన్లను వెనుకకు తీసుకొని పోయి, క్రేను ముందుకు తెచ్చి, దాని వెనుక సిండరు వాగన్లను నిలపాలి. ఇంజను యెత్తి పక్కకు పెట్టేవరకు ట్రాక్ పని కొంత దెబ్బ తింటుంది. ఒకసారి ఇంజనును ఎత్తి పక్కకు పెట్టామో, అప్పటి నుంచి మీపని నిరాటంకంగా ముందుకు సాగుతుంది. మీకు సహాయం చేయడానికి ఇద్దరు అసిస్టెంటు ఇంజనీర్లు, నలుగురు ఇన్స్పెక్టర్లు, పదిమంది మేస్త్రీలు పదిగంటలయేసరికి వస్తున్నారు. మధ్యాహ్నం రెండుగంటలయేసరికి కాన్వాన్ రోడ్డుమీద నుంచి వస్తుంది. ఒక అకౌంట్సు ఆఫీసరు, ఇద్దరు కాష్ క్లార్కులు గ్రామాల నుంచి వచ్చిన లేబరుకి కూలీ ఇస్తారు. మీరు షెడ్యూలుకన్న ముందుగా పనిచేసుకుపోతున్నారు. మిమ్మల్ని అభినందించటంతప్ప మరేమీ చేయ్యలేను.''

''థాంక్స్''!

''అబ్రహాం! నేను ఏడు గంటలకు జీపులో బయలుదేరి వరంగల్ హాస్పిటల్‌కి వెళ్ళి వస్తాను. డ్రైవరు అతని అసిస్టెంటు ఇంకా ప్రమాద పరిస్థితిలోనే వున్నారు. తొమ్మిది గంటలకు హైదరాబాదు నుంచి స్పెషలిస్టులు వస్తున్నారు. వారందరితో మాట్లాడి, ఆది నారాయణ కుటుంబంతో మాట్లాడి, తిరిగి పదకొండు గంటలకు సైటుకు వస్తాను. అంతవరకు ఫోర్మెన్ సింహాచలం కథ నడిపిస్తాడు.''

పక్కనే నిలబడ్డ సింహాచలం ముందుకు వచ్చాడు.

''యస్ సార్! చెప్పండి సార్!''

''సింహాచలం! చెప్పిన విషయాలు జాగ్రత్తగా వినండి. పది గంటలకు డీసెల్ ఇంజను వరకు ఇంజనీరింగ్ ట్రాకు వేస్తారు. అప్పుడు ఈ సిండరు వాగన్లను తీసి, స్టీమ్ క్రేను ముందుకు పెట్టి మార్షల్‌చేయించాలి. సైటులోకి క్రేను పదిగంటల ముప్పై నిమిషాలకు వుండాలి. తరువాత సీతారామయ్య క్రేను పని చేస్తాడు. మీరు దగ్గర వుండి, గర్డర్లు బిగించి, చాల జాగ్రత్తగా, మెల్లమెల్లగా డీసెలు ఇంజను ఎత్తి, స్లీపర్లు సపోర్టు పెట్టి నిలబెట్టాలి. నేను సరిగా పదకొండు గంటలకు వస్తాను. ఆ అరగంటలో మీరు పని చేయగలిగితే మంచిదే. ఏ విధమైన అనుమానాలు, ఆటంకాలు వున్నా, పని మొదలు పెట్టడానికి సమయం కాకపోయినా, అబ్రహం గారిని తొందరపెట్టకండి. పదకొండు గంటలకు నేను వచ్చిన తరువాత పని మొదలుపెట్టినా పరవాలేదు. అన్నీ అమకూలంగా వున్నప్పుడు మీరు నిరభ్యంతరంగా పని మొదలు పెట్టండి. మీకు ముప్పై అయిదు సంవత్సరాల అనుభవం వుంది. ఇటువంటి ఆక్సిడెంట్లు ఎన్నో చూశారు. వాటిలో పని చేశారు.''

''అవును సార్!''

''స్టాఫ్‌తో చెప్పండి. వాళ్ళను కలియలేకపోయానని. మధ్యాహ్న భోజనం స్టాఫ్‌తో పాటు సైటులో చేయడం మన ఆనవాయితీ కదా!''

''అవును సార్! అన్నట్టు మరచి పోయాను, కాఫీ తయారుచేసి తెస్తున్నారు సార్!''

''అప్పుడే ఐదు నిమిషాలు తక్కువ ఏడయింది. జీపు వచ్చి రోడ్డు మీదనా కోసం ఎదురుచూస్తున్నది కాఫీ అబ్రహాం గారికి యివ్వండి.''

మూర్తి నడుస్తున్నాడు. రోడ్డు వేపు అతనికి ఎదురుగా కుడిచేతివేపు చిన్న కొండలు

మూడు కనిపిస్తున్నాయి. నిన్న సాయంకాలం అక్కడ విపరీతమైన వర్షం కురిసింది, మేఘాలన్నీ ఒక సుడిలో చిక్కి భూమికి దిగినట్లు వచ్చాయి. తమలో ఉన్నులకొద్దీ నీరు, దాచుకున్నాయి. మేఘాల కడుపులను చీల్చుకొని పడితే, కొండలమీద బండరాళ్ళు దొర్లి, చెట్లు కూలి చిన్న కొండవాగు వెల్లువలై వచ్చి, అంత వేగంతో పోతున్న రైలు బండిని కనురెప్పపాటు కాలంలో కూల్చివేసింది. శాస్త్ర పద్ధతులలో ఆవిర్భవించిన శక్తిని లెక్క కట్టవచ్చు. కాని ప్రకృతి విలయతాండవం చేసి విడుదల చేసిన శక్తిని ఊహలోకి తీసుకోలేరు. అంచనాల నన్నిటినీ అది అధిగమించి ఊహాతీతమైన పరిధులలోకి పోతుంది. దీనిని వారించడానికి మానవ ప్రయత్నాలేవీ కలిసిరాలేదు. ప్రమాదం సూచించే సంకేతాలను ఎన్ని ప్రవేశపెట్టినా ప్రమాదాన్ని నివారించే పద్ధతులను మానవుడు క్రమబద్ధం చేయలేకపోతున్నాడు. ప్రకృతి నిర్దాక్షిణ్యంగా తన బలాన్ని ఒకొక్కప్పుడు రుజువుచేస్తూ వుంటుంది. మానవుడేం చేయగలడు? తల వంచి మొట్టికాయలను తినడం తప్ప.

2.6 ఆదివారం- 8 గంటలు- ఉదయం- గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్-

ఉదయం ఎనిమిది గంటలకు గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెసు చాల సందడిగా వుంది. బేరర్లు బ్రేక్ ఫాస్టు ట్రేలు పట్టుకొని కారిడారులో పరుగెత్తుతున్నారు. వెస్టిబ్యూలు తలుపులు అన్నీ తెరవగా అన్ని కంపార్టుమెంటులకు దారి ఏర్పడింది.

జనార్దన శర్మ రాత్రి చాల వరకు మేలుకొని వున్నాడు. చిత్రలేఖ వచ్చి సంగతులే మేనా చెప్తుందని ఆశపడ్డాడు. పన్నెండు గంటలకు అతనికి జ్ఞాపకం వచ్చింది. రాత్రి పది తరువాత వెస్టిబ్యూలు తలుపులన్నీ మూసివేస్తారని, ఆవిడ మరి చెప్పే అవకాశం లేదని, నిద్రపోవడానికి ప్రయత్నించాడు. అతనికి కళ్ళు మూస్తే ఆకుపచ్చ రిబ్బను కట్టిన గిఫ్ట్ పార్సెలు కనిపిస్తున్నది. దానిలో పది కేజీలు బరువైన టైం బాంబుంది. అది పేలితే కృష్ణా నది బ్రిడ్జి అప్‌లైనుది. మూడుముక్కలు ఆరుచెక్కలు అవుతుంది.

ఈ కుమారరాజావో, కుష్మాండ రాజావో! గ్రహాలమీద పనిపట్టించాడు. జంతు నష్టమేగాని జననష్టం అంతగా వుండదు. జనార్దనశర్మకు నవ్వు వచ్చింది. ఇంతవరకు విషయాలు తెలిసిన తరువాత ఆ బాంబు జాగ్రత్తగా పేలుతుంటే చూడడానికా? అదెప్పటికీ జరగదు. ఈ దేశీయమైన విపత్తు సంభవించకుండా చూడవలసిన బాధ్యత భారతీయ పౌరుడైన తనమీద ఎంతైనా వుంది.

జనార్దన శర్మ ఉదయం అయిదు గంటల నుంచి ఇదే ఆలోచనలో వున్నాడు. కాల కృత్యాలు ముగించి. గడ్డం గీసుకొని కూర్చున్నాడు, చిత్రలేఖ కోసం ఎదురుచూస్తూ చిత్రలేఖ రాలేదుకాని ఇటార్సీ స్టేషను వచ్చింది, రైలాగింది. రుమాలు భుజంమీద వేసుకొని చెప్పులు తొడుక్కొని ప్లాట్‌ఫారమ్ మీదికి దిగాడు, అతను. సోమేశ్వరరావు కళ్ళు నులుముకుంటూ లేచి బెర్తుమీద కూర్చున్నాడు.

జనార్దనశర్మ ఆలోచిస్తూ బుక్‌స్టాలు దగ్గిరకి నడిచాడు. దినపత్రిక ఒకటికొని చంకలో పెట్టుకొని, ప్లాట్‌ఫారమ్ మీద కొంచెంసేపు పచారుచేసి, గాలి పీల్చుకొని, రైలు కదులుతుంటే ఎక్కాడు.

సోమేశ్వరరావు తొందరగా పళ్ళు తోముకొని, ముఖం కడుక్కొని వచ్చాడు. ఇంతలో బేరరు వచ్చాడు.

''సార్! రెండు వెస్టరన్ స్టైల్ వెజిటేరియన్ బ్రేక్‌ఫాస్టులు, ఒక నాన్ వెజిటేరియన్ ఇండియన్ స్టైల్ బ్రేక్ ఫాస్టు, ఒక స్పెషల్ బ్రేక్‌ఫాస్ట్ బిల్లీకి, మరొక నాన్ వెజిటేరియన్ వెస్టరన్ స్టైలు బ్రేక్‌ఫాస్టు మేమ్ సాహెబ్‌గారికి ఏసీ కోచ్ డి-కూపేలో.''

చిన్నమ్మగారు పై బెర్తు మీద నుంచి లేచి క్రిందకు వచ్చింది.

''అమ్మాయిగారు రాలేదు?'' అడిగిందావిడ

సోమేశ్వరరావు జనార్దనశర్మ ముఖం లోకి చూశాడు. జనార్దనశర్మ క్షణం ఆలోచించాడు.

''ఇంకా రాలేదండీ!''

''జిమ్మీ బ్రేక్‌ఫాస్టు వచ్చింది?''

''అదే! బేరరు తీసుకొచ్చి ఇప్పుడే పెట్టాడు. పాలు అవి చల్లారిపోతున్నట్లున్నాయి. కాని జిమ్మీ ఇంకా లేవలేదు కాబోలు'' అన్నాడు సోమేశ్వరరావు.

''సరిగ్గా ఎనిమిదిన్నరకు బ్రేక్‌ఫాస్టు లేకపోతే జిమ్మీ ఉండదు. ఎవరినీ నిలబడనీయదు కూడా!'' అంది చిన్నమ్మగారు.

''అయితే మరో పది నిమిషాలలో చిత్రలేఖగారు వస్తారు.'' అన్నాడు జనార్దన శర్మ నిబ్బరంగా.

''మనుష్యులకు బ్రేక్‌ఫాస్టులు లేకపోయినా ఉండగలరు. కాని బ్రేక్‌ఫాస్టుకి అలవాటు పడ్డ పిల్లి చాల ప్రమాదమైనది. అన్నవేళకు ట్రే ముందర ఉండకపోతే అది కళ్ళు పీకేస్తుంది.'' అన్నాడు సోమేశ్వరరావు.

''చిత్రలేఖ కళ్ళు అది పీకదు. జిమ్మీ చాలమంచి పిల్లి'' అంది చిన్నమ్మగారు.

''అయితే ఆ కుమార రాజా కళ్ళు పీకేయడం తప్పదు.'' అన్నాడు జనార్దనశర్మ ట్రే దగ్గరగా లాక్కొంటు.

సోమేశ్వరశర్మ కూడా ట్రే దగ్గిరగా లాక్కొన్నాడు. క్రీప్ పేపరు రుమాలు తీసి ఒడిలో వేసుకున్నాడు. ఒక ప్లేటులో కారన్ ప్లేక్సు ఉన్నాయి. ఒక ప్లేటులో టోస్టు, వెన్న ఉన్నాయి మరొక ప్లేటులో ఫ్రెంచి ఫ్రైలు, వాటి మీద సమృద్ధిగా పోసిన టమాటా కెచప్ వున్నాయి. మరొక చిన్న ప్లేటులో వెజిటబుల్ కట్‌లెట్, సన్నగా తరిగిన ఉల్లిపాయ చక్రాలు ఉన్నాయి. జగ్గులో పాలున్నాయి. ఫ్లాస్కులో కాఫీ ఉంది. అన్నిటికీ మించి ఇద్దరు మిత్రుల కడుపులలో ఆకలి మిక్కుటంగా ఉంది.

జిమ్మీది గ్రేట్ గురించి కాని, చిత్రలేఖ గురించి కాని వాళ్ళు ఎదురుచూడలేదు. బండి నడిపించారు.

చిన్నమ్మగారు బాత్‌రూమ్‌లోకి వెళ్ళారు. సరిగ్గా ఎనిమిది గంటల ముప్పైనిమిషాలకు, దగ్గిరగా చేరవేసిన తలుపు తోసుకుని చంకలో జిమ్మీని పెట్టుకొని చిత్రలేఖ లోనికి వచ్చింది.

చిత్రలేఖ గాఢమైన ఊదారంగులోనున్న ముఖమల్ మాక్సీ తొడుక్కుంది. మెడ దగ్గిర కట్టిన ఎరుపు పట్టుతాడు మాక్సీ రంగుకి భిన్నంగా ఉండి, తెల్లటి చిత్రలేఖ కంఠసీమకు అందమిస్తున్నది.

శర్మ, రావు వెన్న రాసిన రొట్టెముక్కలు కొరుకుతూ చిత్రలేఖ వేపు చూశారు.

''ఫైన్! జిమ్మీ బ్రేక్‌ఫాస్టు వచ్చింది! ఓ మైలిటిల్ ఏంజల్! రా! నీ పారిడ్జి, బిస్కత్తులు, మిల్కు..... రా! రా!.....''

ముందు చిత్రలేఖ జిమ్మీ బ్రేక్‌ఫాస్టు ట్రే మీద కాగితం రుమాలు తీసి, దాని మెడలో కట్టింది. తరువాత ట్రే దాని ముందు ఉంచుతే, జిమ్మీ కళ్ళు మూస్తూ తినడం మొదలుపెట్టింది.

తరువాత చిత్రలేఖ సావకాశంగా కూర్చుంది.

సినీమాల్లో ఒకొక్కప్పుడు ఎందుకోగాని ఏక్షన్ ఫ్రీజ్ చేస్తారు. నటించేవారు ఎటువంటి పరిస్థితులలో ఉంటే అలాగే కొన్ని క్షణాలు ఉండిపోతారు. ఆ విధంగానే బ్రెడ్ నోట్లో పెట్టుకున్న వారిద్దరూ, దవడలేనా ఆడించకుండా చిత్రలేఖను చూస్తూ ఉండిపోయారు.

''జనార్దనశర్మగారూ! మీకు కలిగిన అనుమానం సహేతుకమైనది'' అంది చిత్రలేఖ.

అంతవరకూ నోట్లోనున్న రొట్టెముక్కలను కొరకడం మానివేసిన ఇద్దరూ వాటిని తీసి ప్లేట్లలో ఉంచారు.

జనార్దనశర్మ లేచివచ్చి ఆమె పక్కను కూర్చున్నాడు. సోమేశ్వరరావు ట్రే ప్రక్కను పెట్టి, ఆమెకు దగ్గిరగా వంగాడు. చిత్రలేఖ మొదటినుంచీ చివరవరకు తాను కుమార రాజా నుంచి విన్న రహస్య వృత్తాంతమంతా వాళ్ళిద్దరికీ నివేదించింది.

ఉండుండి వింత శబ్దాలుచేస్తూ జిమ్మీ బిస్కత్తులు తింటున్నది.

జనార్దన శర్మ గుండెల్లో రాయిపడింది. విషయం నిర్ధారణ అయే వరకు, తరువాత చేయదగిన పని గురించి అతను అట్టే ఆలోచించలేదు. ఒకసారి నిజం తెలిసినతరువాత ఏమి చెయ్యాలన్నదే సమస్యగా మిగిలింది.

అదృష్టవశాత్తు ఆలోచించడానికి తగినంత వ్యవధి ఉంది. ఆ గిఫ్ట్ పార్సెలును చాల నేర్పుగా వెలుపలికి నడిపించాలి. ఇది కత్తిమీద సాము వంటిది. చిత్రలేఖ ముందుగానే హెచ్చరించింది. ఏపాటి చిన్న పొరపాటు జరిగినా బాంబు సంగతి బయట పడితే- ఆమె భవిష్యత్తు సర్వనాశనమవుతుంది. మూడవకంటి వాడికి తెలియకుండా చేయాలి. చెల్లెలి మంచికోసమని బావగారి దుశ్చేష్టితాలను ఆమోదించవలసి వస్తున్నది.

చిత్రలేఖ ఇద్దరి ముఖాలు చూస్తున్నది. జిమ్మీ బ్రేక్‌ఫాస్టు అయిపోయినట్లుంది. వింత చప్పుడులు రావడం మానివేశాయి. జిమ్మీ ఒక పక్కకు వెళ్ళి కూచుంది. చిన్నమ్మ గారు బాత్‌రూమ్ నుంచి వచ్చి చిత్రలేఖను పలకరించి, బ్రేక్‌ఫాస్టు ట్రేను తీసుకొని మీద బెర్తు ఎక్కిపోయారు.

రైలు చాలావేగంగా వెళ్తున్నది. అడవులూ, కొండలూ పారిపోతున్నాయి. అంతా నిశ్శబ్దంగా ఉంది.

చిత్రలేఖ కొంచంసేపు ఆలోచిస్తూ కూర్చుంది. అనిశ్చయమైన పరిస్థితులను అంతం చేయడానికి ఆమె నిశ్చయించినట్లుంది. మెల్లిగా వంగి సోమేశ్వరరావు ప్రక్కను, ఎదురు బెర్తుమీదనున్న న్యూస్ పేపరు తీసింది.

చిత్రలేఖ పేపరు చూస్తూ మూడు నిమిషాలయిందో లేదో ఒక్కసారి గాభరా పడుతూ అరిచింది.

''శర్మగారూ! రావుగారూ! కొంపమునిగిపోయింది.''

''ఏమిటేమిటి?'' ఇద్దరూ ఒక్కసారే అడిగారు.

''ఈ వార్త చదివారా! ఎంత ఘోరమయిందో!''

''నేను పేపరు కొని తెచ్చాను, కాని వార్త లేవీ చూడలేదు.''

''చాలా పెద్దరైలు ప్రమాదం సంభవించింది. కాజీపేటకు, డోర్నకలుకు మధ్యను ఒక కిలోమీటరు వరకు డబల్‌లైను పాడయిపోయింది. గూడ్సు ట్రెయినుకు ప్రమాదం జరిగింది. డ్రైవరును, అతని అసిస్టెంటును వరంగల్ గవర్నమెంటు హాస్పిటల్‌లో తీవ్రమయిన గాయాలతో చేర్చారు. ఈ ప్రమాదం వలన ఢిల్లీకి, మదరాసుకి, హైదరాబాదుకి, విజయవాడకు రైళ్ళ రాకపోకలు ఆగిపోయాయి. చాల రైళ్ళను రద్దు చేశారు. ముఖ్యమైన వాటిని వేరే మార్గాల గుండా పంపుతున్నారు.''

''ఏదేది పత్రిక యివ్వండి.''

జనార్దనశర్మ పత్రిక తీసుకొని మళ్ళీ చదివాడు, సోమేశ్వరరావు చదివాడు.

''అయితే మనం ట్రాప్ అయిపోయాం'' అంది చిత్రలేఖ.

''బాంబు ఏ బ్రిడ్జి క్రింద పేలనక్కరలేదు. అది మన పక్కనున్న ఏసీ కోచిలోనే పేలుతుంది.'' అన్నాడు జనార్దనశర్మ.

''పదండి దానిని ఒకసారి చూచివద్దాం. తరువాత.....'' అన్నాడు సోమేశ్వరరావు.

''ప్రస్తుతం సమస్య ఈ బాంబుని ఎలా వదిలించుకోవడమనేది'' అంది చిత్రలేఖ.

''మనరైలు కాజీపేటవరకు ఏ ఆటంకం లేకుండా పోతుంది. తరువాత చుట్టూ తిరిగి మద్రాసు చేరడంగాని, లేకపోతే కాజీపేటలో ఆగిపోవడంకాని జరుగుతుంది. కాజీపేటలో మాతోపాటు పనిచేస్తున్న అసిస్టెంటు ఇంజనీరు ఉన్నాడు. నాగపూరు నుంచి అతనితో మాట్లాడి ఈ పార్సెలును ఏ పాడుబడ్డ బావిలోనో పారవేయిస్తాను. చిత్రలేఖా! ఈ ఏర్పాటు బాగుందంటారా?''

''అద్భుతంగా ఉంది!'' అంది చిత్రలేఖ.

''ముందు ఆ గిఫ్ట్ పార్సెలును మరొక సారి చూసి జాగ్రత్తపరచాలి'' అన్నాడు సోమేశ్వరరావు.

ముగ్గురూ ఏసీ కోచి లగేజిరూము వేపు వెళ్ళారు. కటకటాల తలుపులకు తాళం వేసి జంబులింగం ఎక్కడికో వెళ్ళాడు. ఆకుపచ్చ రిబ్బను పార్సెలు ఉండవలసిన చోట, చక్కగా వార్నిషు వేసిన రెండు ఢిల్లీ బుట్టలు ఉన్నాయి.

''పార్సెలు ఏదీ!'' ముగ్గురూ ఒక్కసారే అన్నారు.

ఇంతలో జంబులింగం వచ్చాడు.

జంబులింగం లగేజిరూము తలుపు తాళం తీశాడు.

అప్పుడు చిత్రలేఖ అరవంలో మాట్లాడింది.

''జంబులింగం! ఇక్కడ ఈ ఎయిర్ కండిషనర్ పానల్‌పక్కను పింక్‌కలరు రాపరు మీద ఆకుపచ్చ రిబ్బను కట్టిన గిఫ్ట్ పార్సెలు నిన్నను నువ్వే కూపేలోంచి తెచ్చిపెట్టావు కదా! మరి ఇప్పుడది కనిపించదేం!''

''నాకేం తెలుసు! ఏమయిపోయిందో!''

''దానికి కాళ్ళు వచ్చి నడిచిపోయిందంటావా?''

''దానికి కాళ్ళువచ్చి నడిచిందో, రెక్కలు వచ్చి ఎగిరిందో నాకు తెలియదు.''

''ఆ పార్సెలు నిన్నను నువ్వు ఇక్కడ పెట్టినట్లు గుర్తుందా?''

దొరగారు మామామను తిట్టి తలుపులు తియ్యలేదు.

''గుర్తు లేకేం! మీరే చెప్పారు కదా! మీదను పెట్టవద్దు, కిందను పెట్టమని, మీరు చెప్పినట్లే క్రిందనే ఈ మూలకు పెట్టాను.''

''మరేమయింది?''

''మీ సామానుకోసం రాత్రల్లా ఇక్కడ పడుకున్నాను. మీకు గుర్తుందో లేదో! ఆగ్రా కంటోన్మెంటు స్టేషనులో రైలునడుస్తుంటే ఇద్దరు మనుష్యులు ఈ రెండు ఢీల్లీ బుట్టలు పట్టుకొని ఎక్కారు. వాళ్ళని, వాళ్ళ మీసాలను చూస్తుంటే అదోలా అనిపిస్తుంది. మా మామ, ఆ యిద్దరు పెద్ద మనుషులూ మీ కూపే తలుపులు కొట్టారు. ఈ రెండు ఆపిల్‌పళ్ళబుట్టలు రజియా బేగమ్ కోసం వారి చెల్లెలు సుల్తానా పంపించారట. వాటిని మీ సామాను దగ్గిర పెట్టి ఆ పెద్దమనుషులిద్దరూ గ్వాలియరు వరకు నాతో ఇక్కడే కూర్చొని ఆపిల్‌పళ్ళు కోసి యిచ్చి మాట్లాడుతూ కాలం గడిపారు. గ్వాలియరు అవుటర్ సిగ్నల్ దగ్గిర రైలాగితే నేను చూడడానికి లేచాను. మళ్ళీ నేను వచ్చేసరికి వాళ్ళూ లేరు, ఆ పార్సెలూ లేదు. అప్పటికే రైలు గ్వాలియర్ స్టేషన్‌కు వచ్చేసింది. ఏ పక్కనుంచి దిగిపోయారో; గ్వాలియరు స్టేషనులో చూసి తరువాత వచ్చిపడుక్కున్నాను. మీ సామానులకు కాపుగాసిన నాకు రాత్రంతా నిద్రలేకుండాపోయింది.''

వారి ముగ్గురి ముఖాల మీద కత్తి వేటుకు నెత్తురు చుక్క లేదు.

''డామిట్! కథ అడ్డంగా తిరిగింది!'' అన్నాడు జనార్దన శర్మ వెనుకకు నడుస్తూ.

''కథ కొత్తమలుపు తిరిగింది'' అన్నాడు సోమేశ్వరరావు చాల సీరియస్‌గా.

2.7. ఆదివారం- 10 గంటలు- పగలు- వరంగలు.

రిక్షావాడికి డబ్బులిచ్చి, రెండు పళ్ళ పొట్లాలు రెండు చేతులలోను పట్టుకొని, వెంకటనారాయణ వరంగలు గవర్నమెంటు హాస్పిటలు లోకి ప్రవేశించాడు. తరువాత భోగట్టా చేసి ఇంటెన్సివ్‌కేర్ యూనిట్ వేపు నడిచాడు. వరండాలో పెద్ద బొట్టుపెట్టుకున్న ఆదినారాయణ భార్య సత్యవతి కనిపించింది. ఆమెకు కొద్ది దూరంలో గడ్డం పెంచిన తురక అతను కనిపించాడు.

వెంకటనారాయణను చూడగానే సత్యవతి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. చీరచెంగుతో కళ్ళు ఒత్తుకుంది ఆవిడ.

''అక్కయ్యగారూ! మీరు ధైర్యంగా వుండాలి!'' అన్నాడు వెంకటనారాయణ.

''అవును, నేను అధైర్యపడితే మీ బావగారు బెంగపెట్టుకుంటారు.''

''ప్రస్తుతం ఎలా వుంది?''

''ప్రమాదం తప్పింది. ప్రార్థన ఎనిమిది వరకు ఆశలేకపోయింది డి ఎమ్ యి దొరగారు, మూర్తిగారట ఆయన ఎనిమిదికి వచ్చారు. సికిందరాబాదు ఉస్మానియా హాస్పిటలు నించి ఇద్దరు స్పెషలిస్టులు వచ్చారు. అందరూ పరీక్ష చేసి, ముక్కులో పెట్టినగొట్టాలు తీసి, పాలుత్రాగడానికి ఇచ్చారు. అబ్దుల్ ఖాదరు కూడా బ్రతికి బయట పడ్డాడు. నేను కొంచెం సేపు మాట్లాడాను మీ బావగారితో. అట్టేసేపు మాట్లాడనివ్వరు. ఒకపారి చూసిరండి, తరువాత మాట్లాడుకోవచ్చు.''

వెంకటనారాయణ డ్యూటీలో వున్న నర్సుతో చెప్పి, పేషెంట్లను మాట్లాడించనని వాగ్దానమిచ్చి, పళ్ళు పట్టుకొని లోపలికెళ్ళాడు.

పక్కపక్కలనున్న మంచాలమీద ఆదినారాయణ, అబ్దుల్ ఖాదర్ పడుక్కున్నారు. ఆక్సిజన్ సిలెండర్లు మంచాల పక్కనే వున్నవి. సైడ్ టేబిళ్ళమీద పూలగుత్తులు ఇద్దరి మంచాల పక్కన వున్నవి. ఆపిల్ పళ్ళు రెండు రెండు కూడా కనిపిస్తున్నాయి.

డ్రైవరు, అతని అసిస్టెంటు కళ్ళప్పి చూస్తున్నారు. వెంకటనారాయణ పెద్దవాడైన ఆదినారాయణకు నమస్కరించాడు. ఆదినారాయణ సీరసంగా తల ఊపాడు. అబ్దుల్ ఖాదర్ చేతులు జోడించి వెంకటనారాయణకు నమస్కారం చేశాడు.

మాట్లాడవద్దని సైజ్ఞచేసి, పదినిమిషాలు వాళ్ళిద్దరినీ చూస్తూ వెంకట నారాయణ నిలబడిపోయాడు. వాళ్ళకు పళ్ళు ఇచ్చి, నమస్కారం చేసి వెలుపలికి వచ్చాడు.

సత్యవతి, ఖాదరు తండ్రి అతని కోసం ఎదురుచూస్తున్నారు.

''దొరగారు మూర్తిగారు చాల సహాయం చేశారు. ఆయనే పూలగుత్తులు తెచ్చి యిచ్చారు. పళ్ళుకొని యిచ్చారు. ఎంతటి ఖరీదైన మందులేనా వాడమని డాక్టర్లతో చెప్పారు. తరువాత హాస్పిటల్‌సూపరెండెంటుతో మాట్లాడారు. ఆదినారాయణగారు చాల సీనియర్ డ్రైవరని, అతనికి అన్ని విధాల సహాయం చేయమని చెప్పారు. అబ్దుల్ ఖాదరు గురించి అవే మాటలు చెప్పారు. మధ్యాహ్నం ఖాజీపేట నుంచి కాషియరు వచ్చి, అయిదేసి వందల రూపాయలు ఒక్కొక్కరికి ఇవ్వడానికి ఏర్పాటు చేశామని చెప్పారు. నాకు, బడే మియాఁకు ధైర్యం చెప్పారు. ఆయనను చూసిన తరువాతే వాళ్ళు బ్రతుకు ముఖం పట్టారని నాకనిపిస్తుంది.''

మాట్లాడుకుంటూ వాళ్ళు ఖాళీగా వున్న చివర బెంచీల దగ్గిరకు నడిచారు. వెంకట నారాయణ, అతని పక్కను ఖాదర్ తండ్రి కూర్చున్నారు. సత్యవతి కొద్ది దూరంలో నిలబడింది.

అప్పుడు అబ్దుల్ ఖాదర్ తండ్రి, కొడుకు ద్వారా విన్న సంగతి చెప్పాడు.

కృష్ణా ఎక్స్‌ప్రెస్ గార్డుతో సిగ్నల్ ఎక్సేంజి చేసిన తరువాత ఖాదరు తన సీటులోకి వచ్చి కూర్చున్నాడు. అతనికి ఎడమచేతి వేపునున్న మూడు కొండలు కనిపిస్తున్నాయి. చాలజోరుగా వీస్తున్న గాలి ఒక్కసారి తగ్గిపోయింది. వర్షం ఏనుగు తొండాలతో కురుస్తున్నది. ఆ మూడు కొండలమీదనున్న మేఘాలు యమని మహిషాల వలె శిఖరాల మీద కేంద్రీకరించాయి. ఒక మెరుపు కారు, వంద మెరుపులు ఒక్కసారి జడపాయల వలె ఆ కొండల మీద మెరిశాయి. అప్పటికి చీకటి ముసురుకుంటున్నది. డ్రైవరుగారు హెడ్‌లైటు వేశారు. ఆ హెడ్‌లైటు వెలుతురులో వాళ్ళకు నమ్మలేని దృశ్యమొకటి కనిపించింది. ఎడమచేతివేపున్న కొండల నుంచి వేయి పడగలను విప్పిన ఆదిశేషువుకు మల్లే ఒక మహా ప్రవాహం బండరాళ్ళను దొర్లించుకుంటూ వస్తున్నది. బడేమియాఁ కురానే

కాక భాగవత రామాయణాలు కూడా చదివాడట. ఆ వరద పెద్ద శబ్దం చేస్తూ రెండు ట్రైన్లను తుడిచిపెట్టింది. ఆదినారాయణ యమర్జన్సీ బ్రేకు వేశారట. కాని ఆ ట్రెయిను ఆగే లోపలే ప్రమాదం జరిగిపోయింది. పాడయిన పట్టాలమీద యింజను దూసుకు పోయింది. ప్రవాహం చేసిన గండిలో పక్కకు పడిపోయింది. దాని మీద నుంచి ప్రవాహం పొంగి పారింది.

వర్షం మూలాన ఇంజను తలుపులు, కిటికీలు బిగించుకొని వాళ్ళిద్దరూ లోపల కూర్చున్నారు ఒక్కసారి ఇంజను ఒరిగి వాలిపోతుంటే ఆదినారాయణ ఇంజను ఆపు జేసాడు. ఎలక్ట్రిక్ స్విచ్‌లన్నీ ఆర్పివేశాడు. డీసెలు యింజను చాల వేడిగా వుంటుంది. ఒక్కసారి కాబిన్ లోపలికి చీకటి వచ్చింది, క్రమంగా కిటికీ సందులోంచి నీరు లోపలికి రావడం మొదలుపెట్టింది. ఆ నీరు వేడిగా వుంది. పైకి పోతున్న పొగ కూడా కొంత లోపలికి వచ్చింది. ఇంజను, డ్రైవరు వేపు వాలిపోయింది. ఆయన మీద ఖాదరు పడిపోయాడు. అపుడు ఆదినారాయణ భగవంతుడి స్మరణ చేస్తున్నాడు. ఖాదర్ డ్రైవరును ఎత్తిపట్టుకోడానికి ప్రయత్నించాడు. క్రమంగా నీరు మొలబంటి వచ్చింది. లోపలిగాలి పైకిపోతూ ప్రాణవాయువులు తోడేస్తున్నట్లనిపించింది. ప్రతీ నిమిషం వారి ఆలోచనలు మొద్దుబారిపోయాయి. ఉన్న తక్కువగాలి డీజిలు ఆయిలు కంపుకొడుతున్నది. నీరు హెచ్చుగా ఉండి, క్రమంగా చల్లబడిపోయింది. ఆ నీరు, చీకటిలో కాబిన్‌ను నింపివేసింది. మృత్యువు తప్పదని వాళ్ళు నిశ్చయానికి వచ్చారు. జుత్తు పీక్కున్నారు తలలు బాదుకున్నారు. ప్రాణవాయువు తగ్గినగాలిలో, నీటిమట్టం హెచ్చుతుంటే, తెలివి తప్పుతుంటే మృత్యువుతో వాళ్ళిద్దరూ పోట్లాడారు. ఇటు వంటి పరిస్థితులలో కిటికీ గాజు తలుపులు పగలగొడుతున్న శబ్దం వచ్చింది. ఎవరో లోపలికి దిగుతుంటే ఇద్దరూ కూలిపోయారు. తిరిగి వారికి ఉదయం నాలుగు గంటలకి హాస్పటల్‌లో తెలివి వచ్చింది.

బడేమియాఁ చేతులెత్తాడు ఆకాశానికి.

''ఖుదాయే రక్షించాడు. ఆ రాముడే అడ్డుపడ్డాడు.''

సత్యవతి కళ్ళంట ధారాపాతంగా నీళ్ళు కారుతున్నాయి.

వెంకటనారాయణ వెక్కివెక్కి ఏడుస్తున్నాడు.

డాక్టర్లు రాత్రంతా శ్రమపడ్డారు. కడుపులు కడిగి, ఆక్సిజన్ పెట్టి ఇంజక్షన్‌లు ఇచ్చి శక్తివంచన లేకుండా పనిచేశారు.

సత్యవతి మంగళసూత్రం బలమో, ఖాదరు తల్లిదండ్రుల అదృష్టమో, ఇద్దరూ బ్రతికి బయటపడ్డారు.

విజయవాడ రన్నింగ్ స్టాఫ్, ఆదినారాయణ గురించి అబ్దుల్ ఖాదరు గురించి ఆందోళన పడుతున్నారు.

ఈ సంగతి సత్యవతి చెప్తే, మూర్తిగారు వెంటనే కంట్రోలు ఫోనులో ఈ విషయం విజయ వాడకు తెలియజేస్తామన్నారు.

వెంకటనారాయణ లేచాడు. అతని మనస్సు తేలికపడింది. ఆదినారాయణను, సత్యవతిని, ఖాదరును, అతని తండ్రిని చూశాడు. అడ్డుపడ్డ భగవంతుడికి నమస్కరించాడు. వంగి సత్యవతి పాదాలకు నమస్కరించాడు. ఆమె అతని పెద్దక్క.

2.8 ఆదివారం- 11 గంటలు- పగలు- కేసముద్రం సైటు.

రైల్వే మెకానికల్ ఇంజనీర్లలో మూడు వర్గాలవాళ్ళున్నారు.

జమాల్ పూరు యూనివర్సిటీకి చెందిన వారు మొదటి వర్గం వారు. బీహారు రాష్ట్రంలో జమాల్ పూరు అన్న నగరముంది. అక్కడ రైల్వే మెకానికల్ ఇంజనీర్లకు శిక్షణ యిచ్చే స్కూలు ఒకటి వుంది. ప్రత్యేకంగా హై ఇంటలిజెన్సు కోషెంటు వున్న గౌరవనీయుల పుత్రులను సర్వీసు కమీషనులో సెలక్టు చేసి అయిదు సంవత్సరాలు వారికి ట్రెయినింగ్ ఇచ్చి, ముద్రవేసి, మెకానికల్ రైల్వే రాజ్యాన్ని పాలించమని విడిచి పెడతారు. వీరికి డిపార్టుమెంటులోని లోటుపాట్లు బాగా తెలుసు ఎవరిని ఏవిధంగా హింస పెట్టాలో, ఏవిధంగా అణచాలో బాగా తెలుసు. వీరు సునాయాసంగా రాజ్యాలని ఏలగలరు. ఎటువంటి మొండిపనివాళ్ళనైనా తికమకలు పెట్టగలరు. నిత్యం అలజడి వుంటేనేకాని వారు ఉద్యోగం చేసి నట్లవదు. చాల సామాన్యమైన పరిస్థితులనే, ప్రెస్టైజ్ కోసమని, కొండంతలుగా చేసి సమ్మెలు సృష్టించగలరు. తమ జాతికి చెందని ఇతర ఆఫీసర్లతో గర్వంగా తలలెత్తుకుని తిరుగుతారు. సంప్రదాయానికి విరుద్ధమైన కొత్త మార్పులకు వీరు దూరంగా వుంటారు. రైల్వేకి ఉత్తరాధికారులు వీరేనని అనుకుంటారు. క్రమంగా ఉన్నత పదవులకు చేరుకుంటారు. బోర్డు వరకు సులువుగా పోతారు.

ఇటువంటి వర్గానికి చెందిన ఆఫీసరు పర్యవేక్షణలో, కాదు కాదు, ఆఫీసరు సైటులో లేనప్పుడు, ఈ రెండో ప్రమాదం జరిగిందని అనుకోండి. అప్పుడేమయేదో తెలుసా! ఆ ఆఫీసరు, సైటులోనే సింహాచలాన్ని సస్పెండు చేసి వుండును. అన్ని చోట్లకు వైరులు, వైర్‌లెస్ మెసేజులు పంపించి వుండును. దెబ్బతగిలిన వాడిని, అశ్రద్ధగా పనిచేసి నందుకు, దుర్భాషలాడి వుండును. రైల్వే అంతా పడిపోతుంటే, కృష్ణుడుగోవర్ధనగిరిని ఎత్తినట్లు, తన ప్రజ్ఞా పాటవాలతో నిలబెట్టినట్లు మొదటి వర్గానికి చెందిన ఆఫీసరు భావిస్తాడు. పెద్ద దుమారం లేవెత్తి, ప్రమాదం సంభవించడానికి తాను కాక మిగిలిన వాళ్ళందరూ కర్తలని వేయినోళ్ళతో చాటుతాడు, అతను అంతయుక్తివంతుడు. ఇతనికి పైనున్న పెద్దల ఆశీర్వచనాలు ఎప్పుడూ రక్షగా వుంటాయి. అతని చుట్టాలు పదవులలో చాలమంది వుంటారు.

ఇక మూడో వర్గానికి చెందిన వాళ్ళున్నారే. వారు కేవలం రాంకుల నుంచి వచ్చినవారు. మూడవ తరగతి ఉద్యోగాలలో మూడు వంతుల జీవితం గడిపి ఆఖరి దశలో రెండవ తరగతి ఆఫీసర్లుగా ప్రమోషను తీసుకున్నవారు. వీరిలో చాల మందిది డిగ్రీలు లేని పాండిత్యం. మొదటి వర్గానికి చెందిన ఆఫీసర్లు పందెపు గుర్రాల జాతికి చెందితే, ఈ మూడవ వర్గానికి చెందిన వారు కంచరగాడిదల జాతికిచెందినవారు. ఈ కంచరగాడిదలు మామూలు కంచరగాడిదలు కావు. కొండచరియలలో మీదకు బరువులతో ప్రయాణం చేయవలసినవి. కాలు జారినా, బరువు అధికమైనా ఇవి క్రుంగి పాతాళానికి పడిపోతాయి. ఈగాడిదలు గట్టిగా అరవలేవు కూడా! పైవాళ్ళంటే భయం! ఉద్యోగమంటే భయం. ఉద్యోగం పోతుందంటే భయం. ప్రమోషను వస్తుందంటే భయం. తమ కళ్ళ ఎదుట, తమ క్రిందను పనిచేసిన వారిని, తమ మీదికి తీసుకొచ్చి, వారి క్రింద పనిచేయవలసివచ్చిన చేటు కాలానికి వీరు భయపడతారు. పైనున్న ప్రబుద్ధులు ఈ గుండెలు లేని ఆఫీసర్లను ఒక్క క్షణంలో పైకి ఎత్తలేకపోయినా, వారి కాన్ఫిడెన్షల్ రిపోర్టులను పాడుచేసి సంవత్సరాల తరబడి పైకి రానీయకుండా చేస్తారు. జరుగుతున్న అన్యాయాలకు వాళ్ళు ప్రత్యక్షసాక్షులు. వీరికి భోషాణానికి లోటు లేదు. ఈ ఆఫీసర్ల లోటుపాట్లు తెలిసిన కింద వాళ్ళు కడుపార నవ్వుకుంటారు. బహుశా భోగం ఆఫీసర్లది కాకపోయినా, వారి భార్యలను మాత్రం అది పీడించుకొని తింటుంది. కొంచెం పెద్ద యిల్లు ఆఫీసరుకు దొరుకుతుంది. ఆ యింట్లో వుండవలసినవారు అతని భార్య, పిల్లలు, చాల అభిమానంతో వచ్చే చుట్టాలు. ఆ యింటికి తెరలు, యింటిలో ఫర్నిచరు, పార్టీలు

అన్నీ ఆఫీసరుగారి స్టేటస్‌కి తప్పనివి. ఆఫీసరెప్పుడూ ఏ యూర్శులోనో, ఏ షెడ్డులోనో, ఏ మీటింగులోనో, ఏ యూనియన్ లీడర్లు చేసిన ఘోరావ్‌లోనో, క్లేమ్స్‌లో పడ్డ ఊగలా, కొట్టుకుంటాడు. అతను ఎంత పనిచేసినా బాగులేదనే సైవాడు తిడుతుంటాడు. తిట్లు సైకి తిట్టనిది అతని భార్య వచ్చిన చుట్టాలకు, స్నేహితులకు భర్త గుణగణాలు, అతని పేరు ప్రఖ్యాతుల గురించి విసిగిపోకుండా చెప్తుంది ఆమె.

అటువంటి మూడవ వర్గానికి చెందిన ఆఫీసరు సమక్షంలో, ఎందుచేతనంటే అతను సైటు విడిచి ప్రాణం పోయినా బయటికి పోడు, ఇటువంటి ప్రమాదం జరిగిందనుకోండి. అతను రెండు చేతులలోను తల మోదుకుంటాడు. వెంటనే ఉద్యోగం పోయిందనుకుంటాడు. ప్రక్కనున్న ప్రతి మనిషిని చూసి తన శత్రువుగా భావించుకుంటాడు. ఆహా! తన భార్య కడుతున్న చీట్లన్నీ ఆ క్షణం నుంచీ బందుకదా అనుకుంటాడు. ఆదివారంనాడు డిన్నరుకి ఆహ్వానించిన ఆఫీసర్లలో ఒకడు కూడా తన ఇంటికి రాడని వాపోతాడు. ఇంతెందుకు లోకమంతా అతనికి చీకటి అయి, అందరూ ముఖాలకు మసిపూసుకున్న రాక్షసులకు మల్లే కనిపిస్తారు.

ఇంతకూ ఒక్క పదిహేను నిమిషాల క్రింద, అంటే పది గంటల నలభై ఐదు నిమిషాలకు సంభవించిన ప్రమాదం అంతగా పరిగణించవలసినదా?

ఇది చాలా క్లిష్టమయిన ప్రశ్న, క్లిష్ట తరం కూడా!

మామూలు పరిస్థితులలో ఇదేమంత గొప్పది కాదు. సాధారణంగా ప్రమాదాలు జరుగుతుంటాయి. పనివాళ్ళకు దెబ్బలు తగులుతుంటాయి. హాస్పిటలుకు వారు పోతుంటారు. సాధ్యమైనన్ని రోజులు ఇంటిపైదు అనుభవిస్తూ సుఖంగా ఉంటారు. పనివాడికి దెబ్బతగిలితే ఒకప్పుడు లాభిస్తుంది కూడా! దెబ్బలకోసం దేవురించే పనివాళ్ళు కూడా ఉన్నారు.

కాని ఇప్పుడు జరిగిన ప్రమాదానికి అన్నీ కాంప్లికేషన్లే.

మత్తాశ్వముల బూన్చి మనుజనాథ
సుతుండు
పురవీథులందున పోవరాదు.

ఇది మొదటి అడ్డు. సీతారామయ్య అనేమెకానిక్కు క్రేను నడిపించడానికి అర్హుడు కాడు. అర్హుడైన కనకరాజు ఇంకా తిరుపతి లోనే ఉన్నాడు. డ్రైవరు లైసెన్సు లేనిదే క్లీనరు బండి నడుపుతే అప్పుడప్పుడు ప్రమాదాలు సంభవిస్తాయి.

సీతారామయ్యది ఏమాత్రం తప్పులేదు.

పదిగంటలకు ముందుగనే అబ్రహాము డీసెలు ఇంజను కోసం లైను వేసి ఇచ్చాడు. ఫోర్మెను సింహాచలం మెరుపులా పనిచేసి, ఉరుములంత కేకలు వేసి, క్రేనును సైటులోకి నడిపించాడు. క్రేను గొలుసులు తగిలించుకొని, నిండు స్టీముతో పది గంటల ముప్పై నిమిషాలకు సర్వసిద్ధంగా ఉంది.

సింహాచలానికి ఎటువంటి అనుమానాలు కలుగలేదు. ఏ విధమైన ఆటంకం ఎదురు కాలేదు.

శుభస్య శీఘ్రమ్ అన్నారు.

దొరగారు రాకముందు పనిచేసి చూపించాలని అనుకున్నాడు సింహాచలం.

క్రేను బరువును ఎత్తేముందు, పక్కలకు ఒరిగిపోకుండా చాల కట్టుదిట్టాలు చేయవలసి ఉంటుంది. క్రేనుకున్న గర్డర్లు పైకి తీసి, వాటి క్రింద ఆధారంగా ఉండడానికి స్లీపర్లు పేర్చి, స్క్రూళ్ళు బలంగా బిగించి, ముందుభాగం గొలుసులతో కట్టి, క్రేను ఎట్టి పరిస్థితులలోనూ పడిపోకుండా కట్టుదిట్టాలు చేస్తారు. వీటినన్నింటిని సింహాచలం తూచా తప్పకుండా పాటించాడు.

డీసెలు ఇంజను బరువు నూటపది టన్నులు. క్రేను అరవై అయిదు టన్నుల వరకు ఎత్తగలదు. కొంచెం కొంచెం ఇంజనును ఎత్తి, దానిక్రింద స్లీపర్లు ఉంచి క్రమంగా దానిని నిలబెట్టాలి. చెప్పవలసివస్తే ఒకటి రెండు అంగుళాల చొప్పున ఎత్తుతూ, పలుచని బల్లలుముందు అడుగున పెట్టి, ఎత్తిన కొలది బలమైన స్లీపర్లు ఉంచుతూ పని చేయాలి.

మొదటి అయిదు నిమిషాలు ఆ విధంగానే ఎత్తడం జరిగింది.

డీసెలు ఇంజను ఏమీ లేచినట్లు అగుపించలేదు.

సింహాచలం అందరి మీదా వెర్రెత్తి పోయాడు. మరేమీ ఆలోచన లేకుండా తొందరగా ఎత్తమని అరిచాడు.

సీతారామయ్య ఒక్కసారి గొలుసుల మీదికి బరువు తీసుకున్నాడు. ఎగ్జాస్టులోంచి స్టీము చాల శబ్దం చేస్తూ బయలువెడలింది. లింకులన్నీ కొట్టుకున్నాయి. ఆ బరువంతా గర్డర్లు మీదకి వచ్చింది. గర్డర్ల మీద నుంచి స్లీపర్ల మీదకి వచ్చింది. వర్షం చేత నానిన భూమి మీద ఒక్కసారి టన్నుల కొద్దీ బరువు వచ్చింది. దానితో స్లీపర్లు బురదగా ఉన్న నేలలోకి చొచ్చుకు పోయాయి. క్రేను క్రేనల్లా గిజగిజలాడిపోయింది. క్రేను కళాసీ క్రేను

మీద నుంచి క్రిందకు గెంతేశాడు. డ్రైవరు సీటులో కూర్చున్న సీతారామయ్య బండీ అయిపోయాడు. క్రేను జిబ్ శబ్దం చేస్తూ డీసెలు ఇంజను మీద కూలిపోయింది. ఎత్తు నించి క్రేనుతో పడిన సీతారామయ్య కుడిచేయి విరిగిపోయింది.

ఒక్కసారి పని అంతా స్తంభించిపోయింది.

చుట్టుపక్కల వారి హాహాకారాలు మిన్నుముట్టాయి.

సింహాచలం నిలుచున్న చోటనే కూలిపోయాడు.

అనుకున్న వేళకు ముందుగానే శ్రీనివాసమూర్తి సైటుకి తిరిగి వచ్చాడు.

సైటుకి అర కిలోమీటరు దూరంలో రోడ్డు మీద జీపు ఆగింది. జీపు దిగుతుంటే శ్రీనివాసమూర్తికి దూరంలో పడిపోతున్న క్రేను కనిపించింది. తరువాత పెద్ద పెద్ద కేకలు వినిపించాయి. జీపు కాజోపేట వెళ్ళి పోవడానికి టర్నింగు తీసుకుంటున్నది.

''డ్రైవర్! సైటులో ప్రమాదం జరిగి నట్లుంది. మీరు కొంచెంసేపు వేచి యుండండి. హాస్పిటల్‌కి ఎవరినేనా తీసుకెళ్ళవలసి ఉంటే మీ సహాయం చాలా ముఖ్యం.''

శ్రీనివాసమూర్తి సైటు వేపు నడక సాగించాడు.

అతని నడకలో తొందర లేదు. అతను ఏ విధంగా ఆందోళన పడడం లేదు. ముందుకు ఒకే విధమైన వేగంతో నడుస్తున్నాడు.

శ్రీనివాసమూర్తి రెండవ వర్గానికి చెందిన రైల్వే మెకానికల్ ఇంజనీరు. ఈవర్గం వాళ్ళు పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షల్లో పోటీలో నెగ్గినవాళ్ళు, వీళ్ళందరూ విధిగా ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు. సాధారణంగా రాంకులో వచ్చినవాళ్ళే ఉంటారు. వీరికి రైల్వేల గురించి, ఉద్యోగాలలో ప్రవేశించే వరకు అంత బాగా తెలియదు. తెలిసుంటే బహుశా ఈ ఊబిలోకి దిగబడరు. రెండు సంవత్సరాలు ప్రొబేషను తరువాత స్వతంత్రంగా పని చేయడం ప్రారంభిస్తారు. నాలుగు సంవత్సరాలలోనే సీనియర్ స్కేలుకి చేరుకుంటారు. వీరు చాల స్వతంత్రమైన ప్రవర్తన కలవారు. పనివాళ్ళ గురించి, తోటి ఆఫీసర్ల గురించి అవకతవక అయిన అభిప్రాయాలు వీళ్ళకు లేవు. చాల విద్యాధికులవడం నుంచి సాధారణంగా మిత భాషులు, చాల సామర్థ్యంతో పాలనా యంత్రాంగం నడిపించగలరు.

శ్రీనివాసమూర్తి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఖర్గపూరులో చదువుకున్నాడు. ఎమ్ టెక్ రాంకులలో పాసయ్యాడు. గోల్డు మెడలిస్టు. సర్వీసు కమీషను పరీక్షలలో మూడవ వాడుగా వచ్చాడు. వెస్టరన్ రైల్వేలో ప్రొబేషను పూర్తిచేసి, ఒక

సంవత్సరం పనిచేశాడు. ఆరునెలల క్రింద విజయవాడ వచ్చాడు. డివిజినల్ మెకానికల్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. విషయ గ్రహణ సామర్థ్యం అతనికి వెన్నతో పెట్టిన విద్య. ఎవరికీ చనువు ఇవ్వలేదతను. ఒళ్ళు దాచుకొని కాలం గడిపే వాళ్ళను నిర్దాక్షిణ్యంగా శిక్షించాడు. తనకు న్యాయంగా తోచినట్లు, పద్ధతులకు కట్టుబడి పనిచేస్తాడు.

అటువంటి మూర్తి ఈ ప్రమాదాన్ని ఏ విధంగా ఎదుర్కోగలడు?

శ్రీనివాసమూర్తి సైటుకు చేరేసరికి, పది మంది క్రేను కొంచెం ఎత్తి దానిక్రింద చిక్కుకున్న సీతారామయ్యను వెలుపలికి తీశారు.

క్రేను కొత్తగా వేసిన రైలు దారిని పెళ్ళగించుకొని పడిపోయింది. బొగ్గులు, మండుతున్నవి పడ్డాయి. వేడినీళ్ళు, స్టీము, విరిగిపోయిన పైపులోంచి వస్తున్నాయి.

మంచి ఉత్సాహంతో ఉరకలు వేసి పనిచేస్తున్న వారి ముఖాలలో చీకటి అలముకొంది.

మూర్తి అందరి ముఖాలలోను విషాదచ్ఛాయలను గమనించాడు. అతని పెదవుల మీద చిన్న నవ్వు వెలిసింది.

''సీతారామయ్యకు దెబ్బ తగిలినందుకు నేను చాల విచారిస్తున్నాను. ఫోర్మెను సింహాచలం ఇతనిని తీసుకొని కాజీపేట రైల్వే హాస్పిటలులో చేర్పిస్తాడు. అబ్రహాం! ఇంజను ఎత్తేవరకు ఈ ప్రాంతాలలో పని ఆట్టే లేదు. పనివాళ్ళను కొంచెం ముందుకు తీసుకొనిపోయి పనిచేయించండి. ఛార్జిమన్ రామారావు స్క్రూజాక్‌లను తీసుకొని క్రేను ఎత్తడానికి ప్రయత్నిస్తారు.''

మూర్తికి తెలుసు, తీవ్రమయిన అవాంతరం ఏర్పడ్డదని. క్రేను మరొకటి రావాలంటే మద్రాసు నుంచి రావాలి. సికిందరాబాదు డివిజను నుంచి వచ్చినా అది కేసముద్రం దాటి ఇటువేపు రాలేదు. ఇంజను ఎత్తుతేనేగాని రైలు లైను బాగుపడదు.

మూర్తి మరెవరితోనూ మాట్లాడలేదు. మెల్లిగా అడుగులు వేసుకుంటూ కొద్ది దూరంలోనే ఉన్న ఫీల్డు టెలిఫోను దగ్గిరికి నడిచాడు.

''హలో! నేను మూర్తిని.''

''నేను కేశవయ్యను. మూర్తీ ఎంత సేపయింద నువ్వు వచ్చి.''

''పావుగంటయింది వచ్చి.''

''పని చాల చురుకుగా సాగుతున్నదని అబ్రహాం చెప్పారు. సాయంకాలం ఆరు గంటలకి ట్రయలుకి ట్రాక్ సిద్ధం చేయవచ్చునని ఆయన అన్నారు.''

''నేనూ ఆ విధంగానే అనుకున్నాను. కాని పావుగంట క్రింద ఆ ప్లాను అన్నీ తారుమారయాయి. ఉన్న ఒక్క క్రేను పడిపోయింది. దానిని నడపవలసిన ఆ ఒక్క మనిషికి చేయి విరిగిపోయింది. బహుశా ఈ రోజు కూడా రైళ్ళ రాకపోకలు ఆటంకం చెందుతాయి.''

''ఎవరీ మాటలంటున్నారు?''

''మూర్తి.''

''నువ్వెప్పుడూ ఇంత అధైర్యంతో మాట్లాడలేదే!''

''అధైర్యం కాదు. యదార్థమిది.''

''ఇక్కడో కేశవయ్య ఉన్నాడన్న సంగతి మరచిపోయావా.''

''కేశవయ్య కూడా ఏమీ చేయలేని పరిస్థితి.''

''కాని కేశవయ్య చాల ముందాలోచన కలవాడు. ఎమర్జన్సీ సెల్ తెరుచగానే, వాల్తేరు నుంచి నూట ఇరవై టన్నుల డీసెల్ క్రేనుకి ఆర్డరిచ్చాడు. ఆ క్రేను డోర్నకలు చేరుకుంటున్నది- పన్నెండు గంటలకు సైటుకి వస్తుంది.''

''కేశవా! నువ్వు మిరకిల్ మాన్‌వి ఎప్పుడయావు?''

2.9- ఆదివారం 12 గంటలు- మధ్యాహ్నం- గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్.

కుమార రాజా భద్రంగా తువాలులో చుట్టిన నోట్ల కట్టలు పక్కనున్న చిన్న టేబిలు మీద పెట్టాడు. చిత్రలేఖ కూపే తలుపు వేసి లోపలనున్న గడియలు పెట్టింది.

కుమారరాజా స్నానం మొదలైన వన్నీ ముగించుకొని మడత షరాయి, బనియను, టీ షర్టు వేసుకున్నాడు. ఎత్తుగా పెరిగిన జుత్తు దువ్వుకున్నాడు. చిత్రలేఖ తన వానిటీ బాగులోంచి కుంకుమ బరిణె తీసి అతని నుదుట తిలకం పెట్టింది.

లగేజి రూము తాళం తీయించి అక్కగారు మధురలో యిచ్చిన వి ఐ పీ సూటు కేసు తాళం తెరచి, నూరు రూపాయల నోట్లకట్టలు పది లెక్క పెట్టి, పెట్టెకు తాళం వేసి, జంబులింగం చేత లగేజి రూముకు తాళం వేయించి, కూపే 'డి' లోకి కుమార రాజా అయిదు నిమిషాల ముందే వచ్చాడు.

సరిగ్గా పన్నెండు గంటలకు కాంట్రాక్టు మీద చిత్రలేఖ సంతకం తీసుకున్నాడు. కాంట్రాక్టు వ్రాయలేదు తెల్లకాగితం మీద ఆమె చేత సంతకం పెట్టించి లక్షరూపాయలు యిచ్చివేశాడు.

చిత్రలేఖ లేచి నిలబడి డబ్బు తీసుకుంది. వంగి అతని పాదాలకు నమస్కరించింది. తరువాత బాహువులు చాచి అతనిని కౌగిలించుకొని పెదవుల మీద గాఢంగా ముద్దు పెట్టుకొంది. పై బెర్తు మీదనున్న జిమ్మీ ముందుకి వంగి అంతా చూస్తున్నది.

కుమార రాజా ముఖం వెలుగులు చిమ్ముతున్నది. అతను కలర్ ఫిల్ము, 'సెక్సో, సైకో మిస్టరీ జావపదం, స్టంట్' తీయాలన్న బలమైన సంకల్పాన్ని రద్దుచేసుకున్నాడు. పది గంటలకు బ్రేక్ ఫాస్టు ముగించి ఇద్దరూ చాల విషయాలు చర్చించారు. కుమార రాజా అంతవరకూ ఒక్క ఫిల్మూ తీయలేదు. ''రాజ్‌కుమార్ పిక్చర్సు'' రిజిష్టరు అయి అయిదు సంవత్సరాలయింది. పాసగల్ పార్కుకి సమీపంలో రెండంతస్తుల మేడ నెలకి నాలుగువేల రూపాయలు అద్దెకి తీసుకొని, ఇన్ని యేళ్ళ ప్లానులు వేయడంలోనే గడిపాడు అతను.

చిత్రలేఖ ఇప్పటికి ఏభై ఫిల్ములలో నటించింది. పూనా ఫిల్ము ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొంది డిప్లొమా తీసుకొంది. ఫీల్డులో చాలమంది తారామణులు హీరోయిన్లుగా చలామణి అవడంవల్ల టాలెంట్ వున్నా, వాంప్ వేషాలు, క్లబ్ డాన్సరు వేషాలతోనే తృప్తి చెందవలసి వచ్చింది. ఒకసారి చిన్న చిన్న వేషాలకు అంగీకరిస్తే - సాధారణంగా జీవితమంతా ఎక్స్‌ట్రాగానో, సపోర్టింగ్ ఆక్ట్రెస్ గానో వుండిపోవలసి వస్తుంది. ఈ దిగ్బంధంలోంచి ఆమె వెలుపలికి రావాలంటే కుమార రాజా వంటి ప్రొడ్యూసర్లు రంగంలోకి దిగాలి.

చిత్రలేఖ చాల బాగా భరతనాట్యం చేస్తుంది. మరేదేనా ట్రూప్‌తో కాక, స్వంతంగా చాలాసార్లు నాట్య ప్రదర్శన లిచ్చింది. కర్ణాటక సంగీతం నాలుగు సంవత్సరాలు నేర్చుకుంది. అంగికంగా చాల చక్కటి అవయవ సౌష్ఠవం కలది. వాచికం నిర్దుష్టమయినది. ఇన్ని మంచి గుణాలున్నా ఆమెకు అదృష్టం ఇన్నాళ్ళవరకు కలిసి రాలేదు. కుమారరాజా బుర్రలో దూరిన పురుగును తొలగించడానికి ఆమెకు రెండు గంటల కాలం పట్టింది.

కుమార రాజా ఆలోచన ప్రకారం సెక్సో-సైకో- ఇత్యాది ఫిల్ములలో నటిస్తే, నాలుగో తరగతి ప్రేక్షకులు చిత్రలేఖ అంగాంగ ప్రదర్శనకు ఈలలు వేసి హర్షం ప్రక

టించవచ్చు కాని సంస్కారమున్న వాళ్ళు తలలు దించుకుంటారు. చిత్రానికి ఫ్రీప్ పాప్యులారిటీ రావచ్చు. అది మాత్రం చాలాకాలం నిలవదు. కుమార రాజా తీసే తొలి చిత్రం అవార్డు విన్నరు కావాలి. శత జయంత్యుత్సవాలు చేసుకోవచ్చు, మానవచ్చు, దానిలో ప్రత్యేకత వుండాలి.

సినీ ఫీల్డులో మహామహులు అడుగు పెట్టారు. మహా కవులు, సంగీత విద్వాంసులు, వాగ్గేయకారులు, స్క్రిప్ట్ రైటర్సు, ప్లేబాక్ సింగర్సు, అందరూ బడ్జట్ నుబట్టి మార్కెట్‌లో లభిస్తారు. ఎలువంటి కథ కావలిస్తే అటువంటిది వ్రాస్తారు. ఫైవ్ స్టార్ హోటళ్ళలో వాళ్ళ ఖర్చులు భరిస్తే బ్రహ్మాండమయిన అయిడియాలు వారికి కలుగుతాయి. కాబట్టి కుమార రాజా వేటికీ వెదుక్కోనక్కరలేదు. ఒక్క డబ్బుకి తప్ప. అది వున్ననాడు ప్రణయ రథం పూలబాట మీద పరుగెడుతుంది.

గ్లేమరున్న సరియైన హీరో చాల ముఖ్యం. అటువంటివారు ఒకరిద్దరు చిత్రలేఖ దృష్టిలో వున్నారు. వాళ్ళ తప్పకుండా సహాయం చేస్తారు. చిత్రలేఖ కేవలం హీరోయిన్‌గా కాక, కుమార రాజాకు పర్సనల్ సెక్రటరీగా, సలహాదారుగా అన్నివిధాల నిలబడుతుంది. కుమార రాజా అక్కడ్నారు ఇచ్చిన పది లక్షలు, తనకిచ్చినది పోగా తొమ్మిది లక్షలు, ముందు ఇన్వెస్టు చేస్తే - ఆంధ్రదేశంలోని ప్రముఖులు చాలమంది, డిస్ట్రిబ్యూటర్లు, డబ్బు మదుపు పెట్టడానికి ఆలోచించరు. ఎంత మందికో చిత్రలేఖ మీద మంచి అభిప్రాయముంది.

రెండు గంటలసేపు పిండి కొట్టినా కుమార రాజా బుర్రలోంచి పురుగు పూర్తిగా బయటపడలేదు.

''చిత్రా! మీరు క్లబ్ డాన్సులో అమోఘంగా వుంటారు. మీరెంత కాదన్నా, నా అభిప్రాయంలో పొరపాటు లేదు.''

''మైడియర్ రాజా! మీరు ఇంతవరకు నా క్లబ్ డాన్సులు, జానపద నృత్యాలు మాత్రమే చూశారు. అందుచేత మీకు నా నటన మీద ఇంకా నమ్మకం కుదరడం లేదు.''

''లేదు చిత్రా! ఆలోచించు. మరేదేనా ఆల్టర్నేటివ్ వుందేమో!''

చిత్రలేఖ అయిదు నిమిషాలు ఆలోచించింది.

''బాస్! నాకో మంచి జవాబు దొరికింది. ఫిల్ములలో పతివ్రత వేషాలు వేసిన వారిని కూడా ప్రేక్షకులు ఒక్కొక్కప్పుడు దుస్తులు లేకుండా చూసే అదృష్టం కలుగుతుంది.

హీరోకో, విలన్‌కో, ఆమె అలా వుంటే బాగుండుననిపిస్తుంది. వెంటనే డ్రీమ్ సీక్వెన్సులో అంత పతివ్రతగా నటిస్తున్న హీరోయినూ విలన్‌తో స్టెప్స్ వేస్తుంది. తొడల మీద స్కర్టు తొలగి, విస్కీ గ్లాసు అతని పెదవుల కందిస్తుంది. ఇది ఫిల్ములలో ఆమోద ముద్ర పొందిన డ్రైవర్షను. కాబట్టి మీరు విచారించవలసిన అవసరం లేదు.''

''ఓగాడ్! చిత్రలేఖా! మీరు కేవలం జీనియస్. ఎంత అద్భుతమైన ప్రతిపాదన.''

ఈపారి కుమార రాజా చిత్రలేఖను కౌగిలిలోకి తీసుకొని ముద్దుల వర్షం కురిపించాడు.

''నాగపూరులో లంచి వస్తుంది. లంచి అయిన తరువాత మనిద్దరం ఒళ్ళు మరచి నిద్రపోదాం. ప్రయాణంలో మీ వంటి ప్రియురాలు దొరికితే ఎంత అదృష్టం! మనం ఈ మంచి అవకాశాన్ని జారవిడుచుకోవద్దు!''

చిత్రలేఖ కుమార రాజా బుగ్గమీద చిటికె వేసి గోముగా అంది

''ఓమై నాటీ బాయ్! బిహేవ్ యువర్‌సెల్ఫ్!''

2.10 ఆదివారం– 14 గంటలు– మధ్యాహ్నం– కేసముద్రం సైటు

వార్తేరు నుంచి వచ్చిన మాట యిరవై టన్నుల డిసెలు క్రేను సరిగ్గా పన్నెండు గంటలకు చేరుకుంది. వెంటనే దానికి పని తగిలింది. మొదట పడిపోయిన అరవై అయిదు టన్నుల స్టీము క్రేనును ఎత్తడం జరిగింది. పన్నెండు గంటల నలభై అయిదు నిమిషాలకు దానిని రైలు పట్టీల మీద నిలబెట్టి రిలీఫ్ ట్రెయినువేపు పంపించారు. తరువాత డీసెలు క్రేను తిరిగి సైటుకి వచ్చింది. స్టీము క్రేను క్రింద పాడయిన లైనును ఆసరికి బాగుచేశారు.

డీసెలు క్రేను చాల పెద్దది. హిందూ దేశంలో అటువంటివి నాలుగో అయిదో వున్నవి. చాల తొందరగా గొలుసులు తగిలించారు. అంచెలంచెలుగా డీసెలు యింజనును ఎత్తారు. క్రమంగా దానిని ముందు నిలబెట్టి, తరువాత పక్కనే వేసిన టెంపరేరీ ట్రాకు మీద నిలబెట్టారు. డౌన్‌లైను బాగుచేసుకుంటూ వచ్చినప్పుడు దానిని కలిపి ఇంజనును లాక్కోవచ్చు.

అప్పటికే రెండు గంటలయింది. రిలీఫ్ ట్రెయిను పనివాళ్ళు భోజనానికి వెళ్ళారు. వార్తేరు క్రేను పనివాళ్ళు విజయవాడ రిలీఫ్ ట్రెయిను వారికి ఆ పూటకు అతిథులయారు. తరువాత మూర్తికి వాళ్ళు, భోజనం తెచ్చారు.

ఆకాశం మబ్బు పట్టే వుంది. వర్షం కురియడం లేదు. చుట్టూ వందలకొలది పనివాళ్ళు భోజనాలు చేస్తున్నారు. పనులు చేస్తున్నారు. మూర్తి డీసెలు యింజను దగ్గిర నిలబడి భోజనం చేస్తున్నాడు. అతను ఎప్పుడు ఇటువంటి పనికి వెళ్ళినా పనివారితోనే భోజనం చేస్తాడు. ఆ భోజనంలో పంచభక్ష్య పరమాన్నాలు లేవు. బంగాళా దుంపలు, ఉల్లిపాయలు కలిపిన కూర, పప్పుపులుసు, అన్నం ఒక గాజుప్లేటులో పెట్టి తెచ్చారు. కూర అన్నం మీద వేశారు. పెద్ద చెమ్చా ఒకటి యిచ్చారు. పులుసు రెండు గాజు గ్లాసులతో తెచ్చి ఇంజను ప్రేమీద పెట్టారు. ఒక పెద్ద గాజు గ్లాసుతో మంచినీళ్ళు.

మూర్తి భోజనం చేస్తున్నాడు. అతనికి కావలసినవి తేడానికి అతని పక్కను ఒక కళాసీ వున్నాడు. కూర చాల బాగుంది. పులుసు అంతకన్నా బాగుంది. రెండే అయిటములు అయినా ఏ సెవెన్ కోర్సు డిన్నరు దానిముందు నిలవలేకపోయింది. ఇటువంటి భోజనమంటే మూర్తికి చాల యిష్టం. ఈ రోజు భోజనం మరీ రుచిగా ఉంది. చాల క్లిష్టమైన సమస్య ఒకటి పరిష్కారమయి, పని చాల వేగాన్ని పుంచుకొంది. ఏ ఆందోళన లేక ప్రకృతి మధ్యను, వందలాది సోదర శ్రామికులమధ్య చేస్తున్న భోజనం అతనికి ఎంతో ఆనందాన్ని కలిగించింది.

అబ్రహాము సెలూనికి వెళ్ళిపోయాడు భోజనానికి. సహాయంగా వచ్చిన ఇద్దరు అసిస్టెంటు ఇంజనీర్లకి, నలుగురు ఇన్స్పెక్టర్లకి కూడా అక్కడే భోజనానికి ఏర్పాటులు జరిగాయి. అతని మనుషులు పక్కనున్న పల్లెటూళ్ళకు పోయి కోళ్ళను కొనుక్కొచ్చారు. కాయగూరలు కొని తెచ్చారు. పనివాళ్ళలో బాగా వంటవచ్చిన వాళ్ళున్నారు. చాలా బాగా వంట తయారు చేశారు. మూర్తిని కూడా అబ్రహాము ఆహ్వానించాడు. అతను కోరితే శాకాహారులైన కోళ్ళనే కోసివండిస్తానన్నాడు. మూర్తి నవ్వి వూరుకున్నాడు.

మూర్తి భోజనం అయిపోయింది. రెండు గ్లాసుల నీరు త్రాగి కొత్తగా వేసిన రైలు పట్టీలమీద రుమాలు పరుచుకొని కూర్చున్నాడు. కూర అన్నం రెండోసారి తెప్పించుకున్నాడు. పాద్దున వరంగల్‌లో కాఫీ హోటలులో తిన్న టిఫిన్. తరువాత ఆందోళన; ఇప్పుడు అనుకున్న పని సక్రమంగా అయిపోయింది. అందుచేతనే ఆకలి బాగా వేసి స్టఫ్ పెట్టిన భోజనం విందు భోజనమైంది. పది నిమిషాలు అలా కూర్చున్నాడు, మూర్తి. వెంటనే అతనికి కేశవయ్య జ్ఞాపకం వచ్చాడు. పైకి కనిపించకుండా ఎంత పని చేశాడు తన అన్న. మూర్తి లేచి ఫీల్డు టెలిఫోను వేపు నడిచాడు.

''హలో! మూర్తిని మాట్లాడుతున్నాను.''

''నేను కేశవయ్యని!''

''చాల థాంక్స్ కేశవా! నువ్వు సమయోచితంగా పంపిన క్రేనుతో చాల సులువుగా యింజనును లేపెత్తాము. దానితోనే పిగిలిన బోగ్గులను కూడా ఎత్తి పక్కకు పారేస్తున్నాము. ఈ డీసెలు క్రేను చాల బాగా ఉపకరిస్తున్నది.''

''మూర్తీ! నా మనసు ఏదో చెప్పరాని ఆనందంతో నిండిపోయింది. పై నున్న ఆఫీసర్లు వచ్చిపోతున్నారు. ఎప్పుడు పని అవుతుందని అడుగుతున్నారు. ఢిల్లీ నుంచి. సికిందరాబాద్ నుంచి శరపరంపరలుగా ప్రశ్నలు వచ్చి పడుతున్నాయి. ఎవరికీ, ప్రమాదం జరిగినచోట ఎంతపని ఉన్నదో తెలియదు. కాని సరియైన ఒక్క మనిషికి మాత్రం ఈకష్టసుఖాలు అన్నీ తెలుసు. ఈ శ్రీనివాసమూర్తి రైల్వేలలో ఎంత పెద్ద పనినైనా చేపట్టడానికి అర్హుడు. ఈ కేసముద్రం ప్రమాదం అతని విజయ పరంపరకు మరొకమెట్టు.''

''మా అన్న ఉపన్యాస ధోరణిలో మాట్లాడతాడని నాకు తెలియదు.''

''ఎంతకేనా, నేను నీకు సీనియరును కదా!''

''అవును కేశవా!''

''మా మరదలు పద్మావతి చాల ఆందోళనపడుతున్నది. నువ్వు ఆమెతో టెలిఫోనులో మాట్లాడలేదని బాధపడుతున్నది. నిన్న సాయంకాం టీ పార్టీకి మీ వదిన, చిట్టితల్లి గుంటూరు నుంచి వచ్చారట. ప్రత్యేకంగా ఒక మనిషిని పంపించి వాళ్ళిద్దరినీ తెప్పించింది. ఇంట్లో ఎవరూ సాయంలేరని వాళ్ళని అక్కడే ఉంచివేసింది.''

''అన్నిటికన్నా చాల సంతోషకరమైన వార్త ఇది. పద్మతో చెప్పు నేను బాగున్నానని.''

''మీ వదినతోను, చిట్టితల్లితోను టెలిఫోనులో మాట్లాడాను, వాళ్ళూ గుంటూరులో హాయిగా ఉండలేకపోతున్నారు. ఈ ఎమర్జన్సీ అయిపోయిన తరువాత సెలవు పెట్టి, వాళ్ళను తీసుకొని రావాలనుకుంటున్నాను.''

''చాల మంచి కోరిక - ఇప్పటికైనా మించిపోయినదిలేదు. చాల సౌమ్యమయిన కాలం.''

''అవును చిట్టితల్లి ఢిల్లీ చూస్తానంటున్నది. మా పెద్ద బావమరిది అక్కడే ఉన్నాడుకదా!''

''మంచిదే కేశవా!''

శ్రీనివాసమూర్తి తిరిగి డీసెలు క్రేను పనిచేస్తున్నవేపు నడిచాడు. సెలూను నుంచి భోజనాలు ముగించుకొని అబ్రహాము, అతని సిబ్బంది వస్తున్నారు.

దూరంగా రోడ్డుమీద కాష్ వాను ఆగుతున్నది.

తనవేపే వస్తున్న అబ్రహామును నిలిపాడు మూర్తి.

''ఆ కాష్ వాస్‌లో అకౌంట్సు ఆఫీసరు ఒకరున్నారు. పనివారి లిస్టులు అతనికిస్తే అతను సాయంకాలం అయిదు గంటలనుంచి పేమెంటు మొదలు పెడతాడు. రేపు, వాళ్ళు మళ్ళా కావలిసి వస్తే వారితో చెప్పి ఉంచండి''

అబ్రహాము తల ఊపాడు.

కేసముద్రం సైటులో జనసముద్రం హోరు పెడుతున్నది.

వాళ్ళందరి మధ్యను నిలిచి వారి శ్రమను అర్థం చేసుకోవడంతో తన జీవితం సఫలమయిందని అనుకున్నాడు అతను-

ఈ దేశమంతా ఇటువంటి వారితోనే నిండి ఉంది. తానూ, వారిలో ఒకడవడం కన్నా గర్వకారణం ఇంకేమున్నది?

2-11 ఆదివారం- సాయంకాలం- 18 గంటలు కాజీపేట

కాజీ పేట రన్నింగ్ రూములో ఒక మంచి వంట మనిషి ఉన్నాడు. అతనిని అందరూ నాయరు అని పిలుస్తారు. వెంకట నారాయణ తన వంట విధిగా నాయరుచేతనే వండించుకుంటాడు.

వెంకటనారాయణ నిద్రలేచి నాలుగు గంటలకే బజారుకు వెళ్ళి చాల సామాన్లు కొనుక్కొని వచ్చాడు. సరిగ్గా సాయంకాలం ఆరుగంటలకు నాయరు డ్యూటీకి వచ్చాడు. అతనిని తన గదిలోకి పిలిపించాడు వెంకటనారాయణ.

''నాయర్! ఇదిగో కాబేజీ, ఇదిగో కారెట్లు, బీన్సు, దుంపలు, ఉల్లిపాయలు. వీటితో ఒక కూర వండాలి. అట్టే మసాలా పనికిరాదు. తరువాత ఇదిగో కాకరకాయలు

వీటిని దుంప కూరతో స్టఫ్ చేసి వేయించాలి. ఈ రెండు కూరలు వండడంలో నిన్ను మించినవాళ్ళు లేరు. పెరుగు తెచ్చాను, కొబ్బరికాయ చెట్నీ తయారుచేయాలి. ఇవిగో బెండకాయలు, వంకాయలు. వీటితో సాంబారు తయారు చేయాలి. వంటంతా ఎనిమిదో గంటకు పూర్తయిపోవాలి. నా కారియరులో ఇద్దరికి సరిపోయిన భోజనం సర్దాలి చెప్పిన విషయాలన్నీ జ్ఞాపకమున్నాయా?''

''అది గీలా కూర - ఇది ఫ్రై - ఆపైన సాంబారు - సాదం - ఇంతేకద!''

''ఎంత సులువుగా తేల్చిపారేశావు. ఇవిగో పదిరూపాయలు, ఇంకేమైనా కొనవలసి ఉంటే పనికి వస్తుంది.''

నాయరు పదిరూపాయల నోటు, సామాను పట్టుకొని వెళ్ళిపోయాడు.

పెరియనాయకికి చేయబోయే తొలి సొతిండియన్ డిన్నరు ఇదే.

ఆమెకు ఇష్టమని పొటాటో ఛిప్స్ తెచ్చాడు. బర్ఫీ తెచ్చాడు. ఆపిల్‌పండ్లు తెచ్చాడు. భుషావల్ అరటిపండ్లు తెచ్చాడు. ఆమెకు ఇష్టమని ప్రత్యేకంగా మిఠాపాన్ కట్టించి తెచ్చాడు. చేమంతిపూల దండలు తెచ్చాడు. ఏవి తెచ్చినా ఇంకా ఏవో మిగిలి పోతున్నాయి.

ఆమె ఏవీ కావాలని అతనికి వ్రాయలేదు. కాని ఆమెతో గడిపిన రెండేళ్ళలోను అతను ఎన్నో చక్కటి వస్తువులమీద మనసు పెంచుకున్నాడు. సువాసన వేసే పూల దండలు, పరిమళాన్ని వెదజల్లే అత్తర్లు, ఖరీదైన బట్టలు, మనసుకు ఇంపైన సంగీతం, మంచి సినిమాలు, ఏకాంతస్థలాల్లో విహారాలు, ఎన్నో ఎన్నో పెరియనాయకి సంపర్కం వల్ల అతని జీవితంలో చోటు చేసుకున్నవి. పెరియనాయకి మీద ఇంత ప్రేమ పెంచుకున్నాడే ఈ వెర్రి బ్రాహ్మడని చాలమంది అనుకుంటారు. వారికి నిజం తెలియదు. తెరచాప తెగి, తెడ్లు విరిగి, తుఫానుగాలులలో, నడి సముద్రంలో దిక్కూ తెన్నూ తెలియకుండా భగ్నమయిపోతున్న అతని జీవిత నౌకను పెరియనాయకి దేవదూతగా వచ్చి శాంతితీరాలకు చేర్చింది. ఈ మాటలెవరూ నమ్మరు. కొవ్వు లావయి అరవపిల్ల వెంట బడ్డాడని కొందరు అంటారు. లోకం లోకమే. వెంకటనారాయణ పెరియనాయకి ఆప్యాయాను రాగంలో లోకాన్ని అర్థంచేసుకోడం మొదలు పెట్టాడు.

వెంకటనారాయణ స్నానం చేసివచ్చాడు. తెల్లటి పంచ కట్టుకున్నాడు. పట్టువాణే పైన కప్పుకున్నాడు. నుదుట కుంకుమ పెట్టుకున్నాడు. భగవద్గీతలో పురుషోత్తమ ప్రాప్తి యోగం చదువుతున్నాడు. అన్నీ మరచిపోయాడు. అతని దృష్టిలో విశ్వరూపం

దర్శనమిస్తున్నది. అనిర్వచనీయ మైన శాంతి అతనిని ఆవరించుకొంది. తాను నిత్యం ఆరాధిస్తున్న దేవత సాక్షత్కరించే శుభవేళ ఆనంద సంకులమయింది అతని మనసు.

పారాయణానికి అనుసంధానమైన గీతామహాత్మ్యం శ్లోకాలు చదివి అతను లేచాడు. టైముచూసుకున్నాడు ఏడున్నర అయింది. స్టేషను ఎంక్వయరీకి టెలిఫోను చేశాడు. గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ సరియైన వేళకే వస్తున్నది. కాజీపేటనుంచి పనిచేయవలసిన డ్రైవరు పక్క-గదిలోనే ఉన్నాడు. అన్నిటికీ మించిన సంతోషవార్త. ఈ ఎక్స్‌ప్రెస్ తిన్నగా మద్రాసుపోయే మొదటి ట్రెయిను. తోవలో కొంచెం ఆలస్యం తప్పదు. అయినా ఉదయం తొమ్మిదికి మద్రాసు చేరుకుంటుంది. చుట్టు తోవ మీంచిపోతే ఏరాత్రికో గాని మద్రాసు చేరదు.

గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ సరిగా ఐదు నిమిషాల తక్కువ తొమ్మిదికి కాజీపేట వస్తుంది. ఇరవై అయిదు నిమిషాలుంటుంది.

వెంకటనారాయణ మళ్ళా టైం చూశాడు. పావుతక్కువ ఎనిమిది అయింది. అతని లైను బాక్సు ఇంజనుతో వెళ్ళిపోతుంది. విజయవాడలో దింపుతారుదాన్ని. తనకున్న కొద్దిబట్టలను చిన్న తోలు సూట్ కేసులో పెట్టి తాళం వేశాడు. తరువాత కిచన్ వేపు నడిచాడు బట్టలు వేసుకొని.

నాయరు చేసిన సాంబారు ఘుమఘుమలాడుతున్నది. కూరలు చూడముచ్చటగా ఉన్నాయి. చట్నీ సరేసరి. అన్నీ వేడివేడిగా ఉన్నాయి. కారియరులో అన్నీ సర్దేశారు. పళ్ళా, కిల్లీలు మొదలైనవన్నీ మరోచేతి సంచీలో పెట్టుకున్నాడు. బాక్సు బాయి సరిగా ఎనిమిదిగంటల పదిహేను నిమిషాలకు వచ్చాడు. అతని చేతికి సూట్‌కేసు, చేతి సంచీ ఇచ్చి, కారియర్ పట్టుకొని స్టేషను వేపు నడిచాడు వెంకటనారాయణ.

2.12. ఆదివారం-19 గంటలు- రాత్రి- కే సముద్రం సైటు

అప్‌లైను లింకింగ్ పూర్తి అయింది. సరిగ్గా ఆదివారం రాత్రి ఏడు గంటలకు అనగా లైనుపాడయి ఇరవై అయిదు గంటలలో మళ్ళీ టెంపరరీ లైను తయారయింది. ఢిల్లీ-మద్రాసులకు హైదరాబాదు, విజయవాడలకు రైలు దారి తెరుచుకుంది. దాని మీద ట్రయల్ రన్ చేసి తరువాత ఉపయోగిస్తారు.

ట్రయల్ రన్ కోసం కాజీపేట నుంచి వచ్చిన రిలీఫ్ ట్రెయిను ఇంజను సిద్ధంగా ఉంది. ఆ డీసెలు ఇంజను నడిచి కొత్తదారి మీద వెళ్తే లోపాలు సరిదిద్ది మామూలుగా రైళ్ళ రాకపోకల కోసం దానిని పినియోగించవచ్చు.

చీకటి కమ్ముకుంటున్నది. పడమటి ఆకాశంలో ఏదో చిన్న గుడ్డి వెలుతురు తారాడుతున్నది. చల్లని గాలి వీస్తున్నది. నాలుగు పెట్రోమాక్సు లైట్లు, రెండు తిర్రీ లాంపులు ఇంజను ముందు ట్రాక్ మీద ఉన్నాయి. రిలీఫ్ ట్రెయిను ఫిట్టరు ఒకడు కొబ్బరికాయ కొట్టాడు. ఇంకొక అతను కొత్త దారికి హారతి ఇచ్చాడు. రైళ్ళు భద్రంగా నడిచి, ప్రయాణీకులు గమ్యం చేరాలని ఈ పూజలు.

రిలీఫ్ ట్రెయిను పనివాళ్ళు, ఇంజనీరింగు మేస్త్రీలు, ఇంజనీర్లు ఆ వెలుతురులో నిలబడ్డారు. వారి మధ్య మూర్తి కూడా ఉన్నాడు. ఉన్నట్టుండి అబ్రహాము కేక పెట్టాడు.

''రామస్వామీ! ఏమిటాలస్యం?''

హరికన్ లాంతరు పట్టుకొని వయసు కొంచెం మళ్ళిన మేస్త్రీ ఒకాయన మనుషులను పక్కకు తోసుకుంటూ, ముందుకు వచ్చాడు. అతని చేతిలో పెద్ద ట్రే ఉంది. దానిమీద కప్పిన తువ్వాలు తొలగించాడు అబ్రహాం.

ఆ ట్రేలో వేయించిన జీడిపప్పుంది. కాజాలున్నాయ. కోవాబిళ్ళలున్నాయి.

''తీసుకోండి దొరగారూ!'' అబ్రహాము మూర్తివేపు పళ్ళెం చాచాడు.

కాంతివంతంగా వెలుగుతున్న దీపాల మధ్య నిలబడ్డ అందరి కళ్ళూ అబ్రహాము చేతిలోని పళ్ళెంవేపు తిరిగాయి.

మూర్తికి ఒళ్ళు చచ్చినట్లయింది.

''అబ్రహాం! ఆ పళ్ళెం మా రిలీఫ్ ట్రెయిను పనివాళ్ళకు ఇవ్వండి. శ్రమపడ్డ వాళ్ళు వాళ్ళు.''

అబ్రహాం ముఖం చిన్నబోయింది.

విశేషమేమంటే ఒక పనివాడూ ఆ పళ్ళెంలో వస్తువేదీ ముట్టుకోలేదు. మూర్తి ఆ పళ్ళానికి ఒక నమస్కారం చేసి వెనక్కు తప్పుకున్నాడు. ఏ పనికైనా సమయమొకటుంది. వేడుకకు మరీ జాగ్రత్తతో సమయాన్ని ఎంచుకోవాలి.

డీసెలు ఇంజను హారన్ మ్రెగింది. మూర్తి దీపం చూపించి ఇంజను ముందు నడిచాడు. ఇంజన్ హెడ్ లైటు కాంతి చీకటిని చీల్చుకొని ముందుకు పోతున్నది. మేస్త్రీ ఒకడు మరో ఆకుపచ్చ దీపం చూపిస్తూ నడవడం మొదలుపెట్టాడు. ఒక కిలోమీటరు

నడవడానికి అరగంట పట్టింది. అక్కడెక్కడ మెల్లంగి సరిచేసి, దారిని ఇంకా బాగుచేయాలో ఇన్‌స్పెక్టర్లు గుర్తు పెట్టుకొని వెంటనే ఆ పని ప్రారంభించారు. తాడలపూసపల్లి వేపు నుంచి ట్రయలు ఇంజను, లైను మరమ్మత్తులు పూర్తిఅయిన తరువాత, ఎనిమిది గంటలకు బయలుదేరి తిరిగి కేసముద్రం వేపు నడిచింది. ఈ సారి గంటకు పది కిలో మీటర్ల వేగంతో నడిచి విజయవంతంగా బయలుదేరిన చోటుకి చేరుకుంది.

మేస్త్రీ ఒకరు తిల్లీ లాంపు పట్టుకొని దారి చూపిస్తే, మూర్తి ఫీల్డు టెలిఫోను వేపు నడిచాడు.

''హలో''!

''ఎవరది మూర్తా?''

''అవునునేనే? సరిగ్గా ఇరవైగంటల పది నిమిషాలకు ట్రయల్‌రన్ పూర్తయింది. ప్రస్తుతం కేసముద్రం, తాడల పూసపల్లి స్టేషన్ల మధ్య సింగిల్‌లైను వర్కింగు అమలులోకి వస్తుంది. గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ సరిగ్గానే వస్తున్నది. దానిని తిన్నగా మద్రాసు వంపవచ్చు.''

''మూర్తీ! అనుకున్న వేళకు పని పూర్తి చేశావు. సూపరిటెండెంటుగారితో మాట్లాడుతావా?''

''ఇందులో మాట్లాడడానికి ఏమీలేదు. ఈ సమాచారం నువ్వే అందజేయవచ్చు.''

''నుంచిది ''

''నేను ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి వస్తున్నానని పద్మావతితో చెప్పు. నీ ఎమర్జన్సీ డ్యూటీ అయినట్లేనా!''

''సెల్‌మూసివేయమన్నారు, లైను బాగుపడగానే! కాని నాకు వెంటనే వెళ్ళిపోవాలని లేదు. తొలి ట్రెయిను భద్రంగా విజయవాడ జంక్షన్ చేరవరకు డ్యూటీలో ఉంటాను.''

మూర్తి అయిదు నిమిషాలు ఆలోచించాడు.

''బహుశా నీ ఆలోచన సమంజసమైనదేమో! ఏదో అరవ సెన్సు చెప్తున్నది. నువ్వు డ్యూటీలో ఉండడం చాలా అవసరం.''

2.13. ఆదివారం-20 గంటలు- రాత్రి- గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్

మొదలియారుకి జ్వరంగా ఉంది. ఏసీ కోచిలోని వారికి ప్రొద్దున బ్రేక్‌ఫాస్టులు, మధ్యాహ్నం లంచ్‌లు, సాయంకాలం టీలు జంబులింగం అందించాడు. అందించాడు అనడంకంటే అందేటట్టు చూశాడు.

మళ్ళీ రాత్రి డిన్నర్లు, రైలు కాజోపేట చేరిన తరువాత, అందించవలసి ఉంటుంది. ఇప్పుడింకా ఎనిమిదే అయింది. మామూ మొదలియారుకు జ్వరం మాత్ర, టీ ఇచ్చి రెండు రగ్గులు కప్పాడు. మీద బెర్తు మీద మొదలియారు పడుకోమన్నాడు. కాని, ఆ జ్వరంతో మూలుగుతున్న వాడికి సమీపంలో ఉండబుద్ధివేయలేదు.

అందుచేత జంబులింగం లగేజి రూములోనే, అడుగునో రగ్గుపరుచుకొని కూర్చున్నాడు. అక్కడ వున్న రెండు వస్తువులు అతని మనసును తిన్నగా ఉండనీయడం లేదు. ఒకటి, రెండు ఢిల్లీ బుట్టలలో మూత బాగా సీలుచేసిన బుట్ట, రెండవది ఊదారంగు వి.ఐ.పి. సూట్‌కేసు.

ఢిల్లీ బుట్టలో ఏముందో అతనికి తెలియదు. కాని అందులో ఒక త్రాచుపాము చుట్టలు చుట్టుకొని ఉన్నట్లుంది. అందులో ఆపిల్‌పళ్ళు ఉండవచ్చు. ఎందుచేతనంటే రెండో బుట్టలో అన్నీ ఆపిల్‌పళ్ళే. రాత్రి ఆ కోరమీసాల వాళ్ళు ఆ బుట్టమూత తీసి తనకు రెండు పళ్ళు కోసియిచ్చారు. వారెవరూ చూడకుండా ఈ రోజు మధ్యాహ్నం తానో రెండు పళ్ళు తీసుకొని తిన్నాడు. సాయంకాలం బళ్ళార్షాలో రైలాగినప్పుడు మళ్ళీ మరో రెండు పళ్ళు తీసుకోవాలని బుట్ట దగ్గిరకు వెళ్ళేసరికి, సీలువేసిన బుట్టలోంచి చప్పుడు వినిపించింది. ఆ చప్పుడు గుండె కొట్టుకున్న శబ్దంలా ఉంది అప్పుడే అనుమానం వేసింది. అందులో ఏదో త్రాచుపాము నిద్రపోతున్నదని, ఆ వినవచ్చే శబ్దం దాని గుండె చప్పుడేనని. ఆ బుట్టలను చూస్తుంటే ఆ లగేజి రూములో కూర్చోవాలని అనిపించడంలేదు జంబులింగానికి.

ఇక రెండవది ఊదారంగు సూట్‌కేసు. అది ఆ రాజాగారెవరిదో. ఆరాజాయే పన్నెండు గంటలవుతుంటే తనచేత లగేజి రూము తాళం తీయించి, ఆ సూట్‌కేసు తాళం తన ఎదుటే తీసి-పదినోట్ల కట్టలు-తాను స్వయంగా చూశాడు- నూరు రూపాయల నోట్ల కట్టలు పది, లెక్క-బెట్టి తువాలు చుట్టాడు. ఆ సూటుకేసు తెరచి ఉన్నంత సేపూ తన కళ్ళు దానికి అంటుకుపోయాయి. ఆ పెట్టెనిండా నూరు రూపాయల నోట్ల కట్టలే- ఎన్ని లక్షలున్నాయో!

ఈ రైలు ఉదయం తొమ్మిది గంటల వేళకు మద్రాసు చేరుతుంది. ఆ మిడిసిపడే సినీమా స్టారులాంటి సుందరిని మరిగి ఈ రాజా అన్నీ మరిచిపోయాడు. లేకపోతే ఎంత తెలివి తక్కువవాడైనా, లక్షలున్న పెట్టె లగేజి రూములో పారేసి వెళ్ళిపోతాడా?

అదృష్టమంటే అలాగే ఉంటుంది. తాను మద్రాసు నుంచి న్యూఢిల్లీ వరకూ ఒక బట్టల వర్తకుడిని అనుసరిస్తూ ప్రయాణం చేశాడు. పాత ఢిల్లీ గల్లీలో అతని తోలు సంచి పట్టుకొని పారిపోతూ దొరికిపోయాడు. తప్పించుకొని పోవడానికి చచ్చివంత కల గాశాడు. చావు దెబ్బలు తిన్నాడు. ఈ సారి ఢిల్లీ ట్రిప్ ఏమీ కలిసిరాలేదు. చేతిలో కానీ లేదు. మళ్ళీ జేబులు కొట్టడానికి ధైర్యం చాలలేదు. చాల దీనమైన పరిస్థితులలో న్యూఢిల్లీ స్టేషను ముందున్న దుకాణాల దగ్గిర తిరుగుతుంటే మామ మొదలియార్ కనులబడ్డాడు. దానితో ప్రాణాలు పోయినవి తిరిగి వచ్చాయి.

మొదలియారు భార్య తనకు దూరపు చుట్టం, వరుసకు అక్క అవుతుంది. ఆమెకో కూతురుంది. ఆ కూతురు కాలేజీలో చదువుతున్నది. దానికేం చెక్క, అయినా తన తల్లి వెళ్ళి అడిగింది, ఆ పిల్లను తనకిచ్చి పెళ్ళిచేయమని. దానితో ఇంటిల్లి పాదీ తిట్టి తగిలేశారు తన తల్లిని. ఆపదలో ఉన్నప్పుడు ఏంచేయాలి? లక్ష అబద్దాలేనా ఆడి ప్రాణాలు దక్కించుకోవాలి. మొదలియారును ఒకదారికి తీసుకొని వచ్చే సరికి తల ప్రాణం తోకకు వచ్చింది. అంతే ఆ సాయంకాలమే న్యూఢిల్లీ నుంచి మద్రాసుకు తిరుగు ప్రయాణం చేశాడు. మొదలియారుకు వచ్చిన భోజనంలో తనకు కొంత ఇచ్చాడు. అతనికి జ్వరంగా ఉంటే, బేరర్లే తనకు అన్నీ ఇవ్వడం మొదలు పెట్టారు.

అదృష్టం కలిసివస్తే చెప్పి రాదు. ఆ లగేజి రూము తనకు అత్తవారిల్లులా ఉంది. రాత్రి కోరమీసాల వారు ఆపిల్ పళ్ళు ఇచ్చారు. తరువాత ఈ రోజు పన్నెండు గంటలకు పెన్నిధి కాళ్ళలో పడింది. ఆ పెట్టె చక్కని చిన్నదానిలా కనిపిస్తున్నది. కొంచెం సేపు వేచే వుండాలి. రాత్రి అటువంటి పనులకు చాల మంచిది.

జంబులింగం ఆలోచనలు భగ్నం చేస్తూ కుమార రాజా లగేజి రూములోకి వచ్చాడు. జంబులింగం గుండె కొట్టుకుంది. అతను ఆ ఊదా రంగు సూట్‌కేసు కూపేలోకి తీసుకు పోతాడేమోనని భయం వేసింది.

కుమారరాజా చాలసేపు అక్కడనే ఉన్నాడు. రెండు మూడు పెట్టెలు తెరిచాడు. ఒకదాని నుంచి విస్కీ బాటిలు, ఒక పెట్టె నుంచి ఆడవాళ్ళ బొమ్మలున్న పుస్తకం, ఒక పెట్టెనుంచి సిగరెట్టు పెట్టె తీసుకొని తాళాలు వేసి వెళ్ళిపోయాడు.

ఇంతలో రైలు వేగం తగ్గింది. కాజీపేట సమీపిస్తున్నది. అందరికీ డిన్నర్లు అందే లట్టు చూడాలి. ఎవరికి వెజిటేరియనో, ఎవరికి నాన్ వెజిటేరియనో, ఇంకా ఇంకా ఎన్నో ఎన్నో విధాలుగా అవస్థీ రాసుకున్న పుస్తకం తీశాడు. లగేజిరూముకి తాళం వేసి, రాబోయే బేరర్ల కోసం ఎదురుచూశాడు జంబులింగం.

2-14. ఆదివారం 21 గంటలు- కాజీపేట

సరియైన చైముకే గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ కాజీపేట స్టేషనులోకి రోలయింది.

వెంకటనారాయణ నిలబడ్డ కొద్దిదూరం లోనే ఎయిర్ కండిషన్డు కోచి ఆగింది. దాని ద్వారం దగ్గిర ఒక వయసులోని చిన్నది నిలబడింది. ఆమె వెనుక ఎత్తుగా వున్న పెద్ద మనిషి నిలబడ్డాడు. పెరియనాయకి కనిపించలేదు.

వెంకటనారాయణ గుండెలుకొట్టుకున్నాయి. ఆమె రాలేదా?

ద్వారందగ్గిర నిలుచున్న చిన్నది ప్లాట్ ఫారమ్ మీదికిగెంతింది. ఆమె వెనుక ఆ పాడువుపాటి మనిషి కూడా కిందికి దిగాడు. వారిద్దరూ దిగిన తరువాత ద్వారం దగ్గిర పెరియనాయకి కనిపించింది.

వెంకటనారాయణ చేయి ఊపాడు. ఆమె చేయి ఊపింది. వెంకటనారాయణ ముందుకి నడిచాడు. పెరియనాయకి కారిడారు లోకి పోయి కూపే ''సి'' తలుపు ముందు నిలుచుంది.

వెంకటనారాయణ కూపేలోకి ప్రవేశించే సరికి తొమ్మిది అయింది. కారియరు ప్రక్కనే ఉన్న బల్లమీద ఉంచాడు. బాక్సుబాయి తెచ్చిన సూట్‌కేసు చేతిసంచి మీద బెర్తు మీద పెట్టాడు.

''నారాయణగారూ! సౌఖ్యమా!''

పెరియరియనాయకి పెదవి మీద గులాబి రేకులు విడినట్లు చిన్న నవ్వు నిగిసింది.

''పెరియనాయకిని ఒక్కసారి చూసి, తరువాత ఏమైనా పరవాలేదని, ఈ వెంకట నారాయణ ప్రాణాలు నిలబెట్టుకున్నాడు. ఆ దేవి దర్శనమిచ్చింది.''

పెరియనాయకి కొంచెం ముద్దుగా నవ్వింది.

ఇంతలో కండక్టరు వచ్చి రిజర్వేషన్లు చూస్తున్నాడు. వెంకటనారాయణకు నమస్కారం చేసి, పెరియనాయకి చూపించిన టిక్కెట్ల మీద సంతకం చేసి వెళ్ళిపోయాడు.

ప్లాట్‌ఫారమ్ మీదకు దిగిన కుమార రాజా, చిత్రలేఖ నవ్వుకుంటూ కోచిలోకి ఎక్కారు. కూపే ''సి'' పక్కనుంచి వెళ్తూ, తలుపుతీసి ఉండడం నుంచి దిగువ బెర్తు మీద పక్క పక్కనే కూర్చున్న జంటను చూసి, ఒక్కక్షణం తలుపు దగ్గిర నిలబడి, నవ్వుకొని కూపే ''డి'' లోకి వెళ్ళిపోయారు.

తొమ్మిది గంటల ఇరవై నిమిషాలకు రైలు కదిలిన తరువాత వెంకటనారాయణ కూపే తలుపు మూసి, లోపలి గడియలు పెట్టాడు. రెండు చేతులలోకి అమాంతంగా పెరియనాయకిని తీసుకొని గాఢంగా కౌగిలించుకొని చాలసేపటి వరకు పెదవులతో ఆమె పెదవులను మూసివేశాడు.

పెరియనాయకి మెడలోని బంగారు గొలుసులో వున్న మంచి ముత్యం మృదువుగా మునివేళ్ళతో స్పృశించింది.

''నాయకీ! నువ్వు మరో ఆరునెలలు కువాయతులో ఉంటే, ఇక్కడనేను ప్రాణత్యాగం చేసి ఉండేవాడిని.''

''నారాయణా! మీరలా అంటారు. ఆరునెలలు ఉందనగానే కాంట్రాక్టు రద్దు చేసుకొని దేశం తిరిగి వద్దామనుకున్నాను. మా అమ్మగారి గురించి నాకేమీ విచారం లేదు. ఆమె ఒంటరిగా జీవితం గడపడానికి అలవాటుపడింది. నా బెంగంతా, తిండి సరిగా తినక మారాం చేసే అబ్బాయి గురించే.''

వెంకటనారాయణ పెరియనాయకి ముఖం లోకి చూస్తూ ఉండిపోయాడు. పెరియ నాయకి అతని జబ్బలు చేతితో నొక్కింది. జాత్తులోకి వేళ్ళుపోనిచ్చి క్రాఫింగు చెరిపింది.

''ఈ జబ్బలు సన్నమయాయి. ముఖం వాడిపోయింది. ఎక్కడి నారాయణ దొరికారు మాకు?''

''నాయకీ! మేఘసందేశంలో అలకాపురంలో యక్షిణి ఉండేది. ఆమెకు ప్రియుడికి ఎడబాటు కలిగింది. ఆమె రోజూ పూవులతో ఎడబాటు కలిగిన దినాలు లెక్కపెట్టేది. అదే వరస నాది. నువ్వు దేశం విడిచి వెళ్ళిన తరువాత వేయిపైగా రోజులను లెక్కపెట్టాను.''

పెరియనాయకి వెంకటనారాయణ చెంపలకు తన చెంపలు చేర్చింది.

''నారాయణా! మరి మనం వేరే ఉండవద్దు. మీకు మద్రాసు బదిలీ అవడానికి అవకాశాలున్నాయన్నారు. ఇప్పుడున్న ఫ్లాటుమీద పెద్ద బెడ్‌రూము, అటాచ్‌డ్ బాత్ కట్టించుకుందాం. అక్కగారిని, అమ్మగారిని అబ్బాయిని మద్రాసు తీసుకొని వద్దాం.''

''అన్నిటికీ ముందు తిరుచామారులో పెరియనాయకి మెడలో తాళి కట్టాలి.''

''అవును అది చాల ముఖ్యం.''

''నాయకీ! మాటలలో పడి ఆకలి మరచి పోయావా?''

''ఒక్క అయిదు నిమిషాలు- బాత్‌రూము లోకివెళ్ళి వస్తాను. స్నానంచేసి రావాలి. సాయంకాలమే అన్నీ ముగించుకొందామనుకున్నాను. కాని ఏవో అంతులేని ఆలోచనలలో మునిగిపోయి అన్నీ మరచి పోయాను!''

''నాయకీ, ఈ పది నిమిషాలలోనూ నేను పక్కనే ఉన్న ఫస్టు క్లాసుకి వెళ్ళి వస్తాను. స్టేషనులో రైలాగుతుంటే ద్వారం దగ్గిర జనార్దనశర్మ కనిపించారు. అతను నాకు మంచి స్నేహితుడు. పలకరించి వస్తాను.''

''వెళ్ళిరండి!''

''లోపల సామానుకి పరవాలేదా?''

''నాతో అట్టే సామాను లేదు. నేను తెచ్చినవన్నీ రెండు పెద్ద పెట్టెలలో పెట్టి, తాళాలు వేశాను. పార్సెలు వానులో బుక్ చేశాను. వెనకనున్న పార్సెలు వేనులో న్యూఢిల్లీ నుంచి సరాసరి మద్రాసుకు బుక్ అయిన సామానులు నిండుగా ఉన్నాయి. న్యూఢిల్లీలో ఆ వానుకి వేసిన సీలు తిరిగి మద్రాసులోనే విప్పుతారని గార్డు చెప్పారు. కాబట్టి మీరు నిర్భయంగా వెళ్ళిరండి.''

వెంకటనారాయణ వెళ్ళేసరికి, తలుపు దగ్గరగా పెట్టి, లోపల క్రింది బెర్తుమీద భోజనాలు చేస్తున్నారు జనార్దనశర్మ, సోమేశ్వర రావు. తలుపు పక్కకు లాగి, వెంకటనారాయణ ద్వారం దగ్గిర నిలబడి అన్నాడు.

''నమస్కారమండీ జనార్దన శర్మగారూ!''

జనార్దనశర్మ తలెత్తి చూశాడు.

''ఓహో వెంకటనారాయణగారా! రండి రండి!''

''న్యూఢిల్లీ నుంచి వస్తున్నారా?''

''అవును, బోర్డు పనిమీద వెళ్ళాను.''

''మనమందరం చాల అదృష్టవంతులం, మన ఎక్స్‌ప్రెస్ తిన్నగా విజయవాడ మీంచి మద్రాసు పోతున్నది. ప్రొద్దుటి వార్తలను బట్టి మూడు నాలుగు రోజుల వరకూ థ్రూ సర్వీస్ ఉండదని భయపడ్డాం!''

''ఎవరీ ఆక్సిడెంటుకి ఎటెండయిన వారు?''

''శ్రీనివాసమూర్తిగారు!''

''సోమేశ్వరరావుగారూ! మధ్యాహ్నం నేను చెప్పడంలేదా? మూర్తిగారు రంగం లోకి వస్తే పనులు చాల తొందరగా, సాఫీగా జరుగుతాయి. ఎంత పనిచేసినా ఎవరికీ కష్ట మనిపించదు. ఎటువంటి పరిస్థితులలోనూ వెనుకంజ వేయని మనిషి.''

''అతను కాకుండా మరెవరేనా వస్తే మన మందరం హాయిగా కాజోపేటలో మరి కొంత కాలముండేవాళ్ళం.''

''వెంకటనారాయణగారూ! మీరు ఇవాళ బండి నడపడం లేదా?''

''నేను సెలవు తీసుకున్నాను. కనకారావు వడుపుతున్నాడు.''

''పరవాలేదు, అతను కూడా మంచి డ్రైవరే!''

''భోజనం చేయండి! వస్తాను.''

''మీతో మాట్లాడుతుంటే మాకేం ఇబ్బంది లేదు. మిమ్మల్ని చూస్తుంటే నాకెంతో ధైర్యంగా ఉంది.''

''అదేమిటలా అంటున్నారు?''

అపుడు సోమేశ్వరరావు కలుగజేసు కున్నాడు.

''నా పేరు సోమేశ్వరరావు, విజయవాడవెళ్తున్నాను. జనార్దనశర్మగారు నిన్న సాయం కాలం బండి ఎక్కిన దగ్గిర నుంచి టెన్షన్ లోనే ఉన్నారు. అతని మనసు ఇంకా కుదుట పడలేదు.''

''వెంకటనారాయణ గారూ! ఏమిటి చెప్పడం! ఈ సోమేశ్వరరావుగారికి ఏం పోయింది? లాయర్లకు పార్టీలుంటే చాలు నిరాటంకంగా రోజులు గడిచిపోతాయి. మన లాంటిరైల్వేవారికి అన్నీ సమస్యలే. ఎవడో ప్రబుద్ధుడు బ్రిడ్జి పేల్చి వేస్తానంటే భయపడతాం. రైళ్ళను కూల్చి వేస్తానంటే భయపడతాం.''

''అటువంటి అనుమానమేదేనా కలిగిందా?''

అప్పుడు జనార్దనశర్మ టూకీగా జరిగినది చెప్పాడు.

''అన్నీ బాగున్నాయి! ఆ పార్సెలు ఎక్కడ పోయింది?''

''అదే మిస్టరీ!'' అన్నాడు సోమేశ్వర రావు.

''కుమార రాజాగారిని బెదిరించడానికి రాణీ మోహినీదేవి ఆడిన నాటకమను కుంటాను'' అన్నాడు వెంకటనారాయణ

''ఇది మన దేశం. ఈ దేశాన్ని ఇంత సులువుగా ధ్వంసం చేస్తున్న వాళ్ళను నిలువున కాల్చి చంపాలి?'' అన్నాడు జనార్దనశర్మ.

''అయ్యా శర్మగారూ! ఆడపడుచుకిచ్చిన వాగ్దానం భంగం చేస్తారా?'' అన్నాడు సోమేశ్వరరావు.

''అయామ్ సారీ!.....''

వెంకటనారాయణ మరో అయిదు నిమిషాలు నిలబడి వెళ్ళిపోయాడు.

వెంకటనారాయణ కూపేలోకి వచ్చే సరికి పెరియనాయకి తిలకం దిద్దుకొంటున్నది. అతను తెచ్చిన చేతి సంచీలోని జలతారు నేతచీర, చీర బట్టతోనే జరీ అంచు చేతులమీదకు వచ్చినట్లు కుట్టిన జాకెట్టు ధరించింది. చేమంతి పూలదండ జడలో తురుముకొంది. అప్పుడే కోసి తెచ్చిన తామరపువ్వువలె ఆమె ముఖం కనిపించింది. వెంకటనారాయణకు.

''నారాయణా! మీకు ఆకలివేయడం లేదా?''

కారియరు ముందుకు తోస్తూ అంది పెరియ నాయకి.

''నాయకిని చూడగానే నా ఆకలి మాయమయిపోయింది.''

తరువాత అట్టే వాదించకుండా ఇద్దరూ భోజనానికి కూర్చున్నారు. గడచిన రాత్రి భోజనం, మధ్యాహ్నం భోజనం కూడా ఆమె వెస్టరన్ స్టైల్ లోనే చేసింది. ఇప్పుడు పూర్తిగా సౌతిండియన్ అంటే తెలుగు పద్ధతి కలిసిన భోజనమే చేస్తున్నది. ఎన్నాళ్ళ తరువాత ఇటువంటి భోజనం- కువాయత్‌లో హ్యాస్టల్‌లోనే భోజనం చేసేది. శాఖాహారిగా ఉండడానికి అన్ని ఇబ్బందులూ పడింది. పళ్ళు, పాలు, ఉడికించిన కాయగూరలు, ఆ విధంగా భోజనం సరిపెట్టుకుంది. వెంకటనారాయణ తెచ్చినవన్నీ ఆమెకు చాల ప్రియమయినవి.

భోజనం ముగిసిన తరువాత కిళ్ళీలు నములుతూ వాళ్ళిద్దరూ ఇంటి విషయాలు మాట్లాడుకున్నారు. వెంకటనారాయణ రెండేసి వారాలకు మద్రాసు పోయి పెరియనాయకి తల్లిగారిని చూసి, ఒక పూట ఆమెతో భోజనం చేసివస్తున్నాడు. ప్రతీ నెల పెరియనాయకి తన పేర పంపిన అయిదు వేల రూపాయల డ్రాఫ్ట్ మద్రాసు బాంకులో జమచేస్తున్నాడు పెరియనాయకి కూడా చాల డబ్బు తనలో తెచ్చింది. ఈ డబ్బు సంపాదించడం కోసమే, మూడు సంవత్సరాలు చెప్పలేని బాధపడిపోయారు ఇద్దరూ! డబ్బు సంపాదించాలంటే అంత కష్టమూ పడవలసిందే.

పెరియనాయకి నవ్వింది. అది సంకేతం తరువాత కార్యానికి.

క్రమంగా ఒకటీ ఒకటీ దుస్తులు తీసి, జాగ్రత్తగా మడతపెట్టి పై బెర్తు మీద పెట్టింది. వెంకటనారాయణ టీ షర్టు, బనియను, ఒకటీ ఒకటీ తొలగించి మడతలు పెట్టి బెర్తు మీద పెట్టింది.

ఒడ్డూ పొడవూ నిండుగా వున్న విగ్రహం పెరియనాయకిది. చూడముచ్చటగా ఉంది. వెంకటనారాయణకు. విశాలమైన ఛాతీతో, బలిసిన కండలతో, ఆరోగ్యమైన వెంకట నారాయణ శరీరం చూడడానికి పెరియనాయకి తొందర పడింది.

''ఈ స్వర్గ సౌఖ్యానికి మూడు సంవత్సరాలు దూరమయాను. జీవితంలో మరి నన్ను విడువ వద్దు.''

''నా నారాయణా! మిమ్మల్ని విడువను''

-- ఆమె అతనిలో కలిసిపోయింది.

2.15 ఆదివారం- 22 గంటలు- రాత్రి- మద్రాసు

భోజనం చేసి, నిద్రపోయే ముందు కురాను చదివి, ప్రార్థన చేస్తున్న రజియబేగమ్, మంచం పక్కనే ఉన్న బల్లమీదనున్న టెలిఫోను మ్రోగడంతో, తివాసి మీద నుంచి లేచి వచ్చి దానిని ఎత్తింది.

పానగల్ పార్కుకి దగ్గిరలో ఎకరం నర జాగాలో ఒక రెండంతస్తుల భవనం ఉంది. ముందు విశాలమైన లాను, పూల మొక్కలు, పోకచెట్లు, అశోకవృక్షాలు వెడల్పైన కంకర రోడ్డు తీర్చిదిద్దినట్టుంటాయి. వెడల్పయిన గేటుమీద ''రాజకుమార్ పిక్చర్స్ ప్రయివేట్ లిమిటెడ్ - మద్రాసు'' అని వ్రాసిన బోర్డు ఉంది.

కారుకోసం మరో గేలు, ఎడమచేతి బొండరీ వాలుకు తగిలి గారేజి ఉన్నాయి. క్రింద అంతస్తులో ఆఫీసు, లైబ్రరీ, చిన్న ఆడిటోరియము ఉన్నాయి. మీద అంతస్తులో కుమారరాజా, అతని పరివారం ఉన్నారు.

పరివారమంటే ఇద్దరు వంట మనుషులు, నలుగురు దాసీ కన్యలు. వారందరూ రజియాబేగమ్‌గారి ఆజ్ఞలు పాలిస్తూ ఉంటారు.

రజియా బేగమ్ ఆగ్రాకు చెందినది. హిందుస్తానీ సంగీతంలో ఆమె నిధి. ఖయాల్ ఘరానాకు చెందిన సంగీతమామెది. పెద్ద పెద్ద ఉస్తాదుల వద్ద శిక్షణ పొందింది. చాల కచేరీలు చేసింది. మనిషి బంగారం బొమ్మ. మనసు చాలా నిర్మలమైనది. ఇటువంటి శిరీష పుష్పం మీద నయాదిల్లీ నివాసి, తుపాకులూ, తూటాల వర్తకుడు జస్బీర్ సింగ్ తల్వండి నజర్ పడ్డది.

జస్బీర్ సింగ్ చాల డబ్బు రజియా తల్లి కిచ్చి, ఆమెను తన పోషణలోకి తీసుకున్నాడు. వారానికి నాలుగయిదు సార్లు వచ్చి ఆగ్రాలో గడిపేవాడు. రజియా చెల్లెలు సుల్తానాకు సంగీతంలో ప్రావీణ్యముంది. కచేరీలు కూడా చేసింది. సుల్తానా కూడా చాల చక్కనిది. రాణీ మోహినీదేవి నుంచి దూరమయిన కుమారరాజాకు జస్బీర్‌కు చాలా దోస్తీ. ఒక సాయంకాలం ఇద్దరూ బాగా మందు వేసుకొని. కారు మీద ఆగ్రా వచ్చారు. సుల్తానా, రజియా ఇద్దరూ పాడారు కుమారరాజా ఆ మరునాడు కూడా ఆగ్రాలోనే ఉండిపోయాడు. తరువాత ఒకనాటి సాయంకాలం రజియాతో సఫ్దర్ గంజ్ విమానాశ్రయంలో మద్రాసుకి ప్లేను ఎక్కేశాడు.

కుమారరాజాకి గుర్రపు స్వారీ కిట్టక పోయినా, ఏనుగు అంబారీలనెక్కి పెద్ద పులులను వేటాడేవాడు - రామనగర్ రిజర్వులో చాలకాలం ఎంపీగా ఉండడం చేత న్యూఢిల్లీ ప్రతీవారానికి, కనీసం రెండు వారాలకైనా వచ్చేవాడు. షికారీలందరికీ విధిగా జస్బీర్ సింగ్ స్నేహితుడు. అందుచేత వాళ్ళతో వేటకెళ్ళడం కాకుండా సంగీత కచేరీలకు గానాబజానాలకు హాజరవుతుండేవాడు. ఆ స్నేహాన్ని పురస్కరించుకొని కుమారరాజా మీద ప్రేమ సెచ్చియినను రజియాబీగం ఇంటికి తీసుకొనిపోయాడు.

జస్బీర్ సింగ్ చాలా ప్రయత్నాలు చేశాడు రజియాను తిరిగి తెచ్చుకోడానికి. కాని ఆమెకు కుమారరాజా మీద ఎడతెగని అభిమానం ముంచుకొని వచ్చింది. కుమార రాజా ఆమెకు సర్వాధికారాలు ఇచ్చివేశాడు. రజియా వచ్చిన తరువాత కుమారరాజా

జీవితం చాలవరకు మారింది. తాగుడు అతను మానలేదు. కాని మతి తప్పలుంలేదు. కనపడిన ఆడపిల్ల వెంటపడడం తగ్గించుకున్నాడు. లిమిటెడ్ కంపెనీలలో షేర్లుకొని మానేజింగ్ కమిటి మెంబరుగా వ్యవహరించేవాడు. కుమారరాజా బాల్యం, యవ్వనం ఇంగ్లండ్‌లోనే గడిచాయి. అందుచేత చదువు సంధ్యలు చాల పాలిష్‌డ్‌గా ఉండేవి.

జస్బీర్ సింగ్, రజియా తనను నిరాకరించడంతో వెర్రెత్తిపోయాడు. కుమార రాజాకు పరిణామాలు తెలియక జస్బీర్‌తో మామూలుగానే స్నేహం పాటించాడు. జస్బీర్ పరోక్షంలో కుమారరాజాకు పరమ శత్రువయాడు.

శనివారం నాడు ఉదయం హోటలునుంచి కుమారరాజా జస్బీరుతో మాట్లాడాడు. ఆరునెలల క్రింద జస్బీర్ కుమారరాజా బుర్రలో ఒకపురుగు దూర్చాడు. రాణీమోహినీదేవి ఆట కట్టాలంటే ఆవిడ పందెపు గుర్రాలని కొట్టాలి. తరుణం వచ్చిం దని, బోర్డుకు పోయి రేసు హార్సు స్పెషలు వేళలు కనుక్కోమని కుమారరాజాని పంపిం చాడు. తరువాత పథకమంతా తానే పూర్తిచేసి బాంబు సెట్‌చేసి, చెక్ తీసుకున్నాడు. బ్లోహాట్ అండ్ బ్లో కోల్డ్. ప్లానుకు ఎదురు ప్లాను సృష్టించి రాణీ మోహినీ దేవిని రం గంలోకి దింపాడు. ఆమె దగ్గిర మరికొంత డబ్బు సంపాదించాడు. రాణీమోహినీ దేవి పేరు పెట్టి అతను తన గుండె లోతులలో పాలు పోసి పెంచుతున్న పాము వంటి కోరిక ను వెలుపలికి తెచ్చాడు. ఒకే దెబ్బతో రెండు పనులు - కుమారారాజా ఖతమ్ - రజి యా బేగం నిరాటంకంగా తిరిగిరావడం-

జస్బీర్ సింగ్ కౌంట్‌డౌన్ చేస్తున్నాడు. ఇక ఓర్వలేకపోయాడు. మనసులోని రహస్యం రజియాతో చెప్పాలని మద్రాసుకి టెలిఫోను చేశాడు.

''హలో! నేను రజియాను!''

''ఓహో! నా బంగారం పిచుకా! నేను నీ ప్రియుడిని, జస్బీర్ సింగ్‌ని.''

''ఏం జస్బీర్! నీకు వేళాపాళా లేదా? ఈ అర్ధరాత్రి ప్రార్థనలు చేసుకుంటుంటే ఎందుకు నన్ను అల్లరిపెడతావు?''

''ఓ ప్యారీ రజియా! నిన్ను విడిచి చాలా యేళ్ళయింది. తొందరలో మనిద్దరం తిరిగి పూర్వంవలె కలిసి ఉంటాము.''

''నువ్వు పాగల్‌వి అయినావా? ఏమిటి మతి తప్పిన మాటలు.''

''నిజం! నిజం! నేనెప్పుడైనా నీతో అబద్ధం చెప్పానా? నీ స్నేహితుడు కుమార రాజాను పైకి పంపించేస్తున్నాను. అతను మరి తిరిగిరాని లోకానికి పంపుతున్నాను. ఆ వేళ చాలా దగ్గిరపడింది.''

''జస్బీర్! తప్పుడు మాటలనకు. కుమార్‌జీ నీకేం అపకారం చేశారు. ప్రతీ సంవత్సరం ఒక లక్ష రూపాయలో తుపాకుల కింద, తూటాల కింద నీకు తగలేస్తున్నారు కదా! ఇంకా నీకు ఆశ తీరలేదా?''

''అది వ్యాపారం! ఇది నా సొంత విషయం. మీ కుమార గంధర్వుడు జస్బీర్ సింగ్‌కే టోకరా ఇచ్చాడు. చాలా డిప్లమాటిక్ పద్ధతిలో అతనిని దారినుంచి తొలగిస్తున్నాను.''

''ఓ అల్లా!''

''నువ్వు చేయవలసినవి ప్రార్థనలే! నిజం నీకే తెలుస్తుంది కదా! ఒక అగ్నిపర్వతం పేలి, ఈ కుమారరాజా ఎగిరిపోతే, పోలీసులు నీకు టెలిఫోను చేసి శవాన్ని గుర్తు పట్ట మంటే ఎలా వుంటుంది? అప్పుడు మంచి మంచి ప్రార్థనలు చేద్దుగాని.''

''ఓ సైతాన్! నీ వంటివాడికి ఆ చావు రాకూడదా! ప్రపంచానికి పీడ విరుగు డవుతుంది!''

''అదే అదే! కౌంట్‌డౌన్ టైము సరిగ్గా రాత్రి పన్నెండు గంటలకు మొదలవుతుంది.....''

లైను కట్ అయిపోయింది.

రజియా బేగం మక్కావేపు తిరిగి, ప్రార్థన చేసే తివాసి మీద కూర్చుంది.

''ఓ భగవంతుడా! నన్ను రక్షించమని నిన్ను ఎప్పుడూ ప్రార్థించలేదు. ఎవరిని రక్షించాలో, ఎవరిని శిక్షించాలో నీకు తెలుసు. ఏ కోరికా లేకుండా లోక కళ్యాణమే కోరి నిన్ను ప్రార్థిస్తున్నాను తండ్రీ!''

2.16. ఆదివారం- 23 గంటలు- గ్రాండ్ ట్రంక్ ఎక్స్ ప్రెస్ డోర్నకలు విడుస్తున్నది

గార్డు ఆకుపచ్చ దీపం చూపించాడు. బ్రేక్సుమను కూడా ఇంజను వేపు తిరిగి ఆకుపచ్చ దీపం చూపించాడు. సిగ్నల్సు ఇచ్చారు. చిన్న మాస్టరు స్టేషను నుంచి ఆకు పచ్చ దీపం చూపిస్తున్నాడు.

డ్రైవరు కనకారావు ఎక్స్ ప్రెస్ ఇంజను హారన్ మోగించాడు.

తరువాత ఇంజనును స్టార్టు చేశాడు.

అసిస్టెంటు సీటులో విజయవాడ డివిజనల్ మెకానికల్ యింజనీరు శ్రీనివాస మూర్తి కూర్చున్నాడు.

కేసముద్రం సైటు దగ్గిరికి సరిగ్గా రాత్రి పదిగంటలకు గ్రాండ్ ట్రంక్ ఎక్స్ ప్రెస్ వచ్చి, కిలోమీటరు రెండు వందల దగ్గిర స్టాప్ ఆర్డరు ఉండడంవల్ల ఆగిపోయింది. అప్పుడు ఎక్స్ ప్రెస్ డీసెలు ఇంజనులోకి శ్రీనివాసమూర్తి ఎక్కాడు.

''నమస్కారం! మీ పేరు కనకారావు అనుకుంటాను''

''అవును సార్!''

''మీ అసిస్టెంటు పేరు?''

''నారాయణరావు సార్!''

ఇంజను మెల్లిగా పదికిలోమీటర్ల వేగంతో నడవడం మొదలుపెట్టింది.

''నేను విజయవాడవరకు ఇంజనులో ప్రయాణం చేస్తాను.''

''తప్పకుండా సార్!''

''ఇంజనులో ప్రయాణం చేయడానికి మీ అనుజ్ఞ కావాలి. వేలకొలది ప్రయాణీకుల భద్రత మీ చేతుల్లో ఉంది. మీ పనికేమైనా ఆటంకంగా ఉంటే దయచేసి చెప్పండి.''

''అదేం మాట సార్! మీరు మా ఆఫీసరు కదా?''

''అందుకోసమే చెప్తున్నాను.''

రైలు మెల్లిగా నడుస్తున్నది.

''కనకారావుగారూ! పెట్టె తీసి రెండో కళ్ళజోడు చూపించండి.''

మూర్తి కళ్ళజోడు చూశాడు. తరువాత రూల్‌పుస్తకాలు చూశాడు. పటాకాలు చూశాడు. సిగ్నలు జండాలు చూశాడు. ఇంజను రిపేరు బుక్కు చూశాడు. రిపేరు చేసిన తారీకులు చూశాడు. పుస్తకంలో సంతకం పెట్టాడు. ఇంజను కాబిన్ శుభ్రత చూశాడు. లోపలనున్న మీటర్లలో లైట్లు వెలుగుతున్నవో లేవో చూశాడు. కాజీపేటకు చెందిన ఇంజనది. మంచి కండిషన్‌లో ఉంది. ఇంజనెక్కిన ప్రతీ మెకానికల్ ఆఫీసరు చేసే పని ఇది. తరువాత శ్రీనివాసమూర్తి అస్టిస్టెంటు సీటులో కూర్చున్నాడు. కనకారావు మంచి చెడ్డలడిగి, అతను ఫ్లాస్కు నుంచి కప్పులో పోసి యిచ్చిన కాఫీ త్రాగాడు.

శ్రీనివాస మూర్తి బాగా అలసిపోయాడు. మధ్యాహ్నం రెండు గంటలకు తిన్న తిండి, సాయంకాలం కొంచెం టీ. రాత్రి భోజనం లేదు. అప్పటికింకా రిలీఫ్ ట్రెయినులో వంట కాలేదు. ఆకలి అంతగా లేదు. నిద్ర ముంచుకొని వస్తున్నది. పగలల్లా ఒక్క క్షణం తీరికలేదు. ఒకచోట కూర్చోలేదు. ఎన్నిసార్లో సైటులో ఈ కొస నుంచి ఆ కొసకు తిరిగాడు.

ఒకటే లక్ష్యం, రాత్రి ఎనిమిది గంటలకు లైను పూర్తికావాలి. ఆ లక్ష్యం చేరడానికి ఎన్నో ఆటంకాలు, విపరీతమైన శ్రమ, మానసికంగా ఒత్తిడి, వీటి అన్నిటికి గురి అయి, అంకుఠిత దీక్షతో రథం నడిపించాడు మూర్తి.

కార్యం సఫలమయిన తరువాత పడిన శ్రమ తెలిసి వచ్చింది. మరొక్క రెండు గంటలు ఇబ్బందిపడితే ఇల్లు చేరుకోవచ్చు. పద్మావతి జ్ఞాపకం వచ్చింది. సైటు విడిచే ముందర ఆఫీసు సారి అతనితో మాట్లాడాడు, కేశవయ్య. గ్రాండ్ ట్రంక్ ఎక్స్ ప్రెస్ విజయవాడ జంక్షన్ విడిచిపెట్టేదాకా డ్యూటీలో ఉంటానన్నాడు. ఆ మాట జ్ఞాపకం వచ్చి అతను చాల సంతోషించాడు.

ఎక్స్ ప్రెస్ డోర్నకల్ విడిచి పదినిమిషాలయింది. క్రాసింగులు దాటి స్టేషను లిమిట్స్ దాటి మెయిన్ లైనులో వేగాన్ని పుంజుకుంటున్నది. ఇప్పటికి పదిహేను నిమిషాల లేటులో నడుస్తున్నది. విజయవాడ సరియైన వేళకు చేరుకుంటుంది.

శ్రీనివాసమూర్తికి చిన్న కునుకుపట్టి నట్లయింది.

మూర్తి ఒక్కసారి తుళ్ళిపడిలేచి కూర్చున్నాడు.

ఇంజను వెనుకభాగంలో చప్పుడు వినిపించింది. హఠాత్తుగా ఎవరో వెనుక ఫుట్ బోర్డు మీదకు బూట్లతో గెంతినట్లయింది. పక్కనే ఉన్న స్పీడ్ మీటరు అతను చూశాడు. ఎనభై అయిదు కిలోమీటర్ల వేగంతో ఇంజను పరుగెత్తుతున్నది.

మళ్ళా అయిదు నిమిషాల తరువాత చప్పుడు మొదలయింది! మూర్తి సరిగా కూర్చున్నాడు. ఫుట్‌బోర్డు మీద బూట్ల చప్పుడు స్పష్టంగా తెలుస్తున్నది. క్రమంగా ఆ చప్పుడు దగ్గిర పడుతున్నది. అకస్మాత్తుగా డ్రైవరు వెనుకనున్న తలుపు శబ్దం చేస్తూ తెరచుకుంది.

శ్రీనివాసమూర్తి తెరచుకున్న తలుపు వేపు చూశాడు. తనవేపు గురిగా రివాల్వరు గొట్టం చూస్తున్నది. మరొక రివాల్వరు గొట్టం డ్రైవరు కనకారావుకి తగిలి ఉంది.

''దోస్తోం! హటో మత్!''

ఆ మాటలు ఉరుములా వినవచ్చాయి. తలుపు జోరుగా చప్పుడు చేస్తూ మూసుకుంది.

డ్రైవరు మెనుక రెండు చేతులతోను రివాల్వర్లు గురిచేసి నిలుచున్న పెద్దమనిషి ఆరడుగుల ఆరంగుళాల వరకు పొడుగు ఉంటాడు. చాలా విశాలమయిన ఛాతీ. తొడుక్కున్న మిలిటరీ చొక్కా దండలమీదకు జరిగి ఇనుప గుళ్ళవంటి కండలను చూపిస్తున్నాది.

ఆ వచ్చిన మనిషి మేఘ గంభీర స్వరంతో మాట్లాడాడు హిందీలో. హయహేషలలె అతని కంఠం వినిపించింది.

''డ్రైవరు సాబ్! మీ పేరేమిటి?''

''కనకారావు!'' తొణక్కుండా అతను జవాబు చెప్పాడు.

''ఆ పక్కనున్న పెద్దమనుషు లెవరు?''

''ఒకరు, నిలబడి ఉన్నవారు నా అసిస్టెంట్, రెండవ అతను మా ఆఫీసరు.''

''భేష్! ఇక్కడో ఉల్లూ కా పత్థా ఉన్నాడన్నమాట. ఈ ఉపోద్ఘాతం చాలు? డ్రైవర్ నేను చెప్పే మాటలు విను. నా పేరు గబ్బర్‌సింగ్! ఢాకూ గబ్బర్‌సింగ్ పేరు విన్నావా?''

ఆ మాటలు విన్న ముగ్గురూ అదిరి పోయారు. అంత గట్టిగా అరిచాడు వాడు.

''మీకు తెలుసా! ఈ గబ్బర్ సింగ్ తల మీద పదివేల రూపాయల బహుమతి ప్రభుత్వం ఉంచిందన్న సంగతి?''

వారికి తెలియదు.

గబ్బర్ సింగ్ నవ్వాడు.

''గబ్బర్ సింగ్ తల దొరకాలంటే ఎన్ని వేల తలలు తెగి దొర్లాలో! భేష్! ఇక నా ఆజ్ఞలు వినండి. డ్రైవర్! ఇదే వేగంతో నేను ఆపమనేదాకా రైలు నడిపించాలి. నా ఆజ్ఞ లేనిది రైలు ఆపితే, వేగం తగ్గిస్తే తల వెయ్యి చెక్కలుగా పగుల్తుంది.''

ఇంతలో ఖమ్మం స్టేషను వచ్చింది. క్రాసింగులమీద స్పీడు తగ్గించాలి, డ్రైవరు ఏనిమిదో నాచ్ నుంచి అయిదో నాచ్‌కి వేగం తగ్గించాడు.

రివాల్వరుతో గబ్బర్‌సింగ్ డ్రైవరు తలమీద మోచాడు.

''అరే బేవకూఫ్! గబ్బర్‌సింగ్ మాటలంటే తమాషాగా ఉందా? వేగం మళ్ళీ పెంచు. చచ్చిపోవాలని ఉందా?''

''నేను చచ్చినా ఫర్వాలేదు. నా వెనుక నున్న వేల కొద్ది ప్రయాణీకులు చచ్చి పోడానికి వీలులేదు.''

''బక్ బక్ చేయకు, నువ్వు నా మాటలు వింటే చచ్చిపోవు, వాళ్ళూ చచ్చిపోరు. ఈ రైలు గబ్బర్‌సింగ్ చెప్పినట్లు పరిగెడుతుంది. మీరిద్దరూ అంత దూరంలో ఉంటే పనికిరాదు. రండి! ఇదేదో ఉంది! దీని దగ్గరికి రండి. నా మాట వినకపోతే మిమ్మల్నందరినీ చంపుతాను.''

''మేం చస్తే నువ్వూ బ్రతకవు'' అన్నాడు డ్రైవరు.

గబ్బర్ సింగ్ నవ్వాడు. ఆ నవ్వు సింహం అడవిలో గర్జించినట్లయింది. రెండో పక్క నున్న డ్రైవరు అసిస్టెంటు, మూర్తి, డ్రైవరు ఎదురుగానున్న కంట్రోలు స్టాండు వెనుక నిలబడ్డారు. డ్రైవరు మళ్ళా ఎనిమిదో నాచికి లాగి, వేగం హెచ్చించాడు.

ఖమ్మం స్టేషనులో కాబిన్ మాను, చిన్న మాస్టరూ చాలా వేగంతో పోతున్న యింజను వేపు చూశారు. దృశ్యంగా కాబిన్‌లోని మనుషులు కనిపించారు. చిన్నమాస్టరు ఒక్కపరుగున ఆఫీసులోకి పోయి కంట్రోలు ఫోనుమీద కేశవయ్యను పిలిచాడు.

''కేశవయ్యా, కొంప మునిగింది. చాల ఎత్తుగా నున్న వాడొకడు గ్రాండ్ ట్రంక్ ఎక్స్ ప్రెస్‌ను హైజాక్ చేస్తున్నాడు. క్రాసింగులమీద వేగం తగ్గించినళ్లే తగ్గించి స్టేషను దాటుకుండానే వేగం పెంచాడు. ఇంజనులో డ్రైవరూ, అసిస్టెంటూ కాక మరొకరు కూడా ఉన్నారు. అతనివేపు కూడా రివాల్వరు గురి పెట్టాడు.''

''ఇంజనులో డి.ఎమ్.యీ. మూర్తిగారున్నారు. మీరు నాకు కొంచెం ఆలోచించు కోవడానికి అవకాశమివ్వండి!''

''ఆలోచనేమిటయ్యా! కొంపలు ముట్టుకుపోతుంటే.''

''అటువంటప్పుడే చాలా తెలివిగా ప్రవర్తించాలి. మీరు గోలచెయ్యకండి. మీ కాబిన్ మానుతో కూడా గొడవచెయ్యవద్దనండి. మనం చేసే చిన్న తెలివి తక్కువపనికి వేలకొలది ప్రయాణీకులు చచ్చిపోతారు. మూర్తిగారు ఇంజనులో ఉన్నారు. కాబట్టి మనం ధైర్యంగా ఉండవచ్చు. నేను చేయవలసిన పని నేను చేస్తాను.''

ఖమ్మం తరువాత పందిళ్ళపల్లి ఉంది. అక్కడి సిగ్నల్సు లూప్ లైనుకిస్తే బహుశా డ్రైవరు అలవాటు ప్రకారం వేగాన్ని పదిహేను కిలో మీటర్లకు తగ్గించవచ్చు. అప్పుడు నలుగురూ రైలును ఆపవచ్చు.

కాని పందిళ్ళపల్లి స్టేషనులో కేశవయ్య అనుకున్న ప్రకారం ఆగలేదు. సిగ్నల్సు లూప్ లైనుకే యిచ్చారు. గంటకు పదిహేను కిలో మీటర్ల వేగంతో ఆ లైను మీద రైలు నడవాలి. స్టేషను స్టాఫ్ చూస్తున్నారు. ఆ వంపుల మీద, క్రాసింగుల మీద నూరు కిలో మీటర్లు వేగంతో రైలు పరుగెత్తింది. రైలు పెట్టెలు పాము మెలికలు తిరిగినట్లు పాయింట్ల మీద పరుగెత్తాయి. ఆ వేగానికి, ఆ ఊపుకి మీద బెర్తుల వాళ్ళు పడిపోయారు. సామానులు తుళ్ళిపోయాయి. అదృష్టవశాత్తు బండి పడిపోలేదు.

కేశవయ్యకు మతిపోయింది. ఇంజనులో తమ్ముడున్నాడు, వృద్ధిలోకి రావలసిన వాడు. ఇంజను పట్టాలు తప్పినా అందులోనివాళ్ళు నామరూపాలు లేకుండా పోతారు. ఆ హైజాకరుని పారపాటున ఎదిరిస్తే నిర్దాక్షిణ్యంగా వాడు ముగ్గురిని కాల్చిచంపుతాడు.

కేశవయ్య కళ్ళవెంట ధారలుగా కారుతున్న నీళ్ళు తుడుచుకున్నాడు. మూర్తి కేదో అనుమానముంది. అందుకే తనను వెళ్ళిపోమని బలవంతం చేయలేదు. ఇంకా తొంభయి కిలో మీటర్ల దూరముంది. రమారమి గంట ప్రయాణం. ఈ గంట లోనే ఏమేనా జరగవచ్చు. కాని తను చేయ వలసిన ముఖ్యమైన పని ఒకటి ఉంది. మిగిలిన స్టేషన్లన్నింటిలో మెయిన్‌లైను ఖాళీగా ఉంచి, సిగ్నల్సు త్రూగా యివ్వాలి. ఆ విధంగా బలవంతంగా బండిని లూప్ లైను మీద పరుగెత్తించి పడదోసే ప్రమాదాన్ని తప్పించవచ్చు. వెంటనే కేశవయ్య అన్ని స్టేషనులకు ఈ మెసేజి అందజేశాడు.

చింతకాని నూరు కిలో మీటర్ల వేగంతో చేరుకుంటున్నది రైలు.

''భేష్! డ్రైవర్ ఇప్పుడు బోధపడిందన్నమాట ఈ గబ్బర్‌సింగ్ సంగతి. నీకు తెలుసా నేనెలా ఇంజనులోకి వచ్చానో? మీరందరూ గడ్డాలు, మీకు గబ్బర్‌సింగ్ సంగతి తెలీదు వినండి.''

ఇంజనులోని మిగిలిన ముగ్గురూ వింటున్నారు.

''హైదరాబాద్‌లో సేఠ్ రూపచంద్ కొడుక్కి ఎల్లుండి బుధవారం పెళ్ళి. పెళ్ళిలో రూప్ చంద్‌ను, కొడుకును చంపితే రెండు లక్షలిస్తామని మరొక పార్టీ వారు చెప్పారు. గ్వాలియరు నుంచి నాగపూరు కారులో వచ్చాను. నాగపూరు నుంచి బ్లూర్‌షా లారీలో వచ్చాను. తరువాత రెండెడ్ల బండిలో రెండు పూటలు ప్రయాణం చేశాను. పెట్రోలు

టాంకరు మీద మొన్న రాత్రికి కాజోపేట చేరుకున్నాను. పోలీసులు నా వెంటపడ్డారు నన్ను పట్టుకొని ఖమ్మం జైలులో పెట్టారు నిన్న నా గురించి వివరాలు తెలుసుకోడానికి ఢిల్లీ ఫోను చేశారు ఇంకా వాళ్ళు జవాబుకోసం ఎదురు చూస్తున్నారు.''

చింతకాని మెయిన్ లైను మీదే ఎక్స్ ప్రెస్ వెళ్ళింది. వేగమేమీ తగ్గలేదు. గబ్బర్ సింగ్ తిరిగి చెప్పడం మొదలుపెట్టాడు.

''ఇవాళ రాత్రి ఎనిమిది గంటలకు భోజనం తీసుకొని ఒక సెంట్రీ నా గదికి వచ్చాడు. బేడీలు వేసిన చేతులతో వాడి తలమీద కొట్టాను. బేడీలు ఒక్క ఊపుతో తెగి పోయాయి. వాడి జేబులో తాళం తీసి బైటికి వచ్చాను. గబ్బర్‌సింగ్ సంగతి పోలీసు స్టేషను వాళ్ళకు తెలీదు. స్టేషనులో ఎవరో రైటరు రాసుకుంటున్నాడు. తల మీద మోది బేడీల తాళం తీశాను. ఎవడో పెద్దమనిషి మోటార్ సైకిలాపి హోటల్‌లోకి వెళ్తే, నా జేబులో నున్న తాళంతో దానిని స్టార్టుచేసి రోడ్డుపట్టాను. నా వెనుక అరుపులు, కేకలు- అంతే, ఆ ఊరు ఏ వూరో? లెవెల్ క్రాసింగ్ దగ్గిర మోటార్ సైకిలు పడేసి స్టేషనువేపు పరుగెత్తాను. వెనుకనో ఎర్ర లైటు వెలుగుతున్నది. దగ్గిరకు వస్తుంటే ఇంజను మోత వినిపించింది. ఆ ఆఖరిపెట్టె పారిపోతుంటే రెండే అడుగులు వేసి వెనుకనున్న ఇనుపనిచ్చెన పట్టుకొని పెట్టె మీదికి ఎక్కాను. పెట్టె మీద నుంచి పెట్టి మీదకి గెంతి రైలు పరుగెత్తుతుంటే అన్ని పెట్టెలు దాటి యింజను ఫుట్ బోర్డు మీదికి గెంతాను. ఇదంతా గబ్బర్ సింగ్‌కి చిన్నపిల్లలాడే ఆట. ఇక ఈ రైలు నేను చెప్పినట్లు నడుస్తుంది.''

మూర్తి, అతని పక్కను డ్రైవరు అసిస్టెంటు నారాయణరావు చేతులెత్తి డ్రైవరు కంట్రోలు స్టాండు వెనుక నిలబడ్డారు. ఏ పాటి కదిలినా గబ్బర్‌సింగ్ రివాల్వరు ఊపితే చాలు, వీళ్ళ తలలు పగులుతవి.

మూర్తి గబ్బర్‌సింగ్‌ని చూస్తున్నాడు. అతను మూడేళ్ళ క్రిందట స్వయంగా చూసిన సంఘటన జ్ఞాపకం వచ్చింది. అప్పుడు తను షుకూర్ బస్తీ డీసెల్ షెడ్‌లో షంటింగ్ డీసెలు ఇంజనుల గురించి ట్రెయినింగు అవుతున్నాడు. ఢిల్లీకి సమీపంలో షుకూర్ బస్తీ ఉంది. పదిహేను రోజులు అక్కడ ఉన్నాడు. టుండ్లా తరువాత రెండు మూడు స్టేషనులు దాటితే షికోహా బాదు స్టేషనుంది. ఆ స్టేషను మాస్టరు తెలుగు వాడు. ఎక్కడనో దూరపు చుట్టం. అతనిని చూడడానికి ఒక శనివారం మధ్యాహ్నం తను వెళ్ళాడు.

స్టేషను మాస్టరు ఇంటికి ఎదురుగా చిన్న మాస్టరు యిల్లు ఉంది. అతను హిందూస్తానీ వాడు. అతనికి మరొక పెద్దమనిషికి వారంరోజుల క్రింద ఊళ్ళో దెబ్బలాట జరిగింది. శుక్రవారంనాడు సాయంకాలం ఎవరో పదేళ్ళ కుర్రాడు యింటివాళ్ళతో చెప్పిపోయాడు, శనివారం రాత్రి ఎనిమిది గంటలకు వాళ్లింట్లో డెకాయిటీ జరుగుతుందని. ఇంటి యజమాని ఆ మాటలు పట్టించు కోలేదు. సరిగా శనివారం ఎనిమిది గంటలకు గుర్రాలమీద నలుగురు ఆజానుబాహులు వచ్చారు. తలలకు పగిడీలు ఉన్నాయి. వాళ్ళు నిర్భయంగా తలుపులు తట్టి ఇంటిల్లి పాదిని చావమోది సమస్తం దోచుకుపోయారు. అప్పుడు చిన్న మాస్టరు డ్యూటీలో ఉన్నాడు. ఇంటి దగ్గర పని అంతా చక్కబెట్టి, స్టేషనులో ప్రవేశించి, అతనిని చితకతన్ని, కాళ్ళు చేతులు కట్టి రైలు లైను మీద పడేసి వెళ్ళిపోయారు. తాను తన కళ్ళతోనే చాలభాగం చూశాడు. బయటికి వెళ్ళి చూడాలనుకుంటే ఇంటి వాళ్ళు వారించారు. మరునాడు సాయంకాలం కూరల మార్కెట్లోనే మళ్ళా మరొక బందిపోటు దొంగ కనిపించాడు. అతను ఆరడుగులు మించి వున్నాడు. చాలా ఎత్తైన గుర్రంమీద వచ్చాడు. పంచ కట్టుకున్నాడు. కాకీ చొక్కా తొడుక్కున్నాడు. తలకు పాగా చుట్టుకున్నాడు. వెడల్పైన ముఖం. అతని జబ్బలు మామూలువాళ్ళ తొడలంత బలంగా ఉన్నవి. అతను చాలా హుందాగా స్వారీ చేస్తూ కూరల మార్కెట్లోకి వచ్చాడు. ఒక ముసలివాడు పెద్ద తట్టలో జామపళ్ళు అమ్ముతున్నాడు. అటువేపు వచ్చి ఆ పళ్ళ తట్టముందు గుర్రాన్ని ఆపాడు. గుర్రం తట్టలోని పళ్ళు తినడం మొదలు పెట్టింది. రౌతు దానిమీద కూర్చొనే ఉన్నాడు. పళ్ళు అమ్ముతున్న ముసలివాడు దూరంగా పోయి దండం పెడుతూ నిలుచుండిపోయాడు. పదినిమిషాలపాటు గుర్రం తినడం అయిన తరువాత, ఆ గుర్రం మీదనున్న మనిషి జేబులోంచి పదిరూపాయలనోటు ఒకటి తీసి ఆ పళ్ళమ్మేముసలాడి మీద విసిరి చాల ధీమాగా గుర్రాన్ని నడిపించుకుంటూ వెళ్ళి పోయాడు. పోలీసులెవ్వరూ జోక్యం కలిగించుకోలేదు. ఆ ప్రాంతం ప్రజలు ఇటువంటి దృశ్యాలకు అలవాటుపడిపోయారు. చంబల్ లోయలోంచి, నర్మదానది తటాలనుంచి, వింధ్య పర్వత ప్రాంతాల నుంచి బందిపోటు పేరును సార్థకం చేసిన వాళ్ళలో గబ్బర్‌సింగ్ ఒకడు.

నాగలవంచ కన్ను మూసి తెరిచే అంతలో మాయమైపోయింది.

మళ్ళా గబ్బర్‌సింగ్ చెప్పడం మొదలు పెట్టాడు.

''మాట్లాడుతూ పోతే ప్రయాణం సరదాగా ఉంటుంది. గబ్బర్ సింగ్ సంగతి

మీకే మాత్రం తెలియదు. అతనికి ఆజ్ఞలు ఇవ్వడమే కాని ఆజ్ఞలు పొందడం తెలియదు.''

''అవునవును ఇలువంటి తెలివితక్కువ ఆజ్ఞలు ఇచ్చి మనుషుల నిండు ప్రాణాలతో ఆటలాడడం తెలుసు.'' అన్నాడు కనకారావు.

''అరే డ్రైవర్! బక్ బక్ మత్ కరో! నీలా భయపడి మంచీ, చెడ్డా ఆలోచిస్తే నేను డాకూనెలా అవుతాను? నా ఆట అంతా మనుషుల నిండు ప్రాణాలతోనే- ఎవరి ప్రాణాలూ రక్షించాలన్నా, ఎవరి ప్రాణాలన్నా తీయాలన్నా వందలకొలది మైళ్ళు ప్రయాణం చేసి పనిచేసురావడం మాకు కుల విద్య. జీవితం మీవంటి పందికొక్కులు ఎలా అనుభవించగలరు? నేను కోరిన బట్ట కట్టగలను. రాజసౌధాలలో నిర్భయంగా నిద్రపోగలను. బీదవాడి గుడిసెలో భోజనం చేస్తాను. రాఖీ కట్టిన చిన్నదానిని కళ్ళు ఎత్తి కూడా చూడను. గుర్రం మీద కోటగోడలు దాటి రాణివాసంలో ఉన్న సుందరీమణులను ఎత్తుకొని పోయాను. పొగరెక్కిన ఆడవాళ్ళను, వాళ్ళ భర్తలను కట్టివేసి, వారి ఎదుటే అనుభవించాను. నాకు పద్దెనమండుగురు పెళ్ళాలున్నారు. హైదరాబాద్‌లో రూపచంద్ కాబోయే కోడలు అతిలోకసుందరట, ఆమెతో పంధొమ్మండుగురు అవుతారు.''

గబ్బర్ సింగ్ నవ్వాడు తన చరిత్ర చెప్పుతూ.

బొనకలు రెప్పపాటు కాలంలో దాటిపోయింది.

''గబ్బర్ సింగ్‌గప్పాలు కొట్టడు. చెప్పాలంటే ఎన్నో వింతలున్నాయి. మీకు తెలుసా ఒక్క సంగతి. ఈ డాకూ పరమేశ్వర భక్తుడని! నర్మదా నదీ తీరాన, ఏకాంత మైన ప్రదేశంలో చలువరాతితో శివమందిరం కట్టించాడీ గబ్బర్ సింగ్! వేయి తామర పూలతో పూజచేస్తాడు శివరాత్రికి. గబ్బర్ సింగ్ చేసిన దానధర్మాల గురించి మీకు తెలుసా? మీ ముగ్గురూ మూడువండల సంవత్సరాలు మీ కుటుంబాలతో తిన్నా తరగని నిధిని శివరాత్రి నాడు పంచాడీ గబ్బర్ సింగ్. ఇప్పుడేముంది అతని దగ్గిర- డబ్బు కాదు. వజ్రం వంటి కలేజా!''

మోటమారి సిగ్నల్సు కనిపిస్తున్నాయి, కనిపించాయి, దాటిపోయాయి.

మూర్తి గబ్బర్ సింగ్ వేపు చూస్తున్నాడు. మూర్ఖులలో పరమ మూర్ఖుడు. బలవంతులలో మహాబలవంతుడు. రివాల్వరు గురి చూసి పేల్చడంలో అతనికి సాటి మరెవరూ లేరు. రెండు చేతులతోనూ, వేర్వేరు దిక్కులలో ఉన్నవారిని ఒకేసారి కాల్చి చంపగలడు. ఎంతవరకూ ఇలా రైలును పరిగెత్తిస్తాడో తెలియదు. దోర్నకలు పదకొండు

గంటలకు విడిస్తే, పదకొండూ ముప్పై నిమిషాలకు బొనకలు దాటింది. గబ్బర్ సింగ్ చేతివాచిలో అప్పుడు చైము కనిపించింది. ఇప్పుడు మోటమారి దాటుతున్నది. ఇలా మీనం మేషం లెక్క పెడుతుంటే ఘోరమైన హెడాన్ కాలీషన్ కోసం ఎక్స్ ప్రెస్ దౌడు తీస్తున్నది.

ఈ రైలుని ఆపాలి!

గబ్బర్ సింగ్ రివాల్వరు పేలుస్తాడు.

లోకంలో గబ్బర్ సింగ్ ఒక్కడేనా కలేజా ఉన్నవాడు?

గబ్బర్ సింగ్‌కి కలేజా ఉంది కాని బుర్ర లేదు.

మూర్తి నిలబడలేక పోతున్నాడు. కాళ్ళలో నెత్తురులు దిగిపోయాయి. ఒకకాలి మీద బరువుంచి, రెండో కాలు కొంచెం పక్కకు కదిపాడు. అతని కాలికేదో గుచ్చుకున్నట్లయింది.

అసాధారణమైన పరిస్థితులు సహాయం చేస్తాయి ఒకప్పుడు. మూర్తి ఆలోచిస్తున్నాడు. అతను డ్రైవరు అసిస్టెంటు సీటులో కూర్చున్నప్పుడు ఒక విషయం గమనించాడు అక్కడ సాధారణంగా ఉండవలసిన వస్తువొకటి కనిపించలేదు. ఆలోచన ఇంకా తీవ్రంగా సాగింది. కొన్ని ఇంజనులలో ఆ వస్తువుని డ్రైవరుకి ఎదురుగా వున్న కంట్రోలు ప్లాండు మెనుకను అమర్చారు. ఈ మార్పు గురించి పైనుంచి ఒక ఉత్తరం కూడా వచ్చింది. మరి సందేహించవలసిన అవసరం లేదు.

గబ్బర్‌సింగ్ తిన్నగా డ్రైవరు తల మీద నుంచి హెడ్ లైటు వెలుతురులో కనిపిస్తున్న రైలు లైను చూస్తున్నాడు. తొందరగా మెనుకకి పోతున్న టెలిగ్రాఫ్ స్తంభాలను చూస్తున్నాడు.

ఉన్నట్టుండి కాలితో బలంగా ఎమర్జన్సీ బ్రేక్ వాల్వును నొక్కాడు మూర్తి.

వాక్యూమ్ బ్రేక్ పైపుకి ఆ వాల్వుకి మార్గముంది. ఆ వాల్వు పైకి లేచినవెంటనే, చుట్టూ ఉన్న వాతావరణంలోని గాలి, గాలి లేని వాక్యూమ్ బ్రేక్ పైపులోకి శబ్దం చేస్తూ ప్రవేశించింది.

''క్యాహువా? క్యా హువా?'' గర్జించాడు గబ్బర్ సింగ్.

''ఇంజన్ ఖరాబ్ హోగయా!'' చాల ధీమాగా జవాబిచ్చాడు మూర్తి.

''ఏయ్ డ్రైవర్! స్పీడ్ బఢావ్!'' అరుస్తున్నాడు గబ్బర్ సింగ్ మేగం తగ్గి పోతుంటే-

చక్రాలకు బ్రేకులు చాల తొందరగా పడుతున్నాయి. కీచుమంటూ శబ్దం చెవులను చిల్లులు పెడుతున్నాది.

''గబ్బర్ సింగ్ కి కలేజా ఉందిగాని అక్కరే లేదు. గుర్రాన్ని ఇంత వేగంతో దౌడు తీయిస్తే పడిచస్తుందని తెలీదా? గబ్బర్ సింగ్ గుర్రాలను చంపినట్టే ఈ ఇంజనును ఖరాబ్ చేశాడు'' అన్నాడు డ్రైవరు.

''సాలా! కోరుండి చేశావా- నిన్ను చంపుతాను.''

డ్రైవరు భయంతో డక్ చేశాడు. కొంచెం ఎడమకు వంగి చేశాడు. రెప్పపాటు కాలంలో గబ్బర్ సింగ్ కుడిచేతిలోని రివాల్వరు పేలింది.

''శివశివా!'' పెద్దగా అరచి డ్రైవరు కనకారావు నిలువునా కూలిపోయాడు. రివాల్వరు తూటా అతని శరీరంలోంచి వచ్చి, ఎదురుగా వున్న లుక్ అవుటు గ్లాసును కన్నం పెట్టి వెళ్ళిపోయింది. అది టఫెన్డ్ గ్లాసు కాబట్టి ముక్కలు ముక్కలు కాలేదు.

చాల తొందరగా రైలు వేగం తగ్గి పోతున్నది.

మూర్తి, నారాయణరావు శిలాప్రతిమలవలే చేతులెత్తే ఉండిపోయారు.

రైలాగిపోతున్నది. గబ్బర్ సింగ్ గాభరాపడుతున్నాడు. రైలాగితే వేలకొలది ప్రయాణీకులు ఇంజనులోనున్న తనను పట్టుకుంటారు.

''సువార్ కా బచ్చా ధోకా దియా!'' అరుస్తూ గబ్బర్ సింగ్ ఇంజను తలుపు డ్రైవరు సీటు వెనుకనున్న దానిని తీసుకొని, ఫుట్ బోర్డుమీద క్షణం నిలబడి కిందికి గెంతేశాడు.

తక్షణం మూర్తి డ్రైవరు కనకారావుని లేవనెత్తాడు తూటా అతని కుడి జబ్బను పక్కగా చీల్చుకొని వెళ్ళిపోయింది. ఎముక వరకూ పోలేదు కాని నెత్తురు వరదలుగా కారుతున్నది.

నారాయణరావు, మూర్తి కనకారావుని ఎత్తి కాబిను మధ్యకు తీసుకొచ్చారు. చంకలో నరాన్ని బలంగా నొక్కి పట్టుకున్నాడు మూర్తి. నెత్తురు కారకుండా ప్రెషర్ పాయింటు నొక్కుతున్నాడు. నారాయణరావు జగ్గులో నున్న మంచినీళ్ళు కనకారావు ముఖం మీద జల్లాడు.

''నారాయణరావ్! నా అటాచీలో మడతలుంగీ ఉంది తీసుకొనిరా!'' మూర్తి లుంగీ చింపి, గాయంలో గుడ్డకుక్కి పైన ఒక పీలికతో కట్టాడు.

''సార్! గబ్బర్ సింగ్ పారిపోతున్నాడు!''

''అతని జోలి మనకిప్పుడు వద్దు. ముందు మన డ్రైవరును రక్షించు కోవాలి. మధిర ఎంత దూరం?''

''ఇక్కడికి అయిదు కిలోమీటర్లు.''

''ఫ్లాస్క్‌లో ఇంకా కాఫీ ఉందా?''

'' ఉంది సార్!''

''కనకారావుగారూ! ధైర్యంగా ఉండాలి. గొప్ప ప్రమాదం తప్పిపోయింది. రెప్ప పాటు కాలంలో మృత్యువు దూరమయింది. కండకే గాయమయింది. చేయిమీదకెత్తు కొని కూర్చోండి, కాఫీ తాగండి.''

డ్రైవరు కనకారావు రెండు సీట్లకు మధ్యను ఉంచిన లైను బాక్సు మీద కూర్చు న్నాడు. తెలివి వచ్చింది. గాయం మంట పెడుతున్నది నారాయణరావు ఇచ్చిన కాఫీ అతను తాగుతున్నాడు.

రైలు ఆగి పది నిమిషాలయింది.

మూర్తి డ్రైవరు సీటు పక్కనున్న కిటికీలోంచి రైలు వేపు చూశాడు. దూరంగా, రైలు లైనుకు పది అడుగుల దూరంలో వున్న కాలిబాట మీదగబ్బర్ సింగ్ నడుస్తున్నాడు.

మూర్తి తిరిగి డ్రైవరు దగ్గిరికి వెళ్ళాడు, టైము చూసుకున్నాడు. జీరో అవ ర్సుకి పది నిమిషాలు బాకీ ఉన్నాయి.

గబ్బర్ సింగ్ ఇంజను మీద నుంచి గెంతి, ఏటవాలుగా వున్న గుట్టమీద నుంచి జారిపోయాడు. కాళ్ళు నిలదొక్కుకొని లేచాడు, ఇంజను వేపు చూశాడు. ఎవరూ కని పించలేదు. హెడ్ లైటు వెలుతురు ఇంజను ముందువున్న భాగాన్ని వెలుగులో ముంచెత్తు తున్నది. అటువేపు వెళ్ళరాదు.

గబ్బర్ సింగ్ వెనుకకు తిరిగి గార్డు పెట్టెవేపు అడుగులు వేస్తున్నాడు. రైలు పెట్టెలలో దీపాలు ప్రకాశవంతంగా ఉన్నాయి. ప్రతి పెట్టెలోను కిక్కిరిసి ఉన్నారు ప్రయాణీకులు. ఇంజను రెండు పెట్టెల వెనుక నున్న బ్రేక్‌మను కాబోలు పెట్టె దిగుతున్నాడు. మధ్య దారిలో రైలాగి పోయింది. డ్రైవరు హారను కూడా మోగించలేదు. కాబట్టి అతను వెళ్ళి కనుక్కోవాలి.

గబ్బర్ సింగ్ చాల నిదానంగా అడుగులు వేస్తున్నాడు. పెద్దపులి ఎరను అనుస రించే టప్పుడు చాల చక్కగా నెమ్మదిగా నడుస్తుంది. అయిదు పెట్టెల దూరం అప్పుడే

నడిచి వచ్చాడు. ఉన్నట్టుండి రైలు పెట్టెల కాంతిలో ఒక మనిషి తనకేసి నడిచి రావడం చూశాడు గబ్బర్ సింగ్. అతని చేతిలో పెద్ద సూట్ కేసు ఉంది. అతనికి తనకి రమారమి రెండు పెట్టెల దూరముంది.

ఆ వస్తున్నవాడు మరెవడో కాడు జంబులింగం.

జంబులింగం రాత్రి డిన్నర్లిచ్చి, ఏసీ కోచివారిని నిద్రపుచ్చే సరికి డోర్నకలు వచ్చింది. మూడు నిమిషాల తరువాత తిరిగి రైలు బయలుదేరింది. జంబులింగం సావకాశంగా లగేజి రూంకు వచ్చి కూర్చున్నాడు. క్రిందనున్న పళ్ళబుట్ట మీద పడుతున్న చూపులు మీదకు ఎత్తి ఊదారంగు వి.అయ్.పి సూట్‌కేసు మీద కేంద్రీకరించాడు. ఆ పెట్టె యజమాని కూపే లోపల ఆ చిన్నదానితో చాల బిజీగా ఉన్నాడు. ఈ రాత్రిపూట అతనిని బైటికి రానీయదు ఆమె.

జంబులింగం ఊహలు ఒక్కసారి మొద్దుబారిపోయాయి. ఏదో చిన్న స్టేషను లోంచి పక్కలైను మీద పోతున్న రైలు వెర్రిగా ఊపేసింది. రైలు పెట్టెలు పడిపోయే టట్లు వెర్రులెత్తి పరిగెడుతున్నది. జంబులింగానికి బాగా నమ్మకముంది. పెరుగుట విరుగుట కొరకే. ఈ రైలు విజయవాడ చేరకుండా మధ్యలో ఎక్కడో ఆగిపోతుంది.

జంబులింగం లేచాడు. ఆ పెట్టె ఎత్తి ట్రయలుకి పట్టుకున్నాడు. ఆ ఉదారంగు సూట్‌కేసు ఒక మాదిరిగా బరువుగా ఉంది. ఆ బరువంతా బరువులదే-దానిని తీసి కిందను పెట్టాడు. అతని కళ్ళు రెండో పళ్ళబట్ట మీద పడ్డాయి. చేయి చురికినవాడిలా ఒక్క సారి సూట్‌కేసు ఎత్తి దాని మామూలు చోట ఉంచాడు. సమయం ఆసన్నం కాలేదు. తొందరపడి వెర్రి పనులేమీ చెయ్యడానికి వీలులేదు.

కూపే ''సి'' లోను, కూపే ''డి'' లోను జంటలేం చేస్తుంటారు? తానూ రెండు రోజుల తరువాత హోటలు బృందావన్‌లో ఇద్దరు, ఒకరు కారు, వాళ్ళ పేరులేవో గమ్మత్తుగా ఉన్నాయి, కాల్ గర్ల్స్, వాళ్ళిద్దరిని పక్కలో పెట్టుకొని స్కాచి మీద స్కాచి తాగుతాడు.

ఇంతలో చీకటిలో వున్న వాడికి వెలుగు తోచినట్లు బ్రేకులు చక్రాలను నొక్కుతున్నాయి చాల శక్తితో. కీచుమని చప్పుడు. జంబులింగం లేచి నిలబడ్డాడు. లగేజి రూమ్‌కి పక్కనున్న ఏసీ కోచి గడియలు తీశాడు. రైలు వేగం తగ్గుతున్నది. తలుపు తీసి చూశాడు. స్టేషనేదీ రాలేదు. మధ్యదారిలో తను అనుకున్నట్లే రైలాగి పోతున్నది. కాలం వ్యర్థం చేయరాదు.

జంబులింగం బట్టలు సరిచేసుకున్నాడు. కొంచి కారిడారులో ఈ కొసనుంచి ఆ కొస వరకూ నడిచాడు. ఎవరూ లేరు. తిన్నగా లగేజి రూముకి వచ్చాడు. ఉదారంగు సూట్‌కేస్ చేతిలో పట్టుకున్నాడు. తిన్నగా తలుపు దగ్గిరికి వచ్చి తెరిచాడు. రైలు కాలి నడక వేగంతో నడుస్తున్నది ఆగడానికి ముందు. జంబులింగం సునాయాసంగా మెట్లు దిగి నేలపై కాలుమోపాడు. రైలు లైను ఎత్తైన గుట్టమీద ఉంది. మామూలుగా నడుస్తూ గుట్టమీద నుంచి దిగాడు. ఒక్క పది అడుగుల దూరంలో కాలిబాట ఉంది. దాని వెనుక పొలాలున్నాయి. జంబులింగం ఒక క్షణం నిలబడ్డాడు. ఎటు వెళ్ళడానికి తోచలేదు. ఇంజను వేపు నడిచాడు.

అప్పుడే గబ్బర్ సింగ్ జంబులింగాన్ని చూశాడు. అతని డేగకళ్ళు వెంటనే పసి గట్టాయి. తనవంటి పెద్ద మనిషే మరొకడు రైలులోంచి పెట్టె దింపుకొని పరారయి పోతున్నాడని అతనికి అర్థమయింది.

జంబులింగం తలెత్తి చూశాడు. సింహంలా నడుస్తూ ఒకడు తన వేపే వస్తున్నా డు. వాడికి, తనకి అట్టే దూరం లేదు. వెళ్ళి వెళ్ళి నిప్పులో దూకినట్లుంది. ఇంత శ్రమ పడి ఉడాయించిన పెట్టెను మరొక పెద్దమనిషి చేతిలో పెట్టడమా!

జంబులింగం ఒక్కసారి వెనుకకు తిరిగి కుందేలులా పరుగెత్తాడు. ఎరకోసం పెద్ద పులి నడకమాని ఒక్క ఉరుకు ఉరికింది. గబ్బర్ సింగ్ పరుగెత్తుతున్నాడు. తూటా గాలిని దూసుకొని పోతున్నట్లుంది.

జంబులింగం హఠాత్తుగా ఆగిపోయాడు. జేబులోంచి మడత కత్తి తీసి మీటు పొక్కాడు . కత్తి మెరుస్తూ పైకి వచ్చింది. చిరుతపులిలా ఒక్కసారి గబ్బర్ సింగ్ మీదికి లంఘించాడు. ఇటువంటి జంబులింగాలను చాల మందిని గబ్బర్ సింగ్ చూశాడు. ఒడుపుగా కొంచెం పక్కకు తొలగి జంబులింగం కుడి చేతి మణికట్టు పట్టుకొన్నాడు. దానిని బిగువుగా నొక్కాడు. జంబులింగం చేతిలోంచి కత్తి నేలమీద పడింది. గబ్బర్ సింగ్ జంబులింగం చేతిని విరిచి వెనుకకు తిప్పాడు. భాధతో మూలుగుతూ కాలితో గబ్బర్ సింగ్ పొట్టమీద తన్నాడు జంబులింగం. ఆ దెబ్బ పొడవుగానున్న గబ్బర్ సింగ్‌కి బెల్టు మీద తగిలింది.

''అరే చోర్! గబ్బర్ సింగ్ తోనా నీ ఆటలు.''

గబ్బర్ సింగ్ మరి కాలం వ్యర్థం చేయలేదు. నేలను పడిన కత్తిని తీసుకొని, పారి పోతున్న జంబులింగం మీదికి లంఘించాడు. రెండు పోట్లతో జంబులింగం నేలకు ఒరిగి పోయాడు. అతని చేతిలోని పెట్టె కొంచెం దూరంలో పడిపోయింది.

గబ్బర్ సింగ్ కత్తికి అంటుకున్న నెత్తురు జంబులింగం బట్టలకు తుడిచాడు. నేలమీద నున్న ఉదారంగు సూట్‌కేసు ఒక చేతిలో పట్టుకున్నాడు. రెండవ చేతితో కత్తి అందుకున్నాడు. ఆ చోటు నుంచి పదడుగులు ముందుకు నడిచాడు.

సూట్‌కేసు ఒక మాదిరిగా బరువుగా ఉంది. దానిలో ఏమున్నాయో చూడాలని పించింది గబ్బర్ సింగ్‌కి, చేతి రిస్టువాచీ చూసుకున్నాడు. పన్నెండు గంటలకు మూడు నిమిషాలు తక్కువ.

పెట్టెను తాళాలు పైకి వచ్చేటట్టు నిలబెట్టాడు. జంబులింగాన్ని పాడిచిన కత్తితో ఒక వేపు తాళం మెడ్డాయించాడు. రెండవ వేపు తాళం మెడ్డాయిస్తే రాలేదు. బలంగా కత్తితో తాళం మీద ఒక పోటు పొడిచాడు. తాళం విరగి భళ్ళున తెరుచుకుంది పెట్టె. గబ్బర్ సింగ్ కళ్ళు పచ్చబారిపోయాయి. పులిబుర్ర నోట్ల కట్టలు చుట్టూపడి చెదిరి పోయాయి.

ఆదివారం ఆ విధంగా ముగిసింది జంబులింగానికి, గబ్బర్ సింగ్‌కి.

విజయవాడ జంక్షన్

3. సోమవారం -

3.1 సోమవారం- 0 గంటలు- ఇంకా చాలా రాత్రి ఉంది- గ్రాండ్ ట్రంక్ ఎక్స్ ప్రెస్: మధిరకు అయిదు కిలోమీటర్ల దూరంలో ఆగిపోయింది-

రైల్వే కాలమానం ప్రకారం ఆదివారం అంతమయి సోమవారం ప్రవేశించి అయిదు సెకెండ్లు మాత్రమే అయింది.

గ్రాండ్ ట్రంక్ ఎక్స్ ప్రెస్‌లో ఫస్ట్‌క్లాసు 568 నెంబరుగల కోచిలో, 'డి' కంపార్ట్ మెంటులో దిగువ బెర్తుమీద పడుకున్న సోమేశ్వర రావు గాఢమయిన నిద్రలో ఉన్నాడు. అతను ఆదివారం మధ్యాహ్నం చాలసేపు చిత్రలేఖతో 'ఎయిర్ పోర్టు' నవల గురించి చర్చించాడు ప్రజల మీద ప్రతకవలసినవాడు అతను. దెబ్బలాటలు, తగువులు ఉంటేనే అతని వృత్తి రాణిస్తుంది. పెద్ద తప్పు చేసిన పార్టీ కేసు పట్టుకొని వాదిస్తే అంత గౌరవం, అంత పేరు, అంత డబ్బు. అందుకోసం అతను ఇతరుల కష్టాల గురించి అంతగా బాధ పడడు. చింతలు లేనివాడికి చాల గాఢమయిన నిద్ర. అతనికి ఆదివారం ముగిసిపోయి సోమవారం ప్రవేశించిందని రవంతైనా చింత లేదు.

అదే కంపార్ట్‌మెంటులో పైబెర్తుమీద నున్న జనార్ధనశర్మకు నిద్రపరిగా పట్టలేదు. డోర్నకలు దాటిన తరువాత ఏదో చిన్న స్టేషనులో రైలు రైలంతా ఊగిపోయి అతను పైబెర్తు మీద నుంచి కిందకు పడిపోయాడు. దెబ్బలు తగులలేదు. కాని నిద్ర మాత్రం అతనికి విడాకులిచ్చింది. రైలు పారిపోతున్న గుర్రంలా దౌడు తీస్తుంటే అతను సంతోషించాడు. లేటు కలిసిపోయి విజయవాడ జంక్షన్‌లో పన్నెండు గంటలకే దిగవచ్చు నను కున్నాడు. హోల్డాలు కట్టి వేసి సామాను సర్దుకొని కూర్చున్నాడు. బాంబు, గిష్ట్ పార్సిలు, కుమారరాజా, కృష్ణానది రైలువంతెన వీటి గురించి ఆలోచిస్తూ అతను రిస్టు వాచీ చూసు కున్నాడు. అప్పటి సోమవారం ప్రవేశించి అయిదు సెకండ్లు మాత్రమే అయింది.

694వ నెంబరు ఎయిర్ కండిషన్డుకోచిలో ఇన్ చార్జి తన కంపార్టుమెంటులో దిగువ బెర్తుమీద పడుకొని పెద్ద పెద్ద మూలుగులు మూలుగుతున్నాడు. జ్వరం పేల్చే స్తున్నది. దాహంతో నాలుక పిడుచకట్టుకొని పోతున్నది ప్రయాణీకులు ఎవరైనా తనను పిలువవలసి ఉంటే తనగదిలో బెల్ మ్రోగుతుంది. ఒక్కొక్కసారి చాలా గంటలు మ్రోగు తాయి ఆ ఒక్కడి ప్రాణానికి. కాని మొదలియారు తన భార్యకు తమ్ముడైన జంబులింగాన్ని పిలవడానికి గంటలేవీ లేవు. అందుచేత అతను శక్తికొలది జంబులింగాన్ని పిలిచాడు. ఆ పిలుపు లోతైన నూతిలో పడిన మనిషి అరుపులా ఉంది. రైలాగిపోయినా పిలుపు మాత్రం జంబులింగాన్ని చేరలేదు. మొదలియారు ప్రయత్నంచేసి లేచాడు. కాని తూలి

పోతూ రెండడుగులు కూడా వేయలేక పోయాడు. తిరిగి పక్క మీద పడుకున్నాడు.

ఎయిర్ కండిషన్డ్ కోచిలో, కూపే 'డి' లో, అప్పర్ బెర్తుమీద కూర్చొని చిత్ర లేఖకు కుమారరాజాకు మధ్య జరుగుతున్న సంభాషణలకు, అభిభాషణలకు, ఆలింగనాలకు, ఇత్యాదులకు ఏకైక సాక్షి అయిన సయామ్ దేశపు ఆడపిల్లి కుమారి జిమ్మీ (ఎందుకంటే సరియైన మొగుడు దొరకనందున, జిమ్మీ హీట్‌కి వచ్చినప్పుడల్లా వెజిలుబుల్ లాంటి వెటర్నరీ డాక్టరు సుందరం దగ్గిరనుంచి మాత్రలు తెచ్చి, చిత్రలేఖ తినిపిస్తున్నది) చాల ఆశాంతిగా ఉంది. కుమార రాజా కొంచెం సేపటి క్రింద వాచీ చూసుకున్నాడు. జీరో అవర్సుకి ఇంకా రెండు నిమిషాలుంది. ఆఖరుసారి అయిసు ముక్కలన్నీ ఖాళీచేసి ఆఖరి సోడా బాటిలు తెరచి, గడచి పోయినరోజుకి ఆఖరిసారి విస్కీ త్రాగడం పూర్తిచేశాడు. తరువాత అతను ఆ గడచిన రోజు ఎకౌంటులో తాగాడు. రైల్వేలో ఒకప్పుడు కొన్ని గమ్మత్తులు జరుగుతుంటాయి. రాత్రి పన్నెండున్నరకు గంట లేటుగా విడిచిన ట్రెయిను, ముందురోజు అకౌంటులో పన్నెండుకు ముందుగా రైట్ టైములో వెళ్ళినట్లే రికార్డులలో ఉంటుంది. అటువంటి పనిచేయడం కుమారరాజా ఎరుగడు కుమారి జిమ్మీ పన్నెండు గంటలు, అర్ధరాత్రి జీరో అవర్సుకి అయిదునిమిషాలు ముందు నుంచి మూలుగుతున్నది. పై బెర్తుమీద పచారు చేస్తున్నది. అరుస్తూ గోళ్ళతో బెర్తుకు కుట్టిన రెక్సీను క్లాతు చింపడానికి ప్రయత్నిస్తున్నది. ఆమె ప్రవర్తన కాండక్టు రూల్సుకి వ్యతిరేకంగా ఉంది.

కుమారరాజా కౌగిటిలోని చిత్రలేఖను పక్కకు పడుకో బెట్టి కూర్చున్నాడు.

''చిత్రా! మీ పిల్లికిగాని పిచ్చిపట్టలేదు కదా?''

'' ఏమిటి మా జిమ్మీకి పిచ్చా?''

''అవును మనిద్దరం స్త్రీ పురుషులం, దాని ఎదుట సిగ్గులేకుండా ప్రవర్తిస్తున్నాము, ఎటువంటి వాళ్ళకైనా కామం కలుగక మానదు. జంతువులకు, మానవులకు ఆహార నిద్రాభయ మైథునాలు సమానమైనవి. కాబట్టి మీ చిన్నారి జిమ్మీకి నిజంగా గండుపిల్లి మీద మనసుపోయినట్లుంది.''

''ఓ రాజా! నా కుమారరాజా! మీకు గల జ్ఞానాన్ని నేను ప్రశంసిస్తున్నాను. ఊహా ప్రకారం విషయం మరోవిధంగా ఉంటుంది. ఈ పిల్లులకు శకునాలకు చాల దగ్గరి సంబంధం. వీటికి పంచేంద్రియాలకు అతీతమైన ఆరవ జ్ఞానేంద్రియమేదో రాబోయే ప్రమాదాన్ని పసిగడుతుంది. అప్పుడే ఇవి విపరీతమైన చేష్టలు చేస్తాయి. ఇదేదో

ప్రమాద సూచకం.''

కుమారరాజా చిత్రలేఖను గాఢంగా కౌగిలించుకున్నాడు.

''ఈవెన్ ఇన్ డెత్ లెట్‌స్ నాట్ పార్ట్'' అన్నాడు.

ఎయిర్ కండిషన్డ్ కోచిలో 'సి' కూపేలో వున్న పెరియనాయకి తన కువాయత్ అనుభవాలు చెప్తున్నది. బుద్ధిమంతుడయిన వెంకటనారాయణ చెవులప్పగించి వింటున్నాడు. కళ్ళు చక్రాల్లా తెరచుకొని ఆ దేవ దేవి సౌందర్యాన్ని తనివితీర చూస్తున్నాడు. కోరికను కవులు దాహంతో పోల్చారు. ఆ కోరికను తీర్చే ప్రయత్నాలను ఉప్పు నీటితో పోల్చారు. దాహంతో ఉన్నవారికి ఉప్పునీరు ఇస్తే వాడి దప్పిక ఇంకా హెచ్చుతుంది. ఆ విధంగానే కళ్ళు ఆమె సౌందర్యాన్ని తాగుతున్నకొద్దీ అతనికి ఆమెపై కోరిక హెచ్చుతున్నది.

పెరియనాయకి కువాయత్‌లో గవర్నమెంటు హాస్పిటలులో పనిచేసింది. వెళ్ళిన ఒక్క సంవత్సరంలో అక్కడి భాష నేర్చుకుంది. ఆమె గైనిక్ వార్డులో పనిచేసేది. స్పెషల్ రూములకు ఆమెను వేశారు. అప్పుడు క్రమంగా కొంతమంది కువాయత్ ధనిక వనితలతో ఆమెకు స్నేహం కలిసింది. లోకంలో డబ్బున్నవాళ్ళ కోరికలు మామూలుగా ఉండవు. నూనె అమ్మే దేశాలు ఒక్కసారి చాల సంపన్నమయాయి. కొంతమంది షేకులు కోటీశ్వరులయారు. చాలమంది లక్షాధికారులు. నలుగురు భార్యలవరకు వారికి అనుమతి ఉంది. మిగిలినవారి గురించి ఏ అనుమతి అక్కరలేదు. వాళ్ళు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు మొదలయిన దేశాలనుంచి గౌరవర్ణంకల పాశ్చాత్య వనితలను తీసుకొని రావడమే కాకుండా బొంబాయి, హైదరాబాదు నగరాల నుంచి భారతీయ స్త్రీలను కూడా కొనుగోలు చేస్తారు. వారు కట్టించిన ఇళ్ళలో అన్ని ఆధునిక సౌకర్యాలు ఉన్నాయి. వారి టేబిళ్ళ మీదకి ప్రపంచంలోని అన్ని దేశాల నుంచీ ఉత్తమమయిన పదార్థాలు వస్తాయి. పళ్ళు, పాలు, వెన్న, మాంసం, కాయగూరలు, పంచదార ఏవి కావలిస్తే అవే వస్తాయి. వారి అత్తర్లు లక్షలు విలువచేస్తాయి. వారికి జనాభా సంఖ్య పెరగడంతో కొత్త సమస్యలు లేస్తాయి. వాటికోసం ఆఫ్రోడైజక్సు వారు అన్ని దేశాల నుంచి తెప్పించి, ఆడవాళ్ళమీద బలం ప్రయోగిస్తారు.

పెరియవాయికిని ఒకసారి ఒక షేక్ భార్య తన భవనానికి తీసుకొని పోయింది. ఆ షేక్‌కి అలువంటివి ఎనిమిది భవనాలున్నాయి. భవనానికొక స్త్రీ ఉంది. ఈమె పక్కా అరబ్బీ వనిత, ఆమె శరీర సౌష్ఠవం మరెవరిలోను చూడలేదని పెరియనాయకి అంది. పాలమిగడ వంచి గౌరవర్ణం. కళ్ళు చాలా వింతగా ఉంటాయి. గుడ్లు కొంచెం

నీలంగా ఉంటాయి ఆమెను చూస్తే కామం శరీరం ధరించి వచ్చిందా అనిపిస్తుంది. ఆమె పెరియనాయకికి తన పడకగది చూపింది. ఎదురుగోడలకు కొద్దిగానైనా ఖాళీ లేకుండా బెల్జియమ్ అద్దాలు తాపించి ఉన్నవి. డబల్ బెడ్ మీద ఫోము పరుపులు. మిగిలిన రెండు గోడలకు సామాన్యులు కొనలేని కళాకారుల అత్యుత్తమ వర్ణ తైల చిత్రాలు! ఆ పడకగది ముచ్చట్లు ఆ అరబ్బీ వనిత పెరియనాయకికి చెప్పింది. తరువాత కారులో పెరియనాయకిని హాస్పిటలకి పంపుతూ ఆమె చిన్న సలహా యిచ్చింది. తన భర్తకి ఎప్పుడూ ఒంటరిగా తారసపడవద్దని చెప్పింది. నలుగురయిదుగురు మనుషులు లేందే అతనితో మాట్లాడ వద్దని చెప్పింది.

వెంకటు నారాయణ వాచీ చూసుకున్నాడు. సోమవారం ప్రవేశించి అయిదు సెకండ్లయింది.

''పెరియ నాయకీ!'' అతని పిలుపులో కోరికలు ఆమె కంఠంలోని పారావత కూజితం రవళించింది.

గ్రాండ్ ట్రంక్ ఎక్స్ ప్రెస్ ఇంజను సరిగ్గా ఆదివారం రాత్రి పదకొండుగంటల నలభై నిమిషాలకు మధ్యేమార్గంలో మధిర స్టేషనుకు అయిదు మైళ్ళ దూరంలో ఎమర్జన్సీ బ్రెకు కొట్టడంవలన ఆగిపోయింది. ఎనిమిదవ నాట్ నుంచి ఇంజను ఐడిల్ స్పీడుకు వచ్చింది.

బ్రేక్ పైపు ప్రెషర్లు సున్నకు చేరుకున్నాయి. అందులో ఉన్న డివిజనల్ మెకానికల్ ఇంజనీరు, డ్రైవరు, డ్రైవరు అసిస్టెంటు కాక మరో మనిషి మంగపతిరావు కూడా ఇప్పుడు ఉన్నాడు. ఇతను ట్రెయిను బ్రేక్సుమను. ఏ హారను చప్పుడూ లేకుండా 'అధ్యమధ్య రంగాన్న' ఎక్స్ ప్రెస్ ట్రెయిను ఎందుకాగిపోయిందని ఒక పదినిమిషాలు తలుపు దగ్గిర నిలబడి ఇంజను వేపు చూశాడు. ఏ విధమైన సిగ్నలు రాలేదు. పదినిమిషాల తరువాత ఇంజను మీదికి వచ్చాడు.

మూర్తి వాచీ చూసుకుంటున్నాడు. అయిదేసి నిమిషాలకు డ్రైవరు కనకారావు తెలివి తప్పి పడిపోతున్నాడు. నీళ్ళు జల్లి అతనికి తెలివి తెప్పించే సరికి మరొక పదినిమిషాలయింది. బ్రేక్సుమను మంగపతిరావు ఇంజను ఎక్కేసరికి రెండవసారి కనకారావుకి తెలివి తెప్పించే ప్రయత్నంలో ఉన్నారు, మూర్తి, అసిస్టెంటు నారాయణరావు.

''నమస్కారం సార్! నేను ట్రెయిను బ్రేక్సుమన్ మంగపతిరావుని. డ్రైవరుగారికి

ఏమయింది సార్!''

''బందిపోటు దొంగగబ్బర్ సింగ్ అన్నవాడు రివాల్వరు పేల్చాడు. డ్రైవర్ గారి కుడిచేతి కండలోంచి గుండు దూసుకొనిపోయింది. మేము గాయానికి కట్లు కట్టినా చాల రక్తం పోవడం నుంచి, డ్రైవరుగారు తెలివితప్పి పడిపోతున్నారు.''

బందిపోటు దొంగ రివాల్వరు అన్న మాటలు వినగానే మంగపతిరావు కాళ్ళు వణకడం మొదలు పెట్టాయి. రివాల్వరు పేలిన చప్పుడు తనకూ వినిపించింది.

''సా....ర్! ఆ బందిపోటు.....''

''అతను ఇంజనుగెంతి పారిపోయాడు. మరేం భయంలేదు.''

మంగపతి రావు ఒక్క క్షణం మామూలు పరిస్థితికి తిరిగి రావడానికి తీసుకున్నాడు. క్రమంగా అన్నాడు.

''సార్, నాదొక్క చిన్న సలహా సార్! మీరు పెద్దవాళ్ళు, అయినా ప్రమాదమయిన పరిస్థితి కాబట్టి చెప్తున్నాను సార్. ఇటువంటి అవసరాలకు పనికివస్తుందని ఒక చిన్న బ్రాందీ సీసా నా పెట్లో పెట్టుకున్నాను. తమరు ఏమీ అనుకోనంటే.....''

మూర్తి చిన్నగా నవ్వాడు.

''మంగపతిరావుగారు, నేను అనుకునే దేముంది, అనుకోవలసిన వారు డ్రైవరు గారు. కనకారావుగారు! మీకు అభ్యంతరం లేకపోతే ముందుగా కొంచెం తీసుకోండి.''

''సార్! నా ప్రాణం పోయినా నా కేమీ పరవాలేదు. ఉద్యోగం మీద ఉండగా అటువంటి తప్పు పనిచేయను.'' అన్నాడు కనకారావు.

మూర్తి వాచీ చూసుకున్నాడు. సోమవారం వచ్చి అయిదు సెకండ్లయింది.

''నారాయణరావు! నేను పెన్సిల్ రికవరు చేసి, వాక్యూము తయారుచేస్తాను. మొదటి పదిబళ్ళకు బ్రేకులు రిలీజ్ చేయండి. మధిర వరకు నేను రైలు నడుపుతాను. అక్కడ డాక్టరుంటాడు.''

కంట్రోలు ఫోనుమీద విజయవాడలో కేశవయ్య చాలా గాభరా పడుతున్నాడు. తాను చాలా ముందాలోచనతో ఎన్నో ఏర్పాటులు చేసి మూర్తికి చాలా సహాయం చేసి రైల్వే బోర్డుకి, సికిందరాబాదుకి డివిజనల్ సూపరెండెంటుకి ఇచ్చిన మాటను వమ్ము కాకుండా చేశాడు. అతని ముందాలోచనలలో ఎక్కడా రివాల్వరు పట్టుకుని హైజాక్ చేయించే మనుషులు ఎవరూ లేరు. విమానాలను హైజాక్ చేయడం మామూలు అయింది. బస్సులను, అప్పుడప్పుడు. టాక్సీలను ఆ విధంగా చేయడం వింటున్నాడు

కాని ఎన్నో ప్రమాద నివారక సూచనలను పాటించి నడవవలసిన రైలు ఇంజనును, ఇంజనేమిటి అతి ముఖ్యమైన ఎక్స్ ప్రెస్ ట్రెయిను ట్రెయినునే హైజాక్ చేయటం సాధ్యమా? సాధ్యం కాకేమి? పందిళ్ళ పల్లి స్టేషను లూపు లైనుమీద రైలు నూరుకిలో మీటర్ల వేగంతో పరిగెత్తినప్పుడే అది నిర్ధారణ అయింది.

రైలు ఇంజనులో తన తమ్ముడున్నాడు. వాడివేపు ఆ హైజాకరు రివాల్వరుగురి చేసి ఉంచాడని అన్ని స్టేషనుల వాళ్ళూ చెప్పారు. స్టేషను స్టేషనుకూ టైము చూస్తున్నాడు. నూరు కిలోమీటర్లకు ఎక్కడా తగ్గలేదు. మధిర స్టేషనులో పదకొండున్నరకే సిగ్నల్సు అన్నీ యిచ్చి చూస్తున్నారు. మోటుమారి చిన్న మాస్టరు ట్రెయిన్ అవుట్ అయిన టైము పదకొండు గంటల ముప్పై అయిదు నిముషాలని ఇచ్చాడు. తరువాత ఆ ట్రెయిను సంగతి మరి తెలియదు.

కేశవయ్య పరిస్థితి చాల అధ్వాన్నంగా ఉంది. ఇంజనులో హైజాకరు ఉన్నట్లు తెలియగానే డివిజినల్ సూపరెండెంటుకి చెప్పవలసింది. ఇదేదో సరదాకి ఎవరో చేస్తున్న తమాషా అనిముందు అనుకున్నాడు. పందిళ్ళ పల్లి లూప్ లైన్ దాటడంతో అతను చాలా గాభరాపడ్డాడు. ఏమి చేయడమో తెలియని స్థితిలో పడిపోయాడు.

పన్నెండు కాకుండా నారాయణన్ గారిని లేపి హైజాకింగ్ గురించి చెప్పాడు. ఆయన మాటలు నిద్రలో విన్నాడేమో, మరోగంట పోయిన తర్వాత ప్రోగ్రెస్ చెప్పమన్నాడు. అదీ మంచికి వచ్చింది. గాభరాపడకుండా ఇప్పుడు పనిచేయవచ్చు. ఎక్కడో ఒక చోట హైజాకింగ్ ఆగిపోతుంది. విజయవాడతరువాత ఆగితే ఏం చేయాలి? ప్లాట్ ఫారమ్ మీద ప్రయాణీకులకు ఏం జవాబు చెప్పాలి?

కేశవయ్య మధిర ప్రతీ నిమిషానికి ఫోను చేస్తున్నాడు. కాని రైలు జాడ ఎక్కడా కనిపించలేదు. అపుడు మోటుమారి స్టేషనుకు ఫోను చేశాడు. వెంటనే పెర్చి పార్టీని, అంటే నలుగురైదుగురు మనుషులని కాగడాలు వెలిగించి వెంటనే పంపించమని చెప్పాడు.

కేశవయ్య వాచీ చూసుకున్నాడు.

పన్నెండు గంటలు..... జీరో అవరు సమీపించింది

కేశవయ్య ఆలోచన డెడ్ జోనులోకి ప్రవేశిస్తున్నది.

అతను లేచి ఎమర్జన్సీ రూములో పచారు చేశాడు.

చేతివాచీ చూచుకున్నాడు. సోమవారం అప్పుడే వచ్చింది

జీరో అవర్స్‌మీద అయిదు సెకెండ్లయింది.

రజియా బీగమ్‌తో మద్రాసుకు మాట్లాడిన తరువాత జస్బీర్ సింగ్ తల్వండీ నిద్ర పోలేదు. పడక గదిలో ఒక్కడే ఉన్నాడు. మంచం పక్కనున్న టేబిలుమీద తెల్ల గుర్రం విస్కీ ఉంది. గ్లాసులో మంచుముక్కలున్నాయ. ఫ్రిజ్ లోంచి తీసిన సీసాలో నీళ్ళున్నాయి.

సీసాలో సగం భాగం విస్కీ ఖాళీ అయిపోయింది. రజియా బీగమ్ తనపట్ల ఎంత అనురాగంతో ఉండేది! ఆమె మనసు విరిచాడో, ఆమెకు మందుపెట్టాడో, స్నేహితుడని నమ్మిన తనను మోసపుచ్చాడు కుమారరాజా! సుల్తానా ఉంది, కాని వజ్రానికీ, గాజు ముక్కకీ ఉన్నంత తేడా అక్కా చెల్లెళ్ళిద్దరికీ! ప్రస్తుతం గాజుముక్కతోనే తృప్తి పడుతున్నాడు.

కుమారరాజాను తొలగించడానికి ఇంత వరకు అవకాశం రాలేదు. ఇప్పుడు దొరికింది. ఎయిర్ కండిన్డు కోచిలో, కూపే 'డి' లో కుమారరాజా బెర్తుకి పక్కను పళ్ళ బుట్టలో నున్న కాలసర్పం మేలుకొంటున్నది. సరిగ్గా అది కట్లు విడి వేళకు పైకి వచ్చి అగ్నిశిఖలు వెలువరిస్తుంది. దానితో ఒక ప్రతిస్పర్ధి నాశనమవుతాడు. వాడు పోతేగాని ప్రియురాలు తిరిగి రాదు.

జస్బీర్ సింగ్ వాచీ చూసుకున్నాడు.

సరిగ్గా అర్ధరాత్రి ఆదివారం పన్నెండు గంటల టయిమవుతున్నది.

''ఇంక కౌంట్ డౌన్ చేయవచ్చును.'' గట్టిగా అనుకున్నాడు జస్బీర్ సింగ్.

కౌంట్ డౌన్ అయిన వెంటనే తాగడానికి గ్లాసులో ఒక వేలు వరకు విస్కీపోసి, మిగిలిన భాగం నీటితో నింపాడు.

సరిగ్గా పన్నెండు గంటలకు, వాచీలోని సెకండ్ హాండ్ చూస్తూ కౌంట్ డవున్ చేయడం మొదలు పెట్టాడు.

''సిక్స్‌టీ''

''ఫిఫ్టీనైన్...

.....

''థ్రీ''

''టూ''

''వన్''

''జీరో!''

''త్రీ ఛీర్సుటు ది డెడ్!'' అంటూ గ్లాసు లోని అమృతాన్ని గడగడ తాగేశాడు జస్బీర్.

సోమవారం సరిగ్గా జీరో హవర్ ఒక నిమిషానికి, ఆగిపోయిన గ్రాండ్ ట్రంక్ ఎక్స్ ప్రెస్ ఎయిర్ కండిషన్డు కోచి, 694వ నెంబరుగల దానిలో, లగేజి రూములో అగ్నిపర్వతమొకటి బద్దలయింది. అది విదేశాలలో తయారయి మిడిలీస్టు అతి వాడు లనుంచి స్మగుల్ అయి, జస్బీర్ సింగ్‌కి దఖలుపడి ఆపిల్ పళ్ళ బుట్టలో పక్వమయి, సరిగ్గా అర్ధరాత్రి దాటిన అరవై సెకండ్లకు పేలిపోయింది. మహాశబ్దం, ఏ చప్పుడూ లేని మధ్యదారిలో, చిమ్మచీకటిలో, దిక్కులను చీల్చుకొని వచ్చింది.

ఎయిర్ కండిషన్డు కోచి పై కప్పు ఎగిరి పోయింది. ఎయిర్ కండిషనర్ పానల్‌లో అడుగుభాగం ఎగిరిపోయింది. పక్కనున్న ఫస్టు క్లాసు రెండు కంపార్టు మెంటులకు బ్లాస్టు తగిలి దెబ్బతిన్నవి. తరువాత లగేజి రూములోని సామానులన్నీ తుత్తనియలై ఎగిరిపోయాయి. కోచికి నిప్పు అంటుకుంది. ఎయిర్ కండిషనర్ పానల్‌కి పక్కనే వున్న పైడ్ పానల్ కూడా ఎగిరి పోయింది. కోచిలోని పాసింజరులు బెర్తుల మీద నుంచి కిందబడ్డారు. తలుపులు తెరచుకుంటే ఎదురుగా వుండవలసిన పక్కభాగం లేదు. మంటలు ఆకాశానికి లేస్తున్నాయి. ఉన్న పద్దెనిమిదిమంది ప్రయాణీకులు మంటలు రాకుండా, ఆ వెలుగులో రైలు లైను పక్కనున్న గుట్టమీదికి గెంతారు. నాలుగయిదు తుమ్మచెట్లు వాలి ఉన్నాయి. వాటి ముళ్ళు వారికి గుచ్చుకున్నాయి.

వారితో పాటు మొదలియారు కూడా గెంతాడు. లేవడంలో కొంచెం ఆలస్యం అయింది. దట్టంగా రగ్గులు కప్పుకోడం నుంచి బాంబు పేలిన శబ్దానికి అతను గుండె ఆగి చచ్చిపోలేదు. కాని మంటలకు చిక్కి శరీరంలో కొంత భాగం కాలిపోయింది.

ఆ వెలుతురులో కొన్ని దృశ్యాలు సిగ్గు చేటుగా ఉన్నాయి. కుమారరాజా ఒంటి మీద ఒక్క నూలుపోగు లేదు. ఆ విధంగానే వెంకటనారాయణ, అంతకుమించి..చిత్ర లేఖ, పెరియనాయకి కూడా అదే పరిస్థితిలో ఉన్నారు. మిగిలిన ప్రయాణీకులు తక్కువ బట్టలతోనే ఉన్నారు. ఒంటికి చుట్టుకోవాలన్నా ఒక్క బట్టముక్క కూడా లేదు.

అప్పుడు రంగంలోకి వచ్చిన మొదటి వాడు జనార్దనశర్మ. ఫస్టు క్లాసు మెట్లు దిగబోతూ మంటల వెలుతురులో ఆడవాళ్ళ శరీరాలు మెరుస్తుంటే చూసి లోపలికి పోయి రెండు దుప్పట్లు, రెండు తువ్వాళ్ళు తెచ్చి ఆ నలుగురి మీద విసిరాడు.

మూర్తి, బాంబు పేలిన సమయానికి హెల్మట్ రికవర్ చేసి వాక్యూము సృష్టిస్తున్నాడు. బాంబు శబ్దం వినగానే డ్రైవరు ప్రక్కనున్న బోగీలలో ఎనిమిదవదో తొమ్మిదవదో బాంబు పేలడం నుంచి నిప్పంటుకోవడం గమనించాడు. ఇంజను దిగి బ్రేకులు రిలీజ్ చేయాలనుకున్న అసిస్టెంటు బాంబు పేలిన శబ్దం విని మంటలు చూసి వెంటనే ఇంజనులోకి ప్రవేశించాడు.

''నారాయణరావ్! పరుగెత్తు ప్రేలుడు సంభవించి నిప్పంటుకున్న బోగిని వేరు చేయాలి. నేను ఇంజనును నడిపిస్తాను సిగ్నల్ ఇవ్వు'' అన్నాడు మూర్తి

''ఏభై గజాలు ముందుకు వెళ్ళిన తరువాత ఆపుతాను, వెస్టిబ్యూల్ కనెక్షన్ తెగుతుంది. అపుడు మండుతున్న కోచి ముందు కపులింగ్ కోసివేయి''.

అసిస్టెంటు నారాయణరావు టార్చి తీసుకుని శరవేగంతో వెనక్కి పరుగెత్తాడు. అయిదు నిమిషాలలో మండుతున్న బోగీ వెనుక కపులింగ్ కోసి సిగ్నల్ ఇచ్చాడు. మూర్తి ముందుకు ఇంజనును నడిపించి 50 గజాల తరువాత ఆపాడు. తరువాత ముందు కపులింగ్ కోసిన తరువాత మండుతున్న బోగీని మధ్యను విడిచి ముందుకు కొంత దూరం నిప్పుతగలనంత వరకు పోనిచ్చాడు. రైలులో ఒక భాగం వెనుకనుంది. కాలుతున్న ఏసీ కోచి మధ్య నుంది. మిగిలిన భాగం ముందుంది. మండుతున్న కోచికి మరేవీ అందుబాటులో లేవు.

అప్పటికి డ్రైవరు కనకారావు తెలివిగా ఉన్నాడు. ఇంజనులో నున్న నిప్పునార్పే దానిని పట్టుకుని మూర్తి ఇంజను దిగిపోయాడు. బ్రేకులోనున్న మరొకటి పట్టుకొని మంగపతిరావు వచ్చాడు. గార్డు తన దగ్గరనున్న దానిని తీసుకొని వచ్చాడు. అందరూ మండుతున్న కోచి దగ్గరికి వచ్చారు. అక్కడే మూర్తికి జనార్దనశర్మ కనిపించాడు. డ్రైవరు వెంకటనారాయణ కనిపించాడు.

మూర్తి చేతిలో ఉన్న నిప్పునార్పేదానిని అసిస్టెంటు చేతికి ఇచ్చాడు. గార్డు, బ్రేక్సుమను, అసిస్టెంటు, నిప్పునార్పడంలో నిమగ్నమయారు.

వెంకటనారాయణను వెంటనే ఇంజను దగ్గరకుపోయి దెబ్బతిన్న డ్రైవర్ని చూడ

మన్నాడు. వెంకటనారాయణ మూర్తి దగ్గర నిలబడ్డాడు.

''సార్! ఈమె నా భార్య పెరియనాయకి. ఈమె సీనియర్ నర్సు, కువాయత్ నుంచి వస్తున్నది. నేను కనకారావును ఇక్కడికే తీసుకొని వస్తాను. జనార్దనశర్మ గారున్న ఫస్ట్ క్లాసులో పడుకోబెడతాను. అక్కడ ఆమె ఎటండవుతుంది.''

''బాగుంది జనార్దనశర్మా, ఇంకా ఎవరెవరికి దెబ్బలు తగిలాయో వారినందరినీ ఫస్టు క్లాసులోకి తీసుకొని పోండి. ఆమె వారికి ఫస్టెయిడ్ చేస్తారు.''

తరువాత మూర్తి గార్డును సమీపించాడు.''గార్డుగారూ! మీ పని అయిన తరువాత ఎమర్జన్సీ ఫీల్డు టెలిఫోను తెచ్చి కంట్రోలు వైరులకి తగిలించండి. విజయవాడతో మాట్లాడాలి.''

ఎలా బాంబు పేలిందని మూర్తి ఆలోచించలేదు. ఏసీ కోచి వారి దగ్గరకు పరిగెత్తాడు. మొదలియారును జవార్దనశర్మ తీసుకొని పోతున్నాడు. కుమారరాజా ఎత్తు నుంచి పడడంచేత కాలు మణిగిపోయింది. లేచి అడుగు వేయలేకపోతున్నాడు. చిత్రలేఖ ముఖమంతటికీ తుమ్మ్ముళ్ళు గుచ్చుకున్నాయి. చీరుకొనిపోయి వెత్తురులు కారుతున్నాయి. అదృష్టవశాత్తు కళ్ళకు గుచ్చుకోలేదు. ఏసీ కోచి పాసింజరులలో మరి నలుగురికి దెబ్బలు తగిలాయి. ఇద్దరికి గట్టు మీద నుంచి జారడంతో మునుకులు లోతుగా చెక్కుకొనిపోయాయి. మరి ఇద్దరికి మోచేతులు లోతుగా చెక్కుకొని పోయాయి.

ఈ సరికి మిగిలి పెట్టెలలోని వాళ్ళు చూడడానికి వచ్చారు. అందరూ నిప్పును ఆర్పుతుంటే చూస్తున్నారు. బాంబు గురించి కొందరు అడుగుతున్నారు. ఇంతలో కాగడాలు పట్టుకొని, దూరం నుంచి బాంబు శబ్దం విని పైకెగుస్తున్న మంటలను చూసి, మోటుమారి నుంచి వస్తున్న అయిదుగురూ సమీపించారు. వారిని చూసి దొంగలను కొని ప్రయాణీకులు గాభరాపడ్డారు. తరువాత విజం తెలుసుకున్నారు.

అందరూ కలిసి రెండు గంటలసేపు నిప్పును ఆర్పారు. అప్పటికి అందాల ఏసీ కోచిలో పై భాగమంతా కాలిపోయింది. ఒట్టి ఫ్రేము, దానిపయిన అక్కడక్కడ బోల్టులు. లగేజి రూము ఇనప కటకటాలు ఎగిరిపోయాయి. కుమారరాజా వస్తువులలో ఒకటీ మిగలలేదు. అన్నీ తునాతునకలై తరువాత కాలిపోయాయి.

ఫస్టు క్లాసు కోచి చిన్న ఎమర్జన్సీ వార్డుగా తయారయింది. పెరియనాయకి గుండెలకు దుప్పటి చుట్టబెట్టుకొని పనిచేస్తున్నది. సోమేశ్వర శర్మ దగ్గిరనున్న అవాల్జన్ మాత్రలు బాగా పనిచేశాయి. పేలయినంత మందికే ఇచ్చింది వాటిని

పెరియనాయకి.

మంటలార్పిన తరువాత గార్డును పిలిచాడు మూర్తి.

''మీకెవరయినా ఆరున్నర అడుగుల మనిషి, కాకీఫంట్లాము, కాకీ చొక్కా వేసుకొని కోరమీసాంతో, తలపైన పాగాతో కనిపించాడా?''

''లేదు సార్?''

ఇంతలో జనార్దనశర్మ అక్కడికి వచ్చాడు.

''శర్మగారూ! ఈ ప్రేలుడు ఏసీ కొచిలోనే జరిగిందా, లేక పైనుంచి ఎవరైనా బాంబు విసిరారా?''

''పై నుంచి బాంబు వచ్చినట్లు లేదు, చేతి బాంబులు ఇంతగా విధ్వంసం చేయవు.''

''అవును మీరన్నది నిజమే! గబ్బర్ సింగ్ అన్న బందిపోటు దొంగ డ్రైవరును రివాల్వరుతో కాల్చి, ఆగిపోతున్న ఇంజను నుంచి గెంతి పారిపోయాడు. అతని జాడ తెలుసుకోవాలి.'' తరువాత గార్డు తన పెట్టెకి వెళ్ళి ఎమర్జన్సీ ఫీల్డు టెలిఫోను తీసుకొచ్చాడు మూర్తి దగ్గిరకి.

రైలు లైను పక్కనే ఉండవలసిన టెలిగ్రాఫ్ స్తంభాలు అక్కడికి కొంచెం దూరంలో ఉన్నాయి. వాటి కోసం రైలులైను గుట్ట దిగి, పది అడుగుల తరువాత వున్న కాలిబాట దాటి మరొక్క పదిహేను అడుగులు పోవాలి. గార్డు రెండు చేతుల తోను టెలిఫోను సరంజామా పట్టుకొని, జనార్దనశర్మ టార్చి చూపిస్తుంటే ముందుకి నడుస్తున్నాడు.

ముందుకి నడుస్తున్న గార్డు కాలి బాట మధ్యకు వచ్చి పెద్దకేకపెట్టి ఆగిపోయాడు.

''అమ్మబాబోయ్! ఎవడ్నో చంపేశారు బాబోయ్!'' వెనకనే ఉన్న శర్మ ముందుకి లైటు వేసి నడిచాడు.

భూమి మీద నెత్తురు మడుగులో నున్న జంబులింగం వారి కళ్ళపడ్డాడు.

'' ఇతను జంబులింగం! ఇక్కడికెలా వచ్చాడు?'' అన్నాడు ఆ మనిషిని గుర్తపట్టిన జనార్దనశర్మ.

మూర్తి ముందుకు వచ్చి టార్చిలైటు వెలుతురులో చచ్చిపోయిన ఆ మనిషిని చూశాడు.

'' ఇతను గబ్బర్ సింగ్ కోపానికిగురి అయిన మరొకడు. మొదటివాడు డ్రైవరు. శర్మా! టార్చి ఇలా ఇవ్వండి. కొద్ది దూరంలో ఏదో పెట్టె'' అంటు ఉన్న మాట ముగించకుండా, శర్మ చేతిలోని టార్చి తీసుకొని, గార్డు పెట్టె దిక్కుగా, కాలి బాట మీద మూర్తి నడిచాడు. మిగిలిన వాళ్ళిద్దరూ అతని వెంటబడ్డారు.

మూర్తి పాతిక గజాలు నడిచి ఆగిపోయాడు. కొద్దిసేపటిలో వెనుక వాళ్ళిద్దరూ సమీపించి దిగ్భ్రాంతులై నిలిచిపోయారు.

ఊదా రంగులో వున్న వి.ఐ.పి. సూట్‌కేసు ఒకటి ఆలిచిప్పల వలె తెరుచుకుంది. దానినుంచి కొన్ని నూరు రూపాయల నోట్ల కట్టలు పడి చుట్టూ చెదిరిపోయాయి. చాల కట్టలు ఇంకా లోపలనే ఉన్నాయి. వాటి మీద ఒక మహాబలవంతుడుగా ఉన్న మనిషి బోర్లపడి ఉన్నాడు. అతని తల వెనుక భాగానికి, మెడకు, వీపుకి ఒక బలమైన దెబ్బ, గొడ్డలితో నరికినట్లు కనిపిస్తున్నది. ఆ దెబ్బ మంచి కారినెత్తురు అతను బారలు చాపి పోగుచేసుకుంటున్న నూరు రూపాయల కట్టలను తడిపింది. టార్చిలైటు వెలుతురులో అతనికి కొద్ది దూరంలో చేటకన్నా పెద్దగా ఉన్న ఎయిర్ కండిషనర్ గేజిపానల్ ముక్క, కత్తికన్న వాడిగా వున్న అంచులతో పడి ఉంది. దానికి చచ్చి పడినవాడి తల వెనుక భాగం చర్మం, వెంట్రుకలు అంటుకొని ఉన్నాయి.

చూస్తున్న వాళ్ళు ముగ్గురూ ఒక ఐదు నిమిషాలు ఈ భయంకరమైన దృశ్యం చూసి మ్రాన్పడిపోయారు.

జనార్దన శర్మ ముందు మాట్లాడాడు.

''ఈ ఊదారంగు సూట్ కేసు కుమారరాజాగారి సామాను లోనిది. ఆ సామానుకి జంబులింగం కాపలా ఉండేవాడు.

''సూట్ కేసులో డబ్బున్న సంగతి జంబులింగానికి తెలిసి ఉండాలి. అయితే మరి ఈ పెట్టె అతని దగ్గిర ఉండకుండా, ఈతనెవరో ఇతని దగ్గిర ఎందుకుంది?''

మూర్తి లైటు వేసి, చచ్చినవాడి పక్కనే పడి ఉన్న మడత కత్తిని, దానిమీద నున్న నెత్తుటి మరకలను వాళ్ళిద్దరికీ చూపించాడు.

''ఇక వినండి, ఇతనే బందిపోటు దొంగ గబ్బర్ సింగ్! ఇతని తలమీద పదివేల రూపాయల బహుమతిని ప్రభుత్వం ప్రకటించింది.''

''పాపం! ఎవరకీ ఆ ఛాన్సు లేకుండా పోయింది'' అన్నాడు గార్డు.

''ఇతను మీ గార్డు పెట్టె మీద డోర్నకలులో ఎక్కి, బోగీ మీదనుంచి బోగీ మీదకుగెంతుకొని వచ్చి ఇంజను మీదికి గెంతి హైజాక్ చేశాడు. ఏదో యుక్తివల్ల ఎమర్జన్సీ బ్రేకు కొట్టడం వల్ల, ఇంజను పాడైపోయిందని రివాల్వరుతో డ్రైవరుమ కాల్చి గెంతి వెళ్ళిపోయాడు. దారిలో జంబులింగమో ఎవరో, ఈ సూట్ కేసుతో పరారవుతూ గబ్బర్ సింగ్ కంటపడ్డాడు. గబ్బర్ సింగ్ దగ్గర రెండు రివాల్వరులే ఉన్నాయి. ఈ

కత్తిని చూడలేదు. బహుశా జంబులింగం కత్తితో గబ్బర్ సింగ్‌ను పొడిచే ప్రయత్నం చేసి ఉండవచ్చు. గబ్బర్ సింగ్ ది పై చేయి అయి జంబులింగం కత్తితోనే జంబులింగాన్ని పొడిచాడు. పెట్టెలో ఉన్నదేదో చూడాలని కుతూహలంతో తాళాలని కత్తితో విరిచిన ప్పుడు, పెట్టె కప్పు తెరచుకొని ఈ నూరు రూపాయల నోట్ల కట్టలు చెల్లా చెదరయి నేల మీద పడిపోయాయి. వాటిని అతను వంగి ఏరుతున్న సమయంలో ఏసీ కోచీలోని బాంబు పేలింది. అప్పుడీ ఎయిర్ కండిషనర్ గేజీ పానల్ తెగి, చాల వేగంతో తల వెనుక భాగానికి, మెడకు, వీపుకు తగిలింది. దానితో గబ్బర్ సింగ్ చరిత్ర ముగిసి పోయింది. పదండి. ముందు టెలిఫోను కనెక్షు చేసి మాట్లాడుదాం.''

జనార్దన శర్మ టెలిఫోను తగిలించాడు.

''హలో! నేను మూర్తిని!''

'' ఎవరూ! ఎవరూ!! మూర్తి!!!''

''అవును కేశవా!''

కేశవయ్య ఏడుపు స్పష్టంగా టెలిఫోను మీద వినిపిస్తున్నది.

''తమ్ముడూ! నేనెంత అదృష్టవంతుడిని. భగవంతుడెవడో ఉన్నాడు. ఇపుడు రెండు న్నర అయింది మోటుమారి స్టేషనునుంచి వచ్చిన వాళ్ళు రాలేదు. మధిరనుంచి కబురు లేదు. ఏదో ఘోరమైన ప్రమాదం సంభవించి వుంటుందని మేము భయపడు తున్నాము. సూపరెండెంటు నారాయణ్‌గారు ఒకగంటనుంచి ఛాంబరులో ఉన్నారు. ఇక చెప్పు, హైజాకరేమయాడు?''

''మధిరకు అయిదు. మైళ్ళ దూరంలో అసిస్టెంటు వేపు ఎమర్జన్సీ బ్రేక్ వే శాను. బండి ఆగింది. హైజాకరు రివాల్వరు డ్రైవరు మీద పేల్చాడు. డ్రైవరు కుడి జబ్బకు బలమయిన గాయం అయింది. తరువాత ఏసీకోచి 694లో బాంబు పేలింది. కోచిపై కప్పు ఒక సైడు వాలు ఎగిరిపోయాయి. మంటలంటుకున్నాయి. కోచిలోని వాళ్ళు కిం దకుగెంతివేశారు. కోచ్ ఇన్చార్జి బాగా కాలిపోయాడు. డ్రైవరుకు నెత్తురు బాగా పోయి దుర్బలంగా ఉన్నాడు. జంబులింగం అనే దొంగను హైజాకర్ గబ్బర్ సింగ్ చంపివేశాడు. బాంబు పేలినప్పుడు ఎయిర్ కండిషనర్ గేజి పానలు తెగి, ఎగిరి గబ్బర్ సింగ్‌ని చంపింది. రెండు శవాలు, ఇద్దరు ప్రమాదస్థితిలో వున్న స్టాఫ్, దెబ్బలు బలంగా తగిలిన నల్గురు ఏసీ పాసింజరులు- ఇక నేను బండి దగ్గిరికి పోతున్నాను.''

''అంబ్యులెన్సు పాసు పంపమన్నావా?''

''అంబ్యులెన్సు వాను వచ్చేసరికి ఒక గంటపైగా అవుతుంది. మళ్ళా వాళ్ళను విజయవాడ హాస్పిటల్‌కి తీసుకొని పోవాలి ఇది డబల్ వర్క్, ఏదో విధంగా ఎక్స్ ప్రెస్‌ను విజయవాడ నడిపిస్తాను.''

''డ్రైవరున్నాడా?''

''మెయిల్ డ్రైవరు వెంకటనారాయణ, అతని భార్య ఏసీ కోచిలో ప్రయాణం చేస్తున్నారు. అతడు డ్రైవరుగా పనిచేస్తాడు. అతని భార్య దెబ్బలు తగిలినవారికి కట్లు కడుతున్నది. ఆమె క్వాలిఫయిడ్ నర్సు.''

''మంచిది. ఇక్కడ డాక్టర్లను, అంబ్యులెన్సులను..... ఇంకా మిగిలిన ఏర్పాటులు చేస్తాను.''

తరువాత మూర్తి, గార్డు, జనార్దనశర్మ బండి దగ్గిరికి వచ్చారు. కాలిపోయిన బండి పై భాగం పోయింది. ఫ్రేము, చక్రాలు, బేరింగులు బాగానే ఉన్నాయి. నలుగురయిదుగురు దానిని తోస్తే మామూలుగా రైలు మీద నడిచింది.

''వెంకటనారాయణగారు, ఈ కాలి పోయిన కోచి అడుగుభాగం నడుస్తున్నది. దీనిని మోటుమారి కాని, మధిర కాని తీసుకొని వచ్చి, ముక్కలుగా ఎక్స్ ప్రెస్ తీసుకొని పోవాలంటే చాలకాలం పడుతుంది. డ్రైవరు పరిస్థితి బాగులేదు. ఏసీకోచి ఇన్చార్జి చాల బాధపడుతున్నాడు. కాబట్టి దీనిని మళ్ళా యథాస్థానంలో ఉంచి, ముందు ముక్కి, వెనుక ముక్కితో కలిపి వేద్దాం. కాని మీకు ఒకటే సమస్య- పూర్తిగా బ్రేక్ పవరు దొరకదు. ఇంజను నుంచి ఈ కాలిపోయిన కోచివరకు ఉన్న బళ్ళకే బ్రేకులు పనిచేస్తాయి.''

''సార్! మరో సంగతి మనవి చేస్తాను. డీసెలు ఇంజనుకి డైనమిక్ బ్రేకింగ్ ఉంది. చాల సున్నితంగా ఆ బ్రేకు వేగాన్ని పద్దెనిమిది వరకు తగ్గిస్తుంది. అప్పుడు ఈ తక్కువ బళ్ళ బ్రేక్ పవర్‌తో ట్రెయిను సరిగా ఆపవచ్చు. ఈ ఇంజనుకి అటువంటి బ్రేక్ బాగా పని చేస్తున్నది. కనకారావు చెప్పాడు.''

''చాల బాగుంది. అసిస్టెంటు నారాయణరావు, బ్రేక్‌మన్ మంగపతిరావు పూర్తి ట్రెయినును ఫారమ్ చేస్తారు. వెంకట వారాయణగారు ఇంజనుకి వెళ్ళిపోతారు.''

వాళ్ళు ముగ్గురూ వెళ్ళిపోయారు.

''గార్డుగారూ! ఈ ట్రెయినులో రైల్వే పోలీసులెవరేనా ఉన్నారా?'' అడిగాడు మూర్తి.

'' ఇద్దరున్నారు సార్!''

''జనార్దన శర్మ! మీరు వాళ్ళకి నేను చెప్పినట్లు చెప్పండి. గార్డువానులో డ్రైవర్

ఉంటుంది. దాని మీద ఈ గబ్బర్ సింగ్‌ని, జంబులింగాన్ని మోసుకొని గార్డ్ వానులో ఉంచమనండి. విజయవాడలో వాళ్ళ ఇన్ స్పెక్టరు వచ్చి పోస్టుమార్టము, ఎంక్వయిరీ మొదలయినవి జరిపిస్తారు. ఆ నెత్తుటితో తడిసిన నోట్లు, పెట్టెలోని నోట్లు, మీ ఎదుటనే సీలుచేసి తీసుకొని వెళ్ళమని చెప్పాలి. అన్ని పనులు అరగంటలోగా ముగియాలి. ఇప్పుడు రెండున్నర గంటల వేళ అయింది. సరిగ్గా మూడు గంటలకు ఈ ఎక్స్ ప్రెస్ బయలుదేరుతుంది.''

వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు. మూర్తి మెల్లిగా అడుగులు వేసుకుంటూ ఇంజను వేపు నడిచాడు. వెంకటనారాయణ ముందు ముక్కును అప్పుడే కాలిన కోచివేపు తెస్తున్నాడు. మంగపతిరావు సిగ్నల్ ఇస్తున్నాడు. నారాయణరావు కపులింగ్ వేయడానికి సిద్ధంగా పక్కను నిలుచున్నాడు.

మూర్తి తిన్నగా ఫస్ట్ క్లాసు వరకు వెళ్ళి క్షణం వెలుపల నిలబడ్డాడు. తరువాత లోపలికి ఎక్కాడు.

కనకారావు, కుమారరాజా ఒక కంపార్ట్ మెంటులో ఉన్నారు. ఏసీ కోచి ఇన్ ఛార్జి మొదలియార్ ఒక్కడు ఒక కూపేలో ఉన్నాడు. ఎవరిదగ్గిరో వాసన నూనె ఉంటే దానిని అతని బొబ్బలకు పట్టించారు. బాధతో అతను అరుస్తున్నాడు. తరువాత ఒక కూపేలో చిత్రలేఖ పడుక్కొంది ఏడుస్తూ. తల దగ్గిర చిన్నమ్మగారు కూర్చున్నారు. కాళ్ళ దగ్గిర జిమ్మీకూర్చుంది. చిన్నమ్మగారు ఎలా జిమ్మీ మండుతున్న కోచిలోంచి కిందకు గెంతిందో, ఎలా చిత్రలేఖ కాళ్ళలో పడ్డదో సోమేశ్వరరావుతో చెప్తున్నది. పెరియనాయకి ఎవరి దగ్గిరనుంచో నెయిల్ కట్టరు ఒకటి సంపాదించుకొని వచ్చింది.

''చిత్రలేఖా! మీరు చిన్నపిల్లలా బాధ పడకూడదు. ఈ చిన్న చిన్న ముళ్ళ రక్కులు ఏవిధమైన మచ్చలను ముఖంమీద విడిచిపెట్టవు. కొత్తచర్మం చాల తొందరగా వస్తుంది. తేనెరాస్తే చర్మం మామూలుగా అవుతుంది. ఈ గడ్డం కిందగుచ్చుకున్న ముల్లు మాత్రం లోపలికి చొచ్చుకుంది. బహుశా ఇక్కడ మచ్చబాగా ఏర్పడవచ్చు. గడ్డం క్రింద భాగం కాబట్టి ఆ మచ్చ బయటికి బాగా కనిపించదు. కొంచెం ఊపిరి బిగబట్టండి! ఇదే ముల్లు మొదలు సరిగ్గా చిక్కింది అరే వచ్చేసింది. మరి పరవాలేదు. ఈ గుడ్డగట్టిగా అదమండి. చిన్నమ్మగారు అదిమి పట్టండి.'' పెరియనాయకి ముల్లుతీసింది.

మూర్తి మిగిలిన దెబ్బలు తగిలినవారిని చూసి క్రిందకు దోసరికి రైలు ప్రూర్తిగా కలపడం అయిపోయింది. మూర్తి యింజను చేరిన పది నిమిషాలకు గార్డు సిగ్నల్ ఇచ్చాడు. సరిగ్గా మూడు గంటల వేళకు గ్రాండ్ ట్రంక్ ఎక్స్ ప్రెస్ తిరిగి ప్రయాణం మొదలుపెట్టింది.

22. సోమవారం- 6 గంటలు- ఉదయం- విజయవాడ జంక్షన్

సరిగా ఆరుగంటలకు వారు ఆరవ నంబరు ప్లాట్ ఫారమ్ చేరుకున్నారు. కుమార రాజా, అతని వెనుక చిత్రలేఖ - ఇద్దరూ తిన్నగా ప్లాట్ ఫారమ్ చివరకు, అంటే మద్రాసు వేపుకు నడిచారు.

అక్కడ చిన్నమ్మగారు ఒక్కరూ చిత్రలేఖ సామానుపెట్టుకొని కూర్చున్నారు. జానార్దనశర్మ యిచ్చిన తువాలు ఇప్పుడు కుమారరాజా భుజాల మీద కప్పుకున్నాడు. సోమేశ్వరరావు యిచ్చిన పంచలుంగీ కట్టుకున్నాడు. 'నా' అన్నది అతని దగ్గిర అప్పుడు ఏదీ లేదు. చిత్రలేఖ అతని దానినే అంది. అతను తనకు అడ్వాన్సుగా ఇచ్చిన లక్ష కూపాయలు అతనివే అంది. అతను మాత్రం సర్వసంగ పరిత్యాగివలె అక్కడ నున్న బెడ్డింగ్ మీద కూర్చున్నాడు.

చిత్రలేఖ భుజానికి వేల వేసిన వానిటీ బాగ్ నుంచి చిన్న ట్రాన్సిస్టరు తీసింది. స్విచ్ వేసి న్యూస్ కోసం సరిగా సెట్ చేసింది. అప్పుడు న్యూస్‌లో ఒక అయిటము వారి ఇద్దరినీ ఆశ్చర్య చకితులను చేసింది.

''..... ఈ రోజు ఉదయం నాలుగు గంటల పదిహేను నిమిషాల ప్రాంతంలో గ్వాలియర్ శివార్లలో ఉన్న పెయింట్ ఫ్యాక్టరీ ఒకటి చాల బలమైన బాంబుపేలి సమూలంగా కూలిపోయింది. అందులోని టర్పెంటయిను మొదలైన తైలాలు పెద్ద మంటలతో కాలిపోయాయి. ఫ్యాక్టరీ మూసి ఉండడం నుంచి ప్రాణనష్టం సంభవించలేదు. దీనిని తీవ్రవాదుల చర్యగా భావిస్తున్నారు.....''

చిత్రలేఖ కుమారరాజా భుజం మీద చరిచింది.

''నా రాజా! నా కుమారరాజా!! విన్నారు కదా వార్తలు- మీ గ్యాస్ పార్సిలు బాంబు గ్వాలియరులో దిగి మీరు చెప్పిన వేళకే ఒక ఫ్యాక్టరీని పేల్చివేసింది. ఇప్పటికేనా మీకు

జ్ఞానోదయమయిందా! మీ బాంబువలన ఏసీ కోచి కాలిపోలేదు. దానిని మీ జస్బీర్ సింగ్ తప్పుగా పన్నెండు గంటలకు సెట్ చేయలేదు. ఈ బాంబుని ఎవరు పంపించారో ఇంకా తెలియదా! ఆ మోహినీ దేవి, అదే జస్బీర్ దగ్గిర కొని మిమ్మల్ని నామ రూపాలు లేకుండా చేయడానికి ఈ పని చేసింది. మీరు వింటున్నారు కదా! మీ ఎదుటే ఆగ్రాతో నారాయణన్ గారు మాట్లాడి, సుల్తానా బీగమ్‌ని అడిగారు కదా! పాపం ఆమెకు ఏమీ తెలియదు- ఢిల్లీ బుట్టలు, ఆపిల్ పళ్ళు ఆమెకు ఏమీ తెలియదు. కాబట్టి మీరు గిల్టీగా ఫీలవ వద్దు. అందరూ నా జిమ్మీని అభినందించాలి. అది ఉన్నది కాబట్టే ఆ పళ్ళ బుట్ట లగేజి రూముకి పోయింది. ఆ రాత్రి జిమ్మీ మనతో ఉండకపోతే, మీరు ఉదయం ఆ పళ్ళబుట్టలను లోపల పెట్టించి ఉందురు మిగతా సామాను దగ్గిర. అప్పుడు మీరు నేను, జిమ్మీ అందరం రెక్కలొచ్చి ఆకాశానికి ఎగిరిపోయి ఉందుము, స్పెషలులోని గుర్రాలకు బదులు.''

కుమారరాజా ఏమీ మాట్లాడలేదు. మాసిన గడ్డం మీద చేయివేసి నిమురుకున్నాడు.

ఇంతలో వెంకటనారాయణ, పెరియ నాయకి వచ్చారు. మరి రెండు నిమిషాలలో సోమేశ్వరరావు జనార్దనశర్మ వచ్చారు. తరువాత మూర్తి, కేశవయ్య వచ్చారు. అందరూ చిత్రలేఖ, కుమారరాజా చుట్టూ నిలబడ్డారు.

''నారాయణన్‌గారు ప్రెస్ కాన్ఫరెన్సులో చాల బాగా మాట్లాడారు.'' అన్నాడు కేశవయ్య.

మూడు గంటలకు బయలు దేరిన గ్రాండ్ ట్రంక్ ఎక్స్ ప్రెస్ సరిగా నాలుగు గంటలకు విజయవాడ జంక్షన్ చేరుకుంది. ఆరు ఏడు ప్లాట్ ఫారాల మీద నిలబెట్టారు. అక్కడ పోలీసు కార్డను ఏర్పాటు చేశారు. రైల్వే హాస్పిటలు నుంచి డాక్టర్లు, నర్సులు, తోటీలు, అందరూవచ్చారు. దెబ్బలు తగిలిన వారిని అందరినీ సెకెండ్లలో హాస్పిటలుకి తరలించారు. మోర్గులో గబ్బర్ సింగ్, జంబులింగాల శవాలను పడేశారు. వెంటనే చిన్న చిన్న దెబ్బలుతగిలిన వాళ్ళకి కట్టుకట్టి, ఇంజక్షన్ లు ఇచ్చి స్టేషనుకు పంపించివే శారు. ఏసీ కోచిలో వారికి ఎవరికి ఒక్క సామాను కూడా మిగులలేదు. లన్నీ కాలిపో యాయి, కట్టుబట్టలు, అంటే రాత్రి కట్టుకునే బట్టలతోనే వాళ్ళు మిగిలారు. కనకారావుకి ఆపరేషను చేసి, నెత్తురెక్కిస్తున్నారు. మొదలియార్‌కి సెలైను ఎక్కిస్తున్నారు. ఇద్దరూ ప్రమాదమైన స్థితిని దాటిపోయారు.

కేశవయ్య చాల ప్రయత్నాలు చేశాడు. ఆకాశవాణికి ఫోనుచేశాడు. విజయవాడ వార్తా పత్రికల రిపోర్టరులకు ఫోన్ చేశాడు. రైల్వే పబ్లిక్ రిలేషన్ ఇన్స్పెక్టర్ని, ఫోటో గ్రాఫర్ని పిలిపించాడు.

ప్రెస్ వాళ్ళు ఎవరికి తోచిన ప్రశ్నలు వాళ్ళు వేయడం మొదలు పెట్టారు. అప్పుడు డివిజనల్ సూపరింటెండెంటు నారాయణన్ గారు ఈ పద్ధతి బాగులేదని అయిదు గంటలకు తన మీటింగ్ రూములో ప్రెస్ వారితో సమావేశం ఏర్పాటు చేశారు. మీటింగుకు ముందు మూర్తితోను, జనార్దనశర్మతోను, కుమారరాజా తోను, వెంకటనారాయణతోను, పెరియనాయకి తోను, చిత్రలేఖ తోను, అతను మాట్లాడి పత్రికల వారికి చెప్పవలసినవి చాల చక్కగా జల్లెడ బట్టారు.

సరిగ్గా అయిదుగంటలకు డివిజనల్ ఆఫీసులోని మీటింగ్ రూములో డివిజనల్ సూపరెండెంటు నారాయణన్‌గారు, మూర్తి ఏసీ కోచి పాసెంజరులు, పత్రికా విలేకరుల, ఆకాశవాణి విలేకరి, ఇంకా మరికొందరూ వచ్చి కూర్చున్నారు. అందరికీ బిస్కత్తులు, కాఫీ కాటరింగ్ నుంచి తెప్పించారు. కేశవయ్య ఆఖరున వచ్చాడు.

నారాయణన్ గారు కేసముద్రం, తాడల పూసపల్లి స్టేషన్ల మధ్య ఆకస్మికంగా సంభవించిన ప్రమాదం గురించి, ప్రయాణీకుల ఇబ్బంది తొలగించడానికి రైలు మార్గం తాత్కాలికంగానైనా బాగుచేయడానికి చేసిన ప్రయత్నాల గురించి, ప్రతీక్షణం ఎదురయిన అవరోధాల గురించి, ఆ అవరోధాలు పంభవించడానికి అవకాశముందని ముందాలోచనలకు పోయి బహుముఖమైన కృషిచేసి వాటిని అధిగమించడం గురించి, చివరకు ప్రకటించిన వేళకు ఏ విధంగా గ్రాండ్ ట్రంక్ ఎక్స్ ప్రెస్‌ని నడిపినది వివరించారు.

తరువాత న్యూఢిల్లీ స్టేషనులో కుమార రాజాగారు, చిత్రలేఖ కలిసికొని, కుమార రాజా గారు తీయబోయే చిత్రానికి ప్రతిపదిక తయారుచేశారని చెప్పారు. కుమారరాజా గారి జ్యేష్ఠ సోదరీమణి రాణీ దయావతిగారు పది లక్షల రూపాయలు, నూరు రూపాయల నోట్ల కట్టల రూపంలో మధురలో ఇచ్చారు. కూపేలో జిమ్మీ అనే పేరు గల సయామీస్ కేట్, చిత్రలేఖగారి పెంపుడు పిల్లి కోసం మీద బెర్తు కాళీ చేసి సామానంతా ఏసీకోచి లగేజి రూములో పెట్టి తాళం వేశారు. జంబులింగం అనే అతను చాల నేర్పుతో నమ్మకంగా ఆ సామానుకు కాపలా కాస్తూ కూర్చున్నాడు. డోర్నకల్ దాటిన తరువాత ఇంజనులోకి వచ్చిన గబ్బర్ సింగ్ గురించి, హైజాకింగ్ గురించి, ఇంజనులో నున్న వాళ్ళు, కంట్రోలు ఆఫీసు వాళ్ళు ఎంత సంయమనంతో వ్యవహరించారో ఆయన చెప్పారు. తరువాత ఇంజ

నులో ప్రయాణం చేస్తున్న మెకానికల్ ఆఫీసరు సమయస్ఫూర్తితో రైలు నాపడం. దానికి బందిపోటు దొంగగబ్బర్ సింగ్ డ్రైవరును రివాల్వరుతో కాల్చడం, రైలు ఆగడం, పన్నెండు గంటల తరువాత కుమారరాజా శత్రువులు పళ్ళబుట్టలో పెట్టిన టైం బాంబు పేలడం, జంబులింగం మరణం, గబ్బర్ సింగ్ మరణం, కోచి ధ్వంసమవడం మొదలయిన విషయాలు చెప్పారు.

ప్రెస్ విలేకరులలో ఒకరు ప్రశ్నించారు.

''ఈ చిత్రలేఖ, సినీమా నటి చిత్రలేఖ ఒకరేనా!''

''ఒకరే''

''సెక్సు బాంబు చిత్రలేఖ?''

''అవును''

''మేము ఆవిడ ఫోటో తీసుకుంటాము?''

చిత్రలేఖ లేచి తన అసమ్మతిని తెలియ జేసింది.

''నాముఖం నిండా గాయాలు- వీటి మీద చిన్న చిన్న ప్లాస్టరు ముక్కలు- మీరు నా ఫోటోయే వేయవలసి ఉంటే క్రిందటి వారం వారపత్రికలో కలర్ ఫోటోను ఉపయోగించవచ్చు. నాకన్న ముఖ్యం మా జిమ్మీ. దాని ఫోటో తీయండి.''

పత్రికల వారు అంగీకరించారు.

''ఈ మహాసంరంభంలో ముఖ్య పాత్ర ధరించిన వాళ్ళెవరు?'' ఒక విలేకరి ప్రశ్నించాడు.

నారాయణన్ మూర్తి నిర్వహించిన పాత్ర గురించి చిప్పారు. కేశవయ్య నిర్వహించిన పాత్ర ప్రశంసనీయమన్నారు. డ్రైవరు కనకారావు, అతని అసిస్టెంటు ప్రత్యేకమైన ధైర్య సాహసాలు ప్రదర్శించారన్నారు. రైలును విజయవాడకు చేర్చిన వెంకటనారాయణ, అతని భార్య పెరియనాయకి ప్రత్యేకంగా ఉదహరించదగిన వారన్నారు. సోమేశ్వరరావు. జనార్దన శర్మ గురించి కూడా చెప్పారు. తరువాత నయాఁమిస్ పిల్లి జిమ్మీ గురించి, ఏ విధంగా ఆపిల్లి కుమారరాజాగారి ప్రాణాలు కాపాడిందో వివరించారు. ఎయిర్ కండిషన్డ్ కోచిలోంచి ప్రయాణీకులు కట్టుబట్టలతో ఇళ్ళకు పోతున్నందుకు విచారం వ్యక్తం చేశారు. వారికి ప్రత్యేకంగా ఒక ఫస్టుక్లాసు బోగీ తగిలిస్తున్నామని, వారికి మద్రాసు చేరిన తరువాత స్పెషల్ బస్సుకూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

అన్ని ప్రశ్నలకు సాధ్యమయినంత వరకు నారాయణన్ జవాబు చెప్పారు. అందరికీ

ధన్యవాదాలు చెప్పి ఆయన పావు తక్కువ ఆరుకి వెళ్ళిపోయారు.

కుమారరాజా చాలా విరక్తుడుగా ఉన్నాడు.

సోమేశ్వరరావు ఆయనకు అభయమిచ్చాడు.

ఆ తొమ్మిది లక్షల రూపాయలు చేరే వరకు తను అన్ని ప్రయత్నాలు కోర్టులో చేస్తానన్నాడు.

జనార్ధన శర్మ చిత్రలేఖను అభినందించాడు, రహస్యం తెలుసుకున్నందుకు.

అందరూ కేశవయ్యను అభినందించారు

మూర్తి భార్య జీప్‌లో స్టేషనుకు వచ్చింది.

''ఈమె నా భార్య పద్మావతి-పద్మావతీ! వీరందరూ మన స్నేహితులు- ఈమె చిత్రలేఖ- సినిమా నటి. ఈమె పెరియనాయకి- మన వెంకటనారాయణ గారి భార్య. ఈయన కుమారరాజా. వారు నిర్మించే పంచరంగుల చిత్రం....'' ఆగిపోయాడు మూర్తి.

కుమారరాజా లేచాడు. పై మీది టర్కిష్ టవల్ సరిగా భుజాలమీద కప్పుకున్నాడు.

''నేను ఇంతవరకు ఎటువంటి కథ సినిమా తీస్తే బాగుంటుందని ఆలోచిస్తున్నాను. మన మందరం పాల్గొన్న కథకన్న గొప్పది లేదు. అందరి అభినందనలు ఆకాంక్షిస్తూ కలర్ పిక్చర్ తీయడానికి నిశ్చయించాను. నన్ను అనుగ్రహించండి.''

''దాని పేరేమిటో?'' ప్రశ్నించాడు కేశవయ్య

''విజయవాడ జంక్షన్'' అంది చిత్రలేఖ,

పెరియనాయకి నవ్వింది. జిమ్మీ తోక ఆడించింది. గ్రాండ్ ట్రంక్ ఎక్స్ ప్రెస్‌కి సిగ్నలు ఇచ్చారు.

'' నీ లగేజి ఏది?'' అలవాటు ప్రకారం అడిగారు వెంకటనారాయణ.

''అప్పుడే మరచిపోయారు? భద్రంగా ఉంది పార్సెలు వాన్‌లో! పదండి రైలు కదిలిపోతుంది'' అంది పెరియనాయకి.

వెళ్ళవలసినవారు రైలెక్కారు.

మిగిలినవారు వాళ్ళకి వీడ్కోలు చెప్తున్నారు.

గ్రాండ్ ట్రంక్ ఎక్స్ ప్రెస్ వెళ్ళి పోయింది.

కేశవయ్య పద్మావతితో అన్నాడు.

'' ఈ మహానాటకానికి హీరో ఎవరో తెలుసా?''

''చెప్పండి బావగారూ?''

''శ్రీనివాసమూర్తి''



శుభం

Kurella Group of Trusts

12-1-26, Maharanipeta, Visakhapatnam - 530 002 (A.P.) India
Ph : 563339 (STD : 0891)
(NON - PROFIT ORGANISATIONS)



Aims and Objects of Four Trusts



1. KURELLA SOMESWARA RAO CHARITABLE TRUST :

i) To felicitate great persons, in the field of Telugu Literature, Music, Dance, Drama, Photography, Cartoonist, Painting, Sculpture, VEDAS, Journalism and Social Service at the annual function every year in December at Kala Bharathi (AC) Auditorium.

ii) To give legal Literary Award for the best article relating to legal subjects amongs Lawyers and Judges once in every year.

iii) To give Vidya Vikas Awards for the best and Meritorius students of several high schools every year besides felicitating best teachers and encouraging Bala Pratibha Murthies between 3 to 8 yrs. (Child Prodigy)

2. SITA MUSIC AND DANCE ACADEMY TRUST :

To give awards for up-coming Musicians and Dancers every year besides organising Music and Dance concerts. To start a Music & Dance School to facilitate common people to learn at reasonable fees. To start a library by collection of books on Music & Dance.

3. SAHITYA SEVA SAMITHI TRUST :

To conduct competitions for giving awards for Telugu Novels. Dramas, Stories annually, besides felicitating luminaries at special Sahithi functions and honouring renowned scholars and also publishing books in Telugu letarature. A memorable short story competition of fifty stories of 50 writers. **named as 'Kadhamanjari' was released in 1998,**

4. SOMESWARA PUNYABHOOMI TRUST :

To open Someswara Punyabhoomi Mandiram for exhibiting several Divine Murthies especially relating to Vinayaka. Vishnurupas. Jyotirlingams etc. etc., and also produce Devotional Music casetts and conduct functions for Bhakti Sangeeta Sabhas etc., and publish books on devotional subjects.

For the above causes. co-operation in all ways and by way of donations are requested for carrying the objects of the Trusts.

Kurella Someswara Rao
Advocate
Founder-Chairman
Kurella Group of Trusts